సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 17 సంచిక: 342

శనివారం 23-8-2025

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'


మరెక్కడ ఊహించలేనంత తక్కువ తరుగు!
Bracelets
V.A. 3%
8%
8%
8%
8%
8%
9%
9%
V.A. 9.5%
9.5%
9.5%
Necklace
11%
12%
Oddiyanam
Haaram
10%
7%
7%
7%
7%
Bangles
8%
8%
8%
8%
10%
5.5%
5.5%
Drops
Haaram
Drops
12%
12%
Haaram
Pendants
8%
11%
11%
11%
9%
11%
8%
Bangles
Ring
Haaram
Jhumkas
Necklace
Drops
8%
8%
8%
8%
Blackbeads
10%
10%
10%
ఇండియాలోనే అతి తక్కువ ధరకు వజ్రాభరణాలు
రూ. 54000 / క్యారెట్
1 Carat = 200 Milligrams
ఇతర షోరూం మాదిరిగా తరుగు మరియు మజూరి వంటి రెండు ఛార్జీలు వేయడం లేదు.
V.A. మాత్రమే.. అది కూడా మార్కెట్‌లో కంటే తక్కువ!
తరుగు V.A. 10%
ఇలాంటి వందలాది బ్లాక్ బీడ్స్ డిజైన్లు, కేవలం 10% తరుగుకే మా వద్ద లభిస్తాయి.
Lalithaa
www.lalithaajewellery.com
PLEASE WATCH MY VIDEOS
MY PERSONAL INSTAGRAM PAGE
బెంగళూరు : కమ్మనహల్లి, మల్లేశ్వరం, జయనగర్, మరతహల్లి, ఎలహంక
మంగళూరు • మైసూరు
Customer Care: 90 99 999 916
VIRAL VIDEO
2.5+M
VIEWS


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 17 సంచిక: 342

శనివారం 23-8-2025

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



దేశీయ రిమోట్ యుద్ధ విమానం

కాలభైరవ పేరుతో రూపొందించిన బెంగళూరు స్టార్టప్ - 6లో



ఇలవేనిల్‌కు స్వర్ణ పతకం


ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల జోరు - 13లో



జైలు నుంచి పరిపాలించాలా?

నేరగాళ్లు జైలు నుంచే పరిపాలన చేస్తామంటే మనం చూస్తూ ఉండిపోవాలా? అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశ్నించారు.


వివరాలు 6లో ▸



స్టెరిలైజేషన్ తర్వాత వదిలేయాలి

కుక్కలకు పిల్లలు పుట్టకుండా శస్త్రచికిత్స చేసిన తర్వాత ఎక్కడి నుంచి తెచ్చారో అక్కడే వదిలేయాలని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

వివరాలు 6లో ▸



శ్రీలంక మాజీ అధ్యక్షుడు అరెస్ట్

ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమ సింఘేను పోలీసులు అరెస్ట్ చేశారు.

వివరాలు 6లో ▸



లార్డ్ స్వరాజ్‌పాల్ కన్నుమూత

ప్రముఖ ప్రవాస భారతీయ పారిశ్రామిక దిగ్గజం లార్డ్ స్వరాజ్ పాల్ అనారోగ్యంతో లండన్‌లో కన్నుమూశారు.


వివరాలు 13లో ▸

కుప్పం నుంచి కుత్రలకు క్లాప్!

ప్రభుత్వ వైద్య రంగంలో ఇప్పటికే ఉన్న సమర్థ వ్యవస్థలను నీరుగారుస్తూ తెరపైకి 'డింక్' ప్రాజెక్టు

- జగన్ హయాంలో పైసా ఖర్చు లేకుండా వీడియో కాల్ ద్వారా మెడికల్ కాలేజీల్లోని హబ్‌లతో పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లను అనుసంధానించి స్పెషలిస్టులతో వైద్య సేవలు
- గొప్పగా నడుస్తున్న వ్యవస్థను అటకెక్కించి ముడుపుల కోసం తెరపైకి బాబు సర్కారు కొత్త ప్రాజెక్టు
- గతంలో అందించిన టెలీ మెడిసిన్ సేవలకే బాబు సర్కారు కలరింగ్.. విలేజ్ క్లినిక్స్‌కు పాతర.. ప్రైవేట్ చేతికి సేవలు
- ఇప్పుడేదో సరికొత్త వ్యవస్థను తెస్తున్నట్లు మభ్యపెడుతూ రూ.350 కోట్ల ప్రజాధనానికి టెండర్.. ఇప్పటికే కుప్పంలో మొదలైన 'పైలెట్'.. ఆపై రాష్ట్రమంతా అమలు
- రేషనలైజేషన్ పేరిట దాదాపు మూడువేల 'విలేజ్ క్లినిక్'లు మూత!.. ఇంత ఖర్చుపెట్టినా అందించేది కేవలం "టెలీ మెడిసిన్" సేవలే
- ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసి ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో రోగులకు సేవలు బంద్
- ఆగిపోయిన ఆరోగ్య ఆసరా.. ప్రభుత్వ వైద్యరంగం నిర్వీర్యం.. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన కొత్త మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌పరం
- గొప్పగా ఉన్న ఆరోగ్య రంగాన్ని నాశనం చేసి బాబు సర్కారు 'ప్రైవేట్' పాట!

2లో



ప్రివెంటివ్ కేర్‌ను బలోపేతం చేస్తూ వైఎస్ జగన్ పాలనలో బలమైన అడుగులు..

ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు ప్రభుత్వ వైద్యుల సేవలు

టెలీ మెడిసిన్ వైద్యసేవల్లో దేశానికే ఆదర్శంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

విప్లవాత్మక రీతిలో తెచ్చిన 'ఫ్యామిలీ డాక్టర్' ద్వారా ప్రజల వద్దకే వైద్యులు

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఊరూవాడా స్పెషలిస్ట్ వైద్యులతో క్యాంపులు..

ఉచితంగా మందులు డోర్ డెలివరీ

రాష్ట్రంలో ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి ప్రజలందరికీ హెల్త్ స్క్రీనింగ్ టెస్టులు

సురవరం సుధాకర్‌రెడ్డి కన్నుమూత


వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో తుదిశ్వాస విడిచిన సీపీఐ అగ్రనేత

విద్యార్థి దశ నుంచే వామపక్ష ఉద్యమాలతో అనుబంధం

పార్టీలో వివిధ హోదాల్లో సేవలు..ప్రధాన కార్యదర్శిగానూ బాధ్యతలు

నల్లగొండ నుంచి రెండుసార్లు ఎంపీగా గెలుపు

సురవరం మృతిపై మాజీ సీఎం వైఎస్ జగన్ సహా పలువురు ప్రముఖులు, పార్టీ నేతల సంతాపం



సాక్షి, హైదరాబాద్/సాక్షి, నెట్‌వర్క్: కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) అగ్రనేత నేత సురవరం సుధాకర్‌రెడ్డి (83) శుక్రవారం రాత్రి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో సుధాకర్‌రెడ్డి మరణించినట్లు కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు తెలిపారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుధాకర్‌రెడ్డి గతంలో పార్టీలో అత్యున్నత పదవి అయిన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. నల్లగొండ నుంచి రెండుసార్లు ఎంపీగా విజయం సాధించారు. సురవరం మృతిపై మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, ఏపీ సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ..

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఓఎన్‌జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్



బంగాళాఖాతంలో ఓఎన్‌జీసీ సంస్థకు చెందిన దీన్‌దయాళ్ గ్యాస్ బావి నుంచి పి.మల్లవరం ఆన్‌షోర్ టెర్మినల్ వరకు వేసిన గ్యాస్ పైపులైను మధ్యమార్గంలో లీక్ కావడంతో భారీ ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడ్డాయి.

వివరాలు 3లో ▸

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం



విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఆందోళనకు దిగడంతో.. కూటమి సభ్యులు దిగివచ్చారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో తీర్మానం చేశారు.

వివరాలు 3లో ▸

22.5 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను నెల్లూరు రైల్వే పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 4.50 లక్షల విలువైన 22.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వివరాలు 3లో ▸

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నక్సలైట్ల మద్దతుదారుడు



నక్సలైట్లకు గట్టి మద్దతుదారుడైన సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని విపక్ష 'ఇండియా' కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసుకుందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తప్పుపట్టారు. 'సల్వాజుడుం' చట్ట వ్యతిరేకమంటూ గతంలో ఆయన తీర్పు ఇచ్చారని గుర్తు చేశారు.

వివరాలు 6లో ▸

ఇదండీ సంగతి



మన అంతరిక్ష కేంద్రం!



బీఏఎస్-01 నమూనాను ఆవిష్కరించిన ఇస్రో

మన అంతరిక్ష ప్రస్థానంలో కీలక మైలురాయి

అమెరికా, రష్యా, చైనా సరసకు భారత్

మూడేళ్లలో ప్రయోగించాలన్నది లక్ష్యం

పూర్తిగా దేశీయంగానే బీఏఎస్ తయారీ


2లో

ఎన్నో విశేషాలు.. బీఏఎస్-01

బరువు	పొడవు	వెడల్పు
10 టన్నులు	8 మీటర్లు	3.8 మీటర్లు

దీన్ని భూమికి 450 కి.మీ. ఎత్తున దిగువ కక్ష్యలోకి ప్రవేశ పెడతారు

ఓడిపోయే వ్యక్తిని ఎలా నిలబెడతారు?



- ఇండియా కూటమి అభ్యర్థి ఎంపికపై సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- సి.పి.రాధాకృష్ణన్‌ను ఎన్డీయే నేతలంతా కలిసే ఎంపిక చేసినట్లు వెల్లడి
- ఎన్డీయే అభ్యర్థికి కాకుండా మరొకరికి మద్దతెలా ఇస్తామని ప్రశ్న..
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ ముఖ్యమంత్రి భేటీ

3లో



పోలవరం నిర్వాసితులకు
పునరావాసంలో అంతులేని నిర్లక్ష్యం

సకాలంలో పునరావాసం కల్పించకపోతే నిర్వాసితుల జీవితాలకు ప్రమాదం

దీనికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఆక్షేపిస్తూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదిక

జీవనోపాధిని పెంచేలా నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని సిఫార్సు

2లో

గుర్తు పెట్టుకుని లెక్క సరిచేస్తాం

- దెందులూరు టీడీపీ నేతలకు వైఎస్సార్‌సీపీ నేతల హెచ్చరిక
- తోటల్లో చెట్లను నరికి వేయడం దారుణం
- భయపెట్టాలని చూస్తే.. అది మీ భ్రమే అవుతుంది
- రక్తం వచ్చేలాగా దాడులు చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారు?
- టీడీపీ మూకలు డీఎస్పీనే తోసేస్తుంటే ఏం చేశారు?.. రాబోయేది వైఎస్ జగన్ ప్రభుత్వమే.. గుర్తు పెట్టుకోండి
- అబ్బయ్య చౌదరికి పరామర్శ.. ఏఎస్పీకి వినతి పత్రం

10లో



డీఎస్సీ-2025 మెరిట్ లిస్టుల విడుదల

2లో

జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్లలో జాబితాలు

వ్యక్తిగత లాగిన్ ఐడీల ద్వారా కాల్‌లెటర్లు అందజేత.. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని అభ్యర్థుల అభ్యర్థిత్వం రద్దు

ఎంపిక ప్రక్రియ పూర్తిగా మెరిట్, అర్హత ఆధారంగానే.. డీఎస్సీ-2025 కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి వెల్లడి

పోలవరం నిర్వాసితులకు పునరావాసంలో అంతులేని నిర్లక్ష్యం

- రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఆక్షేపిస్తూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదిక

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మండిపడింది. సకాలంలో పునరావాసం కల్పించకపోతే నిర్వాసితుల జీవితాలు ప్రమాదంలో పడతాయని ఆందోళన వ్యక్తం చేసింది. జీవనోపాధిని పెంచేలా నిర్వాసితులకు పునరావాసం కల్పించడాన్ని అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలని సిఫార్సు చేస్తూ పార్లమెంట్‌కు ఇటీవల స్టాండింగ్ కమిటీ నివేదిక ఇచ్చింది. జలవనరుల విభాగంపై ఎంపీ రాజీవ్ ప్రతాప్ రూడీ అధ్యక్షతన ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ.. ఈ ఏడాది జూన్ 8 నుంచి 11 వరకు పోలవరం ప్రాజెక్టు పనులు, పునరావాసం కల్పనను క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. దీనిపై పార్లమెంట్‌కు నివేదిక ఇచ్చింది.

12,797 కుటుంబాలకే పునరావాసం

పోలవరం ప్రాజెక్టులో 45.72 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేస్తే 1,06,006 కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. ఇందుకోసం 213 పునరావాస కాలనీల్లో ఇళ్లు నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించాలి. కానీ, 41.15 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేసేలా.. పోలవరం ప్రాజెక్టును 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని కేంద్ర కేబినెట్ నిర్దేశించింది. వరదలు, సాంకేతిక సమస్యలు వస్తే.. ప్రాజెక్టును పూర్తి చేసేందుకు మరో ఏడాది గడువు పొడిగించింది. ఆ మేరకు నిధులు ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ ప్రాజెక్టులో 41.15 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేస్తే 38,060 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. కానీ, జనవరి 8 నాటికి కేవలం 12,797 కుటుంబాలకే పునరావాసం కల్పించారని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికలో ఎత్తిచూపింది. తక్షణమే నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. పోలవరం నిర్మాణం, నిర్వాసితులకు పునరావాసం కల్పించే పనులను సమన్వయం చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. పనులను పర్యవేక్షిస్తున్న అధికారులకు వెంటనే ప్రాజెక్టు వద్ద క్వార్టర్స్ నిర్మించాలని సిఫార్సు చేసింది. ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేలా పనులను ఎప్పటికప్పుడు సమీక్షించడానికి కమిటీని నియమించాలని సిఫార్సు చేసింది. పోలవరం ప్రాజెక్టు వద్ద ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి కల్పించవచ్చని అభిప్రాయపడింది.

అధికారం, డబ్బు @ పెరోల్

- కొమ్మూరి కనకారావు విమర్శ
- హోంమంత్రి, ఎమ్మెల్యేలపై సీఎం చర్యకు డిమాండ్



సాక్షి, అమరావతి: జీవితఖైదీ శ్రీకాంత్ పెరోల్ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన హోం మంత్రి అనిత, నెల్లూరు జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలపై సీఎం చంద్రబాబు తక్షణం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందని, అధికార దుర్వినియోగం జరిగిందని పేర్కొన్నారు. ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ''శ్రీకాంత్‌ను బయటకు తీసుకువచ్చి, తమ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పావుగా వాడుకోవాలనే లక్ష్యంతోనే హోంమంత్రి, టీడీపీ ఎమ్మెల్యేలు అతని పెరోల్‌కు సహకరించారు. పెరోల్ వ్యవహారం బయటకు రావడంతో కప్పిపుచ్చేందుకు హోంమంత్రి, టీడీపీ ఎమ్మెల్యేలు నానా తంటాలు పడుతున్నారు. అరుణను కూడా హడావుడిగా అరెస్ట్ చేశారు.'' అని కనకారావు ధ్వజమెత్తారు.

మన అంతరిక్ష కేంద్రం!



బీఏఎస్-01 నమూనా ఆవిష్కరించిన ఇస్రో

ఇదేమిటో తెలుసా? రోదసిలో మన దేశాన్ని అమెరికా, రష్యా, చైనా సరసన నిలిపే ప్రతిష్టాత్మక భారతీయ అంతరిక్ష కేంద్రం (బీఏఎస్) తొలి నమూనా! దేశమంతా చిరకాలంగా ఎంతో ఉత్సుకతగా ఎదురు చూస్తున్న ఈ బీఏఎస్-01ను భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో) శుక్రవారం సగర్వంగా ఆవిష్కరించింది. ఢిల్లీలోని భారత్ మంటపంలో జరుగుతున్న జాతీయ అంతరిక్ష దినోత్సవం ఇందుకు వేదికైంది. దేశీయంగా రూపకల్పన చేసిన బీఏఎస్ తొలి మాడ్యూల్ (01)ను 2028 కల్లా భూ దిగువ కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు ఇస్రో కృషి చేస్తుండటం తెలిసిందే. 2035కల్లా దాన్ని ఐదు మాడ్యూళ్లకు విస్తరించాలన్నది లక్ష్యం. - న్యూఢిల్లీ

ఎన్నెన్ని విశేషాలో!

- బీఏఎస్-01 బరువు 10 టన్నులు, పొడవు 8 మీటర్లు, వెడల్పు 3.8 మీటర్లు.
- దీన్ని భూమికి 450 కి.మీ. ఎత్తున దిగువ కక్ష్యలోకి ప్రవేశపెడతారు
- అంతరిక్షంలో స్పేస్-లైఫ్ సైన్సెస్, ఔషధ, గ్రహాంతర అన్వేషణ తదితర అత్యాధునిక పరిశోధనలకు వేదికగా నిలవనుంది.
- వాణిజ్య అంతరిక్షం రంగంలో భారత్ పూర్తిస్థాయిలో కాలూనేందుకు వీలు కల్పించనుంది.
- అంతరిక్ష పర్యాటకంతోపాటు అంతర్జాతీయ సహకారాలకు వేదిక కానుంది.
- స్పేస్ టెక్నాలజీ, రీసెర్చ్‌ను కెరీర్‌గా మలచుకునేలా భావితరాలకు స్ఫూర్తినివ్వనుంది.
- ఎన్విరాన్‌మెంటల్ కంట్రోల్, లైఫ్ సపోర్ట్ సిస్టం (ఈసీఎల్ఎస్ఎస్), భారత్ డాకింగ్ సిస్టం, భారత్ బెర్తింగ్ మెకానిజం, ఆటోమేటెడ్ హాచ్ సిస్టం వంటి హంగులెన్నో దీని సొంతం.
- ఇవన్నీ పూర్తిగా దేశీయంగా తయారు చేసుకున్న ఫీచర్లే కావడం విశేషం.
- అంతరిక్షంలో మనుషుల ఆరోగ్యంపై సూక్ష్మగురుత్వాకర్షణ ప్రభావంతో పాటు సాంకేతిక ప్రదర్శనలు, శాస్త్రీయ ఇమేజింగ్ తదితరాలు బీఏఎస్‌లో జరగనున్నాయి.
- రోజువారీ కార్యకలాపాలకు తోడు రీఫిల్లింగ్ ప్రొపల్లెంట్, ఈసీఎల్ఎస్ఎస్ ఫ్లూయిడ్లు, రేడియేషన్, థర్మల్ ప్రభావం, మైక్రో మీటరాయిడ్ ఆర్బిటల్ వ్యర్థాల (ఎంఎంఓడీ) నుంచి రక్షణ తదితరాలకు అవసరమైన హంగులన్నీ బీఏఎస్‌లో ఉండనున్నాయి.
- స్పేస్ సూట్లు, ఎయిర్ లాక్స్, ప్లగ్ అండ్ ప్లే తరహా ఇంటిగ్రేటెడ్ ఏవియానిక్స్ వ్యవస్థలకు దన్నుగా నిలుస్తుంది.

ఆ దేశాల సరసన..

బీఏఎస్-01 భారత్‌ను సొంత అంతరిక్ష కేంద్రాలున్న అమెరికా, రష్యా, చైనా సరసన నిలపనుంది. ప్రస్తుతం రెండే అంతరిక్ష కేంద్రాలు పని చేస్తున్నాయి. మొదటిది అమెరికా, రష్యా, యూరప్, జపాన్, కెనడా సంయుక్తంగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం. రెండోది చైనాకు చెందిన టియాంగాంగ్ స్పేస్ స్టేషన్.

- గతంలో తొలుత అమెరికా, అనంతరం సోవియట్ యూనియన్ (యూఎస్ఎస్ఆర్-ప్రస్తుత రష్యా) సొంత అంతరిక్ష కేంద్రాలను నిర్వహించాయి.
- అమెరికా స్కైలాబ్ పేరిట, యూఎస్ఎస్ఆర్ మిర్ పేరిట అంతరిక్ష కేంద్రాలను నిర్వహించాయి.
- ఇటీవల టియాంగాంగ్ స్పేస్ స్టేషన్ నిర్మించిన చైనా అంతకుముందు టియాంగాంగ్-1, టియాంగాంగ్-2 పేరుతో మాడ్యూళ్లను ఏర్పాటు చేసుకుంది.

సురవరం సుధాకర్‌రెడ్డి కన్నుమూత

మొదటి పేజీ తరువాయి

ఇతర నేతలు, ప్రముఖులు సంతాపం ప్రకటించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పార్టీ ప్రధాన కార్యదర్శిగా.. రెండుసార్లు ఎంపీగా

సుధాకర్‌రెడ్డి 1942 మార్చి 25న ప్రస్తుత నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొండ్రావుపల్లిలో సురవరం వెంకట్రామ్‌రెడ్డి, ఈశ్వరమ్మ దంపతులకు జన్మించారు. అయితే ఆయన సొంతూరు జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని కంచుపాడు. ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం కర్నూలు జిల్లాలోని ఉస్మానియా కళాశాలలో బీఏ చదివారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాలలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచే వామపక్ష ఉద్యమాలతో అనుబంధమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. సీపీఐ అనుబంధ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నుంచి ఆయన ప్రస్థానం మొదలైంది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియాలో క్రమంగా ఎదుగుతూ ప్రధాన కార్యదర్శి కూడా అయ్యారు. అంతకుముందు 1966లో ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, 1970లో జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారు. 1972లో ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1971లో



సురవరం సుధాకర్‌రెడ్డి (ఫైల్)



తల్లిదండ్రులతో సురవరం సుధాకర్‌రెడ్డి (ఫైల్)

సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడిగా.. 1974 నుంచి 1984 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. 1984, 1990లలో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 1994లోనూ కర్నూలులోని డోన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు. అయితే 1998 (12వ లోక్‌సభ), 2004 (14 లోక్‌సభ)లో నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా విజయం సాధించారు. ఈ క్రమంలో సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2007లో హైదరాబాద్‌లో జరిగిన పార్టీ జాతీయ సమావేశాల్లో ఉప ప్రధాన కార్యదర్శిగా, 2012లో పాట్నాలో జరిగిన జాతీయ సమావేశాల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత కూడా ఆయననే ప్రధాన కార్యదర్శిగా పార్టీ ఎన్నుకుంది. ఈ నేపథ్యంలో 2012 నుంచి 2019 వరకు ఆ పదవిలో కొనసాగారు. 2004లో ఎంపీగా ఎన్నికైన తర్వాత పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ (కార్మిక) చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

విద్యుత్ చార్జీల ఆందోళనలో కీలక పాత్ర

2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచగా.. దీనిపై వామపక్షాలు పెద్దయెత్తున పోరాటం నిర్వహించాయి. ఈ ఆందోళనల్లో సురవరం కీలక పాత్ర పోషించారు. ఎంపీగా పార్లమెంటులో కార్మికులు, రైతులు, కూలీలు, పేదల సమస్యలపై గళమెత్తారు. వ్యవసాయ సంక్షోభం, కార్మిక హక్కులు, ఆర్థిక విధానాలపై నిరంతరం స్వరం వినిపించారు. ప్రజలు, కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉండేవారు. నిరాడంబర జీవనశైలి, ఆచరణాత్మక రాజకీయ దృక్పథం ఆయన ప్రత్యేకత. దేశంలో వామపక్ష శక్తుల ఐక్యత కోసం కృషి చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు. తెలంగాణ వైతాళికుడిగా పేరుగాంచిన సురవరం ప్రతాపరెడ్డి ఈయనకు పెదనాన్న.

మహబూబ్‌నగర్‌లో జననం.. నల్లగొండతో అనుబంధం

సురవరం సుధాకర్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించినా నల్లగొండతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉంది. పార్టీ కార్యక్రమాలైనా, రాజకీయాలైనా నల్లగొండ గడ్డ నుంచే క్రియాశీలంగా వ్యవహరించారు. నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు ఎంపీగా గెలుపొంది సేవలందించారు. ఉద్యమాల పురిటిగడ్డ నల్లగొండ జిల్లా కేంద్రంగా అనేక వామపక్ష పోరాట కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 2024 డిసెంబర్‌లో నల్లగొండలో నిర్వహించిన సీపీఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగసభలో పాల్గొన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కూడా ఆయన సభలో పాల్గొని మాట్లాడారు. జాతీయ నాయకులతో కలిసి వేదికపై ప్రసంగించారు.

చిరస్మరణీయుడు సురవరం

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. సీపీఐకే కాక తెలంగాణకు, వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

వైఎస్ జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: సీపీఐ అగ్రనేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన సురవరం సుధాకర్‌రెడ్డి ప్రముఖ వామపక్ష నేతగా గుర్తింపు పొందారని, ఏ పదవిలో ఉన్నా.. తనదైన ఒక ప్రత్యేక ముద్ర వేశారని గుర్తుచేశారు. ఆయన మరణం రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని లోటన్న వైఎస్ జగన్.. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

డీఎస్సీ-2025 మెరిట్ లిస్టుల విడుదల

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన డీఎస్సీ-2025 మెరిట్ జాబితాలను శుక్రవారం అర్ధరాత్రి ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్ర, జోన్, జిల్లా స్థాయిలో అన్ని సబ్జెక్టుల వారీగా మెరిట్ లిస్టులను ప్రకటించింది. వీటిని డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ (http;//apdrc.apcfrr.in/లోనూ, సంబంధిత జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్లలోనూ అందుబాటులో ఉంచామని డీఎస్సీ-2025 కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీ పోస్టులకు సంబంధించి జోన్ ఆఫ్ కన్సిడరేషన్‌లోకి వచ్చిన అభ్యర్థులకు వారి వ్యక్తిగత డీఎస్సీ లాగిన్ ఐడీల ద్వారా కాల్ లెటర్లు అందిస్తామన్నారు. అభ్యర్థులు తమ వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్ లెటర్లను డౌన్‌లోడ్ చేసుకుని అందులో సూచనలను అనుసరించాలని ఆయన పేర్కొన్నారు. సదరు అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు తాజాగా తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన మూడుసెట్ల జిరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలి. అంతకుముందే సంబంధిత సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీ, టైముకి సర్టిఫికెట్ల పరిశీలనకు వ్యక్తిగతంగా హాజరుకావాలి. హాజరుకాని అభ్యర్థుల అభ్యర్థిత్వం రద్దుచేస్తారు. మెరిట్ లిస్టులో తదుపరి ఉన్న అభ్యర్థిని సర్టిఫికెట్ల పరిశీలకులు పిలుస్తారు. ఇక సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చినంత మాత్రాన అభ్యర్థులు ఎంపిక అయినట్లు కాదని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి స్పష్టంచేశారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా మెరిట్, అర్హత, సంబంధిత నియమ నిబంధనలకు అనుగుణంగా జరుగుతుందని స్పష్టంచేశారు. ఇక రాష్ట్రస్థాయి పోస్టులైన ప్రిన్సిపాల్, పీజీటీ, టీజీటీ పోస్టులకు రాష్ట్రస్థాయి, జోనల్ స్థాయిలో ర్యాంకులను ప్రకటించగా.. స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీలకు ఉమ్మడి జిల్లాల వారీగా ర్యాంకులు, స్కోర్‌ను విడుదల చేశారు.

పీజీటీ రాష్ట్ర టాపర్లు వీరే..

ఇంగ్లిష్ : వారణాశి లక్ష్మీ స్వరూప (87 స్కోరు)
హిందీ : రమేష్ రామనుకొలను (93.5 స్కోరు)
సంస్కృతం: తునికిపాటి భాను (94 స్కోరు)
తెలుగు: పట్నాన ధర్మారావు (85.5 స్కోరు)
బయాలజీ (ఇంగ్లిష్ మీడియం): చోడవరం శివకుమార్ (81.5 స్కోరు)
గణితం (ఇంగ్లిష్ మీడియం): సంకరణం విజయ్ (78.5 స్కోరు)
ఫిజిక్స్ (ఇంగ్లిష్ మీడియం): బాలకిశోర్ కురాకుల (74.5 స్కోరు)
సోషల్ స్టడీస్ (ఇంగ్లిష్ మీడియం): నిరోషా కురమాన (85 స్కోరు)
ప్రిన్సిపాల్: చింతల గౌతమ్ (75.5 స్కోరు)

పీఈటీ రాష్ట్ర ర్యాంకర్లు..

అన్నెపు జగదీశ్వరరావు: 90.5 స్కోరు
టీజీటీ ఇంగ్లిష్..
వెలగల రమ్యశ్రీ : 85.43 స్కోరు
టీజీటీ హిందీ..
గొల్లపల్లి పవన్ నారాయణ్ కౌశిక్ శాస్త్రి: 88.53 స్కోరు
టీజీటీ సంస్కృతం..
తునికిపాటి భాను: 93.60 స్కోరు
టీజీటీ తెలుగు..
కల్లె మహేశ్‌బాబు: 85.20 స్కోరు
టీజీటీ మ్యాథ్స్.. సుంకరణం విజయ్: 87.33 స్కోరు
టీజీటీ సైన్స్..
బోకం అనిత: 77.89 స్కోరు
టీజీటీ సోషల్ స్టడీస్..
బొమ్మిడి డిల్లేశ్: 84.20

కుప్పం నుంచి కుట్రలకు క్లాప్!

ప్రభుత్వ వైద్య రంగంలో ఇప్పటికే ఉన్న సమర్థ వ్యవస్థలను నీరుగారుస్తూ తెరపైకి 'డింక్' ప్రాజెక్టు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైద్య రంగంలో అందుబాటులో ఉన్న వనరులను నిర్వీర్యం చేస్తున్న కూటమి సర్కారు పీపీపీ ప్రాజెక్టుల పేరిట ప్రజాధనాన్ని దారి మళ్లిస్తోంది. ఇప్పటికే ఉన్న సమర్థ వ్యవస్థలను నీరుగారుస్తూ 'డింక్' (డిజిటల్ నెర్వ్ సెంటర్) పేరుతో ఓ ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది. మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో పైసా ఖర్చు లేకుండా వీడియో కాల్ ద్వారా మెడికల్ కాలేజీల్లోని హబ్‌లతో పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లను అనుసంధానించి స్పెషలిస్టులతో వైద్య సేవలు అందించగా గొప్పగా నడుస్తున్న ఈ వ్యవస్థలను అటకెక్కించిన బాబు సర్కారు ముడుపుల కోసం కొత్త ప్రాజెక్టును తెచ్చింది. గతంలో అందించిన టెలీ మెడిసిన్ సేవలకే కలరింగ్ ఇస్తూ సమర్థంగా సేవలు అందించిన విలేజ్ క్లినిక్స్‌కు పాతరేసింది. వైద్య సేవల్లో ఇప్పుడేదో సరికొత్త వ్యవస్థను తెస్తున్నట్లు మభ్యపెడుతూ 'డింక్' పేరుతో రూ.350 కోట్ల ప్రజాధనానికి టెండర్ పెట్టింది! సాక్షాత్తూ సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం కేంద్ర బిందువుగా 'పైలెట్' ప్రాతిపదికన ఈ దోపిడీ వ్యవహారాలకు రంగం సిద్ధమైంది. కొద్ది నెలలుగా ఇక్కడ ప్రైవేట్ భాగస్వామ్యంతో 'డింక్' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. వచ్చే ఏడాది ఆఖరునాటికి రాష్ట్రవ్యాప్తంగా దీన్ని విస్తరిస్తామని సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. 'డింక్' ప్రాజెక్టులో భాగంగా రేషనలైజేషన్ పేరిట ఏకంగా 2,500 నుంచి 3 వేల విలేజ్ క్లినిక్‌లను మూసివేసేందుకు వైద్యశాఖ ఇప్పటికే కసరత్తు ప్రారంభించడం గమనార్హం. గ్రామీణ స్థాయిలో మెరుగైన వైద్యాన్ని అందించిన వ్యవస్థలను నీరుగార్చి ప్రైవేట్ సంస్థల సేవల పట్ల మొగ్గు చూపడం ఏమిటనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ రంగంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ఎన్నికైన ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. ఈ క్రమంలో ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ వైద్యులే నేరుగా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యం చేసేలా విప్లవాత్మక రీతిలో ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష లాంటి వినూత్న కార్యక్రమాలను తొలిసారిగా మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టారు. ఆరోగ్య సురక్షలో భాగంగా రాష్ట్రంలో ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి మరీ ప్రజలందరికీ హెల్త్ స్క్రీనింగ్ టెస్టులు చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు చికిత్సను పేదలకు ఉచితంగా అందించారు. వైద్య శాఖలో ఎప్పటి ఖాళీలు అప్పుడే భర్తీ చేస్తూ జీరో వేకెన్సీ విధానాన్ని అమలు చేశారు. ఏకంగా 54 వేలకుపైగా పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీ మాటే లేకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో నాడు జాతీయ స్థాయిలో గైనిక్ వైద్యుల కొరత 50% ఉంటే రాష్ట్రంలో కేవలం 1.4% మాత్రమే ఉంది. జాతీయ స్థాయిలో స్పెషలిస్ట్ వైద్యుల కొరత 61% ఉంటే ఏపీలో 6.2 శాతం మాత్రమే ఉండేది. కేవలం వైద్య నియామకాలే కాకుండా ఆస్పత్రుల్లో మందుల కొరతకు తావు లేకుండా చేశారు. ఇలా ప్రభుత్వ వనరులను సద్వినియోగం చేసుకుంటూ.. నిధులు దుర్వినియోగం కాకుండా 2019-24 మధ్య జగన్ వైద్య ఆరోగ్య శాఖను బలోపేతం చేస్తే నేడు పీపీపీ ప్రాజెక్టుల రూపంలో చంద్రబాబు ప్రజారోగ్యానికి గండి కొడుతున్నారు. ప్రభుత్వ నూతన మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేశారు. రోగులకు ఆరోగ్య ఆసరాను ఎగరగొట్టారు. ఆరోగ్యశ్రీ బిల్లులు దాదాపు రూ.నాలుగు వేల కోట్లు పెండింగ్‌లో పెట్టడంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు నిలిచిపోతున్నాయి.



'డింక్' ప్రాజెక్టు ఏమిటంటే..?

'డింక్' పేరిట కుప్పంలో ఓ సెంటర్‌ను ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు అనుసంధానించారు. ఇక్కడికి వచ్చే రోగులకు డిజిటల్ హెల్త్ అకౌంట్ జారీచేసి ఈ సెంటర్ ద్వారా ఫోన్‌లో స్పెషలిస్ట్ వైద్యసేవలను అందచేస్తారు. అవసరం మేరకు వైద్యుడు వీడియో కాల్ చేసి రోగితో మాట్లాడి సలహాలు, సూచనలు ఇస్తారు. సెంటర్‌లో ఉండే ఆరోగ్య సిబ్బంది గర్భిణులు, బాలింతలు, ఇతరులకు ఆరోగ్య సంరక్షణపై సలహాలు, సూచనలు ఇస్తుంటారు. స్థూలంగా చెప్పాలంటే 'డింక్' ప్రాజెక్టు అచ్చు టెలీ మెడిసిన్ లాంటిదే. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే కుప్పం పరిధిలో రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకూ ప్రభుత్వం ఖర్చుచేసింది. దీన్ని రాష్ట్రం మొత్తం విస్తరించడానికి రూ.350 కోట్ల మేర ఖర్చవుతుందని సంబంధిత సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదించింది.

టెలీ మెడిసిన్‌తో అంతకంటే మెరుగ్గా..

గత ప్రభుత్వం పైసా కూడా దుర్వినియోగం కాకుండా అంతకంటే మెరుగ్గా ప్రజలకు టెలీ మెడిసిన్ సేవలను అందించింది. 26 జిల్లాల్లో వైద్య కళాశాలు, జిల్లా ఆస్పత్రుల్లో 27 హబ్‌లను వైద్యశాఖ ఏర్పాటు చేసింది. ఈ హబ్‌లకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,400కిపైగా పీహెచ్‌సీలు, 562 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 10,032 విలేజ్ క్లినిక్‌లను అనుసంధానం చేసింది. ఒక్కో హబ్‌లో ఇద్దరు జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పీడియాట్రిక్స్ లాంటి మూడు రకాల స్పెషలిస్ట్ వైద్యులతో పాటు ఇద్దరు మెడికల్ ఆఫీసర్ల సేవలు అందుబాటులో ఉంచింది. పీహెచ్‌సీ, విలేజ్ క్లినిక్‌కు వచ్చిన రోగులకు స్పెషాలిటీ వైద్యుల సేవలు అవసరమైన సందర్భాల్లో టెలీమెడిసిన్ ద్వారా హబ్‌లోని వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు చికిత్స అందించారు. హబ్‌లోని వైద్యులు ఆడియో, వీడియో కాల్ ద్వారా రోగులతో మాట్లాడి సలహాలు, సూచనలు తెలియజేయడంతో పాటు ప్రిస్క్రిప్షన్ సూచించేవారు. పీహెచ్‌సీ, విలేజ్ క్లినిక్‌లో ఈ మందులను రోగులకు అందజేసే యంత్రాంగం అప్పట్లో పనిచేసింది. స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు ఈ-సంజీవని (ఓపీడీ) యాప్ ద్వారా ఇంటి నుంచే వైద్యసేవలు పొందడానికి కూడా ఆస్కారం కల్పించారు. స్మార్ట్‌ఫోన్ లేనివారు, వినియోగం తెలియని వారికి ఆశావర్కర్లు సహాయపడ్డారు. ఇందుకోసం రాష్ట్రంలోని 42వేల మంది ఆశా వర్కర్లకు స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేసిన గత ప్రభుత్వం వాటన్నింటినీ హబ్‌లకు అనుసంధానించింది. ఇలా ప్రైవేట్ వ్యక్తులు, నిధుల దుర్వినియోగానికి ఏమాత్రం తావులేకుండా గత ప్రభుత్వంలో ప్రజలకు టెలీమెడిసిన్ సేవలు పారదర్శకంగా అందాయి.

నాడు దేశానికే ఆదర్శంగా..

నిధుల దుబారాకు అడ్డుకట్ట వేసి టెలీ మెడిసిన్ వైద్యసేవలు అందించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచింది. 2019 నుంచి 2023 డిసెంబరు నాటికి దేశవ్యాప్తంగా 18.3 కోట్ల టెలి కన్సల్టేషన్లు నమోదైతే ఒక్క ఏపీ నుంచే అత్యధికంగా 25 శాతం అంటే 4,61,01,963 కన్సల్టేషన్లు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే పీపీపీ ప్రాజెక్టుల రూపంలో రూ.వందల కోట్ల నిధులు దుబారా చేయకుండా గత ప్రభుత్వంలో ఏర్పాటైన హబ్‌లను మరింత బలోపేతం చేసి టెలీవైద్య సేవలు అందించవచ్చని వైద్య రంగ నిపుణులు సూచిస్తున్నారు.

ప్రివెంటివ్ కేర్ బలోపేతం..

వైఎస్ జగన్ పాలనలో 2019-24 మధ్య ప్రజారోగ్య పరిరక్షణలో అత్యంత కీలకమైన ప్రివెంటివ్ కేర్‌ను బలోపేతం చేశారు. పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో పట్టణాల్లో 562 యూపీహెచ్‌సీలను నెలకొల్పారు. మండలానికి రెండు పీహెచ్‌సీలు/ఒక పీహెచ్‌సీ, ఒక సీహెచ్‌సీ ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు ప్రభుత్వ వైద్యులను సమకూర్చారు. అంతేకాకుండా నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీలకు అధునాతన సౌకర్యాలతో భవనాలు, ల్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా గిరిజన, మారుమూల గ్రామాలకు సైతం ప్రభుత్వ వైద్యసేవలను చేరువ చేస్తూ 2,500 జనాభాకు ఒకటి చొప్పున 10,032 విలేజ్ క్లినిక్స్‌ను నెలకొల్పారు.

వైద్యులే ప్రజల వద్దకు..

వైద్యం కోసం ప్రజలు వ్యయప్రయాసలు పడాల్సిన పనిలేకుండా నాడు వైఎస్ జగన్ ప్రభుత్వం వైద్యులనే ప్రజల దగ్గరకు తీసుకెళ్లింది. విప్లవాత్మక రీతిలో ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ వైద్యులను గ్రామాలకు పంపి వైద్యసేవలు అందించారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడి ఆరోగ్యాన్ని వాకబు చేసి వ్యాధులను ముందే గుర్తించడంతో పాటు వైద్య సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుచేశారు. ఇందులో భాగంగా ఊరూవాడా స్పెషలిస్ట్ వైద్యులతో క్యాంపులు నిర్వహించి అనారోగ్య బాధితులకు కొండంత భరోసా కల్పించారు. 16 రకాలు టెస్టులు ఉచితంగా చేశారు. మెరుగైన వైద్యం అవసరం ఉన్నవారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసి ఉచితంగా వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చేయి పట్టుకుని ముందుకు నడిపించింది. అంతేకాకుండా గుండె, కిడ్నీ, మెదడు, క్యాన్సర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇళ్ల వద్దే ఖరీదైన మందులను ఉచితంగా డోర్ డెలివరీ చేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆస్పత్రుల్లో డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలతో మందులు అందచేశారు. అంత గొప్పగా ఉన్న ఆరోగ్య రంగాన్ని నాశనం చేసిన చంద్రబాబు సర్కారు నిధులను దోచిపెట్టే ప్రాజెక్టులకే జైకొడుతోంది.

క్లుప్తంగా...

ఓఎన్జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్
ఎగిసిపడిన మంటలు



గ్యాస్ పైపు లైనులో అగ్నిప్రమాదంతో దట్టంగా వ్యాపించిన అగ్నికీలలు

యానాం: బంగాళాఖాతంలో ఓఎన్జీసీ సంస్థకు చెందిన దీన్‌దయాళ్ గ్యాస్ బావి నుంచి పి.మల్లవరం ఆన్‌షోర్ టెర్మినల్ వరకు వేసిన గ్యాస్ పైపులైను శుక్రవారం తెల్లవారుజామున లీక్ కావడంతో భారీ ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. యానాం నియోజకవర్గ పరిధిలో దరియాలతిప్ప ఐలాండ్-3 ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ భూముల నుంచి 400 మీటర్ల దూరంలో గోదావరి నీటి ఉపరితలంపై ఉన్న గ్యాస్ పైపులైను నుంచి ఉవ్వెత్తున మంటలు వ్యాపించాయి. భారీ శబ్దాలతో మంటలు వస్తుండటంతో సిబ్బంది గోదావరి మధ్యలోకి చేరుకుని సరఫరాను నిలిపివేసి, మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదం గోదావరి మధ్యలో జరగడం, వరదనీరు ఎక్కువగా ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ తీర్మానం
వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల పట్టుతో దిగొచ్చిన కూటమి సభ్యులు



మేయర్ పోడియం వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ, సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం జీవీఎంసీని కుదిపేసింది. శుక్రవారం ఉదయం జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో చర్చించి ఆమోదించడానికి 84 అంశాలతో అజెండాను సిద్ధం చేశారు. అయితే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు నల్ల దుస్తులతో జీవీఎంసీకి వచ్చారు. ప్లకార్డులు ప్రదర్శించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరానికి చేరుకుని అక్కడ కూడా పెద్ద ఎత్తున నినదించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించాలని పట్టుబట్టారు. సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లు కూడా జత కలిశారు. ఎన్నికలకు ముందు కూటమి నేతలు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేసి ప్రధాని, ముఖ్యమంత్రికి పంపించాలని వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అయితే దీనికి మేయర్ పీలా శ్రీనివాసరావు అంగీకరించలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి, రెండు గంటల పాటు సభను అడ్డుకున్నారు. చివరికి మేయర్, కూటమి కార్పొరేటర్లు దిగొచ్చి, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేశారు.

22.5 కేజీల గంజాయి స్వాధీనం
చెన్నైకు చెందిన ఇద్దరు అరెస్ట్

నెల్లూరు (క్రైమ్): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను నెల్లూరు రైల్వే పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి4.50 లక్షల విలువైన 22.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నెల్లూరు రైల్వే పోలీసులు ప్రధాన రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. టాటానగర్-ఎర్నాకుళం రైల్లో చెన్నైకి చెందిన పళనిరాజేష్, అన్నానగర్‌కు చెందిన జుబునీషా ఒడిశాలోని రాయగఢ్ నుంచి నెల్లూరు వచ్చారు. ఇక్కడి నుంచి చెన్నై వెళ్లేందుకు టికెట్ తీసుకుని ప్లాట్‌ఫాంపైకి వస్తుండగా వారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడాన్ని పోలీసులు గమనించారు. వారిని అదుపులోకి తీసుకుని పరిశీలించగా రాజేష్ వద్ద 14.5 కేజీలు, జుబునీషా వద్ద 8 కేజీలు మొత్తం 22.5 కేజీల గంజాయిని గుర్తించారు.

అందరి సమ్మతితోనే కావేరికి గోదావరి

నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ చైర్మన్ అతుల్ జైన్

సాక్షి, అమరావతి: గోదావరి ట్రిబ్యునల్ కేటాయింపులకు భంగం వాటిల్లకుండా, ఏ రాష్ట్ర హక్కులకు విఘాతం కలగకుండా, పరివాహక ప్రాంతం (బేసిన్)లోని రాష్ట్రాల సమ్మతితో గోదావరి-కావేరి అనుసంధానం చేపడతామని నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ కమిటీ, కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అతుల్ జైన్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆరో సమావేశం జరిగింది. గోదావరి-కావేరి, బెడ్తి-వరద అనుసంధానంపై ఏకాభిప్రాయసాధనే అజెండాగా నిర్వహించిన ఈ సమావేశంలో బేసిన్‌లోని తొమ్మిది రాష్ట్రాలు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, కర్ణాటక), కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి జలవనరులశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ అనుసంధానంపై అతుల్ జైన్ తొలుత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇంద్రావతి సబ్ బేసిన్‌లో ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 148 టీఎంసీల గోదావరి జలాలను ఇచ్ఛంపల్లి నుంచి నాగార్జునసాగర్ (కృష్ణా), సోమశిల (పెన్నా), అరణియార్ రిజర్వాయర్ మీదుగా కావేరికి తరలిస్తామని చెప్పారు. దీన్లో అంతర్భాగంగా కర్ణాటకలో బెడ్తి-వరద అనుసంధానం చేపడతామన్నారు. కావేరికి తరలించే 148 టీఎంసీల గోదావరి జలాలు, బెడ్తి-వరద అనుసంధానంలో తరలించే 18.5 టీఎంసీలు వెరసి 166.5 టీఎంసీలలో.. తెలంగాణకు 43.65, ఆంధ్రప్రదేశ్‌కు 43.86, తమిళనాడుకు 40.93, కర్ణాటకకు 34.40, పుదుచ్చేరికి 2.19 టీఎంసీలు కేటాయిస్తామని వివరిచుచారు. రెండోదశలో గంగా-మహానది, మహానది-గోదావరి అనుసంధానంతో కావేరికి మరిన్ని జలాలు తరలిస్తామని, అప్పుడు ఛత్తీస్‌గఢ్ కోటా 148 టీఎంసీలను ఆ రాష్ట్రానికే ఇస్తామని చెప్పారు. రెండోదశ అనుసంధానంలో రాష్ట్రాల అవసరాల మేరకు నీటిని కేటాయిస్తామన్నారు. తొలిదశ అనుసంధానానికి అన్ని రాష్ట్రాలు సమ్మతి వ్యక్తం చేస్తే తక్షణమే ప్రాజెక్టును చేపడతామని ఆయన చెప్పారు.

ఏ రాష్ట్ర ప్రభుత్వం ఏమన్నదంటే..

ఆంధ్రప్రదేశ్: గోదావరిలో నీటిలభ్యతపై సీడబ్ల్యూసీ మళ్లీ అధ్యయనం చేసి నికరజలాల్లో మిగులు తేల్చాలి. ఇచ్ఛంపల్లి నుంచి గోదావరి జలాలను తరలిస్తే ఏపీ హక్కులకు భంగం వాటిల్లుతుంది. పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి-కావేరి అనుసంధానం చేపడితే ఏ రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్లదు. నికర, వరదజలాల సమస్య ఉత్పన్నం కాదు. నాగార్జునసాగర్, సోమశిల రిజర్వాయర్లను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లుగా వినియోగించుకుంటే వాటి ఆయకట్టు ప్రయోజనాలకు విఘాతం కలుగుతుంది. వరదల్లో కృష్ణా, పెన్నా నిర్వహణ కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల, సోమశిల రిజర్వాయర్లపై సిమ్యులేషన్ స్టడీస్ నిర్వహించాలి.

ఛత్తీస్‌గఢ్: ఇంద్రావతి సబ్‌బేసిన్‌లో ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. మా కోటా 148 టీఎంసీలను తరలించడానికి అంగీకరించం.

తెలంగాణ: ఇచ్ఛంపల్లి నుంచి గోదావరి జలాల తరలింపునకు అభ్యంతరం లేదు. కానీ ఈ అనుసంధానంలో తరలించే జలాల్లో 50 శాతం నీటిని మాకు కేటాయించాలి. నాగార్జునసాగర్ ఆయకట్టుకు విఘాతం కలగకుండా చూడాలి.

మహారాష్ట్ర: ఇచ్ఛంపల్లి బ్యారేజీలో నీటిని వాడుకోవడానికి అనుమతి ఇవ్వాలి.

మధ్యప్రదేశ్: గోదావరి ట్రిబ్యునల్ అవార్డుకు విఘాతం కలగకుండా అనుసంధానించాలి.

ఒడిశా: గోదావరి-కావేరి అనుసంధానం రెండో దశలో మహానది-గోదావరి అనుసంధానాన్ని అంగీకరించం.

తమిళనాడు: మాకు నీటికేటాయింపు పెంచాలి.

కర్ణాటక: కృష్ణాజలాల్లో మా వాటా పెంచాలి.

కేరళ: కావేరి జలాల్లో మాకు అదనపు నీరు కేటాయించాలి.

పుదుచ్చేరి: మాకు నీటికేటాయింపు పెంచాలి.

నదుల అనుసంధానంలో ఏకాభిప్రాయమే ముఖ్యం

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి కేంద్రం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో నదుల అనుసంధానంలో రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయ సాధనే ముఖ్యమని కేంద్ర జల శక్తి శాఖ పేర్కొంది. దీనిని విజయవంతం చేసేందుకు రాష్ట్రాలు ముందుకు రావాలని కోరింది. నదుల అనుసంధానంపై రాజీవ్ ప్రతాప్ రూఢీ నేతృత్వంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ లేవనెత్తిన పలు ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం జవాబులు ఇచ్చింది. గోదావరి-కావేరి నదుల అనుసంధానాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి.. 147.98 టీఎంసీల నీళ్ల బదిలీ కోసం ముసాయిదా డీపీఆర్‌ను ఇప్పటికే అన్ని పరీవాహక రాష్ట్రాలకు అందించినట్లు తెలిపింది. నదుల అనుసంధానం అమలు కోసం ముసాయిదా మెమొరాండం ఆఫ్ అసోసియేషన్(ఎంవోఏ)ను తయారు చేసి.. గతేడాది ఏప్రిల్‌లో రాష్ట్రాలకు పంపించినట్లు పేర్కొంది. అనుసంధాన ప్రక్రియపై ఏకాభిప్రాయం కోసం ఐదుసార్లు సమావేశాలు నిర్వహించామని తెలిపింది. రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయ సాధన, ఎంవోఏపై సంతకాల కోసం కృషి చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. అలాగే దేశవ్యాప్తంగా చేపట్టనున్న నదుల అనుసంధానం ప్రతిపాదనలను కూడా కేంద్రం ప్రస్తావించింది. మొత్తంగా 30 ప్రాజెక్టులకు నివేదికలను సిద్ధం చేసినట్లు తెలిపింది. ఇందులో కెన్-బెత్వా లింక్ ప్రాజెక్ట్, గోదావరి-కావేరి లింక్ (గోదావరి-కృష్ణా, కృష్ణా-పెన్నా, పెన్నా-కావేరి), పర్బతి-కలిసింధ్-చంబల్ నదుల అనుసంధానాన్ని తొలి ప్రాధాన్యతగా గుర్తించినట్లు పేర్కొంది. 2030 నాటికి వీటిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు తెలిపింది. దీనిపై కమిటీ స్పందిస్తూ.. నీటి కొరత, కరువు నివారణ, వరద నియంత్రణకు ఆచరణీయమైన పరిష్కారాన్ని నదుల అనుసంధానం అందిస్తుందని అభిప్రాయపడింది. సంబంధిత రాష్ట్రాలకు దీనిపై అవగాహన పెంచి.. ఈ ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని సూచించింది.

తువాలుతో మెడకు ఉచ్చేసి.. చంపేయాలని..

చిలమత్తూరు వైఎస్సార్‌సీపీ ఎంపీపీపై టీడీపీ గూండాల దాడి

చిలమత్తూరు: చేతిలో మారణాయుధాలు పట్టుకుని శ్రీ సత్యసాయి జిల్లాలో టీడీపీ మూక రెచ్చిపోయింది..! ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకుడే లక్ష్యంగా దాడికి దిగింది.. పైపెచ్చు బాధితుడిని పరామర్శించేందుకు వెళ్తున్నవారిని పోలీసులు అడ్డుకోవడం ఈ దాడి వెనుక పెద్ద కుట్రను తేటతెల్లం చేస్తోంది. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తమరెడ్డిని హతమార్చేందుకు ప్రయత్నించింది. శుక్రవారం హుస్సేన్‌పురం గ్రామంలో ఈ ఘటన జరిగింది. చౌడేశ్వరీదేవి ఆలయంలో పూజల అనంతరం పురుషోత్తమరెడ్డి ఇంటికి వెళ్తుండగా టీడీపీ గూండాలు దాడికి తెగబడ్డారు. టీడీపీకి చెందిన బాబూరెడ్డి, నర్సిరెడ్డి, మరో నలుగురు మారణాయుధాలతో వచ్చారు. ఎంపీపీ ఎత్తుగా ఉండడంతో ఎడమ కాలిపై ఇనుప రాడ్డుతో కొట్టి కిందపడేశారు. ఆయన మెడలోని తువాలుతోనే ఉచ్చు బిగించి చంపేందుకు ప్రయత్నించారు. ఇంతలో గ్రామస్థులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో బాబురెడ్డి, అతడి అనుచరులు పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన పురుషోత్తమరెడ్డిని హిందూపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు.



ఎంపీపీ పురుషోత్తమరెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక

- దాడి సంగతి తెలిసి వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, ఆమె భర్త వేణురెడ్డిలు ఎంపీపీని పరామర్శించేందుకు ఆస్పత్రికి వెళ్తుండగా.. రెండో పట్టణ పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేశారు. పోలీసుల తీరుపై వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీనిపై నిలదీయడంతో వదిలేశారు. ఆస్పత్రిలో పురుషోత్తమరెడ్డిని దీపిక దంపతులతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పరామర్శించారు.

నిందితులను అరెస్ట్ చేయాలని ధర్నా

పురుషోత్తమరెడ్డిపై దాడి చేసినవారిని అరెస్టు చేయాలంటూ హిందూపురం సద్భావన సర్కిల్‌లో దీపిక, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందన్నారు. హిందూపురంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హత్యలు, దాడులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఎంపీపీపై హత్యాయత్నం చేసిన టీడీపీ గూండాలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలోనే దీపికను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి.. వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. ఆమెతో పాటు 30 మందిపై కేసులు నమోదు చేశారు.

నిందితుడికే కట్లు.. టీడీపీ వింత నాటకం

పురుషోత్తమరెడ్డిపై దాడిని కప్పిపుచ్చుకునేందుకు టీడీపీ వింత నాటకానికి తెరతీసింది. నిందితులను పార్టీ నుంచి తొలగించాల్సిన టీడీపీ నేతలు అందుకు విరుద్ధంగా చిలమత్తూరు రప్పించుకుని, లేని గాయానికి కట్టు కట్టించారు. తర్వాత ప్రెస్‌మీట్ పెట్టి బాధిత ఎంపీపీ పురుషోత్తమరెడ్డిపైనే విమర్శలు చేయించారు. నిందితుడు బాబూరెడ్డి కుడి మణికట్టు దగ్గర వాపు ఉందని చెబితే మాత్ర ఇచ్చామని, అయినా నొప్పి ఉందని కట్టు కట్టించుకున్నారని, కంప్రెషన్ బ్యాండేజీ లేకపోవడంతో రక్త గాయాలకు కట్టే బ్యాండేజ్ ను కట్టినట్టు వైద్యాధికారి రోజా చెప్పడం గమనార్హం.

గోరకల్లు రిజర్వాయర్ మరమ్మతులకు రూ.53 కోట్లు

- గతేడాది కురిసిన వర్షాలకు కుంగిన మట్టికట్ట
- ఇటీవల కురిసిన వర్షాలకు మరింతగా దెబ్బతిన్న కట్ట



సాక్షి, అమరావతి: శ్రీశైలం కుడిగట్టు కాలువ, గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుల్లో అంతర్భాగమైన గోరకల్లు (నరసింహరాయ సాగర్) రిజర్వాయర్ మట్టికట్ట మరమ్మతులకు ప్రభుత్వం రూ.53 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో మరమ్మతు పనులు చేపట్టాలని కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈని ఆదేశిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైలం కుడిగట్టు కాలువ, గాలేరు-నగరి ప్రాజెక్టుల్లో అంతర్భాగంగా నంద్యాల జిల్లా పాణ్యం మండలం గోరకల్లు వద్ద 11 టీఎంసీల సామర్థ్యంతో గోరకల్లు రిజర్వాయర్‌ను నిర్మించారు. ఈ రిజర్వాయర్ మట్టికట్ట గతేడాది కురిసిన భారీ వర్షాలకు దెబ్బతింది. రివిట్‌మెంట్ కుంగిపోయింది. భారీ గోతులు ఏర్పడ్డాయి. రిజర్వాయర్ భద్రత దృష్ట్యా తక్షణం మట్టికట్ట మరమ్మతులకు రూ.58.90 కోట్లు మంజూరు చేయాలని గతేడాది డిసెంబర్ 12న కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కానీ.. అప్పట్లో ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టికట్ట మరింతగా దెబ్బతింది. ఇది రిజర్వాయర్ భద్రతను ప్రశ్నార్థకం చేసింది. మట్టికట్టసహా రిజర్వాయర్ భద్రతకు అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని ఈ ఏడాది జూలై 4న కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈ ప్రభుత్వానికి మరోసారి నివేదిక పంపారు.

ఓడిపోయే వ్యక్తిని ఎలా నిలబెడతారు?

- ఇండియా కూటమి అభ్యర్థి ఎంపికపై సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- సి.పి.రాధాకృష్ణన్‌ను ఎన్డీయే నేతలంతా కలిసే ఎంపిక చేసినట్లు వెల్లడి
- ఎన్డీయే అభ్యర్థికి కాకుండా మరొకరికి మద్దతెలా ఇస్తామని ప్రశ్న
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్డీయేలో ఉన్న తాము ప్రతిపక్ష పార్టీ నిలబెట్టిన అభ్యర్థికి ఎలా మద్దతిస్తామని, ఓడిపోతామని తెలిసి కూడా ఇండియా కూటమి వాళ్లు తెలుగువాడు అంటూ అభ్యర్థిని పెట్టడం ఏమిటని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. తాము సపోర్ట్ చేస్తామని ఆశించడం కూడా కరెక్ట్ కాదంటూ ఇండియా కూటమిని విమర్శించారు. ఢిల్లీకి వచ్చిన చంద్రబాబు శుక్రవారం ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్‌ను మహారాష్ట్ర సదన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్డీయే భాగస్వామిగా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయనకు తెలిపారు. అనంతరం అక్కడున్న మీడియాతో చంద్రబాబు మాట్లాడారు.

ఇండియా కూటమి రాజకీయం చేస్తోంది..

'సి.పి.రాధాకృష్ణన్‌ను ఎన్డీయే అభ్యర్థిగా మేమంతా కలిసే నిర్ణయించాం. ఆయన దేశంలో గర్వించదగ్గ నేత. దేశానికి, ఆ కుర్చీకి వన్నె తెస్తారు'.. అని చెప్పారు. టీడీపీ మద్దతు ఇస్తుందా అంటూ మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ.. 'గెలిచే అవకాశం లేకపోయినా తెలుగువాడు అంటూ అభ్యర్థిని పెట్టిన ఇండియా కూటమి రాజకీయం చేస్తోంది. రాష్ట్రంలో మేం, కేంద్రంలో ఎన్డీయే ఉన్నప్పుడు మేం వాళ్లకే కదా మద్దతు తెలిపేది' అని చంద్రబాబు చెప్పుకొచ్చారు.



కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన సీఎం చంద్రబాబు

మరో రూ.5 వేల కోట్లు ఇవ్వండి..

మరోవైపు.. చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు అదనంగా రూ.5 వేల కోట్లు అవసరమని ఆమెకు తెలిపారు. ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయం (సాస్కి-స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) కింద ఆ నిధులను అందించాలంటూ వినతిపత్రాన్ని అందచేశారు. అలాగే, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగిల్ నోడల్ ఏజెన్సీ ప్రోత్సాహక పథకం మార్గదర్శకాల ప్రకారం.. రూ.250 కోట్ల విడుదలకు ఉత్తర్వులివ్వాలని కూడా కోరారు. ఇక 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగరియాతోనూ ముఖ్యమంత్రి సమావేశమై రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆరు వారాల్లో తాజా దర్యాప్తు నివేదిక ఇవ్వండి

- తిరుపతి మున్సిపల్ ఉప ఎన్నికల్లో దాడి ఘటనపై డీజీపీకి ఆదేశాలు
- ఎంపీ గురుమూర్తి ఫిర్యాదుపై మరోసారి స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్సీ



సాక్షి, న్యూఢిల్లీ : తిరుపతి మున్సిపల్ ఉప ఎన్నికల్లో జరిగిన ఘటనపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్ఆర్సీ) మరోసారి స్పందించింది. ఈ ఘటనలో ప్రజాప్రతినిధులపై జరిగిన దాడి వివరాలు, ప్రస్తుత కేసు స్థితిగతులపై ఆరా తీసింది. తాజా దర్యాప్తు వివరాలను తమకు ఆరు వారాల్లో సమర్పించాలని ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ డీజీపీకి శుక్రవారం ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశాలు జారీ చేసింది. 'ఫిబ్రవరి 3న తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో పాల్గొనేందుకు నేనూ (ఎంపీ గురుమూర్తి), ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం వెళ్తున్నాం. మాతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కూడా ఉన్నారు. మేం వెళ్తున్న బస్సును అడ్డగించిన వేరే పార్టీకి చెందిన కొందరు.. నాపైన, ఎమ్మెల్సీ, కార్పొరేటర్లపై భౌతిక దాడికి పాల్పడ్డారు. బస్సు ఆపి రాడ్లతో బస్సు అద్దాలు ధ్వంసం చేసి లోపలకు చొరబడి చొక్కాలు చించి మరీ భయభ్రాంతులకు గురిచేశారు. ఈ ఘటన అంతా పోలీసుల సాక్షిగానే జరిగింది. ఇది మానవ హక్కుల ఉల్లంఘనే'.. అంటూ ఎంపీ గురుమూర్తి ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిబ్రవరి 18న ఫిర్యాదు చేశారు. దీనిపై ఎన్‌హెచ్‌ఆర్సీ స్పందిస్తూ.. ఈ ఘటనపై మూడు వారాల్లో తమకు నివేదిక సమర్పించాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు నోటీసులు జారీచేసింది. తాజాగా.. తిరుపతి పోలీసులిచ్చిన నివేదికను ఎన్‌హెచ్‌ఆర్సీకి అందచేశారు. ఈ నివేదికలో ఉన్న విషయాలు, ఎంపీ లేవనెత్తిన అంశాలకు పొంతనలేదు. దీంతో మరోసారి, తాజా దర్యాప్తును తమకు ఆరు వారాల్లో అందచేయాలని డీజీపీని ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశించింది.

మేం కట్టిన రోడ్డు టాక్స్ ఎక్కడకెళ్తోంది?

ఎమ్మిగనూరు-గూడూరు రోడ్డు బాగుచేయాలంటూ స్థానికుల నిరసన

- టీడీపీ కూటమి సర్కారు తీరుపై మండిపాటు
- ఆందోళనకు విద్యార్థులు, ఎడ్లబండ్లతో రైతులు సంఘీభావం

సి.బెళగల్: 'ప్రభుత్వానికి మేం కడుతున్న రోడ్డు టాక్స్ నిధులు ఎక్కడకు వెళ్తున్నాయి' అని ఆగ్రహం వ్యక్తంచేస్తూ కర్నూలు జిల్లా సి. బెళగల్ కంబదహాల్ గ్రామస్తులు శుక్రవారం రోడ్డుపై నిరసన తెలిపారు. గ్రామ శివారులో ఎమ్మిగనూరు-గూడూరు ప్రధాన రోడ్డు ఛిద్రమై ప్రజలు, ప్రయాణికులు నిత్యం తీవ్ర అవస్థలు పడుతున్నా టీడీపీ కూటమి ప్రభుత్వానికి కనిపించడంలేదా అని వారు ప్రశ్నించారు. సమస్యను టీడీపీ నాయకులకు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందని మండిపడ్డారు. గ్రామస్తులు దాదాపు మూడు గంటలపాటు రోడ్డును దిగ్బంధించి నిరసన చేపట్టారు. దీంతో.. సి.బెళగల్ నుంచి అలువాల, ఏనుగబాల, దైవందిన్నె గ్రామాల మీదుగా ఎమ్మిగనూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. వీరి నిరసనకు రైతులు మద్దతు తెలుపుతూ తమ ఎడ్లబళ్లను రోడ్డుపై అడ్డంగా నిలిపి సంఘీభావం తెలిపారు. అలాగే, బస్సుల్లో ప్రయాణిస్తున్న విద్యార్థులు, ఇతర ప్రాంతాల వారు సైతం ఈ నిరసనలో పాల్గొని మద్దతు తెలిపారు. ప్రజలు ఇంత పెద్దఎత్తున నిరసన తెలిపినా అధికారులెవరూ రాలేదు.

రైలులో లగేజీ మరింత భారం

విమానాల తరహాలో వాత పెట్టేందుకు సిద్ధం

ఎప్పట్నుంచో ఆంక్షలున్నా.. ఇక పక్కాగా అమలు

- ఫస్ట్ ఏసీ ప్రయాణికులకు 70 కిలోలే గరిష్టం
- స్లీపర్ క్లాస్ అయితే 40 కిలోలు దాటితే జరిమానా
- ఎక్కువ బరువు ఉంటే.. ముందస్తు బుకింగ్ అవసరం
- లేదంటే ఒకటిన్నర రెట్లు ఫైన్ కట్టాల్సిందే.!
- బ్యాగ్ పెద్దదైనా బాదుడు తప్పదు

సాక్షి, విశాఖపట్నం: రైలు ప్రయాణం..అన్నీ సర్దేసుకుని పట్టేసుకుందాం. సీటు కింద బ్యాగులు ఇష్టం వచ్చినట్లు పెట్టేసుకుందాం అంటే కుదరదిక. మీ లగేజీ.. మీకు మరింత భారమవ్వనుంది. ఇకపై రైలులో ప్రయాణికుల లగేజీకి విమాన ప్రయాణంలో మాదిరిగా బాదుడు షురూ చెయ్యనున్నారు. ఎప్పటి నుంచే ఈ నిబంధనలున్నా.. ఇకపై తూ.చా. తప్పకుండా అమలు చెయ్యాలని నిర్ణయించారు. నిర్దేశించిన బరువు కంటే ఎక్కువ లగేజీ ఉంటే ఒకటిన్నర రెట్లు ఫైన్ పడనుంది. సీటు కంటే బ్యాగ్ సైజ్ పెద్దదైనా బాదుడు తప్పదని రైల్వే శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మధ్యతరగతి ప్రయాణికులపైనే అధిక భారం మోపేందుకు రంగం సిద్ధమైంది. ఫస్ట్ క్లాస్ ఏసీ కోచ్‌లో 70 కిలోల వరకూ అనుమతి ఉండగా సెకెండ్ క్లాస్ ప్రయాణికులకు కేవలం 40 కిలోల పరిమితికి మాత్రమే అనుమతించనున్నారు. విమానం ఎక్కేందుకు వెళ్లే ప్రయాణికుల లగేజీ బరువు కొలిచే పద్ధతి అమల్లో ఉంది. ఇప్పుడు రైలు ప్రయాణికులకూ అదే విధానం అమల్లోకి రాబోతోంది. ఇకపై లగేజీ కొలిచే విధానం రైల్వే స్టేషన్లలో కూడా ప్రారంభం కానుంది. కొత్త నిబంధనల ప్రకారం, ప్యాసింజర్లు తమ లగేజీని రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషిన్లలో తనిఖీ చేయించుకోవాలి. రైల్వే శాఖ ప్రతి కోచ్‌కు నిర్దిష్ట లగేజీ బరువు పరిమితులను నిర్ణయించింది. నిర్దేశించిన బరువు మించితే అదనపు చార్జీలు, జరిమానాలు చెల్లించాల్సిందేనంటూ ఇండియన్ రైల్వేస్ కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. భారతదేశంలో ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులు రైలులో ప్రయాణిస్తారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిబంధనలు కఠినతరం చేస్తున్నట్లు రైల్వే బోర్డు చెబుతున్నా.. ఈ నూతన నిబంధనలు.. ప్రయాణికుల జేబులకు చిల్లులు పెట్టబోతున్నాయి.

మధ్యతరగతిపైనే అధిక భారం

ఈ నిబంధనలు గతంలో ఉన్నవే అయినా.. ఇకపై కచ్చితంగా అమలు చెయ్యాలని రైల్వే శాఖ భావిస్తోంది. ప్రతి ప్రయాణికుడి లగేజీ బరువు రైల్వే కోచ్ ప్రకారం నిర్ణయించారు. ఇందులో మధ్యతరగతి ప్రయాణికులు ఎక్కువగా ప్రయాణించే సెకెండ్‌క్లాస్, థర్డ్ ఏసీ పైనే భారం ఎక్కువగా ఉండనుంది. ప్రయాణికుల తరగతిని బట్టి ఉచిత లగేజీ పరిమితిని నిర్ణయించారు. దీని ప్రకారం, ఫస్ట్ ఏసీ ప్రయాణికులు 70 కిలోల వరకు లగేజీని తీసుకెళ్లవచ్చు. సెకండ్ ఏసీ ప్రయాణికులు 50 కిలోలు, థర్డ్ ఏసీ ప్రయాణికులు 40 కేజీల వరకు లగేజీని తీసుకెళ్లవచ్చు. స్లీపర్ క్లాస్ ప్రయాణికులకు కూడా కేవలం 40 కిలోలు మాత్రమే పరిమితి విధించవచ్చు. జనరల్, సెకండ్ సిట్టింగ్ ప్రయాణికులకు కేవలం 35 కిలోల వరకు ఉచిత పరిమితి విధించారు. రైల్వే నిబంధనల ప్రకారం.. నిర్దేశించిన పరిమితి కంటే 10 నుంచి 15 కిలోల వరకు ఎక్కువ లగేజీని తీసుకెళ్లడంలో సడలింపు ఉంటుంది. కానీ బరువు అంతకంటే ఎక్కువగా ఉంటే, ప్రయాణికులు స్టేషన్‌కు వెళ్లి లగేజీని బుక్ చేసుకోవాలి. ఒకవేళ ప్రయాణికుల్లో 5 నుంచి 12 ఏళ్ల వయసున్న వారు ఉన్నట్లైతే అనుమతించిన దానిలో సగం లగేజీని తీసుకెళ్లేందుకు అవకాశం ఉంది.



లగేజీ పరిమితి ఇలా...

క్లాస్	ఉచిత పరిమితి	ఉచిత సడలింపు	గరిష్టం
ఫస్ట్ ఏసీ	70 కిలోలు	15 కిలోలు	150 కిలోలు
సెకెండ్ ఏసీ	50 కిలోలు	10 కిలోలు	100 కిలోలు
థర్డ్ ఏసీ	40 కిలోలు	10 కిలోలు	80 కిలోలు
స్లీపర్ క్లాస్	40 కిలోలు	10 కిలోలు	80 కిలోలు
జనరల్/సెకెండ్ సిట్టింగ్	35 కిలోలు	10 కిలోలు	70 కిలోలు

బ్యాగ్ సైజ్ పెరిగినా వాత పడుద్ది

నిర్దేశించిన పరిమితి కంటే ఎక్కువ తీసుకెళ్లినందుకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఒక ప్రయాణికుడు బుకింగ్ పరిమితి కంటే ఎక్కువ లగేజీని తీసుకెళ్తున్నట్లు తేలితే.. సాధారణం కంటే 1.5 రెట్లు అధికంగా జరిమానా విధిస్తారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం ప్రయాణ సమయంలో ప్రతి ప్రయాణికుడి లగేజీ బరువు మాత్రమే కాకుండా బ్యాగ్ పరిమాణంపైనా భారం పడనుంది. ప్రయాణికుల బ్యాగ్ చాలా పెద్దదిగా ఉండి, కోచ్‌లో ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తే, దానిపైనా జరిమానా విధించే అవకాశం ఉందని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. బుకింగ్ లేకుండా పరిమితి కంటే ఎక్కువ బరువు తీసుకెళ్లడం ఇక జేబుకు చిల్లు పడటమేనని ప్రయాణికులు వాపోతున్నారు. కొందరు ప్రయాణికులు పరిమితికి మించి లగేజీ తీసుకెళ్తుండటం వల్ల తోటి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇకపై ఈ సమస్య లేకుండా ఉండేందుకే నిబంధనలు కఠినతరం చేస్తున్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. ఈ నిబంధనలు తొలుత ప్రయాగ్‌రాజ్ డివిజన్‌లోని ప్రధాన స్టేషన్లైన ప్రయాగ్‌రాజ్ జంక్షన్, కాన్పూర్ సెంట్రల్, అలీగఢ్ జంక్షన్ మొదలైన జంక్షన్లలో అమలుకు రంగం సిద్ధం చేశారు. త్వరలోనే మిగిలిన స్టేషన్లలో అమలు చేయనున్నామని రైల్వే అధికారులు వెల్లడించారు.

నాకు పుట్టుక లేదు. నాశనము లేదు. నేను సర్వజీవరాసులకు అధిపతినై యున్నాను. అయినప్పటికీ నా చేత నిర్మింపబడిన ప్రకృతితో చేరి మాయతో జన్మించుచుందును.

– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 23 ఆగస్టు 2025

ముంబై చేస్తున్న హెచ్చరిక!

ప్రణాళికాబద్ధంగా లేని పట్టణీకరణను పరిహసిస్తూ తరచు ప్రకృతి వైపరీత్యాలు విరుచుకు పడుతున్నా పాలకులు మేల్కొనటం లేదనటానికి మళ్లీ నీట మునిగిన ముంబై మహానగరమే సాక్ష్యం. ముంబై దక్షిణ ప్రాంతంలో గురువారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో ఏకధాటిగా 300 మి.మీ., పశ్చిమ శివారు ప్రాంతంలో 200 మి.మీ. వర్షం కురిసిందంటే కుంభవృష్టి ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. నిన్నంతా దాదాపు ప్రశాంతంగానే ఉన్నట్టు కనబడిన ఆ మహానగరం, మళ్లీ భారీ వర్షాలుంటాయన్న హెచ్చరికలతో బెంబేలెత్తుతోంది. ఏటా వర్షాకాలంలో కనీసం ఒక్కసారైనా వరదలు ముంబైని పలకరించటం ఆనవాయితీ. ఈసారి మే నెలలోనే ఒక రోజు నడుంలోతు వరదల్లో నగరం నానా యాతనలూ పడింది. ఆ నెలలో కొత్తగా ప్రారంభమైన వొర్లి మెట్రో స్టేషన్ భారీ వరదతో వణికిపోయింది. రెండు నెలలు గడిచాయో లేదో మళ్లీ నగరానికి కుంభవృష్టి తప్పలేదు. నిరుడు 21 దఫాలు 100 మి.మీ. వర్షం పడిందని గణాంకాలు చెబుతున్నాయి. వాతావరణంలో పెనుమార్పులు విపత్తుల తీవ్రతను పెంచాయి. అస్తవ్యస్థ పట్టణీకరణ ఈ సమస్యను వందల రెట్లు పెంచింది. ఈసారి వర్షాలవల్ల సంపన్నులు, సినీతారలు నివసించే ప్రాంతాలు సైతం వరద నీటన మునిగాయి. ఇటీవలే ఆర్భాటంగా ప్రారంభించిన మోనోరైల్ సైతం భారీ వర్షాలతో విద్యుత్ సరఫరా అందక గంటసేపు నిలిచిపోయింది. చివరకు అద్దాలు బద్దలుకొట్టి వందమంది ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురావాల్సి వచ్చింది.

ముంబై తూర్పు శివారులోని మీఠి నది ఆ మహానగరంపై విరుచుకుపడింది. అయిదు రోజులపాటు వరసగా కురిసిన వర్షాలతో ఆ నది కట్టు తెంచుకుని అటువైపుగల రైల్వే ట్రాక్‌లన్నిటినీ ముంచెత్తింది. అరేబియా సముద్రం భారీ కెరటాలతో అల్లకల్లోలంగా ఉండటంతో దానిలో కలవాల్సిన మీఠి వరద నీరు కాస్తా వెనక్కొచ్చి నగరంలోని అనేక ప్రాంతాలను జలమయం చేసింది. హైదరాబాద్ నగరంలో మూసీ మాదిరిగా ముంబైలో మీఠి నదిని కూడా మురికిమయం చేశారు. అందులో 70 శాతం మురికినీరు కాగా, 30 శాతం చెత్తాచెదారం, 10 శాతం పారిశ్రామిక వ్యర్థాలు కలుస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలుగా కనబడు తున్నవన్నీ సారాంశంలో మానవ తప్పిదాల పర్యవసానం. గత యేభైయ్యేళ్లగా నగరాన్ని విస్తరించుకుంటూ పోవటమే తప్ప అందుకు తగిన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టినవారు లేరు. అలాగని మీఠి నది ప్రక్షాళనకు ప్రయత్నాలు జరగ లేదని కాదు. 2013–23 మధ్య బృహన్ ముంబై కార్పొరేషన్ (బీఎంసీ) రూ. 2,000 కోట్లు వ్యయం చేసింది. కానీ చివరకు తాజా వర్షాల ధాటికి మురికి నీటితో, ప్లాస్టిక్ వ్యర్థాలతో నివాస ప్రాంతాలన్నీ నిండిపోయాయి. 70వ దశకం వరకూ పరిశుభ్రంగా ఉండే ఆ నది మురికి కూపంగా మారిందంటే పాలకులు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే కారణం.

భౌగోళికంగా ముంబై తీరం పశ్చిమ కనుమలకు దగ్గరలో ఉంది. వాటివల్ల నైరుతి రుతుపవనాల్లో గాలుల తీవ్రత హెచ్చుగా ఉంటుంది. అందుకే ఏటా భారీవర్షాలు, వరదలు తప్పవు. దేశ ఆర్థిక రాజధానిగా, ఢిల్లీ తర్వాత అత్యధిక జనసాంద్రత గల నగరంగా ముంబై మన దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రాణప్రదమైనది. దేశ జీడీపీలో ఆ నగరం వాటా దాదాపు 7 శాతం. కానీ వరదలు ముంచుకొచ్చిన ప్రతిసారీ మౌలిక సదుపాయాలు దెబ్బతినటం, ఉత్పాదకత పడకేయటం రివాజైంది. పునర్నిర్మాణానికి ఏటా రూ. 550 కోట్ల వ్యయమవుతోంది. నిజానికి ఈ సంక్షోభం అక్కడే కాదు... దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పాలకులనూ పునరాలోచనకు పురిగొల్పాలి. నగర నిర్మాణాల్లో ఎలాంటి మెలకువలు తీసుకోవాలో, పెద్ద నగరాల నిర్మాణంపై మోజువల్ల చివరకు జరిగేదేమిటో గ్రహించేలా చేయాలి. కానీ అదెక్కడా కనబడదు. ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అమరావతి తాజా వర్షాలకు ఎంత దయనీయ స్థితిలో పడిందో కనబడుతూనే ఉంది. పెద్ద నగరాల నిర్మాణంవల్ల జనసాంద్రత పెరిగి మౌలిక సదుపాయాల కల్పన అసాధ్యమవుతుందనీ, పైగా అభివృద్ధి మొత్తం ఒకే చోట కేంద్రీకరించటం వల్ల ఇతర ప్రాంతాలు ఎప్పటికీ ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోతాయనీ నిపుణులు హెచ్చరిస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు తలకెక్కటం లేదు. మన కోసం ప్రకృతి మారదు. మనమే దానికి అనుగుణంగా మారాలన్న స్పృహ పాలకులకు కలగాలి. మళ్లీ మళ్లీ మునుగుతున్న ముంబై మహానగరాన్ని చూసైనా గుణపాఠం నేర్వకపోతే భవిష్యత్తు క్షమించదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** అమావాస్య ప.11.18 వరకు, తదుపరి భాద్రపద శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** మఖ రా.1.32 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.1.21 నుండి 2.59 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.42 నుండి 7.27 వరకు, **అమృత ఘడియలు:** రా.11.14 నుండి 12.50 వరకు, **పోలాల అమావాస్య.**

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.19
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

గౌరవం



ఆనందం అకస్మాత్తుగా రాదు. కలలు వాటంతటవే నెరవేరవు. మనం నిబద్ధతతో ఉండాలి. కష్టపడి పనిచేయాలి. కష్టపడి పనిచేయడం అత్యంత గౌరవనీయమైన మానవ ధర్మం.

– షీ జిన్‌పింగ్, చైనా అధ్యక్షుడు

తర్ఫీదు



మీరు సమయానికి ముందే ఆలోచించాలి. సమయం లేని ఆలోచన సత్ఫలితాలను ఇవ్వదు. సమయం ఉండి చేసే ఆలోచన మీరు చేయబోయే కార్యానికి తగిన తర్ఫీదును ఇస్తుంది.

– నితిన్ గడ్కరీ, కేంద్ర మంత్రి

ఈత



సమస్యల సముద్రంలో మీరు మునగనైనా మునుగుతారు, లేదంటే ఈతైనా కొడతారు. ఈత కొట్టడమే జీవితం. మునిగిపోవటానికి ఏ ప్రయత్నమూ అక్కర్లేదు.

– టామ్ క్రూజ్, హాలీవుడ్ స్టార్

డబ్బు



డబ్బు సంతోషాన్ని కొనగలిగినా, లేకున్నా... స్వేచ్ఛనైతే కొనగలదు. అది చాలా పెద్ద విషయం. ఎందుకంటే డబ్బు లేకపోవడం అన్నది జీవితాన్ని చాలా ఒత్తిడికి గురి చేస్తుంది.

– సామ్ ఆల్ట్‌మాన్, సీఈవో, ఓపెన్ ఏఐ

అవకాశం



నేను మైదానంలో అడుగు పెట్టిన ప్రతిసారీ, నన్ను నేను మెరుగు పరుచుకోవడానికి ఒక అవకాశం అనుకుంటాను. నేను భారీ స్కోరు చేసినా, లేదా త్వరగా ఔట్ అయినా, ప్రతి ఇన్నింగ్స్ నుండి ఎల్లప్పుడూ నేర్చుకోవటం మీదే నా దృష్టి ఉంటుంది.

– శుభ్‌మన్ గిల్, క్రికెటర్

పోలిక




మిమ్మల్ని మీరు ఇతరులతో పోల్చుకోకండి. ప్రతి ఒక్కరి ప్రయాణం భిన్నంగా ఉంటుంది. విజయం అన్నది పట్టుదలకే కానీ, పరిపూర్ణతను చిహ్నం కాదు. మీ ప్రతి చిన్న ప్రయత్నాన్ని సెలబ్రేట్ చేసుకోండి. మీరే మీ చీర్ లీడర్‌లా ఉండండి.

– దువా లిపా, సాంగ్ రైటర్

ప్రభుత్వాలను దించే ఆయుధమా?

సందర్భం



సంజయ్ హెగ్డే

రాజ్యాంగంలోని 75, 164, 239ఎఎ అధికరణలకు సవరణలను ప్రతిపాదిస్తూ రాజ్యాంగ (130వ) సవరణ బిల్లును ఇటీవల లోక్ సభలో ప్రవేశపెట్టారు. దానిని కేంద్ర పాలిత ప్రాంతాలు, జమ్ము–కశ్మీర్‌కు వర్తింపజేసే విధంగా రెండు అనుబంధ బిల్లులను కూడా ప్రవేశపెట్టారు. మూడింట రెండొంతుల మెజారిటీ ప్రభుత్వానికి కొరవడినందు వల్ల ఈ ప్రతిపాదనలు చట్ట రూపం ధరించకపోవచ్చు. అయినప్పటికీ, వాటి వెనుక ఆలోచన గమనార్హమైనది.

ప్రధాని లేదా ముఖ్యమంత్రితో సహా ఏ కేంద్ర లేదా రాష్ట్ర మంత్రి అయినా ఐదేళ్ళు లేదా అంతకు మించి శిక్షపడగల ఆరోపణలను ఎదుర్కొంటూ అరెస్టు అయి, వరుసగా 30 రోజులు కస్టడీలో ఉంటే సదరు మంత్రులు వెంటనే రాజీనామా చేయాలి. లేకపోతే, వారు ఆయా పదవుల నుంచి ఆటోమేటిక్‌గా వైదొలగినట్లు పరిగణిస్తారన్నది సవరణ మూల సారాంశం. బిల్లును సమర్థించుకునేందుకు చెబుతున్న ఆశయాలు గొప్పవిగానే ఉన్నాయి. అవి: రాజ్యాంగ నైతికతను కాపాడటం, ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించడం, ఉన్నత పదవుల్లో ఉన్నవారు తాము చట్టానికి అతీతులమనే భావనకు లోను కాకుండా చూడటం. కానీ, ఉన్నతాశయాలు ఎల్లప్పుడూ ఉన్నతమైన ఫలితాలనే ఇస్తాయనే పూచీ ఏమీ లేదు. రాజకీయాలలో వ్యూహం తరచు నైతికతను పక్కకు నెడుతున్న పరిస్థితుల్లో ఈ రాజ్యాంగ సవరణ ఆయుధంగా పరిణమించవచ్చు.

పరిశుద్ధ రాజకీయాలపై వాగ్దానమేనా?

మంత్రులు నిజాయతీకి ప్రతీకలుగా ఉండి తీరాలనీ, వారు కస్టడీలో ఉన్నపుడు పరిపాలనకు భంగం కలుగకుండా నివారించవలసి ఉందనీ ఈ బిల్లును తేవడంలోని లక్ష్యాలు, కారణాల పత్రంలో పేర్కొన్నారు. రాజకీయ వాస్తవికత ముందు ఈ నైతిక విజ్ఞాపన తేలిపోవచ్చు. అరెస్టయి, కస్టడీలో ఉన్నంత మాత్రాన ఎవరూ దోషి కారు. అధికారంలో ఉన్నవారికి జీ హుజూర్ అనే పోలీసు వ్యవస్థ ఉన్న ప్రజాస్వామ్యంలో నిజాన్ని రాబట్టడానికి, వేధించడానికి మధ్య నున్న రేఖ బహు పల్చనైనది. ఈ సవరణ, అరెస్టు చేసేందుకు ఉన్న అవకాశాలను తక్కువ చేసే బదులు, అరెస్టు చేయడానికి మరిన్ని అవకాశాలను సృష్టించేలా ఉంది.

దీనిలో కొట్టొచ్చినట్లు కనిపించే అంశం 30 రోజుల వ్యవధి. ఒక మంత్రి 30 రోజులకు మించి నిర్బంధంలో ఉంటే రాజీనామా చేసి తీరాలి. ఆచరణలో, ప్రభుత్వాన్ని మార్చేందుకు రాజ్యాంగం ప్రసాదించిన 'కూల్చివేత ఆయుధం'గా ఇది ఉపకరించవచ్చు. ప్రతిపక్షానికి చెందిన ఒక ముఖ్యమంత్రి ఎన్నికలకు వెళ్ళబోతున్నాడు అనుకుందాం. పోలింగ్‌కు ఒక నెల ముందు పన్నాగంతో చేయించిన అరెస్టుతో అతని పార్టీ నిర్వీర్యం అయిపోతుంది. ప్రభుత్వాలను దించడానికి బ్యాలట్ కన్నా లాకప్ ఒక మార్గంగా మారుతుంది.



వ్యవస్థలు రాజకీయమయం

ఈ నిబంధన తటస్థంగా ఉండవలసిన వ్యవస్థలను అనివార్యంగా రాజకీయమయం చేస్తుంది. ఇప్పటికే రాజకీయ ఒత్తిడులకు లొంగిపోయేవారిగానున్న పోలీసు అధికారులు తాము ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేస్తే అతను లేదా ఆమె ప్రభుత్వం కూలిపోవచ్చని గ్రహించుకుంటారు. బెయిలు దరఖాస్తులను నిర్ణయించే జడ్జీలు ఎవరు పాలించారో నిర్ణయించే శక్తిమంతులుగా మారతారు. బెయిలు సంపాదించి పెట్టడంలో వ్యూహాత్మక మాయోపాయాలకు పాల్పడే యుక్తిపరులైన న్యాయవాదులు భారీ ప్రయోజనాలు పణంగా పెట్టే రాజకీయ పోరాటంలో ముఖ్యమైన పాత్రధారులుగా మారతారు. చట్టాలను అమలుపరచవలసిన వ్యవస్థలకూ, రాజకీయ ఇంజనీరింగ్‌కూ మధ్య రేఖ గుర్తుపట్టలేనంతగా మారిపోతుంది.

పాకిస్తాన్ నేర్పుతున్న పాఠాలు

లీగల్ సాధనాలు ప్రజాస్వామ్యాన్ని ఎలా డొల్ల చేయగలవో తెలుసుకునేందుకు పాకిస్తాన్ ప్రత్యక్ష ఉదాహరణ. రాజకీయ ప్రేరేపితమైనవిగా చాలా మంది భావించిన ఆరోపణలపై సుప్రీం కోర్టు 2017లో నవాజ్ షరీఫ్‌ను అనర్హుడిగా ప్రకటించింది. ఆయన తొలగింపు ప్రజాస్వామిక ప్రక్రియలను అస్థిరపరచి, ఎన్నిక కాని పాత్రధారులను బలోపేతులను చేసింది.

ఒకప్పుడు పాకిస్తాన్ అసలైన పాలక వ్యవస్థకు ప్రీతిపాత్రుడుగా ఉన్న ఇమ్రాన్ ఖాన్ అనర్హుడుగా ప్రకటితుడై ఇపుడు జైలులో మగ్గుతున్నారు. ఓటర్లలో ఇమ్రాన్ ఖాన్‌కు ఉన్న ప్రజాదరణ జుడీషియల్ మాయోపాయాల నుంచి ఆయనను కాపాడలేకపోయింది. నైతికత ముసుగు కప్పుకున్న చట్టాలు అనర్హత వేటు వేసేందుకు, చట్టబద్ధతను తొలగించడానికి సాధనాలుగా ఎలా ఉపయోగపడగలవో ఆ రెండు కేసులు తేటతెల్లం చేస్తున్నాయి. ప్రభుత్వాల మార్పులో కోర్టులు కూడా ఒక పావుగా మారిపోబట్టే పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యం బలహీనపడింది. అదే దారిని రాజ్యాంగంలో చొప్పించే ప్రమాదంలో ఇపుడు భారతదేశం ఉంది.

- రాజకీయాలలో వ్యూహం తరచు నైతికతను పక్కకు నెడుతున్న పరిస్థితుల్లో ఈ 130వ రాజ్యాంగ సవరణ ఆయుధంగా పరిణమించవచ్చు.
- ప్రతిపక్షానికి చెందిన ఒక ముఖ్యమంత్రిని పోలింగ్‌కు ఒక నెల ముందు పన్నాగంతో అరెస్ట్ చేస్తే అతని పార్టీ నిర్వీర్యం అవుతుంది.
- ప్రభుత్వాలను దించడానికి బ్యాలట్ కన్నా లాకప్ ఒక మార్గంగా మారుతుంది.

వ్యాధికన్నా దుర్భరమైన వైద్యం

సుదీర్ఘ కాలం కస్టడీలో ఉన్న మంత్రి విధులను నిర్వర్తించలేడని బిల్లు మద్దతుదారులు వాదిస్తున్నారు. అది నిజమే. కానీ, దానికి విరుగుడులు ఇప్పటికే ఉన్నాయి. మంత్రిత్వ శాఖలను ఒకరి నుంచి మరొకరికి మార్చవచ్చు. తాత్కాలిక అధిపతులను నియమించవచ్చు. కస్టడీలో ఉన్న నాయకునికి మద్దతు కొనసాగించాలో వద్దో చట్ట సభలు నిర్ణయించుకుంటాయి. ఈ ప్రక్రియలను పక్కనపెట్టేసి, ఒక నిర్దిష్ట గడువును విధించడం ద్వారా, ఈ సవరణ నియమాని కన్నా అవసరానికి పెద్ద పీట వేస్తోంది. అరెస్టు అయిన వ్యక్తి నిర్దోషి కూడా కావచ్చుననే సూత్రానికి నీళ్ళు వదులుతోంది.

ప్రతి సవరణ ఒక ప్రమాణాన్ని నెలకొల్పుతుంది. ఈ రోజున మంత్రులను 30 రోజులు కాగానే పదవుల నుంచి తొలగిస్తే, రేపు 15 రోజులు కాగానే, శాసన సభ్యులను లేదా పార్లమెంట్ సభ్యులను అనర్హులుగా ప్రకటించవచ్చు. రాజకీయాలను ప్రక్షాళన చేసే ప్రయత్నం కాస్తా, అరెస్టును రాజకీయాల్లో సర్వ సాధారణమైనదిగా రూపొందించవచ్చు. నాయకత్వం బ్యాలెట్ ద్వారా కాకుండా పోలీసు స్టేషన్లు, కోర్టులలో నిర్ణయమవుతుందని పౌరులు భావించడం ప్రారంభిస్తారు.

ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా రాజ్యాంగాన్ని ఉద్దేశించారు కానీ, ప్రత్యర్థులను దునుమాడే కత్తులను సమకూర్చడానికి కాదు. 130వ సవరణ బిల్లు అభిమతం మంచిదే కానీ, అది అరెస్టులను ప్రోత్సహించేదిగా, సంకుచిత రాజకీయాలకు ధైర్యం కల్పించేదిగా, న్యాయవ్యవస్థను కూడా రాజకీయమయం చేసే ప్రమాదాలను కొనితెచ్చేదిగా ఉంది. అంతిమంగా, పాలకుడు అంటే, పోలీసు అధికారో లేదా మేజిస్ట్రేటో కాదు, ఓటరు. ఎవరు అధికారంలో ఉండాలో ఎవరు వైదొలగాలో ఓటరు మాత్రమే నిర్ణయించాలి.

వ్యాసకర్త సుప్రీం కోర్టు న్యాయవాది
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

ఆర్థిక వ్యవస్థకు ప్రమాద సంకేతం

తాత్కాలికంగా లేదా శాశ్వతంగా ఉద్యోగులను తొలగించడం (లే ఆఫ్) అనేది ఆర్థిక సవాళ్ల లేదా పని లేకపోవడం వల్ల కంపెనీలు తీసుకునే చర్య. లే ఆఫ్‌లు 1980–90లలో వాటాదారుల విలువను పెంచడానికి ఖర్చు తగ్గించే వ్యూహంలో భాగంగా విస్తృతంగా ప్రాచుర్యం పొందాయి. ఇది కంపెనీలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చినప్పటికీ, ఉద్యోగుల తొలగింపులు తరచుగా అనిశ్చితిని సృష్టిస్తాయి. ఉద్యోగుల ప్రేరణను, ధైర్యాన్ని దెబ్బతీస్తాయి.

ఇటీవల, పరిశ్రమలలోని అనేక ప్రధాన సంస్థలు గణనీయమైన తొలగింపులను ప్రకటించాయి. ఈ చర్య ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది ఉద్యోగులను ప్రభావితం చేసింది. ఆర్థిక మందగమనం, వేగవంతమైన సాంకేతిక మార్పుల వల్ల ప్రపంచవ్యాప్త ధోరణిని ప్రతిబింబిస్తూ... భారతదేశం, మెక్సికో వంటి దేశాలపై కూడా తొలగింపులు ప్రభావం చూపాయి. టెక్ రంగంలో మైక్రోసాఫ్ట్, ఇంటెల్, గూగుల్ వంటి కంపెనీలు గణనీయమైన ఉద్యోగ కోతలు విధించాయి. భారతదేశంలో అతిపెద్ద ఐటీ సంస్థ అయిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన శ్రామిక శక్తిని 2% తగ్గిస్తోంది. అమెజాన్, మెటా, సిస్కో, డెల్ వంటివి కూడా తగ్గించుకున్నాయి. టెక్‌తో పాటు రిటైల్, మీడియా, బయోటెక్/ఫార్మా రంగాలు కూడా విస్తృతమైన కోతలను చవిచూశాయి.



◆ ఉద్యోగులు తమ వృత్తిపరమైన భవిష్యత్తును కాపాడుకోవడానికి కృత్రిమ మేధ, డేటా ఎనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి డిమాండ్ ఉన్న నైపుణ్యాలను సంతరించుకోవాలి.

స్వతంత్ర ట్రాకర్ 'లేఆఫ్స్.ఎఫ్‌వైఐ' ప్రకారం, గత సంవత్సరం 549 కంపెనీలలో 1,50,000కు పైగా ఉద్యోగులు తొలగింపునకు గురయ్యారు. 2025లో ఇప్పటివరకు 22,000కు పైగా టెక్ కార్మికులు తమ ఉద్యోగాలను కోల్పోయారు. ఈ వివరాలు టెక్ రంగంలో కొనసాగుతున్న అస్థిరతను నొక్కి చెబుతున్నాయి. ఇటీవలి ఛాలెంజర్, గ్రే అండ్ క్రిస్మస్ నుండి వచ్చిన నివేదిక ప్రకారం... అన్ని పరిశ్రమలలో, అమెరికా–ఆధారిత యజమానులు జూలై 2025 చివరి నాటికి 8,00,000 కంటే ఎక్కువ ఉద్యోగాల కోతలను ప్రకటించారు.

అయితే, ఆకస్మిక తొలగింపుల కారణంగా ఉద్యోగుల జీవితాలు అగమ్యగోచరం అవుతున్నాయి. ఆందోళన, ఒత్తిడి, నిరాశ వంటి మానసిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. కంపెనీలూ తమ ప్రతిష్ఠనూ, ఉత్పత్తి సామర్థ్యాన్నీ కోల్పోతున్నాయి. విస్తృత స్థాయిలో ఉద్యోగుల తొలగింపులు అధిక నిరుద్యోగానికి దారితీస్తాయి. స్థానిక ఆర్థిక వ్యవస్థలకు హాని చేస్తాయి.

2025లో భారతదేశం ముఖ్యంగా టెక్, స్టార్టప్, సాంకేతికత, సేవల రంగాలలో గణనీయమైన తొలగింపులను చవిచూసింది. ప్రధానంగా నిధుల కొరతను ఎదుర్కొంటున్న స్టార్టప్ వ్యవస్థ ఆగస్టు 2025 నాటికి 17,000 కంటే ఎక్కువ తొలగింపులను చూసింది.

ఆర్థిక అనిశ్చితి, తరచుగా కార్పొరేట్ పునర్నిర్మాణాలు జరిగే సమయాల్లో... ఉద్యోగులు తమ వృత్తిపరమైన భవిష్యత్తును కాపాడుకోవడానికి చురుకైన కెరీర్ రక్షణ వ్యూహాలను అవలంబించడం అవసరం. కృత్రిమ మేధ, డేటా ఎనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి డిమాండ్ ఉన్న నైపుణ్యాలను సంతరించుకోవాలి. బలమైన ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌ను నిర్వహించడం, రెజ్యూమ్, పోర్ట్‌ఫోలియోను నవీకరించడం, ఫ్రీలాన్స్ లేదా కన్సల్టింగ్ అవకాశాలను అన్వేషించడం వంటి కెరీర్ ప్లానింగ్‌లు కూడా ముఖ్యమే.

– డా॥ పి.ఎస్. చారి । కామర్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో ప్రొఫెసర్

అంతరిక్ష పరిశోధనలో నవ శకం

ఇన్ బాక్స్

భారత్ నూతన అంతరిక్ష సాంకేతికతతో విశ్వ రహస్యాల అన్వేషణకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో నేడు రెండవ జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకొంటోంది. 2023 ఆగస్టు 23న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్–3లోని విక్రమ్ ల్యాండర్ 'శివశక్తి' అనే ప్రదేశంలో సురక్షితంగా దిగింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఆగస్టు 23ను జాతీయ అంత రిక్ష దినోత్సవంగా నిర్ణయించింది. ఈ దినోత్సవం అంతరిక్ష పరిశోధన ప్రాముఖ్యతపై అవగాహన, విద్యను ప్రోత్సహించడానికి ఒక వేదిక కానుంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితంలో వృత్తిని కొనసాగించడానికి భవిష్యత్తు తరాలకు ప్రేరణ ఇవ్వనుంది. ఈ యేడు 'ఆర్యభట్ట నుండి గగన్‌యాన్ వరకు: ప్రాచీన జ్ఞానం నుంచి అనంతమైన అవకాశాలు' అనే ఇతివృత్తంతో అంతరిక్ష దినోత్సవం నిర్వహించుకొంటున్నాం.



2040 నాటికి భారతీయ వ్యోమగామిని చంద్రుడిపైకి పంపాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని ఇస్రో నిర్దేశించుకున్నది. ఈ లక్ష్య సాధన దిశగా ప్రయాణించడానికి గగన్‌యాన్ మిషన్ కీలకం కానుంది. వ్యోమగాములను భూమికి దగ్గరగా 400 కిలోమీటర్ల దూరంలో భూ కక్ష్యలోకి పంపి, వారిని సురక్షితంగా తిరిగి తీసుకురావడం ఈ మిషన్ తొలి లక్ష్యం. ఇందులో భాగంగా మొదట 2026 నాటికి 'వ్యోమమిత్ర' అనే రోబోను అంతరిక్షంలోకి పంపనున్నారు. అనంతరం 2027లో మానవ సహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ మిషన్ చేపట్టనున్నారు. మరోవైపు మానవ సహిత చంద్రుడి యాత్రకు ముందు ఇస్రో 2035 నాటికి సొంతంగా ఒక అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అనంతరం మానవ సహిత చంద్రుడి యాత్రకు సిద్ధం కానుంది. చంద్రయాన్–4లో చంద్రుడి ఉపరితలం నుంచి నమూనాలను సేకరించి భూమికి తిరిగి తీసుకురావడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం. ఎల్వీఎం అనే పెద్ద రాకెట్లతో డాకింగ్ ద్వారా ఈ ప్రయోగం నిర్వహించనున్నారు.

అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా భారత్ అంతరిక్ష ప్రయోగాలు కొనసాగుతున్నప్పటికీ... భారతదేశం ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో కేవలం 2 శాతం మాత్రమే కలిగి ఉంది. దీన్ని ఇంకా పెంచాల్సిన అవసరం ఉంది. అంతరిక్ష ప్రయోగాల పట్ల పిల్లలు, యువతలో ఆసక్తిని పెంచాలి. ఇప్పటికే ఈ రంగంలో మక్కువ ఉన్న విద్యార్థులను ప్రొత్సాహించేందుకు ఇస్రో 'యువిక (యుంగ్ సైంటిస్ట్)– 2025' కార్యక్రమం నిర్వహిస్తున్నది.


– సంపతి రమేష్ మహారాజ్ । జన విజ్ఞాన వేదిక
(నేడు జాతీయ అంతరిక్ష దినోత్సవం)

75 ఏళ్లలో... '60 ప్లస్' రెట్టింపయ్యారు!

డేటా పాయింట్

ప్రస్తుతం భారతదేశ జనాభా సగటు వయసు 29 సంవత్సరాలు. 1950లో ఇది 20 ఏళ్లే. 'ఐక్యరాజ్యసమితి వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ 2024' ప్రకారం... దేశ జనాభాలో 14 ఏళ్లలోపు వారు 1950లో సుమారు 38 శాతం ఉండేవారు. 65 ఏళ్లకు పైబడిన వృద్ధులు కేవలం 3.1 శాతమే. 2025 గడిచే నాటికి 14 ఏళ్లలోపు వారు 24.2 శాతానికి తగ్గిపోతారని అంచనా. వృద్ధులు 7.3 శాతానికి పెరగనున్నారు.





శుద్ధాంత రంగం

జ్యోతిర్మయం

ఒక చిట్టెలుక ఉండేది. దానికి ఎప్పుడూ పిల్లి తనను తినేస్తుందేమోనన్న భయం. ఆ భయాన్ని పోగొట్టుకోవటానికి ఒక మంత్రగాణ్ణి ఆశ్రయించి తనను పిల్లిగా మార్చమని వేడుకొంది. మంత్రగాడు దాన్ని పిల్లిగా మార్చాడు. అప్పుడా పిల్లికి కుక్క భయం పట్టుకొంది. అది మళ్లీ మంత్రగాని వద్దకు వెళ్ళి తనను కుక్కగా మార్చమంది. వాడు దాన్ని కుక్కగా మార్చాడు. ఇప్పుడా కుక్కకు పులి తనను చంపుతుందేమోనన్న భయం పట్టుకొంది. మరొక్కమారు మంత్రగాడిని కలిసి తనను పులిగా మార్చమని వేడుకొంది. వాడు అలాగే చేశాడు. అప్పుడా పులికి ఎప్పుడు ఏ వేటగాడు బాణం ప్రయోగించి చంపేస్తాడో అనే భయం వెంటాడింది. చిట్టెలుకకు పైపై రూపాలు మారాయిగానీ లోపలున్న భయం మాత్రం పోలేదు. 'పంచ తంత్రం'లోని ఈ కథను చెప్పి... చాలామంది మనుషుల జీవితం ఇలాగే ఉంటుందని అంటాడు ఓషో (రజనీష్) (పుట 27–ద బుక్ ఆఫ్ ద సీక్రెట్స్ – వాల్యూమ్–4).

ఒకడు ఎన్నో దుర్గుణాలను కలిగి ఉంటాడు. నుదుట కుంకుమ బొట్టు పెట్టుకొని గుడికి వెళ్ళొస్తే బాగుంటుందని ఎవరో చెప్పగా విని అది అలవరచుకొంటాడు. కొద్ది రోజుల తర్వాత నామాలు పెట్టుకోవటం మొదలెడుతాడు. కొన్ని ఏండ్ల తర్వాత గుండు గీయించుకొని సన్యాసి అవతారాన్ని ఎత్తుతాడు. అతని లోపల దుర్గుణాలన్నీ పదిలంగా ఉంటాయి. అలా కాక హృదయంలోని మలినాలను, దుర్గుణాలను వదిలించుకొంటే దివ్యత్వం బహిర్గతమవుతుంది, ప్రకాశిస్తుంది. బాహ్య ఆచారాలను పాటించటం మొదటి మెట్టు. ఆ ఆచారాల సహాయంతో అంతరంగాన్ని శుభ్రపరచుకోవటం రెండవ మెట్టు, బాహ్యంగానూ, అంతరంగంలోనూ పవిత్రంగా జీవించటం తదుపరి మెట్టు. 'కామం, క్రోధం, లోభం, మోహం త్యక్త్వాత్మానం పశ్యతి సోహం' అంటుంది భజగోవింద శ్లోకం.

– రాచమడుగు శ్రీనివాసులు

రూ.కోట్ల స్థలాన్ని ఆంధ్రజ్యోతికి ఎలా ఇస్తారు?

- తోకపత్రికకు స్థల కేటాయింపును కౌన్సిల్‌లో నిలదీసిన వైఎస్సార్‌సీపీ
- దీంతో చివరి నిముషంలో వాయిదా వేసిన మేయర్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖలోని విలువైన స్థలాలను కారుచౌకగా అనుయాయులకు అప్పగిస్తున్న కూటమి ప్రభుత్వం, తాజాగా తన తోకపత్రిక ఆంధ్రజ్యోతికి అర ఎకరం హౌసింగ్ బోర్డు స్థలం విశాఖ నగరపాలక సంఘం ద్వారా కేటాయించాలన్న ప్రయత్నం చివరి నిమిషంలో నిలిచిపోయింది. కోట్లాది రూపాయల స్థలాన్ని ఆంధ్రజ్యోతికి నామమాత్రపు ధరకు ఎలా కేటాయిస్తారంటూ శుక్రవారం కౌన్సిల్‌లో వైఎస్సార్‌సీపీ సభ్యులు ప్రశ్నించడంతో ఈ అంశాన్ని వాయిదా వేస్తున్నట్లు గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రకటించారు. వివరాల్లోకి వెళితే, పరదేశీపాలెంలోని సర్వే నెంబరు 203/2పీలోని అర ఎకరం స్థలం కేటాయింపు అంశాన్ని జీవీఎంసీ కౌన్సిల్ ముందుకు తెచ్చింది. నిజానికి రెగ్యులర్ అజెండాను నాలుగైదు రోజులు ముందుగానే కార్పొరేటర్లకు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు భిన్నంగా ఈ కేటాయింపును రెగ్యులర్ అజెండాలో చేర్చకుండా టేబుల్ అజెండాగా, అదీ చివరి 67వ అంశంగా ఆఖరు నిమిషంలో కౌన్సిల్ ముందుకు తెచ్చారు. అనంతరం టేబుల్ అజెండాలోని అన్ని అంశాలను ఆమోదించారు. చివరి నిమిషంలో వైఎస్సార్‌సీపీ సభ్యులు 67 వ అంశాన్ని తిరిగి ప్రస్తావించారు. ఇంతటి కీలక అంశాన్ని టేబుల్ అజెండాగా చేర్చి, ఎలా ఆమోదింపజేస్తారంటూ గట్టిగా నిలదీశారు. దీనితో తప్పనిసరి పరిస్థితిల్లో 67వ అంశాన్ని వాయిదా వేస్తున్నట్లు మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రకటించారు. కాగా, ఇక్కడ బహిరంగ మార్కెట్‌లో ఎకరా ధర దాదాపు రూ.20 కోట్లు ఉంటుందని అంచనా.

గతంలోనూ కారుచౌకగా కేటాయింపు, రద్దు చేసిన వైఎస్సార్‌సీపీ

వాస్తవానికి 2017లో ఇదే ప్రాంతంలో రూ.7.26 కోట్లు విలువ చేసే స్థలాన్ని రూ.50.50 లక్షలకే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఆంధ్రజ్యోతి పబ్లికేషన్స్, ఆమోద పబ్లికేషన్స్‌కు కేటాయించింది. ఆ కేటాయింపును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రద్దు చేసి, ఆ స్థలాన్ని పేదలకు పంచాలని నిర్ణయించింది. ఇప్పుడు బాబు ప్రభుత్వం మరోసారి అదే సంస్థకు భూమిని అతి తక్కువ ధరకు కట్టబెడుతూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

ఆగమ అడ్వైజరీ చైర్మన్, సభ్యుల రాజీనామా.. ఆమోదం

సాక్షి, అమరావతి: పండుగలు, ఉత్సవాల నిర్వహణతో పాటు వివిధ అంశాల్లో ప్రభుత్వానికి, దేవదాయ శాఖకు సలహాలిచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఆగమ సలహా కమిటీ మూకుమ్మడిగా రాజీనామా చేసింది. చైర్మన్ డా.వేదాంతం సత్య శ్రీనివాస అయ్యంగార్ సహా మొత్తం 12 మంది సభ్యులతో 2023లో అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేయగా, అందులో కొందరు సభ్యులు 2024 జూలైలోనే రాజీనామా చేశారు. కాగా, ఆగమ అడ్వైజరీ బోర్డులో చైర్మన్ మిగిలిన సభ్యుల రాజీనామాల ఆమోదం కోసం దేవదాయ శాఖ ఈ నెల 12న ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. వాటిని ఆమోదం తెలుపుతూ దేవదాయ శాఖ కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు (హెచ్‌డీపీటీ) చైర్మన్‌గా దాసరి శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం వేరొక ఉత్తర్వు జారీ చేసింది.

అక్రిడిటేషన్లపై త్వరలో జిల్లాలకు మార్గదర్శకాలు

సాక్షి, అమరావతి: వర్కింగ్ జర్నలిస్టులకు ఇచ్చే అక్రిడిటేషన్ల విషయంలో సమాచార శాఖ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిందని, త్వరలోనే జిల్లాలకు మార్గదర్శకాలు జారీ చేస్తామని సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్ కిరణ్ తెలిపారు. అక్రిడిటేషన్ల ఉత్తర్వుల జారీ నేపథ్యంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, విజయవాడ ప్రెస్‌క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్ కిరణ్‌తో సమావేశమై చర్చించారు. సమాచార శాఖ ప్రధాన కార్యాలయం నుంచి జిల్లాల్లో ఉన్న సమాచార శాఖ అధికారులకు ఎలాంటి ఆదేశాలు వెళ్లకుండానే కొన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్లకు ప్రతిపాదనలు పంపాలని పాత్రికేయులను ఆయా జిల్లాల సమాచార శాఖ అధికారులు కోరుతున్న అంశాన్ని నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

రేట్లు పెరిగినప్పుడే సబ్సిడీపై నిత్యావసరాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిత్యావసరాల రేట్లు పెరిగినప్పుడు మాత్రమే చౌక దుకాణాల్లో సబ్సిడీపై సరుకులు అందిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఇప్పటికే రేషన్ దుకాణాల్లో బియ్యం, పంచదారతో పాటు కొన్ని ప్రాంతాల్లో రాగి, జొన్నలను పంపిణీ చేస్తున్నామన్నారు. శుక్రవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు తక్కువగా ఉండటంతో కందిపప్పు వంటి నిత్యావసరాలను రేషన్ దుకాణాల్లో ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఎండీయూ వాహనాలను తొలగించిన తర్వాత రేషన్ పంపిణీ 92 నుంచి 93 శాతం పెరిగిందన్నారు. నిత్యం రాష్ట్రంలో ఎక్కడో చోట టన్నుల కొద్దీ రేషన్ బియ్యం పట్టుబడటంపై మీడియా అడిగిన ప్రశ్నలకు.. పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈనెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 1.45 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులకు ఉచితంగా స్మార్ట్ మోడల్‌లో రైస్ కార్డులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

క్రిస్ సిటీ తొలి దశలో 2,228 ఎకరాల అభివృద్ధి

సాక్షి, అమరావతి: చెన్నై–బెంగళూరు కారిడార్‌లో భాగంగా కృష్ణపట్నంనోడ్ క్రిస్ సిటీ తుది మాస్టర్‌ప్లాన్‌ను ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. క్రిస్ సిటీని మొత్తం 10,834.5 ఎకరాల్లో మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. తొలి దశలో 2,228.4 ఎకరాలను అభివృద్ధి చేయనున్నట్లు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొత్తం 10,834.5 ఎకరాల్లో 44.3 శాతం అంటే.. 4,797.5 ఎకరాలు పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తుండగా, రహదారులకు 1,493 ఎకరాలు (13.8%), నివాస సముదాయాలకు 1,308.1 ఎకరాలు (12.1%), పచ్చదనం కోసం 1,202.6 ఎకరాలు (11.1%) వినియోగించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో వెల్లడించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

సాక్షి, అమరావతి: ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ పెండింగ్ బిల్లులను వెంటనే నెట్‌వర్క్ ఆసుపత్రులకు విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం ప్రతినిధి డాక్టర్ అంబటి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళగిరిలో ఆరోగ్యశ్రీ సీఈవోకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.4వేల కోట్లు, ఈహెచ్‌ఎస్ బిల్లులు రూ.320 కోట్లు అదనంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో నెట్‌వర్క్ ఆసుపత్రులు నగదు రహిత చికిత్సల కోసం ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ కార్డులను అంగీకరించడం లేదని పేర్కొన్నారు. అనారోగ్యం బారినపడి పేద ప్రజలతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు చికిత్సలకు తీవ్ర అగచాట్లు పడుతున్నారని పేర్కొన్నారు.

వక్ఫ్ నిధులు చైర్మన్ జేబులో సొమ్ముకాదు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ సంస్థల నిధులను బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ దుర్వినియోగం చేస్తున్నారని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు నిధులు చైర్మన్ జేబులో సొమ్ము కాదని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వక్ఫ్ బోర్డు పరిధిలో కేవలం 10శాతం సంస్థలకే ఆస్తులు, బ్యాంకులో నిల్వలు ఉన్నాయని, మిగిలిన 90శాతం సంస్థల ముతవల్లీలు, ముజావర్లు పేదరికంలో జీవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వక్ఫ్ సంస్థల నుంచి వచ్చే ఆదాయాన్ని మొదటగా ముతవల్లీలు, ముజావర్లు, వారి కుటుంబాల సంక్షేమం కోసం వినియోగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయకపోవడంతో వక్ఫ్ నిధులు దారి మళ్లుతున్నాయన్నారు.

గర్భిణీ మృతిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సుమోటో కేసు

సాక్షి, న్యూఢిల్లీ: వైద్యురాలి నిర్లక్ష్యంతో అనంతపురంలో ఓ గర్భిణి మృతి చెందిన ఘటనపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా కేసు స్వీకరించినట్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. రెండు వారాల్లో గర్భిణి మృతికి గల కారణాలను, ఎఫ్ఐఆర్ స్థితిగతులను తెలపాలంటూ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, అనంతపురం పోలీసు సూపరిటెండెంట్‌లకు నోటీసులు జారీ చేసింది. ఈనెల 3న బుక్కరాయసముద్రం మండలం, చదళ్లకు చెందిన గర్భిణి రాధమ్మ(29)కు ఆరోగ్య సమస్య ఎదురైంది. దీంతో కుటుంబీకులు నగరంలోని సాయికృప ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు గర్భసంచి తొలగించాలంటూ శస్త్ర చికిత్స చేశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో రాధమ్మ అక్కడిక్కడే మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించిన వార్తలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. దీంతో జాతీయ మానవ హక్కుల సంఘం సుమోటోగా స్వీకరించి, కేసు నమోదు చేసింది.



పి.గన్నవరం మండలం ఊడిమూడి ఏటిగట్టు దిగువన వరద నీట మునిగిన గుడిసెలు



ఉన్న గుడిసెలు మునిగిపోవడంతో ఏటిగట్టుపై మళ్లీ గుడిసెలు నిర్మించుకున్న సంచార జాతి బాధితులు

కోనసీమలో వరద ఉధృతి

లంకగ్రామాలను చుట్టుముట్టిన నీరు • పలుచోట్ల పడవల మీదనే రాకపోకలు

సాక్షి, అమలాపురం: గోదావరి ఉగ్రరూపం దాల్చింది. వరదనీరు చొచ్చుకురావడంతో లంకవాసుల కష్టాలు రెట్టింపయ్యాయి. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద శుక్రవారం మధ్యాహ్నం నుంచి వరద తగ్గుతుండగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వరద ముంపు పెరుగుతోంది. వరద లంకగ్రామాలను చుట్టుముట్టింది. రోడ్లు, కాజ్‌వేలు మునగడంతో పలుచోట్ల పడవల మీదే రాకపోకలు సాగుతున్నాయి. పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లోని పలు లంకగ్రామాల్లోకి వరద చేరింది. లోతట్టు ప్రాంతాల్లోని మత్స్యకారుల ఇళ్లు నీటమునిగాయి. విద్యార్థులు పడవల మీద పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రజలు నిత్యావసర సరుకులకు, తాగునీటికి అవస్థలు పడుతున్నారు. పంటలన్నీ మునిగిపోయాయి. కూరగాయ పంటలు, బొప్పాయి, ఎర్ర చక్రకేళి, కంద వంటి వాణిజ్యపంటలు దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వే, అయినవిల్లి మండలం ముక్తేశ్వరం ఎదురుబిడియం కాజ్‌వేలు నీటమునిగాయి.

అయినవిల్లి మండలం ముక్తేశ్వరం-అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే పై నాటు పడవలపై ప్రయాణిస్తున్న లంక ప్రజలు



పునరావాస కేంద్రం లేదు

అల్లవరం మండలం బోడసకుర్రు మత్స్యకార కాలనీలో 80 ఇళ్లు నీట మునిగినా అధికారులు పునరావాస కేంద్రం ఏర్పాటు చేయలేదు. వరద బాధితులకు భోజనం, నీళ్లు అందించడం లేదు. గోదావరి ఉగ్రరూపం దాలుస్తుందని కోనసీమ జిల్లా లంకవాసులు ఆందోళన చెందుతున్న సమయంలో ఎగువన శాంతిస్తుండడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఇంకా రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండడంతో వారు ఆందోళనలో ఉన్నారు.

వరద తగ్గుముఖం.. కొనసాగుతున్న ప్రవాహం



రాజమహేంద్రవరం వద్ద గోదావరి ప్రవాహం

- ప్రకాశం బ్యారేజీ నుంచి 4.16 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 13.42 లక్షల క్యూసెక్కులు కడలిలోకి

సాక్షి, అమరావతి, పోలవరం రూరల్, ధవళేశ్వరం, విజయపురిసౌత్: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉధృతి క్రమేణా తగ్గుతోంది. ప్రకాశం బ్యారేజీలోకి 4,33,398 క్యూసెక్కులు చేరుతుండగా కృష్ణా డెల్టా కాలువలకు 16,776 క్యూసెక్కులు వదలుతూ మిగులుగా ఉన్న 4,16,622 క్యూసెక్కులను అధికారులు సముద్రంలోకి వదిలేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీలోకి 13,54,996 క్యూసెక్కుల ప్రవాహం చేరుతుండగా.. గోదావరి డెల్టా కాలువలకు 12,600 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 13,42,396 క్యూసెక్కుల గోదావరి జలాలను సముద్రంలోకి వదిలేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులోకి 5,26,876 క్యూసెక్కులు కృష్ణాజలాలు చేరుతుండగా.. 4,86,493 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి 4,32,217 క్యూసెక్కులు చేరుతుండగా.. 4,05,532 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టులోకి 3,82,121 క్యూసెక్కులు చేరుతుండగా 3,58,902 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టులోకి 11,75,859 క్యూసెక్కులు చేరుతుండగా అంతే పరిమాణంలో దిగువకు వదిలేస్తున్నారు.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేకు ఈడీ షాక్

చిత్రదుర్గ ఎమ్మెల్యే వీరేంద్రప్ప ఇళ్లు, కంపెనీలపై దాడులు

బనశంకరి : అక్రమ నగదు బదిలీ ఆరోపణలకు సంబంధించి కర్ణాటకలోని చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే, నటుడు దొడ్డణ్ణ అల్లుడు కేసీ వీరేంద్ర(పప్పి) ఇళ్లు, కంపెనీలపై శుక్రవారం ఈడీ అధికారులు దాడి చేశారు. బెంగళూరు, చిత్రదుర్గ, గోవాతో సహా 17 చోట్ల తనిఖీలు జరిగాయి. 10 మంది ఈడీ అధికారుల బృందం బెంగళూరు వసంతనగరలోని ఎమ్మెల్యే వీరేంద్ర ప్రైవేటు అపార్టుమెంట్, సహకారనగరలోని ఇల్లు, చెళ్లకెరెలో ఎమ్మెల్యే నివాసంతో పాటు, అతడి సోదరులైన కేసీ నాగరాజ్, కేసీ తిప్పేస్వామి నివాసాల్లో సోదాలు చేపట్టారు. దాడి సమయంలో ఎమ్మెల్యే వీరేంద్ర సిక్కింలో ఉన్నట్లు తెలిసింది. ఆయన నివాసాల్లో కిలోకు పైగా బంగారం లభ్యమైంది. కీలక ఫైళ్లు, పత్రాలు, బ్యాంక్ లావాదేవీలు, స్థిర, చరాస్తుల ఆచూకీని కనిపెట్టారు. వీరేంద్రతో ఆర్థిక వ్యవహారాలు కలిగి ఉన్న కాంగ్రెస్ నాయకురాలు కుసుమా హనుమంతరాయప్ప ఇంటిపైనా ఈడీ అధికారులు దాడి చేశారు.

రెండు కాళ్లూ సక్రమంగా లేవు... అయినా పింఛన్ కట్



ఈ చిత్రంలో ఉన్నది వరయూరు శ్రీనివాసులు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణంలోని తూర్పుకరణాల వీధిలో తల్లిదండ్రులపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఓ కాలు పూర్తిగా నడవలేని పరిస్థితి కాగా, రెండో కాలుపై బరువు ఎక్కువై నడవలేని స్థితికి చేరుకున్నాడు. ఈ క్రమంలో కన్ను చూపు మందగించింది. ఇతని దివ్యాంగత్వాన్ని గుర్తించి 2010 అక్టోబరులో జిల్లా వైద్యులు నూరు శాతం వికలాంగత్వం ధ్రువీకరిస్తూ సర్టిఫికెట్ మంజూరు చేశారు. అయితే ఇటీవల ప్రభుత్వం తొలగించిన దివ్యాంగుల పెన్షన్‌లో ఇతని పేరు కూడా ఉంది. ప్రతి నెలా మందులకు ఆసరాగా ఉండే పింఛన్ రద్దు కావడంతో తన గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక వాపోతున్నాడు. జిల్లా వైద్యులు ధ్రువీకరించి 15 ఏళ్లుగా పింఛను పొందుతున్న తనకు ఇప్పుడు పింఛను రద్దు చేయడమేంటని ప్రశ్నిస్తున్నాడు.

– ఆత్మకూరు

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా, టీటీడీ అధికారులు లడ్డూప్రసాదాలను అందించారు.

– తిరుమల

దివ్యాంగుల పింఛన్ల కోతకు చేతులెలా వచ్చాయ్?

- పునరుద్ధరించకుంటే దివ్యాంగులతో కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తాం
- నిస్సహాయులకు పింఛన్ల కోసం ఉద్యమం చేపడతాం
- వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: 'కదల్లేని నిస్సహాయులు 20 ఏళ్లుగా పింఛన్ పొందుతున్నారు. అలాంటివారి పింఛన్లలో కోత విధించారు. న్యాయం కోసం బాధితులు రోడ్డెక్కారు. వారిని చూస్తే తొలగించడానికి మనసెలా వచ్చింది అనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే 9,601 మంది దివ్యాంగుల పింఛన్లను తొలగించి విశ్వాసఘాతుకానికి పాల్పడింది. వాటిని పునరుద్ధరించకపోతే దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులతో కలసి కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తాం' అని వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. 2024 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ ప్రభుత్వంలో 66.34 లక్షల మందికి పింఛను అందేదని, ఏటా జనవరి, జూన్ నెలల్లో అర్హులకు కొత్త పింఛన్లను మంజూరు చేసేవారని గుర్తు చేశారు. వైఎస్ జగన్... దివ్యాంగులను 21 కేటగిరీలుగా గుర్తించి పింఛన్ అందించినట్లు చెప్పారు.

5 లక్షల పింఛన్ల తొలగింపు

కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే 5 లక్షల పింఛన్లకు కోత పెట్టిందని అనంత మండిపడ్డారు. రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులు, మంచంపై ఉన్న నిస్సహాయులను సైతం ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే దారుణ పరిస్థితిని సీఎం చంద్రబాబు తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో 2 లక్షల దివ్యాంగుల పింఛన్లకు కోత విధించారని, అనంతపురం కార్పొరేషన్‌లోనే 1,008 మందికి నోటీసులు ఇచ్చారన్నారు. అధిక శాతం వైకల్యం ఉన్నా.. రీ వెరిఫికేషన్ పేరిట వైద్యులపై ఒత్తిడి తెచ్చి, 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్నట్లు చూపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. సీఎం పర్యటనల పేరుతో హెలికాప్టర్, విమానాలకు, సమావేశాల పేరుతో ఇష్టారాజ్యంగా రూ.కోట్లు వ్యయం చేస్తున్నారని, ఆ ఖర్చును తగ్గిస్తే అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు ఇవ్వవచ్చని సూచించారు.

అన్నింటిలోనూ కోతే...

ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌తో పాటు వందల పథకాలు అందిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి పార్టీలు అన్నింటినీ ఎగ్గొట్టాయని, వైఎస్సార్‌సీపీ పోరాటాల తర్వాత సూపర్ సిక్స్ హామీల్లో కొన్నింటిని అమలు చేస్తున్నారన్నారు. అందులోనూ ఆంక్షల పేరిట ప్రజలను వంచించారని అనంత దుయ్యబట్టారు.

నోటీసులు అందుకున్న వారికి వచ్చే నెలలో పింఛన్లు రావు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అనర్హత నోటీసులందుకున్న దివ్యాంగులకు వచ్చేనెలలో పింఛన్లు అందవని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. రీ అసెస్‌మెంట్‌లో వైద్య పరీక్షలు పూర్తయి మళ్లీ సర్టిఫికెట్లు వచ్చాకే వారికి తిరిగి పింఛన్లు వస్తాయని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం దివ్యాంగ పింఛనుదారులకు అనర్హుల పేరిట టీడీపీ కూటమి ప్రభుత్వం భారీ సంఖ్యలో నోటీసులు జారీచేస్తుండడంపై వివాదం రగులుతున్న నేపథ్యంలో.. శుక్రవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో 2.07 లక్షల మంది దివ్యాంగులకు కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని.. అంతకుముందు 15 ఏళ్లలో ఆరు లక్షల మంది దివ్యాంగులకు పింఛన్లు ఉన్నాయని చెప్పారు. అయితే, గత ఏడాది తమ ప్రభుత్వం వచ్చాక దీనిపై అధ్యయనం చేస్తే చాలామంది అనర్హులకు వికలాంగ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు తేలిందని.. దీంతో మొత్తం అన్ని సర్టిఫికెట్లు పరిశీలించాలని ఆదేశించామన్నారు. ఇక ప్రస్తుతమున్న మొత్తం 7.95 లక్షల మంది దివ్యాంగుల పింఛనుదారులకుగాను 5.50 లక్షల మందికి సంబంధించిన రీ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిందని, అందులో 80 వేల మంది అనర్హులుగా తేలగా, వారికి నోటీసులు జారీచేసినట్లు మంత్రి తెలిపారు. ఇదిలా ఉంటే.. అనర్హులుగా తేలిన వారిని వారి అర్హతబట్టి ఇతర పింఛన్లకు మళ్లిస్తున్నామని.. ఇలా 20 వేల మందిని వృద్ధాప్య పింఛన్ల కిందకు మార్చినట్లు మంత్రి చెప్పారు. వితంతువులు ఉంటే వాళ్లను వితంత పింఛన్లకు మారుస్తున్నామన్నారు. ఇక 2024 జులైలో 65.18 లక్షలు మందికి పింఛన్లు ఇచ్చామని.. ఇప్పుడు 63.71 లక్షల మందికి ఇస్తున్నామని.. ఈ తగ్గిన పింఛన్లు మరణించిన వారివి మాత్రమేనని మంత్రి శ్రీనివాస్ చెప్పారు.

కార్మికశాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు



జేసీ కార్యాలయం

కర్నూలు: కర్నూలు చల్లా కాంపౌండ్‌లోని కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శుక్రవారం విస్తృత తనిఖీలు చేశారు. కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ముడే బాలు నాయక్ ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారంటూ తిరుపతి ఏసీబీ రేంజ్ కార్యాలయంలో ఈనెల 21న కేసు నమోదైంది. దీంతో ఏసీబీ అధికారులు తిరుపతి, మదనపల్లె, రాయచోటి ప్రాంతాల్లోని ఆయన బంధువుల ఇళ్లతో పాటు కర్నూలులోని కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ కార్యాలయంలో తనిఖీలు చేశారు. సీఐ కృష్ణయ్య, ఎస్ఐ సుబ్బరాయుడు తమ సిబ్బందితో కార్యాలయంతో పాటు ఆయన నివాసముంటున్న బాలాజీ నగర్‌లోని సాయికృప నివాస్ అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. అయితే ఆయన చాంబర్‌లో కానీ, నివాసముంటున్న అద్దె ఇంట్లో కానీ ఎలాంటి డాక్యుమెంట్లు దొరకలేదని ఏసీబీ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు ప్రతిపాదన

సాక్షి, అమరావతి: ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంపుపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేందుకు మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విభజన చట్టంలోని తొమ్మిది, పదో షెడ్యూల్స్‌లో చేర్చిన ప్రభుత్వ ఇన్‌స్టిట్యూషన్లు, సొసైటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంపు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి వీలైనంత త్వరగా నివేదిక, సిఫార్సులను సమర్పించేందుకు మంత్రులు పి.నారాయణ, లోకేశ్, పయ్యావుల కేశవ్‌తో బృందాన్ని ఏర్పాటు చేశారు. దీంతోపాటు కార్యకలాపాలను సమన్వయం చేయడానికి బృందం కన్వీనర్‌గా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఉంటారు.

రాష్ట్రంలో కక్షపూరిత ప్రభుత్వం నడుస్తోంది

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- ఎంపీ మిథున్‌రెడ్డితో ములాఖత్



సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్‌సీపీ నేతల విషయంలో కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. మద్యం అక్రమ కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డితో శుక్రవారం ములాఖత్ అయ్యారు. అనంతరం కారాగారం బయట విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో కక్షపూరిత ప్రభుత్వం నడుస్తోందనేందుకు మీడియా పాయింటే సాక్ష్యం. గతంలో మీడియా పాయింట్ ఎక్కడుంది? ఇప్పుడు ఎక్కడికి తరలించారు? గతంలో బారికేడ్లు ఎక్కడున్నాయి? ఇప్పుడు ఎక్కడున్నాయి? చంద్రబాబు సెంట్రల్ జైల్లో ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వం ఈ రకంగా ఎప్పుడూ ప్రవర్తించలేదు. జైలు సిబ్బంది, పోలీసులు కనీస మర్యాద లేకుండా వ్యవహరించడం దారుణం. మిథున్‌రెడ్డికి కోర్టు ఆదేశించిన సదుపాయాలు కూడా కల్పించడం లేదు. అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి' అని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్, యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, లీగల్ సెల్ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఇన్‌చార్జి సాదిక్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మంత్రి రాసలీలలతో తిరుపతికి అప్రతిష్ట

- వైఎస్సార్‌సీపీ నేత భూమన కరుణాకరరెడ్డి
- మంత్రి రాసలీలలను బయటపెట్టిన టీడీపీ అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డిని అభినందిస్తున్నా



తిరుపతి మంగళం: టీడీపీ మంత్రి అమ్మాయిలతో రాసలీలలు సాగిస్తూ తిరుపతి పవిత్రతను మంటగలుపుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీలోని ఓ మంత్రి రాసలీలల గురించి రాష్ట్రమంతా కోడైకూస్తోందన్నారు. ఆ మంత్రి రాసలీలల విషయాన్ని స్వయంగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌బీ సుధాకర్‌రెడ్డే.. టీడీపీ అనుకూల ఛానల్లో జరిగిన చర్చా కార్యక్రమంలో వెల్లడించారని తెలిపారు. ఆ మంత్రి తరుచూ తిరుపతికి వచ్చి.. అత్యంత ముఖ్యమైన పోస్టు మీకే ఇప్పిస్తానంటూ మహిళలను వలలో వేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. కూటమి నాయకులు కూడా ఈ విషయంపై చర్చించుకుంటున్నట్లు తెలిసిందన్నారు. ఆ మంత్రి ఎవ్వరో.. ఆయన పేరేమిటో తనకు తెలియదన్నారు. కానీ టీడీపీ, జనసేన నాయకులకు మాత్రం చాలా స్పష్టంగా తెలుసని చెప్పారు. టీడీపీ అధికార ప్రతినిధి ఎస్‌బీ సుధాకర్‌రెడ్డికి కూడా ఆ మంత్రి పేరు బాగా తెలుసని.. కానీ ఆ పేరు చెప్పడానికి ఆయన ఇష్టపడలేదన్నారు. హైదరాబాద్‌లో ఆ మంత్రి చేసిన అవినీతి, రాసలీలల గురించి.. కొంత కాలం కిందట టీడీపీ అనుకూల పత్రికల్లోనే పెద్ద పెద్ద కథనాలు వచ్చాయని గుర్తు చేశారు. తిరుపతి పవిత్రతను కాపాడతానని ప్రగల్భాలు పలికే ఆ మంత్రి.. తిరుపతి పుణ్యక్షేత్రంలో చేస్తున్న రాసలీలలను బయటపెట్టిన టీడీపీ నేత ఎస్‌బీ సుధాకర్‌రెడ్డిని అభినందిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత మంత్రిపై వెంటనే చర్యలు తీసుకోవాలని చంద్రబాబును భూమన కరుణాకరరెడ్డి డిమాండ్ చేశారు.

శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రమసింఘే అరెస్ట్



కొలంబో: అధికారంలో ఉండగా ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమ సింఘే(76)ను పోలీసులు అరెస్ట్ చేశారు. కొలంబోలోని క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్(సీఐడీ)ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న అధికారులు ఆ వెంటనే అరెస్ట్ చేశారు. మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. శ్రీలంక అధ్యక్షుడిగా 2022–24 సంవత్సరాల్లో విక్రమసింఘే శ్రీలంక అధ్యక్షుడిగా పనిచేశారు. 2023 సెప్టెంబర్‌లో తన భార్య ప్రొఫెసర్ మైత్రి పాల్గొన్న కార్యక్రమానికి హాజరయ్యేందుకు లండన్ వెళ్లిన విక్రమసింఘే ప్రభుత్వ నిధులను వాడుకున్నట్లు ఆరోపణలున్నాయి. లాయర్, సీనియర్ రాజకీయ నేత అయిన విక్రమసింఘే ఐదు దశాబ్దాలకు పైగా పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నారు. వేర్వేరు సమయాల్లో ఆరు సార్లు ప్రధానిగా పనిచేశారు. గొటబయ రాజపక్స రాజీనామాతో 2022లో అధ్యక్ష పగ్గాలు చేపట్టిన ఆయన దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేశారన్న ప్రతిష్టను సంపాదించుకున్నారు. అనంతరం ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అధ్యక్షుడిగా ఆయన చేపట్టిన 23 విదేశీ పర్యటనల ఖర్చు రూ.17.50 కోట్లని మీడియా తెలిపింది. కాగా, అరెస్టయిన ఏకైక శ్రీలంక మాజీ అధ్యక్షుడిగా విక్రమ సింఘే నిలిచిపోయారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికకు ముఖాముఖి పోరు

పూర్తయిన నామినేషన్ల పరిశీలన

న్యూఢిల్లీ: దేశ 17వ ఉపరాష్ట్రపతి పదవికి సెప్టెంబర్ 9వ తేదీన జరిగే ఎన్నిక బరిలో అధికార ఎన్‌డీయే బలపరిచిన సీపీ రాధాకృష్ణన్, ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డి మిగిలారు. ఈ ఇద్దరు అభ్యర్థులు అందజేసిన నాలుగేసి సెట్ల నామినేషన్ పత్రాలు సరిగ్గా ఉన్నాయని ఈ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న రాజ్యసభ సెక్రటరీ జనరల్ తెలిపారు. వీటిని అంగీకరించామని చెప్పారు. శుక్రవారంతో నామినేషన్ల పరిశీలనకు గడువు ముగియడంతో, దక్షిణాదికే చెందిన ఇద్దరు అభ్యర్థుల మధ్య ద్విముఖ పోటీ ఖరారైనట్లయింది. ఈ నెల 7 నుంచి 21వ తేదీ వరకు మొత్తం 46 మంది అభ్యర్థులు 68 నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. సీపీ రాధాకృష్ణన్, సుదర్శన్‌రెడ్డిల నామినేషన్లు మినహా సరిగా లేని మిగతా అన్ని నామినేషన్ పత్రాలను తిరస్కరించినట్లు రాజ్యసభ సెక్రటరీ జనరల్ వివరించారు.



కాలభైరవ.. దేశీయ రిమోట్ యుద్ధ విమానం

రూపొందించిన బెంగళూరు స్టార్టప్

బెంగళూరు: బెంగళూరుకు చెందిన ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్(ఎఫ్‌డబ్ల్యూడీఏ) సంస్థ మొట్టమొదటిసారిగా దేశీయంగా మీడియం అల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యురెన్స్(మేల్) రిమోట్ యుద్ధ విమానం 'కాల భైరవ'ను సిద్ధం చేసింది. సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో సుహాస్ తేజస్కంద దీనిని శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. కాల భైరవుని స్ఫూర్తితో ఈ విమానం డిజైన్, అభివృద్ధి, ఉత్పత్తి దేశీయంగానే పూర్తి చేశామని వివరించారు. కాల భైరవ విమానం 3 వేల కిలోమీటర్ల దూరం 30 గంటలపాటు ఏకబిగిన ప్రయాణించగలదన్నారు. దక్షిణాసియాలోని ఒక దేశం నుంచి ఇప్పటికే 25 లక్షల డాలర్ల విలువైన ఒక ఆర్డర్ వచ్చిందని వివరించారు. అమెరికా నుంచి మన ప్రభుత్వం కొనుగోలు చేసే ఒక్కో రిమోట్ ప్రిడేటర్ విమానం ఖరీదు రూ.1,000 కోట్లు కాగా, అదే ఖర్చుతో 10 కాల భైరవలను దేశీయంగా సొంతం చేసుకోవచ్చని, ఇందులో ఒకటి దెబ్బతిన్నా లక్ష్య సాధనలో ఎటువంటి మార్పు ఉండదని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న విధానాలు, అమెరికా ప్రభుత్వ ఆంక్షల నడుమ భారత ప్రభుత్వం యుద్ధ అవసరాల కోసం ఇతరులపై ఆధారపడరాదని ఆయన తెలిపారు. వేరే దేశాల వంక చూడటం వల్ల మన వ్యూహాత్మక స్వాతంత్ర్యం దెబ్బతింటుందని, రహస్య సమాచారం లీకయ్యే ప్రమాదముందని సుహాస్ పేర్కొన్నారు.

20 ఏళ్లు పైబడిన వాహనాల రెన్యువల్ ఫీజు పెంపు

న్యూఢిల్లీ: 20 ఏళ్లు పైబడిన మోటారు వాహనాల రిజిస్ట్రేషన్ రెన్యువల్ ఫీజును కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచింది. తద్వారా ఇటువంటి వాహనాల వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. ఇరవయ్యేళ్లు పైబడిన లైట్ మోటారు వెహికల్(ఎల్‌ఎంవీ)ల రెన్యువల్ ఫీజును ప్రస్తుతమున్న రూ.5 వేల నుంచి రెట్టింపు చేసి రూ.10 వేలకు పెంచింది. మోటారు సైకిళ్లకైతే ఈ ఫీజును రూ.వెయ్యి నుంచి రూ.2 వేలకు, త్రీ వీలర్స్, నాలుగు చక్రాల వాహనాలకైతే ఇది రూ.3,500 నుంచి రూ.5,000కు పెంచింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా హైవేల శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దిగుమతి చేసుకున్న టూ–త్రీ వీలర్‌కైతే రెన్యువల్ ఫీజు రూ.20వేలు చెల్లించాల్సి ఉంటుంది. నాలుగు లేదా అంతకంటే ఎక్కువ చక్రాలుండే వాహనాల రెన్యువల్ ఫీజు రూ.80వేలని కేంద్రం తెలిపింది. ఈ మేరకు ముసాయిదా సవరణను ఫిబ్రవరిలో జారీ చేసిన కేంద్రం, ఈ నెల 21వ తేదీన దీనిని ఆమోదించింది. వాహనాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ ఫీజును కేంద్రం చివరిగా 2021 అక్టోబర్‌లో పెంచింది.

మరణం అంచున గాజా



అన్నార్తుల ఎదురు చూపులు

- అక్కడ అత్యంత తీవ్రమైన కరువు
- యూఎన్ డబ్ల్యూఎఫ్‌పీ చీఫ్ అధికారిక ప్రకటన
- తక్షణం స్పందించకపోతే మరింత విస్తరిస్తుందని హెచ్చరిక

గాజా స్ట్రిప్: రెండేళ్ల యాజన్.. గాజా నగరంలోని బీచ్‌లో ఉన్న శరణార్థి శిబిరంలో ఉన్నాడు. ఆ శిబిరానికి రెండు నెలలుగా పిండే కాదు.. ఎలాంటి ఆహార సహాయం అందడం లేదు. విశాలమైన అతని కళ్లు.. ఆహారం కోసం ఎదురుచూసి.. చూసి.. అలసటతో బరువెక్కాయి. ఎముకలు తేలిన శరీరం అతని ఆకలిని చెబుతోంది. ఏడవడానికి కాదు కదా.. చివరికి తిండి తినడానికి కూడా ఓపికలేక.. చిరిగిపోయిన పరుపుపై జీవచ్ఛవంలా కూర్చున్నాడు. ఇది ఒక్క యాజన్ స్థితి కాదు.. గాజా స్ట్రిప్‌లోని పిల్లలందరి సామూహిక దుంఖః. ప్రస్తుతం గాజాలో పోషకాహార లోపం వేగంగా వ్యాపిస్తోంది. గాజా నగరంలో ఆకలి మరణాలు ఫిబ్రవరి నుంచి నాలుగు రెట్లు పెరిగాయి. ప్రస్తుతం గాజాలో 5లక్షల మంది తీవ్రమైన కరువును ఎదుర్కొంటున్నారని ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్‌పీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిండీ మెక్ కెయిన్ హెచ్చరించారు. మధ్యప్రాచ్యంలో అధికారికంగా కరువు నిర్ధారించడం ఇదే మొదటిసారి. రాబోయే రోజుల్లో ఇది గాజా గవర్నరేట్ నుంచి డెయిర్ అల్ బలాహ్, ఖాన్ యూనిస్‌కు వ్యాపిస్తుందని ఆందోళన వ్యక్తంచేసింది. 'రోజుల తరబడి తినడానికి ఏమీ లేక లక్షలాది మంది బతుకీడిస్తున్నారు. పోషకాహార లోపం స్థాయి వేగంగా పెరుగుతోంది. ఆకలి మరణాలు పెరుగుతున్నాయి. ఈ సమయంలో తక్షణ, పూర్తి స్థాయి మానవతా సాయం అవసరమని ప్రపంచ ఆహార కార్యక్రమం, ప్రపంచ ఆరోగ్య సంస్థ నొక్కి చెప్పాయి. కరువును ఎలాగైనా ఆపాలని ఆమె పిలుపునిచ్చారు. ఆ ప్రజల ప్రాణాలు కాపడేందుకు అడ్డంకులు లేని మానవతా సహాయం, తక్షణ కాల్పుల విరమణ అవసరమని సూచించారు. లేని పక్షంలో సెప్టెంబర్ చివరి నాటికి, గాజా స్ట్రిప్ అంతటా దాదాపు 7 లక్షల మంది కరువును ఎదుర్కొంటారని ఆమె హెచ్చరించారు.

ప్రాణాంతకంగా మారిన పోషకాహార లోపం

రెండు సంవత్సరాల సంఘర్షణ ప్రజలను పదే పదే నిరాశ్రయులను చేస్తే.. మానవతా సాయంపై ఆంక్షలు ప్రజలను ఆకలిలోకి నెట్టాయి. ఇక్కడ ఆహారం దొరకడం లేదు. జూలై, మే నెలతో పోలిస్తే ప్రజలు రెట్టింపు సంఖ్యలో ఆకలితో అలమటిస్తున్నారు. ఇక గాజా నగరంలో మూడు రెట్లు ఎక్కువైంది. ప్రతి ముగ్గురిలో ఒకరికి రోజుల తరబడి ఆహారం దొరకడం లేదు. దొరికిన కొద్ది మొత్తంతో పిల్లల కడుపు నింపి, పెద్దలు పస్తులుంటున్నారు. పిల్లల్లో పోషకాహార లోపం వేగంగా పెరుగుతోంది. నలుగురిలో ఒకరు తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. అది అత్యంత ప్రాణాంతకం. జూన్ 2026 చివరి నాటికి పోషకాహార లోపం వల్ల మరణించే ప్రమాదం ఉన్న పిల్లల సంఖ్య 14,100 నుంచి 43,400 కు అంటే మూడు రెట్లు పెరుగుతుంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో 98 శాతం పంట భూములు దెబ్బతిన్నాయి. వ్యవసాయం లేదు. ప్రతి పది కుటుంబాల్లో తొమ్మిది కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. జూలై నుంచి గాజాలోకి వచ్చే ఆహారం, సహాయ సామగ్రి పెరిగింది. కానీ.. అవసరంతో పోలిస్తే అది చాలా తక్కువ. సహాయ ట్రక్కుల నుంచి ఆహారం దోచుకుంటున్నారు. వంట చేసుకోవడానికి నీళ్లు కూడా లేవంటే పరిస్థితిని ఊహించొచ్చు.

మనుషులు సృష్టించిన కరువు

అయితే ఈ కరువు మనుషులు సృష్టించిందని, అవకాశం ఉన్నా నివారించలేకపోవడం వెంటాడే విషయమని ఐక్యరాజ్యసమితి సహాయ అధిపతి టామ్ ఫ్లెచర్ అన్నారు. జెనీవాలో మీడియాతో మాట్లాడిన ఆయన ఇజ్రాయెల్ విధిస్తున్న అడ్డంకుల కారణంగా పాలస్తీనా భూభాగానికి ఆహారం చేరుకోలేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 'మమ్మల్ని అనుమతిస్తే మనం నివారించగలిగే కరువు ఇది. ఇజ్రాయెల్ అడ్డంకుల కారణంగానే సరిహద్దుల వద్ద ఆహారం నిల్వలు నిలిచిపోయాయి' అని తెలిపారు.

ఫిర్యాదులకు 'ఆధార'మే

- ఓటర్ల తొలగింపుపై ఫిర్యాదు చేయొచ్చు
- బిహార్ ఉదంతంలో సుప్రీం స్పష్టీకరణ
- పౌరులను పట్టించుకోని పార్టీలెందుకు?
- ఫిర్యాదుల దాఖలులో సహకరించండి
- మీ కార్యకర్తలను రంగంలోకి దింపండి
- బిహార్‌లోని 12 పార్టీలకు ఆదేశాలు

న్యూఢిల్లీ: బిహార్‌లో ఓటర్ల జాబితా నుంచి తొలగింపునకు గురైన వాళ్లు దాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసే ఫిర్యాదులకు మద్దతుగా ఆధార్‌ను కూడా సమర్పించవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ విషయమై ఎన్నికల సంఘం పేర్కొన్న 11 డాక్యుమెంట్లతో పాటు ఆధార్ కూడా చెల్లుబాటవుతుందని స్పష్టం చేసింది. ఎన్నికల జాబితా ముసాయిదాపై సకాలంలో అభ్యంతరాలు లేవనెత్తడంలో బిహార్‌లోని 12 రాజకీయ పార్టీలూ విఫలమయ్యాయంటూ గట్టిగా తలంటింది. ఈ విషయంలో వాటిది పూర్తిగా చేతగానితనమేనంటూ ఆక్షేపించింది. బిహార్‌లో తాము చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) సందర్భంగా ముసాయిదాపై ఒక్క పార్టీ కూడా తమవద్ద అభ్యంతరాలు దాఖలు చేయలేదన్న కేంద్ర ఎన్నికల సంఘం అఫిడవిట్‌ను ఉటంకిస్తూ ఈ మేరకు పార్టీలను గట్టిగా మందలించింది. పైపెచ్చు ఓటర్ల జాబితా నుంచి తొలగింపునకు గురైన పౌరులకు కనీసం ఈసీ వద్ద అభ్యంతరాలు దాఖలు చేయడంలో ఒక్క పార్టీ కూడా చురుగ్గా వ్యవహరించి సాయం చేయలేదంటూ తీవ్రంగా ఆక్షేపించింది. ప్రజలతో ఇంతటి దూరం ఎందుకు ఏర్పడిందంటూ ప్రశ్నించింది. ఈ విషయమై పార్టీలన్నీ ఆత్మవిమర్శ చేసుకోవాలంటూ ఉద్బోధించింది. ఎస్‌ఐఆర్ కసరత్తును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ఇద్దరు సభ్యుల ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. "ఓటర్ల ముసాయిదాలో పేర్లు గల్లంతైన వారికి ఫారం–6 సాయంతో ఈసీ వద్ద ఫిర్యాదులు చేయడంలో పూర్తిస్థాయిలో సహకరించండి. ఆ మేరకు మీ పార్టీల కార్యకర్తలందరికీ స్పష్టమైన ఆదేశాలివ్వండి" అంటూ బిహార్‌లోని 12 పార్టీలనూ ఆదేశించింది. వ్యక్తిగతంగా అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో దాఖలు చేసేందుకు వీలు కల్పించాల్సిందిగా ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. ఎస్‌ఐఆర్ కసరత్తు గడువు విషయమై ఈ దశలో ఎలాంటి మార్పుచేర్పులూ చేయలేదని స్పష్టం చేసింది.

బూత్ ఏజెంట్లు ఏం చేస్తున్నట్టు?

బిహార్‌లో ఏకంగా 1.68 లక్షల మంది బూత్ స్థాయి ఏజెంట్లున్నట్టు ఈసీ నివేదించింది. అలాంటప్పుడు ఓటర్ల జాబితా నుంచి తొలగింపులకు సంబంధించి ఇప్పటిదాకా కేవలం రెండంటే రెండే అభ్యంతరాలు దాఖలవడంపై ధర్మాసనానికి విస్మయం వ్యక్తం చేసింది. ఈ విషయంలో పార్టీలు, అవి నియమించిన బూత్ స్థాయి ఏజెంట్లు ఏం చేస్తున్నట్టని ప్రశ్నించింది. "తొలగించిన 65 లక్షల ఓటర్లు మరణించారా, నివాసాలు మార్చారా, మరేమైనా జరిగిందా అన్నది తేలాలి. ఈ దిశగా అన్ని పార్టీల ఏజెంట్లు పూర్తి స్థాయిలో తనిఖీలు జరపాలి" అని ఆదేశించింది.

స్టెరిలైజేషన్ తర్వాత వదిలేయాల్సిందే

- ఎక్కడి నుంచి తీసుకొచ్చారో అక్కడే వదిలేయాలి
- వ్యాధులు, ఆవేశపూరిత ప్రవర్తన ఉన్న కుక్కలను షెల్టర్‌కు తరలించాలి
- బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలకు ఆహారం పెట్టడం నేరం
- సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఆదేశాలు



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వీధి కుక్కల సమస్యపై అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 8వ తేదీన ఇచ్చిన ఉత్తర్వు పట్ల జంతు ప్రేమికుల నుంచి ఆగ్రహావేశాలు వెల్లువెత్తడంతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు అభ్యంతరం వ్యక్తంచేయడంతో.. ఆ ఉత్తర్వులో మార్పులు చేస్తూ శుక్రవారం తీర్పు వెలువరించింది. కుక్కలకు స్టెరిలైజేషన్(పిల్లలు పుట్టకుండా శస్త్రచికిత్స) పూర్తి చేసిన తర్వాత ఎక్కడి నుంచి తీసుకొచ్చారో అక్కడే వదిలేయాలని తేల్చిచెప్పింది. రేబిస్ వంటి వ్యాధులు, ఆవేశపూరిత, విపరీత ప్రవర్తన ఉన్న కుక్కలను మాత్రం స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ అనంతరం ప్రత్యేక షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. ఈ నెల 8న ఇచ్చిన ఉత్తర్వు అత్యంత కఠినంగా ఉన్న మాట వాస్తవమేనని సుప్రీంకోర్టు అంగీకరించింది. వీధి కుక్కల బెడద దేశమంతటా ఉన్నట్లు గుర్తుచేసింది. ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రాణాలు సైతం కోల్పోతున్నారని, అందుకే దేశవ్యాప్తంగా వీధి కుక్కల నియంత్రణకు ఒక జాతీయ విధానం తీసుకొచ్చే విషయం ఆలోచించాలని ప్రభుత్వానికి సూచించింది. ఢిల్లీలో వీధి కుక్కల వ్యవహారంపై ఈనెల 8న ఇచ్చిన ఉత్తర్వుపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. కుక్కలన్నింటినీ 8 వారాల్లోగా బంధించి, షెల్టర్లకు తరలించాలంటూ జస్టిస్ పార్దివాలా నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను జంతు ప్రేమికులు తప్పుబట్టారు. దాంతో ఈ అంశాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ త్రిసభ్య ధర్మాసనానికి ఇప్పగించారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం మళ్లీ విచారణ చేపట్టింది. తగిన మౌలిక సదుపాయాలు ఉన్నాయో లేదో తెలుసుకోకుండా అన్ని కుక్కలను బంధించి, షెల్టర్‌కు తరలిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంది. ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలు ఏమిటంటే..

- వీధి కుక్కలకు బహిరంగ ప్రదేశాల్లో ఆహారం పెట్టడం నేరం. ఉల్లంఘించినవారికి శిక్ష తప్పదు.
- వాటికి ఆహారం అందించడానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వీధుల్లో ఇళ్ల ముందు కుక్కలకు అన్నం పెట్టినవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.
- వీధి కుక్కలను జంతు ప్రేమికులు దత్తత తీసుకోవచ్చు. వాటిని వారు సరిగ్గా సంరక్షించాలి. మళ్లీ వీధుల్లోకి వదిలేయకూడదు.
- ఢిల్లీలో వీధి కుక్కలను కాపాడాలంటే పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తి రూ.25,000, ఎన్జీఓలు రూ.2 లక్షల చొప్పున కోర్టులో డిపాజిట్ చేయాలి.
- కుక్కల సమస్యకు సంబంధించిన హైకోర్టుల్లో ఉన్న పిటిషన్లను సుప్రీంకోర్టుకు బదిలీ చేస్తున్నాం. ఒక జాతీయ పాలసీని రూపొందించే దిశగా విచారణ చేపడతాం.
- వీధి కుక్కల కేసులో కేవలం ఢిల్లీని మాత్రమే కాకుండా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సైతం భాగస్వామ్య పక్షాలుగా చేరుస్తున్నాం.
- సుప్రీంకోర్టు తాజా తీర్పు పట్ల జంతు ప్రేమికులు హర్షం వ్యక్తంచేశారు.

నేరగాళ్లు జైలు నుంచి పరిపాలించాలా?

అవినీతిపరులను పదవుల నుంచి తొలగిస్తామంటే భయమెందుకు?



ప్రధాని మోదీ

- ఊచలు లెక్కిస్తూ ఫైళ్లపై సంతకాలు చేస్తున్నారంటే మనం చింతించాలి
- చొరబాటుదార్లపై చర్యలు తీసుకుంటే మీకు ఉలుకెందుకు?
- ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ ఆగ్రహం
- బిహార్, బెంగాల్‌లో పర్యటించిన ప్రధాని
- పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం..

గయాజీ: అవినీతికి పాల్పడి జైలుపాలైన ప్రజాప్రతినిధులను పదవుల నుంచి తప్పించడానికి చట్టం తీసుకొస్తామంటే ప్రతిపక్షాలు ఎందుకు భయపడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశ్నించారు. అధికారం వెలగబెడుతున్న వ్యక్తులు జైలుకెళ్లి, అక్కడి నుంచే పరిపాలన సాగిస్తున్న పరిస్థితులు చూసి మనం నిజంగా బాధపడాలని అన్నారు. ఒకవైపు ఊచలు లెక్కిస్తూ మరోవైపు ఫైళ్లపై సంతకాలు చేస్తున్నారంటే మనం చింతించాలని చెప్పారు. అలాంటి వ్యక్తులు(ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పేరును పరోక్షంగా ప్రస్తావిస్తూ) రాజ్యాంగ విలువలను హేళన చేస్తున్నారని ధ్వజమెత్తారు. నేరగాళ్లు జైలు నుంచే పరిపాలన చేస్తామంటే మనం చూస్తూ ఉండిపోవాలా? అని నిలదీశారు. 11 ఏళ్ల మా పాలనలో ఎలాంటి అవినీతి మరక లేదని గర్వంగా చెబుతున్నామని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కార్ పాలనలో ఎన్నో కుంభకోణాలు జరిగాయని, బిహార్‌లో ఆర్జేడీ అవినీతి బాగోతాలు ప్రతి ఒక్కరికీ తెలుసని చెప్పారు. అందుకే అవినీతి ముఖ్యమంత్రులు వరుసగా 30 రోజులు జైల్లో ఉంటే పదవి నుంచే తొలగించేలా చట్టం తీసుకురావాలని నిర్ణయించామని, ప్రధానమంత్రి సైతం వరుసగా 30 రోజులు జైల్లో ఉంటే పదవి నుంచి దిగిపోవాల్సిందేనని స్పష్టంచేశారు. ఒక సాధారణ ప్రభుత్వ ఉద్యోగి ఏదైనా తప్పుచేసి 50 గంటలు జైల్లో ఉంటే పోస్టు నుంచి తొలగిస్తారని, మరి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులను ఎందుకు వదిలిపెట్టాలి? అని ప్రశ్నించారు. తాము తీసుకొస్తున్న కఠినమైన చట్టాన్ని కాంగ్రెస్, ఆర్జేడీ సహా ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని, చేసిన పాపాలకు శిక్ష పడుతుందని భయపడుతున్నాయని విమర్శించారు. నేరగాళ్లు ఉండాల్సింది జైల్లోనే తప్ప పదవుల్లో కాదన్నారు. కాంగ్రెస్, ఆర్జేడీలు అధికారంలో ఉన్నప్పుడు జనం సొమ్ముతో బొజ్జలు నింపుకున్నాయని నిప్పులు చెరిగారు.

ప్రధాని మోదీ శుక్రవారం బిహార్, పశ్చిమ బెంగాల్‌లో పర్యటించారు. బిహార్‌లోని గయాజీ జిల్లాలో రూ.13,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. బెంగాల్ రాజధాని కోల్‌కతాలో మూడు మెట్రో రైలు మార్గాలను ప్రారంభించారు. ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. బహిరంగ సభల్లో ప్రసంగించారు. ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రాజ్యాంగ(130 సవరణ) బిల్లు–2025తోపాటు బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్) ప్రక్రియను పరోక్షంగా సమర్థించారు. వ్యవస్థలో ఉన్న లోపాలను సరి చేస్తున్నామని చెప్పారు. ఇంకా ఆయన ఏం చెప్పారంటే...

"పహల్గాంలో మన పర్యాటకులను బలి తీసుకున్న ముష్కరులపై ప్రతీకారం తీర్చుకుంటామని బిహార్ గడ్డపైనే ప్రతిజ్ఞ చేసి, నెరవేర్చి చూపించా. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్ ఉగ్రవాదుల భరతం పట్టాం.

ఓట్ల కోసమే విపక్షాల ఆరాటం: దేశంలో జనాభా స్వరూపం మారకుండా చూడాలన్న లక్ష్యంతో అక్రమ వలసదార్లు, చొరబాటుదార్లపై చర్యలు తీసుకుంటే విపక్షాలకు ఉలుకెందుకు? మన దేశానికి వలసదార్లు, చొరబాటుదార్లు అతిపెద్ద ముప్పుగా మారారు. ఈ సమస్య గురించి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించా. కొన్ని రాష్ట్రాల్లో జనాభా స్వరూపమే మారిపోతోంది. స్థానికులు మైనార్టీలుగా మారుతున్నారు. ఇది ఇకపై సాగడానికి వీల్లేదు. అందుకే డెమోగ్రఫీ మిషన్ ప్రారంభించాలని నిర్ణయించాం. కానీ, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదార్లను కాపాడేందుకు ప్రతిపక్షాలు ఆరాటపడుతున్నాయి.

చొరబాట్లను సహించే ప్రసక్తే లేదు: పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చొరబాటుదార్లను ప్రోత్సహిస్తోంది. కేవలం అధికారం దాహంతో దేశ భద్రతను పణంగా పెడుతోంది. చొరబాటుదార్లను గుర్తించి, వెనక్కి పంపించే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. చొరబాట్లను సహించే ప్రసక్తే లేదు. వారు మన దేశంలో తిష్ట వేస్తామంటే ఒప్పుకోం. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ తదితర పార్టీలు బుజ్జగింపు రాజకీయాలను నమ్ముకుంటున్నాయి. చొరబాటుదార్ల ఓట్లతో ఎన్నికల్లో నెగ్గాలని చూస్తున్నాయి. అక్రమంగా వచ్చినవారంతా దేశం విడిచి వెళ్లిపోవాల్సిందే. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇక ఇంటికి సాగనంపాలి".


పార్లమెంట్‌లోకి చొరబాటు యత్నం

యువకుడిని అదుపులోకి తీసుకున్న భద్రతా సిబ్బంది

న్యూఢిల్లీ: ఓ ఆగంతకుడు పార్లమెంట్ ఆవరణలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. నిచ్చెన సహాయంతో లోపలికి ప్రవేశించాడు. శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో రైల్ భవన్ వైపు నుంచి గోడ ఎక్కి పాత పార్లమెంట్ భవనం గరుడ ద్వారం వరకు చేరుకోగలిగాడు. కాంప్లెక్స్ లోపల మోహరించిన భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. అతడిని అదుపులోకి తీసుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. దుండగుడు ఉత్తరప్రదేశ్ నివాసి రామ్‌కుమార్ బింద్(20) అని, గుజరాత్‌లోని సూరత్‌లో ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడని అధికార వర్గాలు తెలిపాయి. అదుపులోకి తీసుకున్న సమయంలో అతను మానసికంగా బాధపడుతున్నట్లు తెలిసింది. తాను ఇంటికి వెళ్లాలనుకుంటున్నానని, పార్లమెంట్‌కు చేరుకునే ముందు రైల్వే స్టేషన్‌కు కూడా వెళ్లానని, కానీ రైలు ఎక్కలేకపోయానని విచారణలో చెప్పాడు. ప్రస్తుతం, పార్లమెంట్ భద్రతా విభాగం అతడిని ప్రశ్నిస్తోంది. ప్రాథమిక విచారణ పూర్తయిన తరువాత చొరబాటుదారుడిని స్థానిక పోలీసులకు విచారణ కోసం అప్పగిస్తామని అధికారులు తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన ఒక రోజు తర్వాత ఈ ఘటన జరిగింది. ఉల్లంఘన జరిగిన సమయంలో పార్లమెంటు సభ్యులెవరూ అక్కడ లేరు. ఈ ఘటన నేపథ్యంలో పార్లమెంట్ భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆయన నక్సలైట్ల మద్దతుదారుడు

- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సల్వాజుడుంకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు
- నక్సలైట్లకు మద్దతివ్వడానికి సుప్రీం కోర్టును వాడుకున్నారు
- వామపక్షాల ఒత్తిడి వల్లే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి
- కేంద్ర మంత్రి అమిత్ షా ఆగ్రహం



అమిత్ షా

కొచ్చీ/తిరునల్వేలి: నక్సలైట్లకు గట్టి మద్దతుదారుడైన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని విపక్ష 'ఇండియా' కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసుకుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తప్పుపట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లపై పోరాటానికి గిరిజన యువకులతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సల్వాజుడుం' చట్టవ్యతిరేకం, రాజ్యాంగ విరుద్ధం అంటూ 2011లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. శుక్రవారం కేరళలో ఓ కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడారు. నక్సలైట్ల ఉద్యమానికి మద్దతు ఇవ్వడానికి సుప్రీంకోర్టును జస్టిస్ సుదర్శన్ రెడ్డి వాడుకున్నారని ఆరోపించారు. ఆయన ఆ తీర్పు ఇవ్వకుంటే, సల్వాజుడుం అమల్లో ఉంటే నక్సలైట్ల ఉద్యమం 2020 నాటికే అంతమయ్యేదని అన్నారు. నక్సలైట్ల సిద్ధాంతంతో స్ఫూర్తి పొందిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సల్వాజుడుంకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారని మండిపడ్డారు. వామపక్షాల ఒత్తిడి మేరకే కాంగ్రెస్ పార్టీ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేసుకుందని ధ్వజమెత్తారు.

కేజ్రీవాల్ రాజీనామా చేసి ఉంటే...

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అప్పటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైల్లో ఉండగానే పదవికి రాజీనామా చేసి ఉంటే.. రాజ్యాంగ(130 సవరణ) బిల్లు–2025ను తీసుకురావాల్సిన అవసరం ఉండేది కాదని అమిత్ షా అన్నారు. 30 రోజులపాటు జైల్లో ఉన్న వారిని పదవుల నుంచి తొలగించే బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించడం సరైంది కాదని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలను అన్ని రాజకీయ పార్టీలూ పాటించాలని సూచించారు. ఏ ముఖ్యమంత్రి అయినా జైలులో ఉండి ప్రభుత్వాన్ని నడపాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారా? అని ప్రశ్నించారు. జైల్లో ఉంటూ కూడా పరిపాలన సాగిస్తారని మన రాజ్యాంగ రూపకర్తలు ఊహించలేదని, అందుకే ఈ అంశాన్ని రాజ్యాంగంలోని చేర్చలేదని స్పష్టంచేశారు. జైల్లో ఉన్న నేతలను పదవుల నుంచి తొలగించడంలో తప్పేమీ లేదన్నారు.

సోనియా, స్టాలిన్ కలలు నెరవేరవు

రాజ్యాంగ(130 సవరణ) బిల్లును 'నల్ల బిల్లు' అనే హక్కు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు లేదని అమిత్ షా తేల్చిచెప్పారు. శుక్రవారం తమిళనాడులోని తిరునల్వేలిలో బీజేపీ బూత్ కమిటీల సమావేశంలో ప్రసంగించారు. చీకటి పనులు చేసిన చరిత్ర స్టాలిన్‌కు ఉందన్నారు. డీఎంకే ప్రభుత్వం దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వమని ఆరోపించారు. స్టాలిన్ పాలనలో ఎన్నో కుంభకోణాలు జరిగాయని విమర్శించారు. కుమారుడు రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసుకోవడం సోనియా గాంధీ ఎజెండా, కుమారుడు ఉదయనిధి స్టాలిన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవడం స్టాలిన్ ఎజెండా అని దుయ్యబట్టారు. వారి కలలు నెరవేరే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. 2026లో తమిళనాడులో ఎన్డీయే అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడుకు చెందిన అబ్దుల్ కలాంను అప్పట్లో రాష్ట్రపతిని చేసింది, నేడు అదే తమిళనాడు బిడ్డ సీపీ రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేసింది ఎన్డీయే ప్రభుత్వమేనని వ్యాఖ్యానించారు.

ట్రంప్ మాజీ సలహాదారు బోల్టన్ ఇంట్లో సోదాలు



బోల్టన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ మొదటి సారిగా ఎన్నికైన సమయంలో 2018–19 సంవత్సరాల్లో జాతీయ భద్రతా సలహాదారుగా వ్యవహరించిన జాన్ బోల్టన్ నివాసంపై ఎఫ్‌బీఐ అధికారులు దాడులు జరిపారు. మేరీల్యాండ్‌లోని బెథెస్డాలో ఉన్న బోల్టన్ ఇంట్లో తనిఖీలు చేపట్టారు. ఈ విషయాన్ని ఎఫ్‌బీఐ అధికారులు ధ్రువీకరించారు. ఇతర వివరాలను మాత్రం వెల్లడించలేదు. రహస్య పత్రాలకు సంబంధించిన దర్యాప్తులో భాగంగానే సోదాలు చేపట్టినట్లు మీడియా అంటోంది. వాషింగ్టన్ డీసీలోని బోల్టన్ కార్యాలయంలోనూ సోదాలు జరిగాయని తెలిపింది. అప్పటి ట్రంప్ పాలనపై బోల్టన్ 2020లో ఒక పుస్తకం రాశారు. ఇందులో ట్రంప్ చర్యలను తీవ్రంగా తప్పుబట్టారు. పుస్తకంలోని పలు అంశాలను అధికార రహస్య పత్రాల ద్వారానే బోల్టన్ పొందినట్లు ట్రంప్ గతంలో విమర్శలు చేశారు. దాడులపై బోల్టన్ స్పందించలేదు. దాడుల విషయంతనకు తెలియదని అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం : 23 : ఆగస్టు : 2025


వినాయక చవితిని పురస్కరించుకొని చిక్కమగళూరులో శుక్రవారం భద్రతా బలగాల కవాతు

తొక్కిసలాటపై విపక్షాల వాకౌట్


చిన్నస్వామి స్టేడియం ఎదుట జరిగిన తొక్కిసలాటకు ఈ చిత్రం సజీవసాక్ష్యం


సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బనశంకరి: ఆర్‌సీబీ విజయోత్సవ సమయంలో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వం కారణం కాదని, దుర్ఘటనకు తమను బాధ్యులను చేయడం సరికాదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఇచ్చిన సమాధానంతో అసంతృప్తికి గురైన విపక్షాలు ఈ ఘటనపై ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పకపోవడం, తప్పు జరిగిందని తెలపకపోవడంపై శుక్రవారం సభలో ధర్నాకు దిగి సభ నుంచి వాకౌట్ చేశాయి. ఆర్‌సీబీ విజయోత్సవంలో తొక్కిసలాట దుర్ఘటనపై శాసనసభలో నిబంధన–69 ప్రకారం నిర్వహించిన చర్చకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య సుదీర్ఘ సమాధానం ఇచ్చారు. ఈ ఘటన జరగకుండా ఉండాల్సింది. ఈ దురంతంతో తనకు బాధగా ఉంది. ఘటనపై గతంలోనే విచారం వ్యక్తం చేశానని, ప్రస్తుతం కూడా విచారం వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం సరికాదంటే తొక్కిసలాట దుర్ఘటనకు సంబంధించి ప్రభుత్వం ఎవరిపై చర్యలు తీసుకుంది? ఏవిధంగా దర్యాప్తు చేపట్టింది? అనే విషయంపై వివరంగా సభలో సిద్దరామయ్య ప్రస్తావించారు.

ముఖ్యమంత్రి సమాధానం సంతృప్తిగా లేదు

ముఖ్యమంత్రి సమాధానం సంతృప్తికరంగా లేదని, సిద్దరామయ్య సమాధానం పరీక్షలో అతను ఫెయిల్ కావడాన్ని వదిలిపెట్టి మిగిలినవారు ఎందుకు ఫెయిల్ అయ్యారు? అనే దానిపై తంత్రికి చెప్పినట్లు ఉందన్నారు. ఆటోలో కూర్చుని ప్రపంచంలో సంచరిస్తున్నట్లు ఉందని, ముఖ్యమంత్రి సిద్దరామయ్య సరైన సమాధానం ఇవ్వలేదని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. స్టేడియంలో సంబరాలకు అనుమతి ఇవ్వడంలో జరిగిన వైఫల్యం గురించి మాట్లాడలేదని విపక్షనేత ఆర్.అశోక్ తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రచార యావతో ఈ దుర్ఘటన సంభవించిందన్నారు. 11 మంది అమాయక ప్రజలు మృతి చెందారని, ఇంత జరిగినా ముఖ్యమంత్రి తప్పు ఒప్పుకోలేదన్నారు. తప్పు ఒప్పుకుంటే గాంధీజీ తెలిపినట్లు పెద్ద మనిషి అవుతారని, దుర్ఘటనలో ప్రభుత్వ వైఫల్యం ఉన్నప్పటికీ ఒప్పుకోకుండా క్షమాపణ చెప్పని సిద్దరామయ్య చర్యను ఖండిస్తూ సభను బహిష్కరిస్తున్నామని తెలిపి విపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

భారం తగ్గించుకున్న సీఎం

అంతకు ముందు సిద్దరామయ్య ఆర్‌సీబీ విజయోత్సవ సమయంలో గత మే 4 తేదీన జరిగిన దుర్ఘటనపై సుదీర్ఘ సమాధానం ఇవ్వగా గురువారం హోం మంత్రి సభలో నిబంధన–69 కింద జరిగిన చర్చకు సమర్థవంతంగా సమాధానం తెలిపి తనపై ఉన్న భారం తగ్గించారు. సభలో మాట్లాడుతుండగా విపక్ష సభ్యులు తనను విమర్శించారని, బీజేపీ సభ్యుడు సురేశ్‌కుమార్ అబెటర్ అని పిలిచారని, అతను షేక్స్‌పియర్ నాటకంలో వచ్చే మార్క్ ఆంటోని రీతిలో మాట్లాడారని తెలిపారు. తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రికి మానవత్వం, హృదయం ఉంటే తప్పు జరిగిందని క్షమాపణ కోరాలని విపక్ష సభ్యులు తెలిపారు. ఈ ఘటన సంభవించిన రోజు నేను విచారం వ్యక్తం చేశానని, జరగరాని ఘటన సంభవించిందని, 42 ఏళ్లకు పైగా తన రాజకీయ జీవితంలో మొదటిసారి ఇలాంటి చేదు ఘటన జరిగిందని తెలిపానని, తనకు ఘటన పట్ల బాధగా ఉందని విచారం వ్యక్తం చేస్తున్నానన్నారు.

ఘటనపై రోజంతా డిస్టర్బ్ అయ్యా

ఘటన పట్ల రోజంతా డిస్టర్బ్ అయ్యానని సీఎం తెలిపారు. ఘటన గురించి తెలిసినా హోటల్‌కు దోసె తినడానికి వెళ్లానని అనడం తప్పు, నేను హోటల్‌కు వెళ్లింది నిజం. కానీ హోటల్‌లో నేను భోజనం చేసిన అనంతరం ఘటనపై న్యాయ సలహాదారులు సమాచారం ఇచ్చారని, ఆ సమయంలో పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి విచారించారన్నారు. అప్పుడు ఒక్కరే చనిపోయారని కమిషనర్ తెలిపారన్నారు. ఇది నిజమైన సంగతి, నాకు చాలా దుఃఖమైందని, చిన్నవయస్సులో పిల్లలు చనిపోవడం నాకు చాలా బాధ కలిగిందన్నారు. హోంమంత్రితో కలిసి ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించానని, అనంతరం బెంగళూరునగర జిల్లా కలెక్టర్ జగదీశ్ నేతృత్వంలో మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించానని తెలిపారు. అనంతరం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కున్హా నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసి నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని తెలిపానన్నారు. ప్రభుత్వాన్ని అబెటర్ అని పిలిచారని, ఘటనకు ప్రభుత్వ బాధ్యత ఉందా, లేదా? అనేది ప్రజలకు తెలుసు. అన్నింటికీ ప్రజలు సమాధానం చెబుతారని తెలిపారు.

న్యూస్‌రీల్

శోకసంద్రమైన రంజోళ గ్రామం

- హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి చేరిన మృతదేహాలు


మృతులు నరసింహ, వెంకటమ్మ, అనిల్, కవిత, అప్పు(ఫైల్)

దొడ్డబళ్లాపురం: కలబుర్గి జిల్లా సేడం తాలూకా రంజోళ గ్రామం శోకసంద్రలో మునిగిపోయింది. గ్రామానికి ఐదు మంది హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకోగా వారి మృతదేహాలు శుక్రవారం స్వగ్రామానికి చేరుకున్నాయి. నరసింహ(60), భార్య వెంకటమ్మ(55) వీరి కుమారుడు అనిల్(32), కుమార్తె కవిత(24), మనవడు అప్పు(2)లు హైదరాబాద్‌లోని మియాపూర్‌లో మృతిచెందారు. ఆర్థిక సమస్యలతో సామూహిక ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలుస్తోంది. అయితే వారి మృతిపై బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సమగ్రంగా దర్యాప్తు జరగాలని డిమాండ్ చేస్తున్నారు. మృత దేహాలకు గ్రామస్తులు చందాలు వేసుకుని దహనసంస్కారాలు నిర్వహించారు. పొట్టకూటి కోసం వెళ్లి విగతజీవులుగా వచ్చిన వారిని చూసి మృతుల బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

విచారణ కోసం ధర్మస్థలకు రాలేను

- పోలీసులకు సమీర్ లేఖ
- మరో కేసు నమోదు

శివాజీనగర: ధర్మస్థల గురించి అపప్రచారం చేసిన ఆరోపణల కేసులో అరెస్ట్ భయాన్ని ఎదుర్కొంటున్న యూట్యూబర్ సమీర్‌కు మంగళూరులో జిల్లా సెషన్స్ న్యాయస్థానం గురువారం ముందస్తు బెయిల్ ఇచ్చింది. ప్రస్తుతం సమీర్‌కు వ్యతిరేకంగా చిక్కమగళూరు జిల్లా కడూరు తాలూకా పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. అరెస్ట్ భయంతో ఉన్న యూట్యూబర్ ఎండీ.సమీర్ బెళ్తంగడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు లేఖ రాశాడు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌కు సంబంధించి లేఖ రాస్తున్నాను. తాను ధర్మస్థల స్టేషన్‌కు రావటానికి సాధ్యం. అయితే తన స్నేహితుడిపై ప్రాణాంతకమైన దాడి జరిగింది. టార్గెట్ చేసి యూట్యూబర్ స్నేహితుడిపై దాడి చేశారు. తనకు ప్రాణబెదిరింపు ఉంది. ప్రమాదముందని తెలుసుకొని తాను సెషన్ న్యాయస్థానంలో బెయిల్‌కు అప్లై చేశానని తెలిపారు. ఒకవేళ తాను ధర్మస్థల పోలీస్ స్టేషన్‌కు వస్తే తనకు భద్రత కల్పించండి. తాను కేసుకు సంబంధించి మీతో వీడియో కాల్ ద్వారా విచారణకు, అన్ని విధాలుగా తనిఖీకి సహకరిస్తాను. తనిఖీకి సహకరించేందుకు చిరునామా, తేదీ, తన భద్రత గురించి తెలియజేస్తే వస్తాను. 15 రోజుల గడువులోగా మీ ముందు హాజరవుతానని, దయచేసి తనకు భద్రత కల్పించాలని లేఖలో తెలియజేశారు.

బ్యాంక్ మేనేజర్ ఆత్మహత్య


ప్రకాశ్(ఫైల్)

బొమ్మనహళ్లి: ఆనేకల్ తాలూకా జిగణి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న హారగద్దె వి.ఎస్.ఎస్.ఎన్.బ్యాంకు మేనేజర్ ప్రకాశ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన కొన్ని సంవత్సరాలుగా మేనేజర్‌గా పనిచేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్నాడు. గురువారం సాయంత్రం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జిగణి పోలీసులు వెళ్లి పరిశీలించగా ఘటన స్థలంలో సూసైడ్ నోట్ లభ్యమైంది. కొంతమంది వ్యక్తులు తనను బెదిరించి అక్రమంగా రుణాలు తీసుకున్నారని, తిరిగి చెల్లించాలని కోరితే వేధింపులకు పాల్పడుతున్నారని, గత్యంతరం లేక ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రకాష్ అందులో పేర్కొన్నట్లు ఉందని పోలీసులు తెలిపారు. ఎవరెవరు అక్రమంగా రుణాలు తీసుకున్నారనే పేర్లు కూడా అందులో పేర్కొన్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

సుజాతభట్‌కు నోటీసులు

దొడ్డబళ్లాపురం: మెడికల్ విద్యార్థిని అనన్యభట్ అదృశ్యం కేసులో ఎస్ఐటీ అధికారులు సుజాతభట్‌కు నోటీసులు ఇచ్చారు. అనన్యభట్ తన కుమార్తె అంటూ సుజాతాభట్ ప్రచారం చేసుకుంటున్నారు. ఈక్రమంలో కేసును తీవ్రంగా పరిగణించిన సిట్ అధికారులు అనన్యభట్ గురించి వివరాలు ఇవ్వాలని, విచారణకు హాజరు కావాలని సుజాత భట్‌కు నోటీసులు ఇచ్చారు. తన కుమార్తె అనన్యభట్ కనబడకుండాపోయిందని గతనెల 15న సుజాతభట్ ధర్మస్థల పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రేషన్‌కు బయోమెట్రిక్ తప్పని సరి

యశవంతపుర: రాష్ట్రంలో రేషన్ కార్డుదారులు తప్పని సరిగా బయోమెట్రిక్ ద్వారానే రేషన్ పొందాలని రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప తెలిపారు. శుక్రవారం విధాన పరిషత్‌లో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలను నివారించేందుకు బయోమెట్రిక్ విధానం తప్పనిసరి చేసినట్లు మంత్రి వివరించారు. వృద్ధులు బయోమెట్రిక్ ఇవ్వటానికి సమస్యలుంటే ఐరిస్ స్కానర్ ద్వారా ఇవ్వవచ్చని ఆయన వివరించారు. బయోమెట్రిక్, ఐరిస్ ద్వారా రేషన్ పొందేందుకు సాధ్యం కానీ పక్షంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా అలాంటి వారికి రేషన్ పంపిణీ చేస్తామన్నారు.

యాక్సిడెంట్లు చేస్తే ఉద్యోగాల నుంచి తొలగింపు

యశవంతపుర: బెంగళూరు మహానగర రోడ్డు రావాణా (బీఎంటీసీ) సంస్థ పరిధిలో డ్రైవర్లు రెండు సార్లు ప్రమాదాలకు పాల్పడితే పనిలోంచి తొలగించాలని బీఎంటీసీ యాజమాన్యం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి బీఎంటీసీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలనే ఉద్దేశంతో ఈ అదేశాలను జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మొదటి సారి ప్రమాదానికి పాల్పడితే ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తారు. మళ్లీవారికి శిక్షణ ఇచ్చి విధులలోకి తీసుకుంటారు. రెండోసారి ప్రమాదాలకు కారణమైతే విధులనుంచి తొలగిస్తారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తెల్లవారుజామునే తలుపు తట్టిన ఈడీ

- చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర ఇళ్లు, కంపెనీలపై దాడులు



బనశంకరి/చెళ్లకెర రూరల్: గతంలో ఈడీ దాడులు ఎదుర్కొన్న చిత్రదుర్గ ఎమ్మెల్యే, నటుడు దొడ్డణ్ణ అల్లుడు కేసీ.వీరేంద్ర(పప్పి) ఇళ్లు, కంపెనీలపై మరోసారి ఈడీ పంజా విసిరింది. అక్రమ నగదు బదిలీ ఆరోపణలతో శుక్రవారం వేకువజామునే ఈడీ అధికారులు బెంగళూరు, చిత్రదుర్గతో పాటు 17 చోట్ల దాడులు నిర్వహించారు. బెంగళూరు, చెళ్లకెరె, చిత్రదుర్గ, గోవాతో పాటు 17 చోట్ల దాడులు చేసి సోదాలు చేపట్టిన ఈడీ అధికారులు ఫైళ్లను పరిశీలించారు. బెంగళూరు వసంతనగరలోని ఎమ్మెల్యే వీరేంద్ర ప్రైవేటు అపార్టుమెంట్, సహకారనగరలోని ఇళ్లపై దాడి చేశారు. చెళ్లకెరెలో ఎమ్మెల్యే నివాసంతో పాటు అతడి సోదరులైన కేసీ.నాగరాజ్ , కేసీ.తిప్పేస్వామి నివాసాల్లో 10 మంది ఈడీ అధికారుల సోదాలు చేపట్టారు. వీరేంద్ర యాజమాన్యంలో అనేక కంపెనీలను టార్గెట్‌గా చేసుకుని దాడి చేసిన ఈడీ అధికారులు రత్నా గేమింగ్ సొల్యూషన్స్, రత్నా గోల్డ్ కంపెనీ, రత్నా మల్టీస్టోర్స్ కంపెనీ, పప్పి టెక్నాలజీస్ కంపెనీ, పప్పి టూర్స్ అండ్ ట్రావెల్స్, పప్పి స్పేర్ బాక్స్ కంపెనీలపై దాడి చేశారు. ఎమ్మెల్యేకు చెందిన ఇళ్లలో కిలోకు పైగా బంగారం లభ్యమైంది. సిక్కిం పర్యటనలో ఉన్న వీరేంద్రను కోల్‌కతా ఈడీ బృందం అదుపులోకి తీసుకుని బెంగళూరుకు తీసుకు వస్తుండగా ఎలాంటి సమయంలోనైనా అరెస్ట్ చేసే అవకాశం ఉంది. చిత్రదుర్గ, చెళ్లకెరెలో గేమింగ్ యాప్‌నకు సంబంధించి నమోదైన ఫిర్యాదుల ఆధారంగా ఈడీ అధికారులు రంగంలోకి దిగినట్లు సమాచారం. గోవా రాజధాని పనాజీలో మెజిస్టిక్ ప్రైడ్ అనే క్యాసినో నిర్వహిస్తున్న హవాలా కుంభకోణం కింగ్‌పిన్ సుమందర్ సింగ్ హుబ్లీ దేశపాండే నగరలోని కామాక్షి అపార్టుమెంట్‌పై ఈడీ అధికారులు దాడి చేశారు. కర్ణాటక, గోవా, సిక్కింతో పాటు మొత్తం 17 చోట్ల ఒకే సారి ఈడీ అధికారులు దాడి చేసి కీలక ఫైళ్లు, పత్రాలు, బ్యాంక్ లావాదేవీలు, స్థిరచరాస్తుల ఆచూకీని కనిపెట్టారు. గతంలో 2016 డిసెంబరు 11 తేదీన కేసీ.వీరేంద్ర ఇంటిపై ఐటీ అధికారులు దాడి చేశారు. బాత్‌రూమ్‌లో రూ.5 కోట్లకు పైగా నగదు, 30 కిలోలకు పైగా బంగారం స్వాధీనం చేసుకున్నారు.



కాంగ్రెస్ నాయకురాలి ఇంటిలో..

2023 శాసనసభ ఎన్నికల్లో రాజరాజేశ్వరినగర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన కాంగ్రెస్ నాయకురాలు కుసుమా హనుమంతరాయప్ప ఇంటిపై ఈడీ అధికారులు దాడి చేశారు. వీరేంద్రపప్పితో ఆర్థిక వ్యవహారాలు కలిగి ఉన్న నేపథ్యంలో ఈడీ అధికారులు దాడులు నిర్వహించారు. అన్నపూర్ణేశ్వరి నగర ముద్దనపాళ్య నివాసం, చంద్రా లేఔట్‌లోని కార్యాలయంపై ఈడీ అధికారులు దాడి చేసి ఫైళ్లను పరిశీలించారు.

మండ్య జిల్లాలో షూటౌట్




కాల్పుల్లో గాయపడిన నిందితుడిని అస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

- దోపిడీదారులపై పోలీసుల కాల్పులు
- ఒకరికి గాయాలు
- ఐదుగురి అరెస్ట్

మండ్య: నగల దుకాణాన్ని లూటీ చేయడంతో పాటు వృద్ధుడిని హతమార్చిన ఉదంతంలో నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపి అరెస్ట్ చేశారు. ఈఘటన శుక్రవారం మళవళ్లి తాలూకా బీమనహళ్లిలో జరిగింది. మండ్య జిల్లా మళవళ్లి తాలూకా కిరుగావలులో మహాలక్ష్మి బంగారు నగల దుకాణం ఉంది. ఈనెల 16న రాత్రి దుండగులు గ్యాస్ కట్టర్‌తో షట్టర్ తొలగించి 110 గ్రాముల బంగారం, 2 కిలోల వెండి చోరీ చేశారు. అదే సమయంలో దుకాణం పక్కన హోటల్ నిర్వహిస్తున్న మహదేవప్ప(65) దొంగలను చూశాడు. తమ నేరాన్ని ఎక్కడ బయట పెడతాడోనని దుండగులు అతన్ని గొంతు నులిమి హత్య చేశారు. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులు భీమనహళ్లిలో తలదాచుకున్నట్లు పక్కా సమాచారంతో సీఐ శ్రీధర్ తన సిబ్బందితో కలిసి వెళ్లాడు. లొంగిపోవాలని హెచ్చరికలు చేయగా నిందితుల్లో ఒకరైన కిరణ్ చాకుతో పోలీసులపై ఎదురుదాడికి దిగారు. దీంతో సీఐ తన రివాల్వర్‌తో కాల్పులు జరపగా ఒక తూటా కిరణ్ కాలులోకి దూసుకెళ్లింది. గాయపడిన ఈచగెరె గ్రామానికి చెందిన నిందితుడు కిరణ్(24), కొత్తత్తి గ్రామానికి చెందిన ఆనంద్, శరత్, శ్రీనివాస్, కృష్ణాచారిని అరెస్ట్ చేశారు. కిరణ్‌ను మిమ్స్‌కు తరలించారు.

రాష్ట్రంలోనూ వన్ నేషన్- వన్ కార్డు

- డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్‌కు స్మార్ట్ కార్డుల పంపిణీ
- డీఎల్, ఆర్‌సీ కార్డుల్లో 'విధానసౌధ' ఔట్

శివాజీనగర: రాష్ట్రంలో వన్ నేషన్– వన్ కార్డు అమల్లోకి రానుండగా, సెప్టెంబర్ నెలాఖరు నుంచి డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్‌కు కొత్త హైటెక్ స్మార్ట్ కార్డుల పంపిణీ వ్యవస్థ అమల్లోకి రానుంది. ఇక డీఎల్, ఆర్‌సీ కార్డుల్లో విధానసౌధ కనుమరుగు కానుంది. అంటే ప్రస్తుతం పంపిణీ చేసే స్మార్ట్ కార్డుల్లో ఉన్న విధానసౌధ, కర్ణాటక చిహ్నం, త్రివర్ణ జెండా ఇవేవీ కొత్తగా పంపిణీ చేసే కార్డుల్లో ఉండవు. కర్ణాటకలో వన్ నేషన్– వన్ కార్డు అమలైన తరువాత కార్డు పైభాగంలో జాతీయ చిహ్నమైన అశోక్ స్తంభం మాత్రమే ఉంటుంది. విధానసౌధ ఉండదు. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన వన్ నేషన్– వన్ కార్డు పథకం కింద స్మార్ట్ కార్డు సరఫరా కానుంది. ఇప్పటి వరకు పంపిణీ చేసిన కార్డుల్లో ఆయా రాష్ట్రాల చిహ్నాలు, పరిపాలనా సౌధ ఫోటో తదితర ప్రత్యేకతలను ముద్రించేందుకు అవకాశం ఉండేది. ప్రస్తుతం వన్ నేషన్– వన్ కార్డు ప్రాజెక్టులో అటువంటి ప్రత్యేకతల ముద్రణకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించటం లేదు. జాతీయ చిహ్నంతో పాటు ఇండియన్ యూనియన్ డ్రైవింగ్ లైసెన్స్, ఇండియన్ యూనియన్ వెహికల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అని మాత్రం ఉంటుంది. ప్రస్తుతం ఇస్తున్న డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ కార్డులు పాలి విన్లైల్ క్లోరైడ్ అంటే పీవీసీ కార్డుతో ఉంటాయి. కొత్త పథకంలో పాలి కార్బనేట్ కార్డు అంటే పీసీసీ కార్డులను పంపిణీ చేస్తున్నారు. ఈ కార్డులు సెప్టెంబర్ ఆఖరుకు సిద్ధకానున్నాయి. అక్టోబర్ తొలి వారంలో ఈ కార్డులు ఆయా కార్యాలయాలకు చేరుకునే అవకాశముంది.

కొత్త ఆర్‌సీ కార్డుల్లో ఏముంటుంది?

- వాహనం రిజిస్ట్రేషన్ నెంబర్, తేదీ, ముగింపు కాలావధి
- చాసీ నెంబర్, ఇంజిన్ నంబర్
- యజమాని పేరు, చిరునామా, ఎమిషన్ వివరాలు
- ఏ వాహనం, తయారీ సంస్థ సమాచారం
- మాడల్ ఏడీ, రంగు, వాహనపు డిజైన్
- సీటింగ్, వాహన సామర్థ్యం, రుణ సదుపాయం కల్పించిన సంస్థ పేరు


కొత్త కార్డులో ప్రత్యేకతలు ఏమిటి?

- కార్డుపై ఉన్న అక్షరాలు శాశ్వతంగా ఉంటాయి. కార్డు విరిగిపోదు
- కేంద్రీకృత వ్యవస్థగా ఉండటంతో నకిలీ కార్డుల తయారీకి బ్రేక్ పడనుంది
- ఆర్‌టీఓ అధికారులు కార్డుల కోసం వేచి ఉండటం తప్పనుంది
- ప్రమాదం, దొంగతనం, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనల్లో పరిశీలనకు ఉపయోగకరం
- వాహనం, వాహన యజమానుల సమాచారం ధృడీకరణ సులభం కానుంది

గణపతికి తుది రూపు


వినాయక చవితి సందర్భంగా వైవిధ్యమైన గణపయ్యలను సిద్ధం చేస్తున్నారు. శుక్రవారం చిక్కమగళూరులో గణేష్ ప్రతిమకు తుదిరూపు ఇస్తున్న కళాకారుడు

నేటి నుంచి యూత్ ఫొటోగ్రఫీ


గోల్డెన్‌లైట్ చాయాచిత్రం

బనశంకరి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నేటి నుంచి బెంగళూరులోని చిత్రకళా పరిషత్‌లో యూత్ ఫొటోగ్రఫిక్‌సొసైటీ ఆధ్వర్యంలో ఛాయాచిత్ర ప్రదర్శన శనివారం నుంచి నగరవాసులను సందడి చేయనుంది. ఫొటోగ్రఫీపై ఆసక్తి కలిగిన ఔత్సాహికులు తమ ప్రతిభ కనబరచడానికి జాతీయ, అంతర్జాతీయ వేదికలో గుర్తింపు పొందడానికి ఆ సంస్థ ఈ వేదికను ఏర్పాటు చేసింది. యూత్ ఫొటోగ్రఫిక్ సభ్యులు తమ కెమెరాల్లో బంధించిన పనోరమ ఛాయాచిత్రాలను ప్రదర్శన ఉంటుంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు కాన్వాస్ ఛాయాచిత్రాల ప్రదర్శన. ఫోటోబూత్–కుటుంబ చిత్రాలను తీసి ఫ్రేమింగ్ చేసే అవకాశం, షూట్, షేర్ అండ్ విన్, క్రీడా స్థలాల్లో కెమెరా, మొబైల్ వినియోగించి తీసిన చిత్రాలను ప్రదర్శించి బహుమతులు గెలుపొందవచ్చు. ప్రతి ఒక్కరూ హాజరుకావచ్చని సంస్థ అధ్యక్షుడు మంజు వికాస్ శాస్త్రి, గిరీశ్‌అనంత మూర్తి,ప్రేమ్‌కాకడే తెలిపారు.

పోరుబాట


ఏడో వేతన సంఘం ద్వారా సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం బెంగళూరులోని ఫ్రీడం పార్కులో ధర్నా నిర్వహించారు.



ఉద్యోగాల నుంచి అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగులు శుక్రవారం ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో బెంగళూరులోని ఫ్రీడం పార్కులో ధర్నా చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

చిన్నారిపై లైంగిక దాడి.. నిందితుడి అరెస్ట్


పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుడు

కెలమంగలం: ఇంటి ముందు ఆడుకొంటున్న ఐదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన నిందితున్ని డెంకణీకోట మహిళా పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు.. డెంకణీకోట తాలూకా అగళకోట సమీపంలో నిర్వహిస్తున్న నర్సరీలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కొంత మంది కూలీలుగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అదే నర్సరీలో పని చేస్తున్న కూలికార్మికుడు జితేంద్ర(30) శుక్రవారం మధ్యాహ్నం ఇంటి ముందు ఆడుకొంటున్న ఐదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయడంతో ఇంటికి చేరుకొన్న బాలిక తండ్రి విచారించి డెంకణీకోట మహిళా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితున్ని అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేశారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు వీరే

చింతామణి: తాలూకాలోని కురుటహళ్లిలో ఇటీవల జరిగిన తాలూకా స్థాయి ఖోఖో పోటీల్లో తాలూకాలోని కైవారంలో శ్రీ కీర్తన ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు యాజమాన్యం తెలిపింది.

సందడిగా హస్తకళా మేళా


దేవతా విగ్రహాలు, పూజాసామగ్రి

బొమ్మనహళ్లి: గౌరీ గణేశ పండుగ సందర్భంగా బెంగళూరు నగరంలోని ప్రసిద్ధి చెందిన కర్ణాటక చిత్ర కళాపరిషత్‌లో కళా, హస్తకళలు, చేనేత, జీవనశైలి, వస్తువుల ప్రదర్శన, విక్రయించే మీనాబజార్ ఉత్సవాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకు బెంగళూరు నగర ప్రజల కోసం అందుబాటులో ఉంటుందని మీనా బజార్ నిర్వాహకులు తెలిపారు. ఈ హస్తకళామేళ వస్తు ప్రదర్శనను ప్రఖ్యాత వీడియో కంటెంట్ సృష్టికర్త సంతోషి మేఘరాజ్ ప్రారంభించడంతోపాటు అక్కడ ఉన్న వస్తువులను చూసి సందడి చేశారు. గాజులు, చెవిపోగులు, ఫ్యాన్సీ ఆభరణాలు, వివిధ రకాల పాదరక్షలు, రోజు అవసరాలకు వినియోగించే రుచికరమైన స్వీట్లు, పిల్లలకు ఇష్టమైన రకరకాల బొమ్మలు, పరిమళాలు వెదజల్లే ద్రవ్యాలు అందుబాటులో ఉన్నాయి.

తగ్గని వరద ప్రవాహం

- వాగులు, వంతెనలపై ప్రవహిస్తున్న నీరు
- నారాయణ పుర డ్యాం నుంచి 2.65 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన


లక్ష్మీ నరసింహ ఆలయం చుట్టుముట్టిన నీరు


నారాయణ పుర డ్యాం గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న నీరు

రాయచూరు రూరల్: కర్ణాటక ఎగువ భాగంలో నదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. ఉత్తర, కళ్యాణ కర్ణాటకలో బెళగావి, విజయపుర, బాగల్ కోట, కలబుర్గి, యాదగిరి, రాయచూరు జిల్లాల్లో వరద ప్రవహిస్తోంది. శనివారం నారాయణ పుర డ్యాం నుంచి 2.65 లక్షల క్యూసెక్కుల నీటిని వదలారు. దేవదుర్గ తాలూకా కోప్పర రహదారి పూర్తిగా కొట్టుకుని పోయింది. దేవదుర్గ తాలుకా హువిన హడగలి, శహపూర తాలుకా కోళూరు వంతెనపై వరద నీరు ప్రవహించడంతో కలబుర్గికి రాకపోకలు స్థంభింపజేశారు. ప్రవాహ పరిస్థితిపై జిల్లాధికారి నీతిష్ అధికారులతో చర్చించారు. యాదగిరి జిల్లా సురుపురలో జిల్లాధికారి హరీష బోయర్, ఎస్పీ పృథ్వీ శంకర్ పరిశీలించారు. హువిన హడగలి వద్ద బసవేశ్వర దేవాలయం నీటి మునిగింది. తుంగభద్ర, కృష్ణా నది తీర ప్రాంతాల్లోకి నీటి ప్రవాహం రావడంతో ప్రజలను అప్రమత్తం చేసేందుకు అధికారులు సహకరించాలని జిల్లాధికారి నీతిష్ సూచించారు. శుక్రవారం కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు ఇచ్చారు. తుంగభద్ర తీరంలో మాన్వి, రాయచూరు, గిల్లేసూగురు, కృష్ణా నది తీరంలో దేవసూరు, దోంగ రాంపూర్, అత్కూర్, బూడిద పాడు, నారద గడ్డ దత్తాత్రేయ దేవాలయం ప్రాంతాల ప్రజల రక్షణకు ముందుండాలని సూచించారు.

బెంగళూరు వాహన చోదకులకు తీపి కబురు...!

- 50 శాతం రాయితీతో జరిమానా చెల్లింపునకు అవకాశం

శివాజీనగర: వాహన చోదకులకు నగర ట్రాఫిక్ పోలీసులు తీపి కబురు అందించారు. పలు సంవత్సరాల నుంచి ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలకు జరిమానా చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచిన వారికి మరోసారి రాయితీ ప్రకటించారు. జరిమానాలో 50 శాతం రాయితీ ఇచ్చారు. పోలీస్ శాఖలో ట్రాఫిక్ ఈ-చలానాల్లో నమోదైన కేసులకు మాత్రం అన్వయించేలా పెండింగ్ కేసుల జరిమానా మొత్తంలో 50 శాతం రాయితీనిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ రాయితీ శనివారం నుంచి సెప్టెంబర్ 12 వరకు 50 శాతం మాత్రమే జరిమానా చెల్లించేలా సూచించారు. ఈ రాయితీ 2023 ఫిబ్రవరి 11లోగా పరిష్కరించుకునే కేసులకు మాత్రమే అన్వయిస్తుందని వెల్లడించారు.

రోడ్డు రోలర్ కింద పడి మహిళ మృతి

శ్రీనివాసపురం : రోడ్డు రోలర్ కింద పడి ఓ మహిళ మరణించిన ఘటన తాలూకాలోని రోణూరు చెరువు కట్టపై చోటు చేసుకుంది. దింబాల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ (55) మృతురాలు. రోణూరు నుంచి దింబాల గ్రామం వరకు జరుగుతున్న రోడ్డు పనుల్లో ప్రమాదవశాత్తు లక్ష్మమ్మ రోడ్డు రోలర్ కింద పడి మరణించింది. ఘటనపై శ్రీనివాసపురం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సెప్టెంబర్‌లో ఫైనల్ పోటీలు

చిక్కబళ్లాపురం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా ప్రోత్సాహం కల్పించడానికి ఈశా ఫౌండేషన్ నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో భాగంగా ఫైనల్ పోటీలు సెప్టెంబర్21న కొయంబత్తూరులో జరుగుతాయి. ఈమేరకు ఆ ఫౌండేషన్ స్వయం సేవా సంఘం సేవకులు రాఘవేంద్ర శుక్రవారం తెలిపారు. చిక్కబళ్లాపురం, కోలారు, బెంగళూరు గ్రామీణ, తుమకూరు, శివమొగ్గతోపాటు 18 జిల్లాల్లో పోటీలు జరుగుతున్నాయన్నారు.

హెచ్‌డీకోటె ఆలయాల్లో వరుస చోరీలు


పట్టదమ్మ ఆలయ గేట్‌ను తెరిచిన దృశ్యం

మైసూరు : మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె పట్టణంలోని 16వ వార్డులో ఉన్న ప్రసిద్ధ శ్రీశనేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. దుండగులు శుక్రవారం వేకువజామున తలుపులు బద్దలుకొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయంలోకి చొరబడ్డారు. అక్కడ ఏమీ లభించకపోవడంతో పట్టదమ్మ ఆలయంలోకి చొరబడి అక్కడి హుండీని ఎత్తుకెళ్లారు. గర్భగుడిలోకి చొరబడేందుకు విఫలయత్నం చేశారు. శుక్రవారం ఉదయం అర్చకులు గుర్తించి చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రుణాలు ఇవ్వాలని ధర్నా


డీసీసీ బ్యాంకు ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

కోలారు : సకాలంలో రుణాలు తిరిగి చెల్లించిన రైతు కూలికార్మికులు, స్త్రీశక్తి సంఘాలకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నగరంలోని డీసీసీ బ్యాంకు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు నుంచి రైతులు, కూలికార్మికులు, స్త్రీశక్తి సంఘాలకు రుణాలు విరివిగా ఇచ్చి ఆదుకోవాలన్నారు. ధర్నాలో జిల్లా మహిళా అధ్యక్షురాలు ఏ.నళిని గౌడ, జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, మరగల్ శ్రీనివాస్, అంజినప్ప, గిరిష్, వెంకటేశప్ప, కుప్పణ్ణ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు బాను ముస్తాక్‌కు ఆహ్వానం


బుకర్ ప్రశస్తి గ్రహీత బాను ముస్తాక్

యశవంతపుర: విశ్వవిఖ్యాత మైసూరు దసరా-2025కు ముస్తాబవుతోంది. వచ్చే నెల 22న మైసూరు దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మైసూరు దసరా ఉత్సవాల ప్రారంభానికి ఈ సారి బుకర్ ప్రశస్తి గ్రహీత, కన్నడ రచయిత బాను ముస్తాక్‌ను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని శుక్రవారం బెంగళూరులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. ఆమె రచించిన హృదయ దీప కృతికి బుకర్ ప్రశస్తి లభించింది. కర్ణాటకకు చెందిన మహిళకు బుకర్ ప్రశస్తి లభించటం గర్వకారణమని తెలిపారు. రైతు, కన్నడ పోరాటాల ద్వారా ఆమె అనేక రచనలు చేశారు. మహిళను దసరా ఉత్సవాల ప్రారంభోత్సవాలకు ఆహ్వానించటం ఎంతో ఆనందంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ఈ సారి దసరా ఉత్సవాలు సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు 11 రోజుల పాటు జరుగుతాయని సీఎం వివరించారు.

ఎస్సీ కులాలను పరిగణనలోకి తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాగేశ్వర్‌రావు బృందం

బనశంకరి: రాష్ట్ర వెనుకబడిన వర్గాల కమిషన్ ఎస్సీ జాబితాలో ఉన్న 101 కులాల గణన చేపట్టాలని కర్ణాటక మాల మహాసభ విజ్ఞప్తిచేసింది. శుక్రవారం ఆ మహాసభ అధ్యక్షుడు ఎల్.నాగేశ్వర్‌రావు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం వెనుకబడిన వర్గాల శాఖ కమిషనర్ దయానంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కులగణనను ఎస్సీ, ఎస్టీకులాలను వర్తింపచేయాలని కోరారు. ఉపాధ్యక్షుడు సిద్దంనారయ్య, సాదురాఘవేంద్ర, కార్యదర్శి గంధం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో శ్రీనివాస కల్యాణం


రీన్యా శెట్టి నృత్య ప్రదర్శన

బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లి నియోజకవర్గం హెచ్ఎస్ఆర్ లేఔట్ అటల్‌బిహారి వాజ్‌పాయ్ క్రీడా మైదానంలో శనివారం శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు కల్యాణోత్సవ సమితి సభ్యులు తెలిపారు. కాగా శుక్రవారం శ్రీసప్తగిరి భజనమండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. శేషాద్రి భజన మండలి, విమల వెంకటేశ్వర ఆధ్వర్యంలో భక్తిగేయాలు ఆలపించారు. కుమారి రీన్యా శెట్టి భరతనాట్య ప్రదర్శన, టీం హెచ్ఎస్ఆర్ ఆధ్వర్యంలో మహిళల కోలాటం ఆకట్టుకుంది.

భూముల కబ్జాలో మంత్రి కుటుంబం


మాట్లాడుతున్న చంజిమలై మునేష్

కోలారు : తాలూకాలోని గరుడనపాళ్య సమీపంలో మంత్రి కృష్ణబైరేగౌడ కుటుంబం ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుందని, ఆ ఆక్రమణలను తొలగించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఫిర్యాదు చేశామని సామాజిక కార్యకర్త చంజిమలై డి మునేష్ తెలిపారు. శుక్రవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కృష్ణబైరేగౌడ మంత్రివర్గంలో ఉండడం వల్ల అతనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. శాసనసభ సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రస్తావించాలనే ఉద్దేశంతో ఫిర్యాదు చేశామన్నారు. సర్వే నెంబర్-10, 48లో చెరువు, రాజకాలువ, చెరువు చుట్టూ మట్టిని మంత్రి ప్రతి ప్రగతి పరిశీలన సమావేశంలోను ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపుపై అధికారుల నుంచి సమచారం సేకరిస్తారు. మొదలు తమ సంబంధీకులు ఆక్రమించుకున్న స్థలాలను తిరిగి వాపసు చేసి ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణల విషయంలో పేదలకో న్యాయం, బలాఢ్యులకో న్యాయాన్ని అధికారులు పాటించడం సరి కాదన్నారు. మాలూరు తాలూకాలో గతంలో ప్రభుత్వ భూమిని అనర్హులకు మంజూరు చేసిన విషయం రుజువైంది. 19 మందిపై క్రిమినల్ కేసులు దాఖలు చేయాలని రీజినల్ కమిషనర్ ఆదేశించినా అక్కడి తహసీల్దార్ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమంగా మంజూరు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

హోసూరు వార్తలు...

‘మీతో ముఖ్యమంత్రి ప్రత్యేక శిబిరం’లో అర్జీల స్వీకరణ


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్

కెలమంగలం: తమిళనాడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మీతో ముఖ్యమంత్రి పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలను నిర్వహించి ప్రజా సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించి తక్షణ పరిష్కారం కల్పిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం డెంకణీకోట తేరుపేటలోని సప్తగిరి మహాల్లో జరిగిన కార్యక్రమానికి డెంకణీకోట పట్టణ పంచాయతీ అధ్యక్షులు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ పాల్గొని ఆరోగ్య శాఖ ద్వారా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. పట్టణ పంచాయతీలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత శాఖాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కెలమంగలం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి రాజేష్‌కుమార్, పట్టణ పంచాయతీ కార్యనిర్వహణాధికారి మంజునాథ్, కౌన్సిలర్ చెన్నీరప్ప, అధికారి దేవరాజ్, యల్లప్ప, శక్తివేల్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

హోసూరు: రైతుపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని నల్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సర్జాపుర ప్రాంతానికి చెందిన రైతు మోహన్‌కుమార్(32), హోసూరు తాలూకా నల్లూరు అగ్రహారం గ్రామానికి చెందిన బంధువు సోమశేఖరరెడ్డి(47) మధ్య ఆస్తి తగాదాలుండేవి. ఈనెల 20వ తేదీ వీరి మధ్య గొడవ జరిగింది. ఓ దశలో సోమశేఖరరెడ్డి వేటకొడవలితో దాడి చేయగా మోహన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని హోసూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నల్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి సోమశేఖరరెడ్డిని అరెస్ట్ చేశారు.

వాహనాలు ఢీకొని ఇద్దరు పాదచారుల మృతి

హోసూరు: హోసూరు సిప్‌కాట్, హడ్కో పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వివరాల మేరకు హోసూరు పారిశ్రామికవాడ మూకొండపల్లి ప్రాంతంలో గురువారం రాత్రి 35 ఏళ్ల వ్యక్తి కాలినడకన వెళ్తుండగా ఆటో ఢీకొంది. తీవ్ర గాయపడిన ఆ బాటసారి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సిప్‌కాట్ పోలీసులు శవాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడు ఏ ప్రాంతవాసి అనేది తెలియాల్సి ఉంది. అదేవిధంగా హోసూరు- క్రిష్ణగిరి జాతీయ రహదారి పేరండపల్లి వద్ద 40 ఏళ్ల వ్యక్తి రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తుండగా అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడి ఆయన ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. హడ్కో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు


ఆందోళనకారులతో చర్చిస్తున్న పోలీసులు, అధికారులు

కెలమంగలం: తాగునీటికి కటకట ఏర్పడటం, అధికారులు పట్టించుకోకపోవడంతో డెంకణీకోట తాలూకాలోని కుందుకోట గ్రామస్తులు శుక్రవారం ఖాళీ బిందెలతో డెంకణీకోట - అంచెట్టి రోడ్డుపై బైటాయించి ఆందోళన నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో 500కు పైగా కుటుంబాలు ఉన్నాయన్నారు. బోరుబావి నుంచి ఓవర్ ట్యాంక్‌కు నీటిని పంప్ చేసి కొళాయిలకు నీటిని పంప్ చేస్తున్నారన్నారు. వారం రోజుల క్రితం విద్యుత్ మోటర్ చెడిపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. గత్యంతరం లేక డబ్బు పెట్టి నీటిని కొనుగోలు చేస్తున్నామన్నారు. మోటర్‌కు మరమ్మతు చేయించాలని పంచాయతీ యంత్రాంగాన్ని కోరుతున్నా పట్టించుకోలేదన్నారు. కాగా గ్రామస్తులు ఆందోళన చేస్తుండగా డెంకణీకోట పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని వారితో చర్చించారు. వెంటనే చర్యలు చేపట్టి తాగునీటి సమస్య తీరుస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి : సూళగిరి తాలూకా అత్తిముగం సమీపంలో నెలకొన్న చారిత్రక ప్రసిద్ధి పొందిన ఐరాధీశ్వర ఆలయ నిర్మాణానికి శుక్రవారం తమిళనాడు రాష్ట్ర ముఖ్యమత్రి ఎం.కే. స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అత్తిముగం సమీపంలో వెయ్యేళ్ల చరిత్ర ఉన్న ప్రస్తుతం పరామర్శ లేక శిథిలావస్థకు చేరుకొన్న ఆలయాన్ని పునఃనిర్మాణానికి దేవదాయ శాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా శిథిలావస్థకు చేరుకొన్న ఆలయాన్ని ఉల్లంఘించి కొత్తగా నిర్మించేందుకు రూ.1.31 కోట్ల నిధులను మంజూరు చేసింది. జిల్లాధికారి దినేష్‌కుమార్, దేవదాయ శాఖాధికారి రాముజేల్, కార్యనిర్వహణాధికారి చిన్నస్వామి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ రోటవేటర్‌కు చిక్కి కొండచిలువ మృతి


చనిపోయిన కొండచిలువతో గ్రామస్తులు

కోలారు : ట్రాక్టర్‌తో దున్నుతుండగా రోటవేటర్‌కు చిక్కి కొండచిలువ మరణించిన ఘటన తాలూకాలోని హెచ్.మల్లండహళ్లిలో జరిగింది. దేవరాజ్ అనే రైతు పొలంలో కొత్తిమీర సాగుకు రోటవేటర్‌తో భూమిని దున్నుతుండగా దానికి చిక్కి కొండచిలువ తీవ్రంగా గాయపడింది. వెంటనే గ్రామస్తులు స్నేక్ ఆనంద్‌కు సమాచారం ఇచ్చారు. అయితే తీవ్రంగా గాయపడిన కొండచిలువ అంతలోనే మరణించింది. విషయం తెలిసి అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. 4 ఏళ్ల వయస్సు, 10 అడుగుల పొడవు కలిగిన కొండచిలువను అటవీ సిబ్బంది, గ్రామస్తులు పూడ్చిపెట్టారు.

కంకర టిప్పర్లు స్వాధీనం

హోసూరు: క్రిష్ణగిరి జిల్లాలో అక్రమంగా కంకర, ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు దాడి చేసి నాలుగు టిప్పర్లు స్వాధీనపరుచుకున్నారు. జిల్లా ఎస్పీ తంగదురై ఆదేశాల మేరకు క్రిష్ణగిరి కేఆర్‌పీ డ్యాం పోలీసులు దేవసముద్రం రోడ్డులో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ మార్గంలో వచ్చిన టిప్పర్‌ను తనిఖీ కోసం ఆపగా డ్రైవర్ ఉడాయించాడు. అక్రమంగా కంకర, ఇసుక తరలిస్తున్నట్లు తేలడంతో వాహనం స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా సూళగిరి, ఊత్తంగేరి, మత్తూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో తనిఖీలు చేపట్టి మూడు టిప్పర్లు స్వాధీనం చేసుకున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు : తాలూకాలోని చిక్కతిరుపతి శ్రీప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయం వద్ద రూ.10 లక్షల వ్యయంతో కూడిన అభివృద్ధి కార్యక్రమాలను శుక్రవారం ఎమ్మెల్యే కె వై నంజేగౌడ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చిక్కతిరుపతి జీపీ నుంచి దేవాలయ రాజగోపురం ముందు రూ.10 లక్షల వ్యయంతో వేస్తున్న టైల్స్ వల్ల భక్తులకు అనుకూలం అవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద తిరుపతి ప్రఖ్యాతి గాంచినట్లుగానే చిక్కతిరుపతి దేవాలయం తాలూకాలో ఎంతో ప్రసిద్ధి పొందిందన్నారు.ఈ ఆలయానికి ప్రతినిత్యం రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారు. పండుగ పర్వ దినాలలో లక్షల సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. భక్తులకు సకల సౌలభ్యాలను కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తుల తాకిడికి అనుగుణంగా దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇళ్లలో శుభకార్యాలు జరుగుతున్న సమయంలో వారు మొదలు చిక్కతిరుపతికి వచ్చి స్వామి వారి ఆశీర్వాదం పొంది వెళుతుంటారు. ఈ విధంగా దేవాలయం ఎంతో ప్రఖ్యాతి గాంచిందన్నారు. రాబోయే రోజుల్లో దేవాలయాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామమూర్తి, రాష్ట్ర రెడ్డి జనసంఘం డైరెక్టర్ ఎంఎ కృష్ణారెడ్డి, టీపీ మాజీ స్థాయి సమితి అధ్యక్షుడు వి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కోలారు సమాచారం

కేంద్ర గ్రంథాలయం తనిఖీ


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కోలారు : నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లాధికారి డాక్టర్ ఎంఆర్ రవి సందర్శించారు. గ్రంథాలయంలోని రీడింగ్ రూం, పుస్తకాల గదులను పరిశీలించారు. గ్రంథాలయంలో లభిస్తున్న సౌకర్యాల గురించి పాఠకులను ఆరా తీశారు. పోటీ పరీక్షలను రాసే విద్యార్థులు గ్రంథాలయంలో లభించే పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో అంబేడ్కర్ కేంద్రాన్ని ప్రారంభించడానికి స్థలం గుర్తించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్తులో పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి గాను మరిన్ని పుస్తకాలను తెప్పిస్తామన్నారు. గ్రంథాలయానికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ అధికారి ఎన్.గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమిత నగరసభ స్థలం స్వాధీనం


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కోలారు : నగరంలోని ఖాద్రిపుర సమీపంలోని 6.1 ఎకరాల నగరసభ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసి నగరసభ అధికారులు శుక్రవారం స్థలానికి వెళ్లి ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. నగరసభ స్థలానికి అధికారులు రెండు నెలల క్రితం కంచె వేసి భద్రపరిచారు. అయితే ఈ మధ్య కొంతమంది కోర్టుకు వెళ్లామని ఆ స్థలంలో నామఫలకం వేశారు. నగరసభ అమర్చిన బోర్డును తొలగించి బెంగళూరు కోర్టులో దావా ఉందని తెలిపి మరో నామఫలకాన్ని ఉంచారు. దీనిని కొందరు నగరసభ దృష్టికి తేవడంతో కమిషనర్ నవీన్‌చంద్ర, అధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ సిబ్బందితో స్థలానికి వెళ్లారు. ఆక్రమణలను, ఆక్రమణదారులు వేసిన నామఫలకాలను తొలగించారు. ఆ సమయంలో అక్కడికి చేరిన కొంతమంది ఈ స్థలం తమదని గొడవ చేశారు. మొదలు రికార్డులు తీసుకు రమ్మని, తరువాత పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. స్థలం వద్ద ట్రెంచ్ నిర్మించడానికి తెచ్చిన జేసీబీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరసభ కమిషనర్ నవీన్‌చంద్ర మాట్లాడుతూ నగరసభకు చెందిన ఈ స్థలంలో వసతి రహితులకు ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు మరమ్మతు చేయాలని 25న ధర్నా


మాట్లాడుతున్న రైతు సంఘం పదాధికారులు

కోలారు : జిల్లాలో అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న కోలారు- శ్రీనివాసపురం రహదారిలో వీరాపుర గేట్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ తెలిపారు. శుక్రవారం నగరంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రహదారులు అధ్వాన స్థితిలో ఉండడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతుండటంతో యువకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అమాయకుల ప్రాణాలు బలైపోతున్నాయన్నారు. కాంట్రాక్టర్లు రహదారులను నాణ్యత లేకుండా నిర్మిస్తుండడం వల్ల నిర్మించిన కొద్ది రోజులకే అవి గుంతలు పడుతున్నాయన్నారు. ఎంతో మంది యువకులు ప్రాణాలు కోల్పోగా మరెంతో మంది కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్నారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల బాధ్యతారాహిత్యం వల్లే ఇదంతా జరుగుతోందన్నారు. వర్షం వస్తే గుంతల్లో నీరు నిలిచి మరింత ప్రమాదకరంగా మారుతోందన్నారు. అధికారుల కళ్లు తెరిపించడం కోసం ధర్నా చేస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, రాష్ట్ర సంచాలకుడు బంగవాది నాగరాజు, తేర్నహళ్లి అంజినప్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిందితుల అరెస్ట్ కోసం ధర్నా



ధర్నా చేస్తున్న కార్యకర్తలు

మైసూరు: ధర్మస్థలపై తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయడం తోపాటు కఠినంగా శిక్షించాలని కృష్ణరాజ, చామరాజ నియోజకవర్గ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కృష్ణరాజ నియోజకవర్గ పరిధిలోని కువెంపు నగరలోని ఆంజనేయ స్వామి ఆలయం ముందు శుక్రవారం ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాలో పాల్గొన్న మాజీ మేయర్ శివకుమార్ మాట్లాడుతూ ధర్మస్థల ధర్మాధికారిపై తప్పడు ఆరోపణలు చేయడంతోపాటు ధర్మస్థల పవిత్రతను దెబ్బతీశారన్నారు. బాధ్యులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కారులో సంచరిస్తూ దోపిడీలు

మండ్య: కారులో సంచరిస్తూ దారిదోపిడీలకు పాల్పడుతున్న ముఠా కటకటాల పాలైంది. బెంగళూరులోని శ్రీనగరలో నివాసం ఉంటున్న ఎస్.కుమార(26), రామనగర జిల్లా ఎస్.ఎం.హళ్లి నివాసి నాగరాజు (27), రామ నగర టౌన్‌కు చెందిన నరసింహ(25)ను నాగమంగళ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.15.70 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. మోపెడ్‌లో వెళ్తున్న వారిని నిందితులు అడ్డగించి 40 గ్రాముల బంగారు నగలు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు గాలింపు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు.

గడ్కరీతో కుమార భేటీ



కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన కుమారస్వామి

మండ్య: మండ్య పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో గతంలో, ప్రస్తుతం చేపడుతున్న జాతీయ రహదారుల పథకాల అమలు విషయంపై కేంద్ర మంత్రి హెచ్.డీ.కుమారస్వామి కేంద్ర ఉపరితల రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి చర్చించారు. గడ్కరీ నివాసానికి తన శాఖ అధికారులతో కలిసి వెళ్లిన కేంద్ర మంత్రి హెచ్.డీ.కుమార స్వామి గడ్కరీని కలిసి మండ్య జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులతోపాటు రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన జాతీయ రహదారుల అభివృద్ధి పనుల గురించి చర్చలు జరిపారు.

జానపద కళాకారులకు ప్రభుత్వ సౌలభ్యాలు



హాజరైన కళాకారులు

గౌరిబిదనూరు: జానపద కళాకారులు అసంఘటిత కార్మికుల భద్రతా పథకం కింద పేర్లను నమోదు చేసుకొని ప్రభుత్వ సౌలభ్యాలు పొందాలని జానపద అకాడమీ ప్రశస్తి పొందిన గొట్లగుంటె వెంకటరమణప్ప సూచించారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో గొట్లగుంటె గ్రామీణ యువకళా సంఘం ఆధ్వర్యంలో సహాయహస్తం పథకం కింద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని స్మార్ట్ కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. కళాకారులు ప్రదర్శనల కోసం ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వెళ్లినప్పుడు ప్రమాదాలు జరిగితే ఈ పథకం కింద ఆర్థికసహాయం అందుతుందన్నారు. తాలూకాలో సుమారు వెయ్యి మంది జానపద కళాకారులున్నారని వారందరూ స్మార్ట్ కార్డులు తీసుకోవాలన్నారు. కార్మిక శాఖ అధికారి సతీష్ పాల్గొన్నారు.

24న బృహత్ ఉద్యోగ మేళా



మాట్లాడుతున్న శివశంకరరెడ్డి

గౌరిబిదనూరు: తాలూకాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ నెల 24 పట్టణంలోని అంబేడ్కర్ సమానతా సౌధలో బృహత్ ఉద్యోగ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ మంత్రి, డాక్టర్ హెచ్ఎన్ ప్రాధికార అధ్యక్షుడు శివశంకరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డాక్టర్ హెచ్. నరసింహయ్య అభివృద్ధి ప్రాధాకార, నిర్మాణ్ సంస్థల సహకారంతో ఈ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 75కి పైగా కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరై నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. ఇకపై ప్రతి మూడు, ఆరు నెలలకొకమారు ఉద్యోగ మేళాలు ఏర్పాటు చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవరెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్‌ఫోన్ వ్యసనం.. పిల్లల్లో దృష్టిలోపం

- అతిగా మొబైల్ వాడకంతో జీవితం అంధకారం
- నానాటికీ పెచ్చుమీరుతున్న బాధితుల సంఖ్య



సెల్‌ఫోన్ వీక్షణ ఎంత ముప్పో



చీకటిలో సెల్‌ఫోన్ చూస్తున్న బాలుడు

బనశంకరి: డిజిటల్ పరికరాలు అతిగా వినియోగించడంతో పాటు వివిధ కారణాలతో దృష్టిలోపం సమస్య బారిన పడే పిల్లల సంఖ్య రాష్ట్రంలో పెచ్చుమీరుతోంది. ఆరోగ్య శాఖ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) కింద నిర్వహించిన తనిఖీలో గత ఏడాదిలో 1.72 లక్షల మంది పిల్లల్లో దృష్టి సమస్య వెలుగు చూసింది. ప్రారంభ దశలో వివిధ అనారోగ్య సమస్యల ఆచూకీ కనిపెట్టి చికిత్స అందించడానికి సంబంధించి అంగన్‌వాడీ, పాఠశాల దశలో ఈ కార్యక్రమం కింద 18 ఏళ్లలోపు వారికి కంటిపరీక్షలు చేపడుతున్నారు. పుట్టుకతో దోషాలు, రోగాలు, పిల్లల ఎదుగుదలలో సమస్యలు గుర్తించడం, ఉచితంగా చికిత్స అందించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 2024–25లో 1.23 కోట్ల మంది పిల్లలను ఆర్‌బీఎస్‌కే బృందం పరీక్షలు నిర్వహించింది. ఈ పిల్లలకు నేత్ర పరీక్షలు చేపట్టగా అధిక మంది పిల్లల్లో దృష్టిలోప సమస్య వెలుగు చూసింది. కోవిడ్ అనంతరం డిజిటల్ పరికరాలను అతిగా వాడడమే ఈ సమస్య పెరగడానికి కారణమని నేత్రవైద్యులు విశ్లేషించారు.

98 వేల మందికి కంటిచూపు లేమి

2022–23లో ఈ కార్యక్రమం నిర్వహించిన నేత్రపరీక్షల్లో 98 వేల మంది పిల్లల్లో దృష్టిలోపం వెలుగు చూసింది. అనంతరం పిల్లల్లో దృష్టిలోపం కేసుల సంఖ్య లక్షకు పైగా చేరుకుంది. 2023–24లో 1.21 లక్షల మంది పిల్లలు కంటిసమస్య ఎదుర్కొంటున్నట్లు తేలింది. పిల్లలకు కంటిపరీక్షలు చేపట్టి కంటి అద్దాలను అందజేశారు. నేత్రసమస్యతో పిల్లల్లో విద్యకు ఇబ్బంది తలెత్తుతుందనే కారణంతో ఈ కార్యక్రమం ప్రారంభ దశలో సమస్యను కనిపెట్టారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కంటి పరీక్షలు చేపట్టగా సమస్య వెలుగు చూసిన వారికి సువర్ణ సురక్షా ట్రస్ట్ కింద నమోదు చేసిన ఆసుపత్రుల్లో ఉచిత చికిత్సను అందిస్తున్నారు. ఇటీవల రోజుల్లో పిల్లల్లో సమీప దృష్టి సమస్య పెచ్చుమీరుతోంది. డిజిటల్ పరికరాల అతి వినియోగం, ఇండోర్ కార్యకలాపాలు తగ్గించడం సమస్యకు ప్రధాన కారణం. ఈ సమస్యను ప్రారంభంలో గుర్తించి చికిత్స అందించకపోతే పిల్లలకు విద్య, సామాజిక కార్యకలాపాలకు ఇబ్బంది తలెత్తుతుందని నేత్రనిపుణులు తెలిపారు. కోవిడ్ అనంతరం డిజిటల్ పరికరాలపై ఆధారపడే పిల్లల్లో దృష్టి సమస్య పెరిగింది.



సెల్‌ఫోన్ వ్యసనంతో ఒంటరితనం

చిన్న వయస్సులోనే నేత్ర సమస్యలు



మొబైల్ వ్యసనంతో చిన్న వయస్సులోనే నేత్ర సమస్యలు కనబడుతున్నాయని మింటో కంటి ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ నాగరాజు తెలిపారు. కంటి సమస్యలకు సంబంధించిన చికిత్సకు వచ్చే పిల్లల సంఖ్య ఇటీవల పెరుగుతోందని, డిజిటల్ పరికరాల వినియోగం తగ్గించి ఇండోర్ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నారాయణ నేత్రాలయ అధ్యక్షుడు డాక్టర్ రోహిత్‌శెట్టి అన్నారు. పిల్లల్లో స్మార్ట్‌ఫోన్ వ్యసనం పెచ్చుమీరుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసిన నేత్రనిపుణులు సుదీర్ఘ అవధిపాటు డిజిటల్ స్క్రీన్లు చూడటంతో కంటి సమస్య తలెత్తుతోందన్నారు. డిజిటల్ స్క్రీన్ల నుంచి విరజిమ్మే వెలుగుతో కంటిపై నేరుగా ప్రభావం పడుతుంది. కంటిలో నొప్పి, దురద, నీరు కారడం కనబడుతుంది. పాఠశాలల్లో పాఠాలను పీడీఎఫ్ రూపంలో అందిస్తుండటంతో డిజిటల్ పరికరాలపై పిల్లలు ఆధారపడటం పెరుగుతోందని రోహిత్‌శెట్టి తెలిపారు. ఇతర ప్రముఖ కారణాల్లో పోషకాహార కొరత, కంటి వైరస్ గాయాలతో దృష్టికి సంబంధించిన సమస్యలు కనబడతాయన్నారు.

నలుగురు దోపిడీదారుల ముఠా అరెస్ట్



పట్టుబడిన నిందితులతో పోలీసులు

బొమ్మనహళ్లి: ఒంటరి వ్యక్తులను బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్న ముఠా పట్టుబడింది. తమిళనాడులోని ముత్తూరు గ్రామానికి చెందిన భరత్(29), ఉచ్చనహళ్లికి చెందిన మధు(24), ఆరేహళ్లికి చెందిన సతీష్(25), సంతోష్(28) అనే నిందితులను ఆనేకల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులనుంచి 25 గ్రాముల బంగారం చైన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఈనెల 2న ఆనేకల్ పట్టణం సంతె వీధి సమీపంలో శేషాద్రప్ప అనే బైకిస్టును అడ్డుకొని కత్తులతో బెదిరించి 25 గ్రాముల బంగారం చైన్ లాక్కొని ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు గాలింపు చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు.

చదువుతోపాటు సంస్కారం నేర్పాలి



ప్రతిభాపురస్కారాలు అందించిన దృశ్యం

గౌరిబిదనూరు: పిల్లలకు తల్లిదండ్రులు సంస్కారంతో కూడిన విద్యను అందివ్వాలని నగరసభ సభ్యుడు మార్కెట్ మోహన్ సూచించారు. బావి కట్టె మిత్ర బళగ, సమృద్ధి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని వేంకటరమణ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రతిభావంత విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మార్కెట్ మోహన్ మాట్లాడుతూ ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే మరింతగా రాణిస్తారన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో దేశానికి సేవ చేయాలని సూచించారు. అనంతరం టెన్త్, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించినవారికి ప్రతిభా పురస్కారాలు అందించారు. ముదలోడు పీడీఓ బాలకృష్ణ, పీఈటీ షబినాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు చైన్ స్నాచర్లకు కటకటాలు

- రూ.15.70 లక్షల విలువైన బంగారు చైన్లు స్వాధీనం

దొడ్డబళ్లాపురం: బెంగళూరు పరిధిలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులనుంచి రూ.15.70 లక్షల విలువైన బంగారు చైన్లు రికవరీ చేసుకున్నారు. ఈనెల 12న రాత్రి హెచ్ఆర్‌బీఆర్ లేఔట్‌లో 8వ మెయిన్ రోడ్డులో ఓ మహిళ వాకింగ్ చేస్తుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు ఆమె మెడలోని మాంగల్యం చైను లాక్కుని పరారయ్యారు. బాణసవాడి పోలీసులు సీసీటీవీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేసి మారత్‌హళ్లిలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా చైన్ స్నాచర్లని తేలింది. చోరీ సొమ్మును ఆంధ్రప్రదేశ్ మదనపల్లిలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టినట్లు తేలింది. పోలీసులు ఈనెల 21న సదరు సొమ్మును రికవరీ చేసుకున్నారు.

ధర్మస్థలపై కుట్ర చేసిన వారిని బంధించాలి

తుమకూరు: వందలాది శవాలను పూడ్చి పెట్టారంటూ ధర్మస్థల పవిత్రతను దెబ్బతీసిన నిందితులను అరెస్ట్ చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం తుమకూరు నగరంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. భద్రమ్మ సర్కిల్‌లోని సోమేశ్వర ఆలయంలో ప్రార్థనలు చేసిన అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని ఆందోళన నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ మాట్లాడుతూ సుమారు 800 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ క్షేత్ర ధర్మస్థలం హిందువులకు పవిత్రమైన స్థలమని అన్నారు. ఇక్కడ కొలువైన మంజునాథస్వామికి దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఉన్నారన్నారు. ఈ స్థలాన్ని అపవిత్రం చేయాలనే ఉద్దేశంతో కొందరు ఇక్కడ శవాలను పాతిపెట్టినట్లు అసత్యాలు ప్రచారం చేశారన్నారు.కుట్రలకు పాల్పడిన వారిని గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ రైతు మోర్చా ఉపాధ్యక్షుడు బ్యాతరంగేగౌడ, సందీప్‌గౌడ, రవిశయ్య, సత్యమంగల్ జగదీష్, విరుపరాక్షప్ప, హనుమతరాజు, తదితరులు పాల్గొన్నారు.

చిక్కబళ్లాపురం: ధర్మస్థల పవిత్రతను కాపాడాలని, అసత్య ప్రచారాలు చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడ ఆధ్వర్యంలో దేవనహళ్లి నుంచి శుక్రవారం వందలాది వాహనాలలో ధర్మస్థలకు తరలివెళ్లారు. రామయంద్రగౌడ మాట్లాడుతూ కొందరు వ్యక్తులు హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. ధర్మస్థల వీరేంద్ర హెగ్డేపై భక్తులకు అపారమైన నమ్మకం ఉందన్నారు. శిడ్లఘట్ట మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ మాట్లాడుతూ ధర్మస్థలలో ఎలాంటి అక్రమాలు జరగలేదన్నారు.



చిక్కబళ్లాపురంలో ర్యాలీ



మధుగిరిలో నిరసన ప్రదర్శన

సిట్ అధికారులు సత్వరం నివేదికను ప్రభుత్వానికి అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ కార్యదర్శి మునిరాజు, శిడ్లఘట్ట తాలూకా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ, వేణు, సురేంద్రగౌడ, దేవరాజ్, సుమిత్రమ్మ, ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.76 లక్షల విలువైన సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

దొడ్డబళ్లాపురం: పీజీల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్దనుంచి రూ.76 లక్షల విలువైన 14 మొబైళ్లు, 4 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. తలఘట్టపురలోని ఒక పీజీలో జరిగిన చోరీకి సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టి ఈనెల 14న తమిళనాడు పురుల్‌లోని సెంట్రల్ జైలు–2 లో ఉన్న నిందితుడిని బాడీ వారెంట్‌పై నగరానికి తీసుకువచ్చి విచారణ చేపట్టారు. లాడ్జ్ లేదా పీజీల్లో రూంలు తీసుకుని నాలుగైదు రోజులు ఉండి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, విలువైన వస్తువులు చోరీ చేసినట్లు నోరు విప్పాడు.బెంగళూరులోనే కాకుండా దేవనహళ్లి, రామనగర తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని ఈనెల 20వ తేదీన తమిళనాడు పోలీసులకు అప్పగించారు.

నాణ్యమైన పాలను అందించాలి



భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

చింతామణి: పాల సంఘాలు బలోపేతం కావాలంటే పాడి రైతులు నాణ్యత కలిగిన పాలను అందించాలని కోచిముల్ డైరెక్టర్ ఊలవాడి బాబు సూచించారు. తాలుకాలోని కొంగనహళ్లి శివారెడ్డి సహకారంతో నిర్మించిన పాల సంఘం నూతన భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం శిడ్లఘట్ట తాలూకా సాదలి గ్రామంలో నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. వెంకటేశ్ మూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ మహేష్ పాల్గొన్నారు.

ఉద్యాననగరిలో త్వరలో యాపిల్ దుకాణం..!

శివాజీనగర: మరి కొన్ని రోజుల్లో ఐఫోన్ 17 మార్కెట్‌లోకి రానుంది. అంతకు ముందుగానే యాపిల్ కర్ణాటక రాష్ట్రానికి తీపి కబురునిచ్చింది. బెంగళూరులోని హెబ్బాళలో తన మూడో ప్రధాన రిటైల్ దుకాణాన్ని ఓపెన్ చేసేందుకు యాపిల్ సంస్థ సిద్ధమైంది. అంతకు ముందు యాపిల్ ముంబైలో యాపిల్ బీకేసీ, న్యూఢిల్లీలో యాపిల్ సాకెట్ షాప్‌లను విజయవంతంగా ఓపెన్ చేసింది. యాపిల్ ఇండియా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం యాపిల్ హెబ్బాళ దుకాణం సెప్టెంబర్‌లో ఓపెన్ చేయనుంది. దుకాణం ప్రారంభోత్సవం ఆచరించేందుకు యాపిల్ ఫ్రీ బెంగళూరు–ప్రేరిత వాల్‌పేపర్, యాపిల్ మ్యూజిక్‌లో ప్రత్యేకంగా సేకరించిన యాపిల్ హెబ్బాళ ప్లేలిస్ట్‌ను పరిచయం చేసింది.

విష్ణు స్మారకం ఏర్పాటుకు సన్నాహాలు



స్మారకం ఏర్పాటుకు అడ్వాన్స్ ఇస్తున్న దృశ్యం

యశవంతపుర: దివంగత నటుడు విష్ణువర్ధన్ స్మారకం నిర్మాణానికి అడ్డంకులు తొలిగాయి. కెంగేరి సమీపంలో అర్ధ ఎకరా భూమిని నటుడు సుదీప్ కొనుగోలు చేశారు. దీనికీ వీరకపుత్ర శ్రీనివాస్ సారథ్యం వహించారు. స్మారకం ఏరాటుకు అడాన్స్ ఇచ్చారు. అభిమాన్ స్టూడియోలో ఉన్న సమాధిని ఇటీవల తొలగించడంతో కొత్తగా స్మారకం ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే నెల 18న విష్ణువర్ధన్ జయంతి రోజునే స్మారకం ఆవిష్కరించాలని నిర్ణయించారు. వచ్చే నెల 2న సుదీప్ జన్మదినం రోజున విష్ణు స్మారకం బ్లూప్రింట్‌ను విడుదల చేయనున్నట్లు అభిమానులు తెలిపారు. అభిమాన్ స్టూడియోలో ఉన్న స్మారకం కంటే విభిన్నంగా విష్ణు స్మారకంను సిద్ధం చేస్తున్నట్లు వీరకపుత్ర శ్రీనివాస్ తెలిపారు.

తప్పడు ప్రచారం చేస్తే శిక్ష తప్పదు

తుమకూరు : ధర్మానికి మద్దతుగా నిలిచే ప్రతిఒక్కరినీ ధర్మస్థల మంజునాథ స్వామి కాపాడుతారని, ఆలయంపై అసత్యాలు ప్రచారం చేసే వారికి శిక్షలు తప్పవని మాజీ మంత్రి కే.ఎన్.రాజణ్ణ అన్నారు. ధర్మస్థలంపై జరుగుతున్న తప్పడు ప్రచారాన్ని నిరసిస్తూ మధుగిరిలో శుక్రవారం నిర్వహించిన ర్యాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధర్మాధికారిపై వస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మరాదన్నారు.

సిటీ సివిల్ కోర్టుకు బాంబు బెదిరింపు

శివాజీనగర: బెంగళూరులోని సిటీ సివిల్ కోర్టుకు శుక్రవారం బాంబు బెదిరింపు చ్చింది. న్యాయస్థాన ఆవరణలో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తులు ఈ మెయిల్ పంపడంతో పోలీసులు అప్రమత్తమై బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో వచ్చి కోర్టు ఆవరణలో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి బాంబు ఆనవాళ్లు లభించలేదు.

ముఖ హాజరు విధానాన్ని రద్దు చేయాలి

గౌరిబిదనూరు: అంగనవాడీ కార్యకర్తలకు కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ క్యాప్చర్ రికార్డ్ సిస్టమ్)రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సిద్దగంగప్ప డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ అఖిలభారత ఫెడరేషన్ పిలుపుమేరకు పట్టణంలోని సీపీఎం కార్యాలయం ముందు గురువారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొన్ని సెల్‌ఫోన్ల కెమెరాల్లో ముఖాలు సరిగా కనిపించవన్నారు. మరోవైపు గ్రామీణ ప్రదేశాలలో కొంతమంది పిల్లలకు ఆధార్ కార్డులు ఉండవని, కొంత మందికి ఓటీపీ చెప్పడం తెలియదన్నారు. కొన్ని చోట్ల నెట్ వర్క్ సమస్య ఉందన్నారు. ఈ నేపథ్యంలో కార్యకర్తల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎఫ్ఆర్ఎస్ సిస్టమ్‌ను రద్దు చేయాలన్నారు. అంగనవాడీ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలి డిమాండ్ చేశారు.



ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అసెంబ్లీలో డీసీఎం ఆర్ఎస్ఎస్ గీతాలాపన

బనశంకరి: శాసనసభ సమావేశాల్లో శుక్రవారం ఆర్ఎస్ఎస్ పాటను పాడి డీకే.శివకుమార్ అందరినీ ఆశ్చర్యపరిచారు. చిన్నస్వామి స్టేడియంలో సంభవించిన తొక్కిసలాట ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటన గురించి శుక్రవారం సభలో జరిపిన చర్చ సమయంలో సమస్త సదా వత్సలే అని పాడగానే బీజేపీ సభ్యులు బల్లలు తట్టారు. స్పీకర్ యూటీ.ఖాదర్ బాగుందని తెలిపారు. చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట ఏర్పడటానికి డీకే.శివకుమార్ కారణమని బీజేపీ సభ్యులు ఆరోపించిన అనంతరం ఆర్ఎస్ఎస్ పాట ఆలపించారు. విమానాశ్రయం నుంచి స్టేడియం వరకు ఆర్‌సీబీ జట్టుతో కన్నడ పతాకంతో మార్గమధ్యంలో డీకే.శివకుమార్ సంబరాలు చేశారని బీజేపీ నేతలు ఆరోపించారు.

క్రికెట్ సంఘం సభ్యుడిగా పాల్గొన్నా–డీకేశి

రాష్ట్ర క్రికెట్ సంఘం సభ్యుడిగా, బెంగళూరు ఇన్‌చార్జ్ మంత్రిగా కార్యక్రమంలో పాల్గొన్నానని డీకే శివకుమార్ తెలిపారు. ఆర్‌సీబీకి శుభాకాంక్షలు తెలియజేశానని, నేను కప్‌ను సైతం ముద్దుపెట్టుకున్నానని తన పని తాను చేశానని తెలిపారు. ఇలాంటి ఘటనలు ఇతర రాష్ట్రాల్లో కూడా సంభవించాయన్నారు. విపక్ష నేత ఆర్.అశోక్ ఒకసారి ఆర్ఎస్ఎస్ చడ్డీ ధరించడాన్ని ఒప్పుకున్న సంగతి గుర్తుకు వచ్చి ఆర్ఎస్ఎస్ పాట పాడానన్నారు.

విపక్షాలతో చేతులు కలపబోను

శుక్రవారం విధానసౌధ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. సభలో ఆర్ఎస్ఎస్ పాట పాడటంపై మీరు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో చేతులు కలిపినట్లు చర్చ జరుగుతోందని విలేకరులు అడిగిన ప్రశ్నకు డీకే సమాధానమిస్తూ నేను పరోక్షంగా, ప్రత్యక్షంగా వారితో చేతులు కలపనన్నారు. నేను పుట్టినప్పటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నానన్నారు. ప్రాణం ఉన్నంత వరకు అందులోనే ఉంటానన్నారు.



విధానసౌధ వద్ద మాట్లాడుతున్న డీకే.శివకుమార్

శతాబ్ది ఉత్సవానికి తెలంగాణ సీఎంకు ఆహ్వానం



తెలంగాణ సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: కర్ణాటక రెడ్డిజన సంఘాన్ని స్థాపించి సుమారు వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బెంగళూరు నగరంలోని ప్యాలెస్ మైదానంలో ఈనెల 24న కర్ణాటక రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో కర్ణాటక రెడ్డిజన సంఘం శతమానోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తుండటంతో ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా కర్ణాటక రెడ్డి జన సంఘానికి చెందిన అధ్యక్షుడు జయరామ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కే.సీ.రామమూర్తిల ఆధ్వర్యంలో తెలంగాణలోని హైదరాబాద్‌కు వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కర్ణాటక రెడ్డి జన సంఘం సమావేశానికి హాజరుకావాలని ఆహ్వానించారు. సంఘం ప్రధాన కార్యదర్శి శేఖర్ రెడ్డి, డైరెక్టర్ విశ్వనాథపుర మంజునాథ్‌తోపాటు సభ్యులు హాజరై ఆహ్వానించారు.

బైక్ ట్యాక్సీ డ్రైవర్లు, యజమానులపై చర్యలు తీసుకోవద్దు

- హైకోర్టు డివిజనల్ ధర్మాసనం

శివాజీనగర: రాష్ట్రంలో బైక్ ట్యాక్సీ యజమానులు, డ్రైవర్లపై ఎలాంటి చర్యలకు సిద్ధం కారాదని మౌఖికంగా తెలియజేసిన హైకోర్టు..నిషేధాల మధ్య కూడా బైక్ ట్యాక్సీ సేవలు కల్పిస్తున్న అగ్రిగేటర్‌లపై చర్యలకు సిద్ధం కావచ్చని స్పష్టం చేసింది. ఈ మేరకు సంబంధించిన పిటిషన్ విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి విభు బక్రు, న్యాయమూర్తి సీ.ఎం.జోషితో కూడిన డివిజనల్ ధర్మాసనం ఈ స్పష్టీకరణనిచ్చింది. శుక్రవారం అడ్వకేట్ జనరల్ కే.శశికిరణ్‌శెట్టి, అగ్రిగేటర్‌కు చెందిన బైక్ ట్యాక్సీ సేవలు అందించేవారు న్యాయస్థానం ఆదేశించినా కూడా తమ సేవలను కొనసాగించారు. వారిపై చర్యలు తీసుకోవటానికి ముందుగా న్యాయస్థానం దృష్టికి తీసుకురావటం తమ బాధ్యత అని ధర్మపీఠానికి వివరించారు. అంతకు ముందు స్పందించిన ధర్మాసనం, తాము అగ్రిగేటర్ల ద్వారా బైక్ ట్యాక్సీ సేవల ప్రారంభానికి ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవాలో దానిని తీసుకోవచ్చని తెలియజేసింది. అంతేకాకుండా బైక్ ట్యాక్సీ డ్రైవర్లు, యజమానులపై ఎలాంటి చర్యలు తీసుకోరాదు. అగ్రిగేటర్లకు సంబంధించిన విధానాన్ని మీరు రూపొందించటాన్ని పరిగణిస్తామని చెప్పటంతో ఎలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేయలేదు. ఈ విషయంలో ఆదేశాలు కావాలంటే చేయవచ్చు. ఆదేశాలు చేయలేదని తెలియజేసిన ధర్మాసనం, వ్యక్తిగత బైక్ ట్యాక్సీ డ్రైవర్లకు వేధింపులు కలిగించకుండా సూచించింది. బైక్ ట్యాక్సీ డ్రైవర్ల తరపున హాజరైన న్యాయవాది, ప్రభుత్వ అప్లికేషన్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవచ్చు. అప్లికేషన్ ఆధారంగా సేవలు చేసే ట్యాక్సీలపై కాదు, వ్యక్తిగత బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ధర్మాసనానికి తెలిపారు. ఈ సమయంలో అడ్వకేట్ జనరల్, వ్యక్తిగత బైక్ ట్యాక్సీ ఇచ్చే వారిని అరెస్ట్ చేయలేదు. ఈ వాదన సరికాదు. వారిని తాము అరెస్ట్ చేయబోమని స్పష్టం చేశారు. గత విచారణలో రాష్ట్ర ప్రభుత్వం బైక్ ట్యాక్సీకి సంబంధించిన తీర్మానం ప్రభుత్వంలో అత్యున్నత స్థాయిలో నిర్ధారిస్తామని హైకోర్టుకు తెలియజేసింది. బైక్ ట్యాక్సీ సేవలను పలువురి జీవనోపాధి కోసం అవలంభించటంతో తీవ్రంగా ఆలోచించాలని ప్రభుత్వానికి న్యాయస్థానం సూచనప్రాయంగా తెలియజేయటాన్ని ఇక్కడ స్మరించవచ్చు.

మాజీ మంత్రి ఇంట్లో చోరీ



చోరీకి పాల్పడిన నేపాల్ దంపతులు

యశవంతపుర: మలెనాడు గాంధీగా పేరుగాంచిన మాజీ మంత్రి, దివంగత హెచ్‌జీ గోవిందగౌడ ఇంటిలో చోరీ జరిగింది. గోవిందగౌడ కుమారుడు వెంకటేష్ కొప్ప తాలూకా మణిపుర ఎస్టేట్‌లో నివాసం ఉంటున్నారు. ఇక్కడే నేపాల్‌కు చెందిన దంపతులు పనిచేస్తున్నారు. గురువారం రాత్రి ఇంటిలో ఏవరూ లేని సమయంలో నేపల్ దంపతులు రూ.7 లక్షల విలువైన నగదు, బంగారంను చోరీ చేసి ఉడాయించారు. శుక్రవారం ఉదయం ఈ చోరీ వెలుగు చూసింది. కొప్ప గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మహిళా క్రికెట్ కప్ పోటీల వేదిక ముంబైకి మార్పు

బనశంకరి: చిన్నస్వామిస్టేడియంలో తొక్కిసలాట ఘటన క్రికెట్ చరిత్రలో రాష్ట్రానికి చే దు జ్ఞాపకంగా మిగిలింది. ఈ ఘటన అనంతరం రాష్ట్ర క్రికెట్ సంస్థ పాలకమండలి సభ్యులు రాజీనామా చేశారు. ఈ షాక్ నుంచి తేరుకోకముందే చిన్నస్వామి స్టేడియంలో నిర్వహించాల్సిన ఐసీసీ మహిళా ప్రపంచకప్ టోర్నీని ముంబైకి మార్చారు. సెప్టెంబరు 30 నుంచి ఐసీసీ మహిళా క్రికెట్ వన్‌డే ప్రపంచకప్ టోర్నీ ప్రారంభం కానుండగా నవంబరు 2 తేదీన ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

క్లుప్తంగా...

దర్యాప్తు వివరాల లీకేజీపై కౌంటర్ వేయండి

- 'సిట్'కు హైకోర్టు ఆదేశం
- విచారణ సెప్టెంబరు 2కి వాయిదా



సాక్షి, అమరావతి: మద్యం కేసులో దర్యాప్తు వివరాలను మీడియాకు లీక్ చేస్తున్న వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు శుక్రవారం 'సిట్'ను ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 2కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఉత్తర్వులు జారీచేశారు. మద్యం కేసులో 'సిట్' అధికారులు దర్యాప్తు వివరాలను మీడియాకు లీక్ చేస్తున్నారని, దీనిపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ చెరుకూరు వెంకటేష్‌నాయుడు సతీమణి వాసిరెడ్డి మహిత హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ జ్యోతిర్మయి శుక్రవారం మరోసారి విచారణ జరిపారు. మహిత తరఫున సీనియర్ న్యాయవాది వీఆర్ ఆవుల వాదనలు వినిపించారు. మద్యం కేసులో నిందితుడిగా ఉన్న వెంకటేష్‌నాయుడిని అరెస్టుచేసిన 'సిట్' అధికారులు అతని ఫోన్లను తీసుకున్నారని తెలిపారు. ఆ ఫోన్లలో ఉన్న వ్యక్తిగత, సున్నిత సమాచారాన్ని 'సిట్' అధికారులు మీడియాకు లీక్ చేశారన్నారు. ఆ సమాచారం మీడియాలో విస్తృతంగా వచ్చిందన్నారు. అందువల్ల వెంకటేష్‌నాయుడికి సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని ప్రచురించకుండా ఆదేశాలివ్వాలని కోరారు. 'సిట్' తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ, ఆ ఫోన్‌కు ఫేస్ ఐడీ ఉండటంతో తెరవడం సాధ్యంకాలేదని తెలిపారు.

మద్యం అక్రమ కేసులో తీర్పు వాయిదా

విజయవాడ లీగల్: మద్యం అక్రమ కేసులో రిమాండ్‌లో ఉన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ఇంటి నుంచి వారంలో మూడు రోజులపాటు భోజనం అనుమతించిన తేదీలను మార్చాలని దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఏసీబీ న్యాయమూర్తి ఉత్తర్వులిచ్చారు. ఇదే కేసులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మధ్యంతర బెయిల్, రెగ్యులర్ బెయిల్ కోసం దాఖలైన పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ఏసీబీ న్యాయమూర్తి కేసును ఈనెల 25కి వాయిదా వేశారు. అలాగే బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ తరఫున దాఖలు చేసిన పిటిషన్‌లపై శుక్రవారం విచారణ జరిగింది. వీటిపై తీర్పును 29కి వాయిదా వేశారు.

కొమ్మా కోట్లు పిటిషన్‌పై వాదనలు పూర్తి

విజయవాడ లీగల్: గన్నవరం టీడీపీ కార్యాలయంలో పనిచేసే సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి బెదిరించారనే అభియోగంపై మాజీ ఎమ్మెల్యే వంశీ అనుచరుడు కొమ్మా కోట్లు తరఫున న్యాయవాది ముందస్తు బెయిల్ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం ఇరుపక్షాల వాదనలు పూర్తవ్వడంతో ఏసీబీ న్యాయమూర్తి తీర్పు ఇచ్చేందుకు కేసును ఈనెల 29కి వాయిదావేశారు.

బీజేపీ రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పాటు

సాక్షి, అమరావతి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పీవీఎన్ మాధవ్ రాష్ట్ర పార్టీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ప్రకటించారు. పది మంది ఉపాధ్యక్షులు, నలుగురు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, పది మంది రాష్ట్ర కార్యదర్శులను నియమించారు. వీరితోపాటు వివిధ మోర్చా అధ్యక్షులను కూడా ప్రకటించారు.

ఉద్యోగం పోతే.. మీరు భద్రమేనా?

ఒడిదుడుకులకు లోనవుతున్న జాబ్ మార్కెట్
అనిశ్చితిని ఎదుర్కోవడానికి 'ఫండ్' తప్పనిసరి
అదనపు ఆదాయ వనరులపైనా దృష్టిపెట్టాలి



ప్రపంచవ్యాప్తంగా 2023లో 1,193 టెక్ కంపెనీలు 2,64,220 మంది ఉద్యోగులను.. గతేదాది 551 టెక్ సంస్థలు 1,52,922 మందిని తొలగించాయి. ఈ ఏడాది ఇప్పటికే 186 కంపెనీలు 81,567 మందిని ఇంటికి సాగనంపాయి. ఒక్క టెక్ ఇండస్ట్రీలోనే ఇలా ఉంటే ఇతర రంగాల్లో పరిస్థితి? ఇదంతా ఎందుకంటే.. ఉద్యోగం కోల్పోయినప్పుడు ఉండే మానసిక వేదన అంతా ఇంతా కాదు. ఆర్థికంగా బలంగా ఉన్నవారైతే ఏ ఇబ్బందీ లేదు. నెల జీతం మీద బతికేవారికే సమస్యల్లా. నిత్యావసరాలు, ఇంటి అద్దె, నెల వాయిదాలు, పిల్లల ఫీజులు, వైద్యం.. ఇలా తప్పించుకోలేని ఖర్చుల జాబితా పెద్దదిగానే ఉంటుంది. అనుకోని కష్టం ఎదురైతే ఎదుర్కొనే ప్రణాళిక లేకపోతే చాలామంది ఆర్థికంగా చితికిపోతారు. అప్పుల ఊబిలో కూరుకుపోతారు. జాబ్ మార్కెట్‌లో ప్రస్తుత తరుణంలో ఉన్న అనిశ్చితి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కొన్ని సూత్రాలు పాటించాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

అత్యవసర నిధి

సగటు ఉద్యోగికి.. అలాగే కుటుంబానికి ఇదే పెద్ద ధీమా. కనీసం 6–12 నెలల ఇంటి ఖర్చులకు సమానమైన మొత్తంలో అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోండి. తద్వారా ఆర్థిక భద్రత పెరుగుతుంది. అకస్మాత్తుగా ఉద్యోగం పోతే.. ఊహించని, అత్యవసర ఖర్చులను తీర్చడానికి ఈ ఫండ్ సమయానికి ఆదుకుంటుంది.

- ఈ నిధి లేకపోతే అధిక వడ్డీతో అప్పులు, లేదా ఇతర ప్రత్యామ్నాయాలపై ఆధారపడవలసి వస్తుంది. ఇదే జరిగితే ఆర్థిక సమస్యలు మరింత తీవ్రమవుతాయి.
- ఆర్థికంగా బలంగా ఉంటే మనశ్శాంతి ఉంటుంది. అన్నింటికీ మించి ఒత్తిడి తగ్గుతుంది.
- ఆహారం, వైద్య బిల్లులు, బీమా ప్రీమియం వంటి ముఖ్యమైన ఖర్చుల కోసం మాత్రమే ఈ అత్యవసర ఫండ్‌ను ఉపయోగించండి.
- జాబ్ కోల్పోయిన తర్వాత కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకోవడానికి ఈ నిధుల నుంచి కొంత మొత్తాన్ని కేటాయించండి. కొత్త కోర్సు, శిక్షణ పూర్తి అయితే ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.

అదనపు ఆదాయ మార్గాలు

ప్రతి ఒక్కరిలో ఏదో ఒక నైపుణ్యం, అభిరుచి, ఆసక్తి దాగి ఉంటుంది. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగంతో పాటు వీటి ద్వారా అదనపు ఆదాయాన్ని సంపాదించడానికి ప్రయత్నించండి. ఆదాయ నష్టాలను అధిగమించడంలో ఇవి మీకు సహాయపడతాయి. ఇదే సమయంలో వీలైనంత పొదుపు చేయడం, పెట్టుబడి పెట్టడం కూడా మర్చిపోవద్దు.

ఆరోగ్య బీమా

చాలా మంది ఉద్యోగులు సంస్థ అందించే గ్రూప్ హెల్త్ కవరేజీపైనే ఆధారపడతారు. సొంతంగా బీమా పాలసీ తీసుకోరు. కంపెనీ నుంచి ఉంది కదా అన్న ధీమా, నిర్లక్ష్యపు ధోరణి ఉంటుంది. ఉద్యోగం కోల్పోయినప్పుడు ఈ బీమా వర్తించదు. అందుకే కుటుంబం అంతటికీ వర్తించే సమగ్ర వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీని కొనుగోలు చేయడం ఉత్తమం. వ్యక్తిగత బీమా ఉంటే జాబ్ పోయినా, మానేసినా చింత ఉండదు. కుటుంబంలోని వారందరికీ నిరంతర ఆరోగ్య బీమా రక్షణ ఉంటుంది.

తక్కువ అప్పు

ఉద్యోగం కోల్పోతామన్న అభద్రతకు లోనైతే.. అప్పులు/రుణాలను కనిష్ట స్థాయిలో ఉంచడానికి ప్రయత్నించండి. కొత్త రుణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోకూడదు. వీలైతే ముందస్తుగా ఈఎంఐలు చెల్లించండి.

బ్యాంకులకు చెల్లించాల్సిన వాయిదాల క్రమం తప్పితే క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. ఇదే జరిగితే భవిష్యత్తులో రుణం పొందడంలో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు.

ఉద్యోగాన్ని కోల్పోయినట్టయితే రుణదాతకు ఈ విషయాన్ని తెలియజేయడంతోపాటు మారటోరియం, నెల వాయిదాల (ఈఎంఐ) గడువు పెంచడం (రీషెడ్యూల్) గురించి విన్నవించండి.

బంధువులు, స్నేహితులు, తెలిసిన వారి నుంచి అప్పు తీసుకున్నట్టయితే పరిస్థితిని నిజాయితీగా వివరించండి.

బడ్జెట్‌లో మార్పులు

అనిశ్చితి సమయాల్లో విచ్చలవిడి ఖర్చులను తగ్గించుకోండి. అత్యవసరమైతే తప్ప ఖర్చు చేయండి.

- అనవసర ఖర్చులు తగ్గిస్తే చేతిలో డబ్బులు మిగులుతాయి. ఉద్యోగ నష్టానికి సంబంధించిన ఒత్తిడి తగ్గుతుంది.
- ఉద్యోగం కోల్పోవడం వల్ల తలెత్తే ఆర్థిక పరిణామాలు, తదుపరి ఉద్యోగ అన్వేషణ, జాబ్ మార్కెట్ గురించి మీ ఆలోచనలు, భావాలు, ప్రణాళికలను కుటుంబంతో పంచుకోండి.
- కుటుంబ సభ్యులు తమ భావాలను వ్యక్తీకరించడానికి, నిర్ణయం తీసుకునే ప్రక్రియకు దోహదపడే సుహృద్భావ వాతావరణాన్ని కల్పించండి. ఈ విధానం కుటుంబ బంధాలను బలోపేతం చేస్తుంది.
- మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, రిటైర్‌మెంట్ ఇన్వెస్ట్‌మెంట్స్ వంటి వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ కదిలించొద్దు.

దారిమళ్లించిన యూరియా అధిక ధరకు విక్రయం

- 266 బస్తాల యూరియాను ఓ మిల్లుకు తరలించిన టీడీపీ నేతలు
- అక్కడే ఒక్కో బస్తా రూ.430 చొప్పున అమ్మకం
- నంద్యాల జిల్లా పసురపాడులో దుర్మార్గం

సాక్షి, నంద్యాల: నంద్యాల జిల్లా గోస్పాడు మండలం పసురపాడు గ్రామంలో దారి మళ్లించిన 266 బస్తాల యూరియాను స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలే అమ్మేశారు. ఒక్కో బస్తాపై రూ.150 అధికంగా వసూలు చేశారు. పసురపాడు గ్రామానికి ఈ నెల 19న మార్క్‌ఫెడ్ ద్వారా 266 బస్తాల యూరియా రావాల్సి ఉంది. ఈ స్టాకును రైతు సేవా కేంద్రంలో నిల్వ చేసి రైతులకు అందజేయాలి. కానీ, టీడీపీ నాయకులు విలేజ్ హార్టికల్చరల్ అసిస్టెంట్(వీహెచ్‌ఏ) శ్రీకాంత్‌రెడ్డిని ఉపయోగించుకుని లారీని పసురపాడు గ్రామంలోని తులసీశ్వరరెడ్డికి చెందిన మొక్కజొన్న మిల్లుకు తరలించారు. మిల్లు నుంచే గుట్టుచప్పుడు కాకుండా యూరియాను విక్రయించేశారు. ఒక్కో బస్తా రూ.266కి విక్రయించాల్సి ఉండగా, టీడీపీ అక్రమార్కులు రూ.430 చొప్పున అమ్ముకున్నారు. అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని మీకింతా.. మాకింత.. అంటూ వాటాలేసుకుని పంచుకున్నారు.



పసురపాడులో యూరియా మాయంపై విచారణ చేస్తున్న ఏడీఏ విజయశేఖర్, ఏఓ

విచారణకు ఆదేశం...

యూరియా మాయమైన విషయంపై 'సాక్షి'లో వార్త ప్రచురితం కావడంతో వ్యవసాయశాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా ఆళ్లగడ్డ ఏడీఏ విజయశేఖర్‌ను నియమించారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకుని నివేదిక ఇవ్వాలంటూ ఆదేశించారు. దీంతో శుక్రవారం ఏడీఏ విజయశేఖర్, గోస్పాడు ఏవో స్వప్నికారెడ్డి గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అయితే, వారు ఎలాంటి వివరాలు వెల్లడించకుండా వెళ్లిపోయారు. ఏడీఏ విజయశేఖర్ తీరుపై గ్రామ రైతులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఆయన తీరు చూస్తే అక్రమార్కులకు వత్తాసు పలికేలా ఉందని చెబుతున్నారు. ఈ మొత్తం ఘటన వెనక జిల్లాకు చెందిన మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఉన్నారని గ్రామస్తులు చెబుతున్నారు.

బాబు పాలనలో రోడ్లపైకి రైతన్నలు

- కూటమి సర్కారు వైఫల్యంపై కాకాణి ధ్వజం
- రాష్ట్రంలో తీవ్రంగా యూరియా కొరత
- అతివృష్టి, అనావృష్టితో అన్నదాతల అగచాట్లు



సాక్షి, అమరావతి: చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా రైతన్నలు ఎరువులు, విత్తనాల కోసం రోడ్డెక్కడమేనని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించే పచ్చ పత్రికల్లోనే 'ఎరువులు ఏమైనట్లు..?' అనే వార్తలు వస్తున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించవచ్చన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, అనంతపురం, నంద్యాల, కృష్ణా, అన్నమయ్య, ఎన్టీఆర్ జిల్లాల్లో ఎరువుల సమస్య తీవ్రంగా ఉందని, యూరియా సమకూర్చకుంటే పంట నాణ్యత దెబ్బతిని రైతులు నష్టపోయే ప్రమాదం నెలకొందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రైవేట్ దుకాణాలు, వ్యాపారులకు కట్టబెట్టడం వల్లే ఇవాళ బ్లాక్ మార్కెట్‌లో యూరియా బస్తాకు రూ.200 అదనంగా ఖర్చు పెట్టి కొనాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు దాపురించాయన్నారు. అతివృష్టి, అనావృష్టితో అన్నదాతలు అగచాట్లు పడుతుంటే సీఎం చంద్రబాబు కనీసం సమీక్ష నిర్వహించిన పాపాన పోవడం లేదని దుయ్యబట్టారు. వరి, మిర్చి, మామిడి, పత్తి, కోకో, పొగాకు, బొప్పాయి.. ఇలా ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదన్నారు. భారీ వర్షాలతో నష్టపోతుంటే పంట నష్టం అంచనాలు లేవని, వర్షాభావ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ప్రణాళికలు కరువయ్యాయని ధ్వజమెత్తారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో కాకాణి మీడియాతో మాట్లాడారు.

వ్యవసాయశాఖ మంత్రిని తప్పించాలి...

'ఇవాళ కట్ట యూరియా కూడా దొరకడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సొసైటీలు, మార్క్‌ఫెడ్, రైతు సేవా కేంద్రాలను పక్కనపెట్టి డీలర్లకు ఎరువులు ఇచ్చి ముడుపులు తీసుకుంటున్నారు. రూ.266.50కే ఇవ్వాల్సిన యూరియాను రూ.350 నుంచి రూ.450 వరకు అమ్ముతున్నారంటే ఎలా దోపిడీ చేస్తున్నారో తెలుస్తోంది. మంత్రుల అవినీతి కార్యకలాపాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. వ్యవసాయశాఖ మంత్రి, మంత్రి పేషీపై ఆగ్రోస్ జీఎం రాసిన లేఖకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా? రైతులకు నాణ్యమైన ఉపకరణాలు ఇవ్వకుండా కమీషన్లకు కక్కుర్తి పడి నాసిరకం కొనుగోలుకు ఒత్తిడి చేయడం దారుణం కాదా? అంతా కలిసి దోచుకుంటున్నారు కాబట్టే విచారణ జరగకుండా దాచిపెడుతున్నారు.' అని కాకాణి అన్నారు. 'వైఎస్ జగన్ హయాంలో ఆర్‌బీకేల ద్వారా 12.70 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు గ్రామాల్లోనే పంపిణీ చేశాం.' అని చెప్పారు.

ఎరువుల కొరత లేకుండా చూడండి

సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా అధికార యంత్రాంగం చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. కృత్రిమ కొరత సృష్టించినా, దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎరువులు, పురుగు మందుల లభ్యత, సరఫరా.. కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహాలపై సీఎం చంద్రబాబు శుక్రవారం ఢిల్లీ నుంచి సీఎస్, డీజీపీలతో కలిసి టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. విజిలెన్స్ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎరువులు దారి మళ్లకుండా, ధర పెరగకుండా చూడాలన్నారు. బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారిపై కేసులు పెట్టాలని, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని.. అలాగే ట్రాకింగ్ చేయాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ విజయానంద్ ఆదేశించారు. గోదావరి, కృష్ణా నదులకు ఎగువ నుంచి వస్తున్న భారీ ప్రవాహాలు, పలు ప్రాంతాల్లో నీట మునిగిన పంటలు, నివాస సముదాయాలపై అధికారులు సీఎంకు వివరించారు. ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన ఏర్పాట్లుచేయాలని సీఎం ఆదేశించారు. కాకినాడ జిల్లా ధరియాల తిప్ప సమీపంలో సముద్రంలో ఓఎన్జీసీ గ్యాస్ పైప్ లీక్ ఘటనపై సీఎం అధికారులతో మాట్లాడారు.

ఏడుగంటల పాటు నారాయణస్వామి విచారణ

- ఉ.10 నుంచి సా.5 వరకు ప్రశ్నించిన 'సిట్' అధికారులు
- మళ్లీ విచారణకు రావాలంటూ నోటీసులు
- పూర్తిగా సహకరిస్తానని చెప్పా : మాజీ డిప్యూటీ సీఎం



సాక్షి ప్రతినిధి, తిరుపతి: మద్యం విధానంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులే లక్ష్యంగా.. టీడీపీ పెద్దల స్క్రిప్ట్ ప్రకారం ముందుకెళ్తున్న ఏపీ 'సిట్' తాజాగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని టార్గెట్ చేసింది. డెబ్బై ఐదేళ్లు దాటిన ఈయన్ను ఏడు గంటలపాటు పనికిరాని ప్రశ్నలతో వేధించింది. తిరుపతి జిల్లా పుత్తూరులో నారాయణస్వామి ఉంటున్న ఇంటికి సిట్ అధికారులు శుక్రవారం ఉ.10 గంటల సమయంలో వచ్చి సా.5 గంటల వరకు నారాయణస్వామిని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం పాలసీకి సంబంధించి జరిగిన ఒప్పందాలు, లావాదేవీలు, మద్యం సరఫరా తదితర అంశాలపై ఆయన్ను ప్రశ్నించారు. నాటి ప్రభుత్వ హయాంలో నారాయణస్వామి ఎక్సైజ్ శాఖ మంత్రిగా పనిచేశారు. అప్పుడు తీసుకొచ్చిన మద్యం పాలసీలో చాలా లొసుగులున్నాయని, ఎవరి ప్రోద్బలంతో లిక్కర్ ఆర్డర్లను ఆన్‌లైన్‌లో కాకుండా, ఆఫ్‌లైన్‌లో ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. సిట్ అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం ఇవ్వడంతో.. మరోమారు విచారణకు రావాలంటూ అధికారులు నారాయణస్వామికి నోటీసులిచ్చారు. విచారణ సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆయన నివాసానికి చేరుకున్నారు.

ప్రశ్నలన్నింటికీ బదులిచ్చా..

విచారణ పూర్తయ్యాక నారాయణస్వామి మీడియాతో మాట్లాడుతూ 'అధికారులు అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానమిచ్చా. వాళ్ల విచారణకు పూర్తిగా సహకరిస్తానని చెప్పాను. మరోసారి విచారణకు రావాలంటే సరేనన్నాను. కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదు' అని అన్నారు. కేవలం వైఎస్సార్‌సీపీ నేతలను మానసికంగా వేధించడానికి టీడీపీ కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగమే ఈ 'సిట్' అని పార్టీ నాయకులు తెలిపారు.

నెల్లూరులోకి ప్రవేశించవద్దన్న షరతుపై స్టే

కాకాణి బెయిల్ షరతులపై హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: అక్రమ మైనింగ్ కేసులో వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి బెయిల్ మంజూరు సందర్భంగా విధించిన పలు షరతుల్లో ఒకదానిని హైకోర్టు పాక్షికంగా సవరించింది. కేసు దర్యాప్తు ముగిసి, చార్జిషీట్ దాఖలు చేసేంత వరకు నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించడానికి వీల్లేదంటూ విధించిన షరతుపై తాత్కాలికంగా స్టే విధిస్తున్నట్లు హైకోర్టు తెలిపింది. బెయిల్ మంజూరు సందర్భంగా నెల్లూరులోకి ప్రవేశించరాదని కాకాణికి షరతు విధించిన తామే, దర్యాప్తు ముగిసి చార్జిషీట్ దాఖలు చేసేంత వరకు ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్ర 5 గంటల్లోపు ఏదో ఒక సమయంలో దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని మరో షరతు విధించామంది. ఈ రెండు షరతులు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తు ముగిసి, చార్జిషీట్ దాఖలు చేసేంత వరకు నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించడానికి వీల్లేదంటూ విధించిన షరతుపై తదుపరి విచారణ వరకు స్టే విధిస్తున్నట్లు హైకోర్టు తెలిపింది. వచ్చే ఆదివారం దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని కాకాణిని ఆదేశించింది. అలాగే, కాకాణి తమ పరిధి దాటి బయటకు వెళ్లడానికి వీల్లేదని గూడూరు కోర్టు ఓ కేసులో షరతు విధించిందని హైకోర్టు గుర్తుచేసింది. కాకాణిపై నమోదైన ఇతర కేసులన్నింటిలోనూ కోర్టు విధించిన షరతులన్నింటినీ పరిశీలిస్తామంది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తాం

వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్



సాక్షి, అమరావతి: 'కూటమి ప్రభుత్వ 14నెలల పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయి. రాష్ట్రంలో ఏమూలన చూసినా హత్యలు, హత్యాచారాలు, దాడులు, దోపిడీలు నిత్యకృత్యమయ్యాయి. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తాం.' అని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు, అన్ని జిల్లాల అధ్యక్షులతో సమావేశం జరిగింది. అనంతరం కాకుమాను రాజశేఖర్ మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వాటిని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పుకోలేక అక్రమ కేసులు బనాయించి వేధిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేశారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు మాత్రం పొలిటికల్ గవర్నెన్స్ పేరుతో ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారిని వేధిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు చేసిందేమీ లేకపోయినా పబ్లిసిటీ కోసం వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తోంది. చంద్రబాబు, ఎల్లో మీడియా కలిసి తిమ్మిని బమ్మిని చేసి ప్రజలను మోసం చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తాం. ప్రభుత్వ దుర్మార్గ పాలనపై రాజీలేని పోరాటం సాగిస్తాం.' అని కాకుమాను రాజశేఖర్ చెప్పారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టండి : సజ్జల

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, చంద్రబాబు సర్కార్ అక్రమాలను ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీది ఎప్పటికీ ప్రజల పక్షమేనని, ప్రజల తరఫున పోరాడటంలో, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో క్రియాశీలకంగా పనిచేసే సైన్యంలో మీరంతా భాగస్వాములవ్వాలని ఆ పార్టీ ప్రచార విభాగం నాయకులకు సజ్జల దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ పి.హరిప్రసాద్ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు ఉత్తుత్తి హెచ్చరికలు

వైఎస్సార్‌సీపీ నేత పోతిన వెంకట మహేష్ మండిపాటు



సాక్షి, అమరావతి: తన సొంత పార్టీలోని ఎమ్మెల్యేల అరాచకాలను చూస్తూ కూడా వారిని అదుపు చేసే స్థితిలో సీఎం చంద్రబాబు లేరని వైఎస్సార్‌సీపీ నేత, ఆ పార్టీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన వెంకట మహేష్ మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ ఎమ్మెల్యేల ఆగడాలపై కేబినెట్‌లో చంద్రబాబు సీరియస్ అయ్యారన్న డ్రామాలు తాటాకు చప్పుళ్లేనని అన్నారు. రాష్ట్రంలో పెచ్చుమీరిన కూటమి ఎమ్మెల్యేల అవినీతి, మహిళలపై దాష్టీకాలకు చంద్రబాబే కొమ్ముకాస్తున్నారని ధ్వజమెత్తారు. ఎక్కడ తన అవినీతిని ప్రశ్నిస్తారోననే భయంతో చంద్రబాబు.. అవినీతి నేతలపై ఉత్తుత్తి వార్నింగ్‌లతో, ప్రజలను మభ్యపెట్టేలా బిల్డప్‌లు ఇస్తున్నారని విరుచుకుపడ్డారు. అరాచకాలు చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులపై చర్యలు తీసుకునే దమ్ము, ధైర్యం చంద్రబాబుకు లేవని చెప్పారు. అటవీ శాఖ అధికారులపై ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తీవ్రంగా దాడి చేస్తే.. ఆ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చిన్న ట్వీట్‌తో సరిపెట్టడం దారుణం అన్నారు. సుగాలి ప్రీతి కేసు, విశాఖ స్టీల్ ప్లాంట్ అంశాలను గెలవగానే వదిలేశారా..? అని నిలదీశారు. 'ఫారెస్ట్ అధికారులను కార్లలో అర్ధరాత్రి వరకూ తిప్పుతూ కొట్టిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని జైల్లో పెట్టారా? డీలర్లతో కమీషన్ల గురించి మధ్యవర్తిత్వం వహించనందుకు మంత్రి అచ్చెన్నాయుడు తనను బదిలీ చేశాడని ఆగ్రోస్ జీఎం రాజమోహన్ చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తే కనీసం పిలిచి విచారించారా? రౌడీషీటర్ శ్రీకాంత్‌కి పెరోల్ ఇవ్వాలని టీడీపీ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పాశం సునీల్ సిఫార్సు లేఖలిచ్చారు. హోంశాఖ రిజెక్టు చేసినా 'వీటో' చేస్తూ ఏకంగా హోం శాఖ మంత్రి అనిత పెరోల్ ఇవ్వాలని సిఫార్సు చేయడంపై ఏం చర్యలు తీసుకున్నారు? గుంటూరు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అసభ్య చేష్టల వీడియోలు.. వాటిని బయట పెట్టారని ఒక మహిళకు వేధింపులపై ఏం చేశారు? దళిత మహిళ, కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను వేధించి వెంటాడి ఆమె మీద కక్ష తీర్చుకున్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై ఏం చర్యలు తీసుకున్నారు? జూనియర్ ఎన్టీఆర్ తల్లిని నారా లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడైన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ అత్యంత దారుణంగా దుర్భాషలాడితే చర్యలు తీసుకోవడానికి ఎందుకు వెనకాడుతున్నారు?' అని మహేష్ ప్రశ్నించారు.

గుర్తు పెట్టుకుని లెక్క సరిచేస్తాం

- దెందులూరు టీడీపీ నేతలకు వైఎస్సార్‌సీపీ నేతల హెచ్చరిక
- తోటల్లో చెట్లను నరికేయడం దారుణం
- భయపెట్టాలని చూస్తే.. అది మీ భ్రమే అవుతుంది
- పోలీసులు స్వామిభక్తితో పని చేస్తున్నారు
- రాబోయేది వైఎస్ జగన్ ప్రభుత్వమే.. గుర్తు పెట్టుకోండి
- మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి పరామర్శ.. ఏఎస్పీకి వినతి పత్రం



టీడీపీ రౌడీమూకలు ధ్వంసం చేసిన పామాయిల్ తోటను నేతలకు చూపిస్తున్న అబ్బయ్య చౌదరి

పెదవేగి/ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో టీడీపీ అరాచక పాలన సాగుతోందని, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దౌర్జన్యాలు, అక్రమాలు మితిమీరిపోయాయని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. అన్నింటినీ గుర్తుపెట్టుకుని లెక్క సరిచేస్తామని స్పష్టం చేశారు. పెదవేగి మండలం కొండలరావు పాలెంలో టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులు విధ్వంసం సృష్టించిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పొలాన్ని వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల బృందం శుక్రవారం పరిశీలించింది. మాజీ మంత్రులు పేర్ని నాని, సాకే శైలజానాథ్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కవురు శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, బొమ్మి ఇజ్రాయిల్, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, లీగల్ సెల్ ప్రెసిడెంట్ మనోహర్ రెడ్డి, ఏపీఎన్‌జీవో మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, తెల్లం బాలరాజు, ఏలూరు, చింతలపూడి నియోజకవర్గాల సమన్వయకర్తలు జయప్రకాష్, కంభం విజయరాజు తదితరులు అబ్బయ్య చౌదరి నివాసానికి చేరుకుని ఆయన్ను పరామర్శించారు. అబ్బయ్య చౌదరి పొలాన్ని పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఎమ్మెల్యే చింతమనేని గ్యాంగ్ చేసిన దాడులు, దౌర్జన్యాలను, కక్షపూరిత రాజకీయాలను మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నాయకులకు వివరించారు. అనంతరం నేతలందరూ కలిసి ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావుకు ఫిర్యాదు చేశారు. కొండలరావుపాలెంలో, ఎస్పీ కార్యాలయం వద్ద మాజీ మంత్రులు పేర్ని నాని, సాకే శైలజానాథ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. వారు చెప్పిన వివరాలు..

అధికారం శాశ్వతం కాదని గుర్తు పెట్టుకోండి

- ప్రత్యర్థుల ఆస్తులను ధ్వంసం చేస్తూ, భయాందోళన సృష్టించడమే టీడీపీ నేతలు పనిగా పెట్టుకున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను భయపెట్టాలని చూస్తే అది చింతమనేనికి భ్రమ మాత్రమే అవుతుంది. పచ్చని చెట్లను నరికివేయడం దారుణం. రక్తం వచ్చేలా టీడీపీ వాళ్లు దాడులు చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారు? టీడీపీ మూకలు డీఎస్పీని సైతం తోసేస్తుంటే ఏం చేశారు? అరాచకాలు చేసే టీడీపీ నేతలను లోపల పెట్టాల్సింది పోయి మా వాళ్లపై కేసులు పెడతారా? ఇదేమి న్యాయం?
- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేకే రక్షణ లేదు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం దేనికి సంకేతం? డీఐజీ నుంచి హోంగార్డు వరకు ఉద్యోగంలోకి ఎంతో సంకల్పంతో వచ్చి ఉంటారు. పోలీసులు రాష్ట్రంలోని రౌడీ మూకలు, గూండాల పీచమణచడానికి కృషి చేయాలి. అలా కాకుండా ఒక రౌడీ చేతిలో కీలుబొమ్మలుగా మారడం దారుణం. ఖాకీ చొక్కాను ముతక చొక్కాగా మార్చేయొద్దు.
- పోలీసులకు జీతాలిస్తున్నది ఎమ్మెల్యే కాదు.. రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే.. అన్ని లెక్కలూ సరిచేస్తాం. రాష్ట్రంలో ఏ వైఎస్సార్‌సీపీ నాయకుడూ ఒంటరి కాదు. వైఎస్సార్‌సీపీ కుటుంబం అండగా ఉంటుంది.
- 30 ఏళ్ల క్రితం రాయలసీమలో ఇలాంటి పరిస్థితులు చూశాం. ఒకప్పుడు వ్యవసాయానికి, కాయకష్టానికి ఈ ప్రాంతం గుర్తింపు పొందింది. ఇప్పుడు బరితెగింపునకు, రౌడీయిజానికి, పోలీసు వ్యవస్థను దిగజార్చేందుకు దెందులూరు మారుపేరుగా మారింది. అబ్బయ్య చౌదరిని చంపేస్తే ఎదురుండదనుకోవడం మూర్ఖత్వం. అధికారంలోకి ఎక్కించిన జనమే నిన్ను కిందపడేసి కాళ్లతో తొక్కటం ఖాయం.


'ఆకాశంలో సగం' అనే మాట మనకు సుపరిచితం. అయితే ఆరోజుల్లో 'స్పేస్ సైన్స్'కు సంబంధించి మహిళా శాస్త్రవేత్తల సంఖ్య చాలా తక్కువ. గతంతో పోల్చితే ఇప్పుడు ఉమెన్ స్పేస్ సైంటిస్ట్‌ల సంఖ్య బాగా పెరిగింది. 'ఇస్రో' మంగళ్‌యాన్ మిషన్ నుంచి చంద్రయాన్ మిషన్ వరకు ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్‌లలో కీలక పాత్ర పోషించారు. శాస్త్ర సాంకేతిక రంగంలో అడుగు పెట్టడానికి ఈతరం అమ్మాయిలకు స్ఫూర్తిని ఇస్తున్నారు...

నేడు నేషనల్ స్పేస్ డే- ఇస్రో

ఈ స్పేస్ మాది..!

ఆకాశమే అపూర్వ పాఠశాల



రీతూ కరిధాల్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన రీతూ కరిధాల్‌కు ఆకాశం ఎప్పుడూ వింతగా అనిపించేది. అంత పెద్దగా కనిపించిన చంద్రుడు ఎందుకు తగ్గుకుంటూ వెళతాడు? పగటి పూట చుక్కలు ఎందుకు కనిపించవు? ఇలాంటి సందేహాలెన్నో ఆ చిట్టి బుర్రకు వచ్చేవి. ఆకాశంపై అమితమైన ఆసక్తే రీతూను సైన్స్ వైపు నడిపించింది. స్కూల్ రోజుల్లో నాసా, ఇస్రోకు సంబంధించిన ప్రాజెక్ట్‌ల సమాచారం గురించి దినపత్రికలలో వెదికేది. కనిపిస్తే వాటిని కట్ చేసి దాచుకునేది.

పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తయిన తరువాత ఇస్రోలో స్పేస్ సైంటిస్ట్‌గా ప్రస్థానం ప్రారంభించింది. ప్రతిష్ఠాత్మకమైన మంగళ్‌యాన్ మిషన్‌తో పాటు ఇస్రోలోని ఎన్నో ప్రాజెక్ట్‌లలో కీలక బాధ్యతలు నిర్వహించింది రీతూ కరిధాల్.

'మంగళ్‌యాన్ మిషన్ కోసం పనిచేయడం అపూర్వ అనుభవం. నిరంతర మేధోమథనం జరుగుతుండేది. సెలవు అంటూ లేకుండా పని చేశాం. వృత్తి, కుటుంబ జీవితాన్ని సమన్వయం చేసుకోవడం అంత తేలిక కాదు. అయితే నా భర్త, కుటుంబ సభ్యుల సహకారం వల్ల అది సాధ్యం అయింది' అంటుంది రీతూ కరిధాల్.

భూదేవి అంత ఓపిక... ఆకాశమంత ప్రతిభ



ప్రతిష్ఠాత్మకమైన మంగళ్‌యాన్ మిషన్ ప్రతిభావంతులైన మహిళా శాస్త్రవేత్తలను లోకానికి పరిచయం చేసింది. ఆ మహిళా శాస్త్రవేత్తలపై 'ఇస్రో'స్ మాగ్నిఫిసియెంట్ ఉమెన్ అండ్ దెయిర్ ఫ్లైయింగ్ మెషీన్స్' పేరుతో పుస్తకం రాసింది మిన్నీ వేద్. నందిని, రీతూ కరిధాల్, మౌమిత దత్తా, మినై సంపత్... మొదలైనవారి గురించి ఈ పుస్తకంలో రాసింది. 'స్పేస్'ను కెరీర్‌గా ఎంచుకోవడానికి కారణం ఏమిటి? రకరకాల ఒత్తిళ్లను తట్టుకొని ఎలా ముందుకు వెళ్లారు? వృత్తి, కుటుంబ జీవితాన్ని ఎలా సమన్వయం చేసుకున్నారు?.... ఇలాంటి ప్రశ్నలకు ఈ పుస్తకం సమాధానం చెబుతుంది. మన దేశంలో ఫస్ట్ ఇండిజినస్ రాడార్ ఇమేజింగ్ శాటిలైట్ రిసాట్-1 ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేసిన వలర్మతి వ్యక్తిగత, ఉద్యోగ జీవిత అనుభవాలు కూడా ఈ పుస్తకంలో కనిపిస్తాయి. మంగళ్‌యాన్ మిషన్ సిస్టమ్ ఇంటిగ్రేషన్ ఇన్‌చార్జిగా పనిచేసిన మినాల్ సంపత్ స్పేస్‌క్రాఫ్ట్ టెస్టింగ్ పనుల్లో భాగంగా బెంగళూరు, అహ్మదాబాద్‌ల మధ్య తరచు ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఆ సమయంలో మూడు సంవత్సరాల తన కుమారుడు గుర్తుకు వచ్చేవాడు. 'మా బాబు గుర్తుకు వచ్చిన సమయంలో పేలోడ్స్ కూడా నా బిడ్డలే కదా అనుకునేదాన్ని' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది మినాల్ సంపత్. ఇలాంటి జ్ఞాపకాలు ఎన్నో ఈ పుస్తకంలో కనిపిస్తాయి.

సైన్స్ ఫిక్షన్ టు ఇస్రో సైంటిస్ట్

తన చిన్నప్పుడు టెలివిజన్‌లో వచ్చే స్టార్ ట్రెక్, సైన్స్ ఫిక్షన్ అంటే నందిని హరినాథ్‌కు చాలా ఇష్టం. టీవీలో వచ్చే సైన్స్ ప్రోగ్రామ్స్‌పై అమిత ఆసక్తి ప్రదర్శించే నందిని తాను స్పేస్ సైంటిస్ట్ అవుతానని అనుకోలేదు.

'జస్ట్ అలా జరిగింది అంతే!' అని స్పేస్ సైంటిస్ట్‌గా తన ప్రయాణం గురించి నవ్వుతూ చెబుతుంది నందిని.


నందిని హరినాథ్

ఉద్యోగంలో చేరిన కొత్తలో రోజుకు పన్నెండు నుంచి పద్నాలుగు గంటలు పనిచేసిన రోజులు ఉన్నాయి. భోజనం చేయడం కూడా మరిచి పనిచేసిన రోజులు ఉన్నాయి.

'ఇస్రో సైంటిస్ట్ అని పరిచయం చేసినప్పుడు ప్రజలు గౌరవించే తీరు వృత్తిపట్ల బాధ్యతను మరింత పెంచుతుంది. మంగళ్‌యాన్ ప్రాజెక్ట్‌లో భాగం కావడం గర్వంగా భావిస్తున్నాను. ఆ ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్ కోసం పనిచేస్తున్నప్పుడు నిద్ర, తిండి గురించి పట్టించుకునేవాళ్లం కాదు. ఇంట్లో తక్కువ సమయం మాత్రమే గడిపేవాళ్లం. ఈ ప్రాజెక్ట్ కోసం ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాం' అంటుంది నందిని హరినాథ్.

వివక్ష లేదు... ప్రతిభే ప్రమాణం


అనురాధ టీకె

'నేను ఇస్రోలో 1982లో చేరినప్పుడు అక్కడ కొద్ది మంది మహిళా ఉద్యోగులు మాత్రమే కనిపించేవారు. ఊహకు అందని రీతిలో ఇప్పుడు ఎంతో మంది పనిచేస్తున్నారు' అంటుంది అనురాధ టికె. ఇస్రో శాటిలైట్ సెంటర్‌లో జియోశాట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ అయిన అనురాధ ఎంతోమంది అమ్మాయిలకు రోల్ మోడల్. 'తొమ్మిది సంవత్సరాల వయసులోనే ఆకాశంపై ఆసక్తి మొదలైంది' అని తన బాల్యాన్ని గుర్తు తెచ్చుకుంటుంది అనురాధ. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడిపై అడుగు పెట్టడం గురించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ద్వారా విన్న అనురాధ సంభ్రమాశ్చర్యాలకు గురైంది. 'చంద్రుడిపై మానవుడు' అనే అంశంపై తన మాతృభాష కన్నడంలో కవిత రాసింది.

'ఇస్రోలో స్త్రీ, పురుషులు అనే భేదం ఉండదు. ప్రతిభ, అంకితభావం మాత్రమే ప్రమాణం. స్పేస్ ప్రోగ్రామ్స్‌లో ఎంతమంది మహిళలు పనిచేస్తే అంత మంచిది. అది ఎంతో అమ్మాయిలకు స్ఫూర్తినిస్తుంది. వారు చేస్తున్నారు. మేము కూడా చేయగలం అనే ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది' అంటుంది అనురాధ.

వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ ఇస్రో

ఒకప్పుడు ఇస్రోలో పనిచేసిన మహిళలు రిటైర్ అయిన తరువాత ఇంటికే పరిమితం కావచ్చుగాక, అయితే వారు ఎక్కడ ఉంటే అక్కడ ఇస్రో కొలువుదీరుతుంది. ఆనాటి శాస్త్రసాంకేతిక విషయాల గురించి చందమామ కథల్లా ఈతరం పిల్లలకు చెబుతుంటారు. అలాంటి వారిలో ఇస్రోలో తొలి మహిళా కెమికల్ ఇంజనీర్ లలితా రామచంద్రన్ ఒకరు. 1969లో విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సి)లో టెక్నికల్ అసిస్టెంట్‌గా చేరినప్పుడు ఆమె వయసు 22 సంవత్సరాలు. తిరువనంతపురంలో క్రయోజనిక్ అప్పర్ స్టేజ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఆమె రిటైర్ అయ్యారు. 'ఆ రోజుల్లో పెద్దగా సౌకర్యాలు లేకపోవచ్చు. అయితే ప్రఖ్యాత శాస్త్రవేత్తలతో కలిసి పనిచేసే అదృష్టం దక్కింది' అంటారు లలిత.


లలితా రామచంద్రన్

1972లో ఇస్రోలో చేరారు జె.గీత. 'ఆరోజుల్లో నెట్ లేదు. డేటా సేకరణ అనేది ప్రధాన సవాలుగా ఉండేది. రిసెర్చ్, రిఫరెన్స్ కోసం లైబ్రరీలకు వెళ్లి గంటల కొద్ది సమయం గడిపేవాళ్లం' అంటున్న గీత... సతీష్‌ధావన్, వసంత్ ఆర్ గోవరికర్‌లాంటి స్టాల్‌వాల్ట్స్ మార్గదర్శకత్వంలో పనిచేశారు.

'ప్రాజెక్ట్‌లకు సంబంధించిన చర్చల్లో చురుగ్గా పాల్గొనేవాళ్లం. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా తమ అభిప్రాయాలను నిస్సంకోచంగా చెప్పే స్వేచ్ఛ ఉండేది. జూనియర్ చెప్పినా సరే, ఆ అభిప్రాయం నచ్చితే ఆమోదించేవారు' అంటున్న రాధిక రామచంద్రన్ 'కేరళ యూనివర్శిటీ'లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయిన తరువాత 1984లో ఇస్రోలో చేరారు.

వంటిల్లు

స్వీట్ కార్న్‌తో హాట్‌హాట్‌గా...



ఉడికించిన స్వీట్‌కార్న్ రుచే వేరే లెవల్! ఉప్పూ కారం జోడించి, కాసింత నిమ్మరసం తగిలిస్తే అహో అద్భుతం అనాల్సిందే. అలాంటి స్వీట్‌కార్న్‌తో వెరైటీ వంటకాలంటే నోరూరుతుంది కదూ! మరింకెందుకు ఆలస్యం ఇలా ట్రై చేసి చూడండి!

స్వీట్‌కార్న్ ఇడియాప్పం



కావలసినవి: స్వీట్ కార్న్ గుజ్జు – 3 కప్పులు; బియ్యప్పిండి – 2 కప్పులు; ఓట్స్ పౌడర్, మైదా లేదా గోధుమ పిండి – పావు కప్పు చొప్పున; జీలకర్ర పొడి – పావు టీ స్పూన్; చిక్కటి పాలు – పావు కప్పు (కాచి చల్లార్చినవి); నీళ్లు – కొద్దిగా, నెయ్యి – టీ స్పూన్; ఎల్లో ఫుడ్ కలర్ – (అభిరుచి బట్టి).

తయారీ: ముందుగా ఒక బౌల్ తీసుకుని అందులో బియ్యప్పిండి, ఓట్స్ పౌడర్, మైదా లేదా గోధుమ పిండి, జీలకర్ర పొడి, స్వీట్ కార్న్ గుజ్జు, పాలు వేసుకుని కలుపుకోవాలి. అవసరాన్ని బట్టి నీళ్లు పోసుకుంటూ ముద్దలా చేసుకోవాలి. ఇప్పుడు ఫుడ్ కలర్ వేసుకుని.. మరోసారి బాగా కలుపుకోవాలి. తర్వాత ఇడ్లీ పాన్‌కి బ్రష్‌తో నెయ్యి పూసుకుని, మురుకుల మేకర్‌కి సన్నని హోల్స్ ఉండే ప్లేట్‌ని అమర్చి, అందులో ఈ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా నింపుకుని, ఇడ్లీ పాన్‌లో నూడుల్స్‌లా ఒత్తుకోవాలి. అనంతరం ఆవిరిపై ఉడికించాలి. అభిరుచిని బట్టి ఆవాలు, కరివేపాకు, కొత్తిమీరలతో తాలింపు వేసి, కలుపుకుని.. సర్వ్ చేసుకుంటే అదిరిపోతుంది.

స్వీట్ కార్న్ హల్వా



కావలసినవి: స్వీట్ కార్న్ – 2 కప్పులు (నీళ్లు పోసి మెత్తగా గుజ్జులా చేసుకోవాలి); బాదం పాలు – ఒక కప్పు; కస్టర్డ్ మిల్క్ – పావు కప్పు; పంచదార – 4 లేదా 6 టేబుల్ స్పూన్లు (పెంచుకోవచ్చు); ఏలకుల పొడి – ఒక టీ స్పూన్; నెయ్యి – 4 టేబుల్ స్పూన్లపైనే; కుంకుమ పువ్వు – చిటికెడు(అభిరుచిని బట్టి); వెనీలా ఎసెన్స్ – ఒక టీ స్పూన్; బాదపప్పు – 2 టేబుల్ స్పూన్లు (దోరగా నేతిలో వేయించాలి, అభిరుచిని బట్టి జీడిపప్పు, కిస్మిస్ వంటివి జోడించుకోవచ్చు)

తయారీ: ముందుగా ఒక పెద్ద బౌల్ తీసుకుని అందులో కస్టర్డ్ మిల్క్, బాదం పాలు, పంచదార, ఏలకుల పొడి, స్వీట్‌కార్న్ గుజ్జు ఒకదాని తర్వాత ఒకటి వేసుకుని మరోసారి కలుపుకోవాలి. అనంతరం స్టవ్ ఆన్ చేసుకుని.. పాన్ బౌల్‌లో సగం నెయ్యి వేసుకుని, వేడి చేసుకుని.. అందులో ఈ మిశ్రమం మొత్తం వేసుకుని చిన్న మంట మీద ఉడికించుకోవాలి. ఆ సమయంలో గరిటెతో తిప్పుతూనే ఉండాలి. మధ్యలో మిగిలిన నెయ్యి వేసుకుని గరిటెతో బాగా కలుపుకోవాలి. కాస్త దగ్గర పడుతున్నప్పుడు వెనీలా ఎసెన్స్ వేసుకుని మరోసారి కలపాలి. ఆ మిశ్రమం మరింత దగ్గర పడుతున్న సమయంలో నేతిలో వేయించిన బాదం పప్పు వంటి వేసుకుని స్టవ్ ఆఫ్ చేసుకుని సర్వ్ చేసుకోవచ్చు.

స్వీట్‌కార్న్ కేక్



కావలసినవి: స్వీట్ కార్న్ – 5 కప్పులు (ఉడికించి, గుజ్జులా చేసుకోవాలి), పిస్తా, వాల్‌నట్స్, బాదం – అర కప్పు చొప్పున, వెన్న – పావు కప్పు, బేకింగ్ పౌడర్ – టీ స్పూన్, పంచదార పొడి – సరిపడా, మైదాపిండి – పావు కప్పు, ఉప్పు – అర టీ స్పూన్, నెయ్యి – కొద్దిగా.

తయారీ: ముందుగా చిన్నబౌల్ తీసుకుని.. అందులో మైదా పిండి, బేకింగ్ పౌడర్, ఉప్పు వేసుకుని కలిపి పక్కన పెట్టుకోవాలి. తర్వాత వాల్‌నట్స్, బాదం, పిస్తాలను నేతిలో వేయించుకుని, చల్లారిన తర్వాత, వాటిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక పెద్ద బౌల్ తీసుకుని.. అందులో వెన్న, స్వీట్‌కార్న్ గుజ్జు వేసుకుని బాగా కలుపుకోవాలి. అవసరం అయితే మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమంలో, పంచదార పొడి, మైదాపిండి మిశ్రమాన్ని వేసుకుని బాగా కలుపుకోవాలి. చివరిగా వాల్‌నట్, బాదం, పిస్తా ముక్కలు వేసుకుని, ఒకసారి కలిపి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు గుండ్రటి బేకింగ్ టిన్‌కి నెయ్యి రాసి.. అందులో ఈ మిశ్రమాన్ని మొత్తం వేసుకుని సమాంతరంగా చేసుకోవాలి. తర్వాత ఓవెన్‌లో బేక్ చేసుకుంటే సరిపోతుంది. కేక్ బేక్ అయిన తర్వాత క్రీమ్‌తో డెకరేట్ చేసి.. నచ్చిన విధంగా అలంకరించుకుని నచ్చిన విధంగా కట్ చేసుకుని సర్వ్ చేసుకోవచ్చు.

● సౌందర్యాత్మక హింస

భార్యల బాడీ షేమింగ్ ఎన్నాళ్లు?



భార్యను బాడీ షేమింగ్ చేయడం ఎప్పటి నుంచో ఉంది. శరీర ఆకృతిని బట్టి పేర్లు పెట్టి పిలుస్తూ వేధిస్తారు భర్తలు. తాజాగా ఒక భర్త మరీ శృతి మించాడు. భార్యను నోరా ఫతేహిలా మారమని రోజుకు మూడు గంటలు జిమ్ చేయిస్తున్నాడు. జిమ్ చేయలేని రోజు పస్తు పెడుతున్నాడు. గర్భం వస్తే అబార్షన్‌కూ వెనుకాడటం లేదు. ఘజియాబాద్‌లో ఆ భార్య పోలీస్ స్టేషన్‌కు వచ్చి 'ఈ భర్త నాకు వద్దు' అని ఫిర్యాదు చేసింది. అంతా నచ్చి, అన్నీ చూసి వివాహం చేసుకున్నాక భర్తలకు వస్తున్న ఈ పాడు జబ్బుకు మందు వెతకాలి.



భార్య పొట్టిగా ఉంటే ఒక నిక్‌నేమ్, సన్నగా ఉంటే మరొకటి, నల్లగా ఉంటే... లావుగా ఉంటే... పొడవుగా ఉంటే... పలు వరుస సరిగా లేకపోతే... జుట్టు పలుచగా ఉంటే... శరీర అంగాలు పెద్దవో చిన్నవో ఉంటే... భర్తలు వాటిని కేంద్రంగా చేసుకుని నిక్‌నేమ్స్‌తో పిలుస్తూ ఇంట్లో, పిల్లల ఎదుట, బంధువుల సమక్షంలో ఆట పట్టించడం ఆనవాయితీ. దీనికి అంగీకారం ఉండటం మన సంప్రదాయం. ఆ నిక్‌నేమ్స్ ఏదో సరదాగా పెట్టినట్టు అనిపించినా, భర్త అలా పిలవడంలో ఏదో గారాబం కనిపించినా, ఆ పేర్లన్నీ భార్యను బాడీ షేమింగ్ చేసేవే. భార్య తన భర్తకు నిక్‌నేమ్ పెట్టదు. పెట్టలేదు. పెట్టి నలుగురిలో పిలిస్తే పర్యవసానాలు మనకు తెలుసు. కాని భర్తలు మాత్రం భార్యలను బాడీ షేమింగ్ చేయడం తమ హక్కుగా భావిస్తూ ఉంటారు.

ఫిట్‌నెస్ వేరు... అందం వేరు

భార్యాభర్తలు ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాల్సిందే. పిల్లలు పెరిగి ఒక వయసు వచ్చాక శారీరక మార్పులు స్త్రీ, పురుషుల్లో వస్తాయి. ఫిట్‌నెస్ కోసం కనీస వ్యాయామం, వాకింగ్, ఆహార జాగ్రత్తలు తీసుకోవడం ఇరువురూ పాటించాల్సిందే. భార్య ఫిట్‌నెస్ కోసం భర్తలు సూచనలు చేయడం, వ్యాయామం కోసం ప్రోత్సహించడం మంచి విషయం. కాని సౌందర్యాభిలాషతో, ఇతర స్త్రీలతో పోలుస్తూ... ఈ విధంగా ఉంటే నువ్వు బాగుంటావు... లేకుంటే నచ్చవు అనే సందేశం ఇస్తున్నట్టుగా మాట్లాడటం ఆమెను హింసించడమే. జన్యువుల వల్ల, శరీర తత్వం వల్ల కొందరు స్త్రీల శరీరంలో వ్యాయామంతో తగ్గని బరువు ఉండొచ్చు. లేదా కాన్పుల వల్ల, మెనోపాజ్ వల్ల కూడా తీవ్రమైన మార్పులు రావచ్చు. వాటిని అర్థం చేసుకుని, భార్య ఆరోగ్యం కోసం ప్రయత్నించాలి తప్ప అనునిత్యం కించ పరుస్తూ ఉంటే తప్పు,... నేరం కూడా. కాని భర్తలు ఈ విషయంలో మారడం లేదు. సొంత పిల్లల ఎదుట కూడా భార్యను గేలి చేస్తూ పిల్లలు ఆమెను తేలిగ్గా తీసుకునేలా చూస్తున్నారు.

నోరా ఫతేహిలా ఉండు

కాని ఆగస్టు 20వ తేదీన ఒక భార్య ఆవేదన ఇలాంటి భర్తల స్వభావాన్ని మరోసారి బట్టబయలు చేసింది. ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన ఒక వివాహిత అక్కడి మహిళా పోలీస్ స్టేషన్‌కు వచ్చి భర్త మీద కేసు పెట్టింది. ఆమె తన ఫిర్యాదులో– 'నేను ఈ సంవత్సరం మార్చి నెలలో వివాహం చేసుకున్నాను. నా భర్త ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్. పెళ్లిలో మా వాళ్లు 6 లక్షల బంగారం, 24 లక్షల స్కార్పియో, 10 లక్షల రొక్కం ఇచ్చారు. కాని పెళ్లయి వచ్చినప్పటి నుంచి నన్ను నా భర్త నోరా ఫతేహీ ఫిగర్‌లాంటిది సాధించాలని వేధిస్తున్నాడు. ఇందుకోసం నాకు రోజుకు 3 గంటల వర్కవుట్ చెప్పి చేయిస్తున్నాడు. ఆ వర్కవుట్లు చేసి అలసి ఏ రోజైనా చేయకపోతే ఆ రోజు నాకు అన్నం పెట్టడం లేదు. అత్తామామలు కూడా అతనికి వంత పాడుతున్నారు. నేను చూడటానికి బాగానే ఉంటాను. కాని అతను అది చాలదని, పిల్లలు కూడా ఇప్పుడే వద్దని, గర్భం వస్తే అబార్షన్ చేయించుకోవాలని చెబుతూ నన్ను భయభ్రాంతం చేస్తున్నాడు. ఈ భర్తు వద్దు' అని ఫిర్యాదు చేసింది.

ఆరోగ్యం, అనురాగం

భార్యాభర్తల మధ్య ఉండాల్సింది అనుబంధం, అనురాగం, గౌరవం. వారిరువురూ తమ బంధాన్ని బలపరుచుకుంటూ పరస్పరం ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటూ సంతోషంగా జీవిస్తే రూపం సమస్య కాబోదు. రూపదోషాల నిర్వచనం ఒకరి సొత్తు కాదు. కొలతలతో ఉండేదే ఆకృతి కాదు. సంతోషకర దాంపత్యమే అందం, ఆనందం.

● బ్యూటిప్

నాలుగు బాదం పలుకులను పొడి చేయాలి. దీంట్లో టీ స్పూన్ రోజ్ వాటర్, టీ స్పూన్ పచ్చిపాలు కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి వేళ్లతో వలయాకారంలో పది నిమిషాల పాటు మర్దనా చేసి, అయిదు నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో కడిగేసి, పొడిగా తుడిచిన తరవాత మాయిశ్చరైజర్ అప్లై చేయాలి. ఈ విధంగా వారంలో ఒకసారి చేయడం వలన చర్మం నునుపవుతుంది.



బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
ఆగస్టు 22న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,01,510	1,02,310	1,00,530	1,02,310	1,01,000	1,00,530
బంగారం (22 క్యారెట్లు)	94,460	92,150	92,150	94,910	92.920	92,150
వెండి	1,17,300	1,17,400	1,28,000	1,17,300	1,17,100	1,28,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● అక్షరం

స్టడీ..రెడీ.. స్టార్ట్ అప్

అక్షరం అంటే ఆమెకు ఆరాధన. పుస్తక పఠనమంటే ప్రీతి. దాంతో అందరూ ఆమెను పుస్తకాల పురుగు అని పిలిచేవారు. పుస్తకాలు చదువుతూనే ఆమె మార్కెటింగ్‌లో ఎం.బి.ఎ. పూర్తి చేసింది. అయితే ఆ చదువును ఆమె కార్పొరేట్ సంస్థలలో లక్షలు సంపాదించి పెట్టే ఉద్యోగం చేయడానికి ఉపయోగించుకోదలచుకోలేదు. సెల్‌ఫోన్లతో... రకరకాల గ్యాడ్జెట్స్‌తో... కంప్యూటర్ గేమ్స్‌తో బిజీ బిజీగా ఉంటున్న నేటి తరంతో కూడా పుస్తకాలను చదివించాలనుకుంది. ముందు తన కూతురు చదవడం కోసం ఆమెను ఆకట్టుకునే పుస్తకాల కోసం వెతుకుతూ, తనకు కావలసిన పుస్తకాలేవీ కనిపించకపోయేసరికి తానే ఒక పుస్తకాలు అమ్మే వ్యాపారాన్ని ఎందుకు ప్రారంభించకూడదు.. అన్న ఆలోచన కలిగింది. అదే బిబ్లియోఫైల్స్ అనే స్టార్టప్‌కు పునాదిగా మారింది. ఆమే ముంబయ్‌కి చెందిన అపూర్వ మాత్రే.



ప్రారంభించిన 6 నెలల్లో 10 వేలకు పైగా కస్టమర్లు 150+ ప్రేరణాత్మక సమీక్షలు వచ్చాయి. ఎందుకంటే బిబ్లియోఫైల్స్ నినాదమే చదవడాన్ని ఒక జీవనశైలిగా మార్చుకోవడం. ఈ ఆలోచనతోనే, అపూర్వ మాత్రే 2020లో పిల్లల పుస్తకాలు అమ్మే స్టార్టప్‌ను స్థాపించింది.



ఒక ఆలోచన నుంచి పుట్టింది

స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలో అనుభవజ్ఞురాలైన అపూర్వ మాత్రే, గొప్ప కార్పొరేట్ నేపథ్యం కలిగిన వ్యూహాత్మక సలహాదారు అద్వైష్ దళ పతిని తన జీవితంలోనే కాదు... వ్యాపారం లో కూడా భాగస్వామిని చేసుకుంది. వారి భాగస్వామ్యం బిబ్లియోఫైల్స్‌కు మూలస్తంభం. విభిన్న నైపుణ్యాలతో కలబోసుకున్న కలలు అద్భుతమైన ఒక ఆలోచనను ఎలా సృష్టించగలవో ఇది రుజువు చేస్తుంది,

''ఒక పుస్తక ప్రియురాలిగా నా బిడ్డకు బాల్యం నుంచే చదవడం పరిచయం చేయాలన్నది నా ఆలోచన. అయితే అది ఒక పనిగా అనిపించకూడదు – దానిని ఆనందదాయకంగా మార్చాలనుకున్నాను. నా కుమార్తె అభిరుచులకు సరిపోయే వయస్సుకు తగిన పుస్తకాలను నేను జాగ్రత్తగా పరిశోధించి ఎంచుకున్నాను. ఫలితంగా, ఆమె పుస్తకంతో ప్రేమలో పడింది. స్క్రీన్ సమయాన్ని తగ్గించేసింది.

త్వరలోనే ఆమె తన స్నేహితులు, కుటుంబ సభ్యులకు వయస్సుకు తగిన పుస్తకాలను సిఫార్సు చేయడం, అమ్మడం ప్రారంభించింది. పిల్లలు ఈ పుస్తకాలను ఇష్టపడ్డారు. చదవడం ఒక ఆహ్లాదకరమైన అనుభవంగా మారింది.

పుస్తకాలతోపాటు...

ప్రారంభంలో పుస్తకాలను మాత్రమే అమ్మే ఈ కంపెనీ చాలా దూరం వచ్చింది. ఇప్పుడు విద్యార్థుల కోసం వివిధ రకాల ఉత్పత్తులను అందుబాటు ధరలలో అందిస్తోంది. ఇందులో లంచ్‌బాక్సులు, బాటిళ్లు, అందమైన స్టిక్కర్ ట్యాగ్‌లు ఇలాంటి అనేక ఇతర వస్తువులు ఉన్నాయి. పిల్లల పుస్తకాల విషయానికి వస్తే అనేక ఎంపికలు ఉన్నాయి.

అసలు చదవడం ఒక జీవనశైలిగా మార్చుకోవాలంటుంది అపూర్వ. దీనిని సాధించాలంటే... మనం మన పిల్లలకు ప్రినేటల్ దశ నుంచే అంటే గర్భంలో ఉన్నప్పటి నుంచే పుస్తకాలు చదివి వినిపించాలన్నది ఆమె ఆలోచన. ఇందుకోసం ప్రత్యేకమైన వాట్సాప్ గ్రూప్ కూడా ఉంది; అది కొత్తపుస్తకం మార్కెట్లోకి ప్రవేశించిన క్షణం నుంచి సిఫార్సులు పంచుకునే స్థలం. బిబ్లియోఫైల్స్ అంతిమ లక్ష్యం భవిష్యత్తు కోసం సిద్ధంగా ఉన్న... సంతోషంగా, బాగా అభివృద్ధి చెందిన పిల్లలను పెంచడం. ఆమె లక్ష్యం నెరవేరాలని ఆశిద్దాం.

> సోషల్ మీడియా, అధిక స్క్రీన్ సమయం ఉన్న సమకాలీన కాలంలో బిబ్లియోఫైల్స్ వంటి స్టార్టప్‌లు మనలోని సృజనాత్మక, ఊహాత్మక స్వభావాన్ని గ్రహించడంలో, దానితో కనెక్ట్ అవ్వడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇది ముఖ్యంగా మన ఆత్మను సజీవంగా ఉంచుతుంది. యువ హృదయాలలో ప్రేమ, కరుణ, సానుభూతిని పెంపొందించడం చాలా అవసరం. బిబ్లియోఫైల్స్ విలువలు, సూత్రాల ద్వారా దానిని సాధ్యం చేస్తోంది.

అవును... నేనే ఓ బిబ్లియోఫైల్

"నేను బిబ్లియోఫైల్స్‌ను ప్రారంభించినప్పుడు, దానిని ఎలా పెంచుకోవాలో నాకు తెలియదు. నా కుమార్తె జీవితాంతం చదవగలిగేందుకు సరిపడా పుస్తకాలు కొన్నప్పటికీ, నేను ఖర్చు చేసినంత సంపాదించలేదనే అపరాధ భావనలోకి నాకు తెలియకుండానే వెళ్లిపోయాను. ఈ ఆలోచన నిప్పురవ్వలా నా అభిరుచిని రగిలించింది, అది నా వృత్తిగా మారింది. అవును... బిబ్లియోఫైల్స్ పుట్టింది, ఎందుకంటే నేనే ఓ బిబ్లియోఫైల్ కాబట్టి. అందుకే నేను దీని ద్వారా ఎంత సంపాదించ గలిగానన్న దానికంటే ఏం సాధించానన్నదే నాకు సంతృప్తినిస్తుంది."

– అపూర్వ మాత్రే



● విహారం

ఆయువు పెంచే ఆనంద తీరం!

సుదీర్ఘకాలం జీవించాలని కోరుకోని వారు ఎవరుంటారు చెప్పండి... అయితే అలా కోరుకుంటే మాత్రం ఆయుష్మంతులు కావడం అందరికీ సాధ్యం కాదు కదా... దీర్ఘాయువు కావాలనుకునే వారు మాత్రం ఈ అధ్యయనం గురించి చదివి తీరాల్సిందే.

అమెరికాలోని ఒహియో స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు జనాభా లెక్కల ప్రాంతాలలోని జనాభా డేటాను – ఆయుర్దాయంతో సహా – విశ్లేషించగా బయట పడిన విశేషం ఏమిటంటే సముద్రపు గాలి తగిలే ప్రదేశంలో నివసించే వారు తక్కిన వారికన్నా ఎక్కువ కాలం జీవిస్తున్నారట. వారి అధ్యయనం ప్రకారం...

తీరప్రాంత నివాసితులు 79 సంవత్సరాల సగటు కంటే ఒక సంవత్సరం లేదా అంతకంటే ఎక్కువ కాలం జీవిస్తారని అంచనా. తీరప్రాంత నివాసితులు బహుశా ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న వివిధ కారణాల వల్ల ఎక్కువ కాలం జీవిస్తారని పరిశోధకుడు జియాన్యోంగ్ జామీ వు అన్నారు.



తక్కువ ఉష్ణోగ్రతలు, మెరుగైన గాలి, వినోదం కోసం ఎక్కువ అవకాశాలు, మెరుగైన రవాణా, కరువుకు తక్కువ అవకాశం, అధిక ఆదాయాలు అన్నీ లోతట్టు ప్రాంతాలలో నివసించే వారితో పోలిస్తే తీరప్రాంత నివాసితులకు మెరుగైన దృక్పథానికి దోహదపడతాయని విశ్లేషణ సూచించింది.

'కాలుష్యం, పేదరికం, శారీరకంగా చురుకుగా ఉండటానికి తగిన అవకాశాలు లేకపోవడం, వరదలు వచ్చే ప్రమాదం పెరగడం ఈ తేడాలకు కారణమయ్యే అవకాశం ఉంది' అని పోస్ట్‌డాక్టోరల్ పరిశోధకురాలు యాని కావో అన్నారు. మొత్తం మీద వీరి పరిశోధన 'నీలిరంగు స్థలం' లో జీవించడం, 'ఎక్కువ కాలం జీవించడం' మధ్య సంబంధం ఉందా... అని ఆలోచించేలా చేసింది.

● ఆహారం

ఉపవాసం ఎలా ఉత్తమం?

బరువు తగ్గేందుకు చాలామంది చేస్తున్న రకరకాల ప్రయత్నాలలో ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యం పొందిన మాట ఇంటెర్మిటెంట్ ఫాస్టింగ్. అయితే స్త్రీలకు మాత్రం ఈ పద్ధతి అంత మంచిది కాదంటున్నారు వైద్యనిపుణులు.

ఇంటెర్మిటెంట్ ఫాస్టింగ్ అనేది తినే సమయానికి, ఉపవాసానికీ మధ్య నిర్దేశించుకున్న వ్యవధులను పాటించే పద్ధతి. ఉదాహరణకు ఆహారం తీసుకోవడం ఉదయం పది నుంచి సాయంత్రం ఆరుగంటల లోగా ముగించేయాలి. ఆ తర్వాత ఏమీ తినకూడదు. దీనివల్ల బరువు తగ్గడం, మెరుగైన జీవక్రియలు, మంచి జీవన నాణ్యత వంటి ప్రయోజనాలున్నాయి. ఈ ఐఎఫ్ అనేది మీరు ఎప్పుడు తింటారు అనే దానిపై దృష్టి పెట్టాలని చెబుతుంది.

స్త్రీలకు జాగ్రత్త ఎందుకు ?

అధిక ఉపవాసం మహిళల హార్మోన్లలో అసమతుల్యతకు దారితీస్తుంది – ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ – ఋతు చక్రాలు, అండోత్సర్గం, థైరాయిడ్ స్థాయులు, పీసీఓస్, సంతానోత్పత్తిని కూడా ప్రభావితం చేస్తుంది. ఇది పునరుత్పత్తి పనితీరును నియంత్రిస్తుంది. అంతేకాదు.. ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్‌ను ప్రేరేపించడం వల్ల ఆందోళన, చిరాకు నిద్రపోవడంలో ఇబ్బందులు వంటి సమస్యలకు దారితీస్తుంది. అందువల్ల ఇలాంటి లక్షణాలు కనిపిస్తే మాత్రం ఈ తరహా ఉపవాసానికి దూరంగా ఉండటం ఉత్తమం.



నెమ్మదిగా ప్రారంభించండి, నెమ్మదిగా వెళ్లండి

16 గంటలు ఉపవాసం ఉండి మిగిలిన 8 గంటల వ్యవధిలోపు తినడం మంచిది. అంటే 12/12 మోడ్‌లో, ఉపవాసం రాత్రి 8 నుండి ఉదయం 8 గంటల వరకు, తినే సమయం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉండాలంటున్నారు. రాత్రి ఆలస్యంగా భోజనం చేసే అలవాటున్న వారికిది ప్రయోజనకరం.

సమృద్ధిగా తినండి... హైడ్రేటెడ్ గా ఉండండి

ఈ పద్ధతి పాటించేవారు కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులు – ఫైబర్ వంటి అన్ని సూక్ష్మ పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు, బయోఫ్లేవనాయిడ్స్ వంటి ఇతర పోషకాలను తగినంత పరిమాణంలో అందేలా చూసుకోవాలి. ఇందుకోసం కూరగాయలు, పండ్లు, గింజలు, విత్తనాలు, తృణధాన్యాలు, లీన్ మాంసాలు, చేపలు, గుడ్లు, చిక్కుళ్ళు వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలకు ప్రాధాన్యత ఇస్తూనే, పెరుగు, పెరుగు వంటి ప్రోబయోటిక్స్, ఫైబర్ అధికంగా ఉండే కూరగాయలు, పండ్లు వంటి ప్రీ బయోటిక్ వనరులను చేర్చడం కూడా ముఖ్యం. ఉపవాస సమయాల్లో హైడ్రేటెడ్ గా ఉండటం కూడా ముఖ్యం. ఇంటి పని, వంట పని, ఆఫీసు పని తదితర పనుల ఒత్తిడిలో ఉండే స్త్రీలకు ఇన్ని జాగ్రత్తలను పాటించడం కష్టం కాబట్టి దీనికి దూరంగా ఉండటమే ఉత్తమం అంటున్నారు డైటీషియన్లు.

సాక్షి సినిమా


● మహేశ్‌బాబు

కామెరూన్‌తో ఫస్ట్ లుక్ రిలీజ్?

హీరో మహేశ్‌బాబు–దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్‌ను సెప్టెంబరులో నైరోబీ, టాంజానియా, సౌత్ ఆఫ్రికా లొకేషన్స్‌లో ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. కాగా ఈ సినిమా అప్‌డేట్‌ను నవంబరులో వెల్లడిస్తామని మహేశ్‌బాబు బర్త్ డే సందర్భంగా ఈ ఆగస్టు 9న రాజమౌళి పేర్కొన్నారు. ఈ సినిమాకు 'జెన్ 63' అనే టైటిల్‌ను అనుకుంటున్నారనే వార్త ప్రచారంలో ఉంది. ఇక 'అవతార్: ఫైర్ అండ్ యాష్' సినిమా ప్రమోషన్స్ కోసం చిత్రదర్శకుడు జేమ్స్ కామెరూన్ ఇండియా వచ్చినప్పుడు ఈ 'జెన్ 63' ఫస్ట్ లుక్, ప్రమోషనల్ కంటెంట్‌ను ఆయన చేతుల మీదుగా రిలీజ్ చేస్తే గ్లోబల్ రేంజ్‌లో రీచ్ ఉంటుందని రాజమౌళి భావిస్తున్నారట. అయితే ఈ విషయంపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. ఇదిలా ఉంటే... 2023లో జరిగిన ఓ అంతర్జాతీయ అవార్డుల వేడుకలో భాగంగా రాజమౌళి, జేమ్స్ కామెరూన్ కలుసుకున్న సంగతి గుర్తుండే ఉంటుంది. ఆ సమయంలో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రాన్ని కామెరూన్ ప్రశంసించారు. ఇదిలా ఉంటే... జేమ్స్ కామెరూన్ డైరెక్షన్‌లోని 'అవతార్: ఫైర్ అండ్ యాష్' చిత్రం ఈ డిసెంబరు 19న తెలుగులోనూ రిలీజ్ కానుంది.


● చిరంజీవి

రియల్ నేమ్‌తో రీల్‌పై...

''చిరంజీవిగారి సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయన కమ్ బ్యాక్ తర్వాత మెగా స్వాగ్ చూడాలని ఒక కోరిక ఉండేది. నాకు ఆ అవకాశం ఎప్పుడు వస్తుందా? అని ఎదురు చూశాను. ఫైనల్‌గా ఆ అవకాశం వచ్చింది. ఆయన బర్త్ డే సందర్భంగా 'మన శంకర వరప్రసాద్‌గారు' చిత్రం గ్లింప్స్, ఆయన లుక్ పరిచయం చేయాలనుకుని, చేశాం. చిరంజీవిగారిని మీరందరూ ఎలా చూడాలనుకుంటున్నారో అలా సంక్రాంతికి రెండింతలు చూస్తారు'' అని దర్శకుడు అనిల్ రావిపూడి తెలిపారు. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా 'మెగా 157' (వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో నయనతార హీరోయిన్. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. శుక్రవారం (ఆగస్టు 22) చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రానికి 'మన శంకర వరప్రసాద్‌గారు' టైటిల్ ఫిక్స్ చేసి, గ్లింప్స్ లాంచ్ చేశారు. గ్లింప్స్‌కి హీరో వెంకటేశ్ వాయిస్ ఓవర్ ఇవ్వడం ఓ హైలైట్. ఈ టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''చిరంజీవిగారి అసలు పేరు శివశంకర వరప్రసాద్‌లో నుంచి శంకర వరప్రసాద్ తీసుకుని ఈ సినిమాలో క్యారెక్టర్‌కి పెట్టాం. వెంకటేశ్‌గారు ప్రస్తుతానికి వాయిస్ ఇచ్చారు. త్వరలో ఈ సినిమా షూట్‌లో ఎంట్రీ ఇవ్వనున్నారు'' అని చెప్పారు. ''నాన్నగారి పుట్టినరోజున మీ అందరి ముందు ఇలా ఉండడం నాకు స్పెషల్ మూమెంట్'' అని సుస్మిత తెలిపారు. ''యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులు, ఫ్యాన్స్... ఇలా అన్ని తరాలవారికి ఈ సినిమా నచ్చుతుంది'' అన్నారు సాహు గారపాటి. సంగీతదర్శకుడు భీమ్స్ మాట్లాడారు.

రెండోసారి...

చిరంజీవి హీరోగా డైరెక్టర్ బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో వచ్చిన తొలి చిత్రం 'వాల్తేరు వీరయ్య'. 2023 సంక్రాంతికి విడుదలైన ఈ సినిమా మంచి విజయం సాధించింది. చిరంజీవి, బాబీ కొల్లి కాంబినేషన్‌లో రెండో సినిమా రానుంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ 'చిరుబాబీ 2' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రం నిర్మించనుంది. ''చిరంజీవిని కొత్త క్యారెక్టర్‌లో చూపించడానికి బాబీ పవర్‌ఫుల్ స్క్రిప్ట్ రెడీ చేశారు. తమిళంలో 'జన నాయకన్, టాక్సిక్, బాలన్' వంటి సినిమాలు నిర్మించిన కేవీఎన్ ప్రొడక్షన్స్ 'చిరుబాబీ 2'తో తెలుగు సినీ రంగంలోకి అడుగుపెడుతోంది'' అని మేకర్స్ తెలిపారు.

సస్పెన్స్... థ్రిల్


● రంజిత్, బాబూమోహన్, బిక్కునాథ్ నాయక్

రంజిత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'త్రిశంకినీ'. ఎస్. బిక్కునాథ్ నాయక్ నిర్మిస్తున్న ఈ సినిమాలో పలువురు నూతన నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా టైటిల్ లాంచ్ ఈవెంట్‌కి ప్రముఖ నటుడు బాబుమోహన్ అతిథిగా హాజరై, మాట్లాడుతూ– ''త్రిశంకినీ' మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''నా స్వస్థలం తిరుపతి. అందరి ఆశీర్వాదంతో మా సినిమా మంచి విజయం సాధించాలనుకుంటున్నా'' అన్నారు రంజిత్ కుమార్. ''నాకు సినిమాలంటే ప్యాషన్. కృష్ణగారి అభిమానిని. గతంలో పాటలు కూడా రాశాను. సస్పెన్స్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన 'త్రిశంకినీ'ని అందరూ ఆదరించాలి'' అని తెలిపారు ఎస్. బిక్కునాథ్ నాయక్.

రఘు విజయం సాధించాలి

– ఆకాశ్ జగన్నాథ్



● సాయికృష్ణ, ఆకాశ్, రామసత్యనారాయణ

నూతన నటీనటులతో కె. సాయికిశోర్ దర్శకత్వంలో తల్లాడ శ్రీనివాస్, తల్లాడ సాయికృష్ణ నిర్మిస్తున్న చిత్రం 'రఘు'. హీరో ఆకాశ్ జగన్నాథ్, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ కలిసి ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆకాశ్ జగన్నాథ్ మాట్లాడుతూ–''సినిమా టైటిల్' అంటే ఒక పేరు మాత్రమే కాదు... ప్రేక్షకులకు సినిమా చూడాలనే ఆసక్తిని కలిగించే తొలిమెట్టు. 'రఘు' సినిమా టైటిల్ ఫస్ట్‌లుక్ లాంచ్ కావడం సంతోషంగా ఉంది. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''మా శిష్యుడు దర్శక–నిర్మాత తల్లాడ సాయికృష్ణ నిర్మాతగా 'రఘు' సినిమా ప్రారంభించారు. ఈ సినిమాతో దర్శక–నిర్మాతలకు, టీమ్‌కి మంచి పేరు రావాలని ఆశిస్తున్నాను'' అని పేర్కొన్నారు రామసత్యనారాయణ. ''మా అన్నపూర్ణ క్రియేషన్స్ బ్యానర్‌లో తొమ్మిదో సినిమా ఇది. ఇందులో దాదాపు అందరూ కొత్తవాళ్లే నటిస్తున్నారు'' అని చెప్పారు తల్లాడ సాయికృష్ణ.

కీ రోల్‌కి సై


● అంజలి

విశాల్ హీరోగా రవి అరసు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో దుషారా విజయన్ కథానాయికగా నటిస్తున్నారు. సూపర్ గుడ్ ఫిల్మ్స్‌పై ఆర్‌బీ చౌదరి నిర్మిస్తున్నారు. విశాల్ కెరీర్‌లో 35వ మూవీగా రూపొందుతోన్న ఈ చిత్రంలో హీరోయిన్ అంజలి కీ రోల్‌లో నటిస్తున్న విషయాన్ని మేకర్స్ ప్రకటించారు. ''అంజలి ప్రస్తుతం ఆచితూచి పాత్రలను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో విశాల్ 35 కథ నచ్చి, ఆమె ఓకే చెప్పారు. 'మద గద రాజా' చిత్రంలో అంజలి, వరలక్ష్మిలతో విశాల్ చేసిన సందడికి కాసుల వర్షం కురిసింది. మళ్లీ ఇప్పుడు విశాల్, అంజలి కాంబోలో ఈ సినిమా రాబోతోంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది'' అని యూనిట్ తెలిపింది.

క్యూట్ లవ్‌స్టోరీ


● గురుచరణ్, శ్రియ

గురుచరణ్ నేతి, జుహీ భట్, అమిషి రాఘవ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ రోమియో'. ఎస్‌కే ఖాదర్, నవనీత్ బన్సాలి, కుల్దీప్ రాజ్, పురోహిత్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. మనోజ్ కుమార్ కటోకర్ దర్శకత్వంలో శ్యామ్ సుందర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను లాంచ్ చేసిన హీరోయిన్ శ్రియ మాట్లాడుతూ– ''టీజర్ చాలా బాగుంది. 'నాకు రియల్ లవ్ కావాలి. రీల్స్ లవ్ కాదు' డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. గురుచరణ్‌లో మంచి నటుడు ఉన్నాడు. మనోజ్ ఎప్పుడూ సినిమాల గురించే చెబుతుంటాడు. యంగ్ టీమ్ చేసిన ఈ సినిమా యూనిట్‌కు మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ఇదొక క్యూట్ లవ్ స్టోరీ'' అని గురుచరణ్ నేతి అన్నారు. ''గురుచరణ్ ఎనర్జిటిక్‌గా నటించాడు. మరో నెలలో సినిమాని రిలీజ్ చేస్తాం'' అన్నారు మనోజ్‌కుమార్.

చాలా మంచోళ్లు


● రోషిణి, మొయిన్, యష్ణ

మున్నా ధూళిపూడి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' ట్యాగ్ లైన్. అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, మొయిన్, రోహన్ సూర్య కీలక పాత్రల్లో శశిధర్ నల్లా, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మిస్తున్నారు. అనూప్ రూబెన్స్ స్వరపరచిన ఈ సినిమా నుంచి 'ఇలా చూసుకుంటానే' పాట త్వరలో విడుదల కానుంది. సిద్ శ్రీరామ్ పాడిన ఈ పాటలో రచయిత చంద్రబోస్ కనిపించడం విశేషం. ''జాతి రత్నాలు, మ్యాడ్' వంటి హిలేరియస్ చిత్రాలు అమ్మాయిలు చేస్తే ఎలా ఉంటుందో అలాంటి వినోదాత్మక చిత్రమిది'' అన్నారు మున్నా.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఇష్టం ఎక్కువైనా కష్టమే

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం 'మామన్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



మన జీవితంలో మనల్ని బాగా ఇష్టపడేవాళ్ళు ఉంటారు, అలాగే ద్వేషించే వాళ్ళు కూడా ఉంటారు. సాధారణంగా మనల్ని ద్వేషించే వారికి దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తాం. అదే మనల్ని ఇష్టపడేవాళ్ళకు దగ్గరగా ఉండాలనుకుంటాం. అయితే అదే ఇష్టం ఎక్కువై, ఆ ఇష్టం మనకి కష్టం తెచ్చిపెడితే ఎలా ఉంటుంది? అన్న సున్నితమైన పాయింట్‌తో తీసిన ఓ భావోద్వేగంతో కూడిన అద్భుతమైన కుటుంబ కథా చిత్రం 'మామన్'. జీ5 ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ తమిళ సినిమా తెలుగులోనూ లభ్యమవుతోంది. ప్రశాంత్ పాండ్యరాజన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిన్న సినిమా బాక్సాఫీస్ సూపర్ హిట్. అలా అని దీంట్లో పెద్ద స్టార్, గ్లామర్ యాక్షన్ ఇటువంటివి ఏమీ లేకపోయినా సినిమా చూస్తున్నంతసేపు సీటులోంచి కదల లేరు. అంతలా కట్టిపడేస్తుందీ సినిమా. ప్రముఖ తమిళ కమెడియన్ సూరి కథానాయకుడిగా ఈ సినిమాలో నటించి, మెప్పించారు. ఇంకా చెప్పాలంటే సినిమా చూసే ప్రేక్షకుల మనస్సులను కదిలించారు. అంతలా ఏముందో ఈ సినిమాలో ఓసారి చూద్దాం. 'మామన్' సినిమా కథ ప్రకారం తమిళనాడులోని తిరుచ్చి ప్రాంతంలో ఇన్బా, గిరిజ అక్కా తమ్ముళ్ళు. ఇన్బాకు అక్కంటే ప్రాణం. అక్కకు పెళ్ళైన చాలా కాలం తరువాత అతి కష్టం మీద ఓ బిడ్డ పుడతాడు. ఆ బిడ్డ పేరు లడ్డూ. అక్క బిడ్డను ఇన్బా అపురూపంగా చూసుకుంటుంటాడు. ఎంతలా అంటే తాను ప్రేమించి పెళ్ళి చేసుకున్న అమ్మాయి రేఖకన్నా లడ్డూ మీదే మమకారం పెంచుకుంటాడు. అయితే అదే సమయంలో ఇన్బా తండ్రి అవుతాడు. ఇక అక్కడి నుండి అసలు సిసలైన కథ మొదలవుతుంది. అక్క బిడ్డా లేక తనకు పుట్టబోయే బిడ్డా అన్న సంఘర్షణలో కథ ఏ మలుపులు తిరుగుతుందో సినిమాలోనే చూడాలి. చాలా సున్నితమైన అంశాన్ని ఎంతో భావుకతతో ప్రేక్షకుడికి ఎక్కడా బోర్ కొట్టనీయకుండా చక్కటి స్క్రీన్‌ప్లేతో సినిమాని నడిపిన విధానం నిజంగా అభినందనీయం. ఈ భూమ్మీద భావావేశాలున్న ప్రతి వ్యక్తి తెలుసుకోవాల్సిన అంశం ఈ సినిమాలో ఉంది. సకుటుంబ సపరివార సమేతంగా ఈ సినిమాని చూడవచ్చు, చూసి చాలా నేర్చుకోవచ్చు. ఆఖరుగా 'మామన్' మామూలు సినిమా అయితే కాదు. మస్ట్ వాచ్ ఫర్ ది వీకెండ్.

– హరికృష్ణ ఇంటూరూ

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
694	214
81,307	24,870

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	21,527	▲	427
డోజోన్స్	45,694	▲	909
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,327	▲	17
డాక్స్	24,381	▲	88
షాంఘై	3,826	▲	55
నికాయ్	42,639	▲	23

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.95	87.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.80	118.75
€	యూరో	ఎస్‌బీఐ	100.10	102.85
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.13	59.62
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.51	57.55
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.99	69.38
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.46	23.98
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.96	24.97
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.32	13.14

వీసీలు, పీఈలకు గేమింగ్ షాక్



- రియల్ మనీ గేమ్స్‌పై నిషేధంతో భారీ నష్టాలు
- లిస్టులో టైగర్ గ్లోబల్, కలరీ క్యాపిటల్ మొదలైనవి
- గేమింగ్ కంపెనీల్లో 2.4 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసిన సంస్థలు

న్యూఢిల్లీ: రియల్ మనీ గేమ్స్‌పై నిషేధం విధించడం గేమింగ్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసిన పలు వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, ప్రైవేట్ ఈక్విటీ సంస్థలకు షాకింగ్ పరిణామంగా మారింది. దీనితో అవి భారీగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. టైగర్ గ్లోబల్, కలారి క్యాపిటల్, బేస్ పార్ట్‌నర్స్ మొదలైనవి ఈ జాబితాలో ఉన్నాయి. డ్రీమ్11, నజారా టెక్నాలజీస్, జూపీ, మొబైల్ ప్రీమియర్ లీగ్, గేమ్స్ 24x7 లాంటి అయిదు బడా గేమింగ్ కంపెనీలు, వెంచర్ ఫండ్స్ నుంచి దాదాపు 2.4 బిలియన్ డాలర్ల స్థాయిలో పెట్టుబడులు సమీకరించాయి. దేశీయంగా అతి పెద్ద ఫ్యాంటసీ స్పోర్ట్స్ ప్లాట్‌ఫాంలలో ఒకటైన డ్రీమ్11లో టెన్సెంట్, కలారి క్యాపిటల్, అల్ఫా వేవ్ గ్లోబల్, థింక్ ఇన్వెస్ట్‌మెంట్స్ మొదలైనవి 2014 నుంచి దాదాపు 1.6 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాయి. పరిశ్రమ వర్గాల డేటా ప్రకారం కలారీ క్యాపిటల్ 100 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. ఆ తర్వాత కొన్ని వాటాలను విక్రయించి పాక్షికంగా తప్పుకుంది. మరోవైపు, మొబైల్ ప్రీమియర్ లీగ్ దాదాపు 396 మిలియన్ డాలర్లు సమీకరించింది. పీక్ ఫిఫ్టీన్ పార్ట్‌నర్స్ టైమ్స్ ఇంటర్నెట్, గూగుల్ వెంచర్స్ లాంటివి ఇన్వెస్ట్ చేశాయి. అటు నజారా టెక్నాలజీస్ 14 విడతల్లో 128 మిలియన్ డాలర్లు పెట్టుబడులు దక్కించుకుంది. వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్, సెకోయా క్యాపిటల్, సీడ్‌ఫండ్ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. గేమ్స్ 24x7 సంస్థ ఆరు విడతల్లో టైగర్ గ్లోబల్ మేనేజ్‌మెంట్, రైన్, మలబార్ ఇన్వెస్ట్‌మెంట్స్ నుంచి 108 మిలియన్ డాలర్లు సమీకరించింది. జూపీలో వెస్ట్‌క్యాప్, జెడ్47, ఏజే క్యాపిటల్ పార్ట్‌నర్స్ తదితర ఇన్వెస్టర్లు 122 మిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టాయి.

ఐపీఎల్‌పైనా ఎఫెక్ట్..

రియల్ మనీ గేమింగ్స్‌పై నిషేధం అటు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)పైనా భారీగా ప్రభావం చూపనుంది. డ్రీమ్11, మై11సర్కిల్‌లాంటి సంస్థలు ఐపీఎల్‌కి బడా స్పాన్సర్లుగా ఉండటమే ఇందుకు కారణం. 2025 ఐపీఎల్‌కి వచ్చిన మొత్తం ప్రకటనల ఆదాయంలో ఫ్యాంటసీ స్పోర్ట్స్ స్పాన్సర్ల వాటా సుమారు రూ. 2,000 కోట్లు ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. డిజిటల్ అడ్వర్టైజింగ్‌పై గేమింగ్ కంపెనీలు అత్యధికంగా ఖర్చు చేస్తుంటాయి కనుక ఐపీఎల్‌తో పాటు ఇతరత్రా ఆటల ప్రసార హక్కులకు పలికే రేటుపైనా ప్రభావం పడుతుందని పేర్కొన్నాయి. ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధంతో అడ్వర్టైజింగ్ పరిశ్రమ ఆదాయంపై సుమారు 10–15 శాతం ప్రతికూల ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

పెయిడ్ గేమ్స్ నిలిపివేత..

కొత్త బిల్లుకు అనుగుణంగా తాము పెయిడ్ గేమ్స్‌ను నిలిపివేస్తున్నామని జూపీ తెలిపింది. అయితే, లూడో సుప్రీమ్, లూడో టర్బో, స్నేక్స్ అండ్ ల్యాడర్స్, ట్రంప్ కార్డ్ మానియాలాంటి ఉచిత గేమ్స్ అందుబాటులో ఉంటాయని వివరించింది. ఇక ఎంపీఎల్, విన్‌జో, నజారా టెక్నాలజీస్ ఇన్వెస్ట్ చేసిన మూన్‌షైన్ టెక్నాలజీస్ (పోకర్‌బాజీ) కూడా రియల్ మనీ ఆన్‌లైన్ గేమింగ్ కార్యకలాపాలు నిలిపివేసినట్లు తెలిపాయి. మూన్‌షైన్ టెక్నాలజీస్‌లో నజారా టెక్నాలజీస్‌కి 46.07 శాతం వాటాలు ఉన్నాయి.

విన్‌జో పోర్ట్‌ఫోలియోలో రమ్మీ, సాలిటైర్, ఫ్యాంటసీ క్రికెట్, పోకర్‌లాంటి 100 పైగా రియల్ మనీ గేమ్స్ ఉన్నాయి. ఎంపీఎల్‌కి ఆసియా, యూరప్, ఉత్తర అమెరికాలో 12 కోట్ల మంది యూజర్లు ఉన్నారు. ఇండియా గేమింగ్ రిపోర్ట్ 2025 ప్రకారం ప్రపంచవ్యాప్తంగా గేమింగ్ యూజర్లలో భారత్‌కి దాదాపు 20 శాతం, గ్లోబల్ గేమింగ్ యాప్ డౌన్‌లోడ్స్‌లో 15.1 శాతం వాటా ఉంది. మన దేశంలో 1,800 పైగా గేమింగ్ స్టార్టప్‌లు ఉన్నాయి. ఇక, రియల్ మనీ గేమ్స్ నిలిపివేతతో నజారా టెక్నాలజీస్ షేరు వరుసగా మూడు రోజుల్లో దాదాపు 18 శాతం పతనమైంది. శుక్రవారం నాడు గేమింగ్, హాస్పిటాలిటీ సంస్థ డెల్టా కార్ప్ 3.50 శాతం, ఆన్‌మొబైల్ గ్లోబల్ దాదాపు 3 శాతం క్షీణించాయి.

ఆందోళనలో పరిశ్రమ..

స్కిల్ గేమ్స్‌కి రాజ్యాంగపరమైన రక్షణ ఉన్నప్పటికీ గేమింగ్ మీద నిషేధం విధించడం ఆశ్చర్యకరమని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రభుత్వం దీన్ని పట్టించుకోకపోవడం సరికాదని డ్రీమ్11 వర్గాలు పేర్కొన్నాయి. దేశీయంగా ఫ్యాంటసీ స్పోర్ట్స్ పరిశ్రమ ప్రస్తుతం 1.82 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండగా 2030 నాటికి ఏకంగా 5.05 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందనే అంచనాలు నెలకొన్న తరుణంలో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సరికాదని అభిప్రాయపడ్డాయి. పెద్ద సంఖ్యలో దీనిపై ఆధారపడిన వారి ఉపాధి, స్పోర్ట్స్‌లో ఆవిష్కరణలు, అత్యధిక నైపుణ్యాలు అవసరమయ్యే ఉద్యోగాలకు నిషేధంతో విఘాతం కలుగుతుందని వివరించాయి.

లార్డ్ స్వరాజ్‌పాల్ కన్నుమూత



ప్రధాని మోదీ సంతాపం

లండన్/న్యూఢిల్లీ: ప్రముఖ ప్రవాస భారతీయ పారిశ్రామిక దిగ్గజం లార్డ్ స్వరాజ్ పాల్ (94) లండన్‌లో కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా ఇటీవల ఆయన చికిత్స కోసం ఆస్పత్రిలో చేరారు. స్వరాజ్‌పాల్ మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. పరిశ్రమ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పాటుపడిన దానశీలిగా ఆయన్ను అభివర్ణించారు. బ్రిటన్-భారత్ సంబంధాలను బలోపేతం చేసేందుకు స్వరాజ్ పాల్ ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. వ్యాపార దిగ్గజం, దానశీలి, అంతర్జాతీయంగా ప్రవాస భారతీయులకు ఆయనొక ఐకాన్ అని తెలిపారు. 1966లో కుమార్తె చికిత్స కోసం బ్రిటన్ వెళ్లిన లార్డ్ పాల్ ఆ తర్వాత అక్కడే అంతర్జాతీయ సంస్థ కపారో గ్రూప్‌ను నెలకొల్పారు. ఉక్కు, ఇంజినీరింగ్, ప్రాపర్టీ తదితర రంగాల్లో దిగ్గజంగా తీర్చిదిద్దారు. బ్రిటన్‌లో అత్యంత సంపన్న ఏషియన్‌గా ఎదిగారు. దశాబ్దాల పాటు వ్యాపార, రాజకీయ రంగాల్లో కీలకంగా నిల్చారు.

భారత్‌లో కింద్రిల్ భారీ ప్రణాళికలు



న్యూఢిల్లీ: అమెరికన్ ఐటీ దిగ్గజం కింద్రిల్ భారత్‌లో భారీ పెట్టుబడుల ప్రణాళికలను ప్రకటించింది. వచ్చే మూడేళ్లలో 2.25 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 19,600 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. భవిష్యత్ టెక్నాలజీ అవసరాలకు తగ్గట్లుగా సిబ్బందికి శిక్షణనివ్వడం, ఏఐ ల్యాబరేటరీ ఏర్పాటు మొదలైన వాటిపై ఈ మొత్తాన్ని వెచ్చించనున్నట్లు పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోదీతో కింద్రిల్ చైర్మన్ మార్టిన్ ష్రోటర్ భేటీ అనంతరం కంపెనీ ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. దిగ్గజ సంస్థలకు అవసరమైన టెక్నాలజీ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడంపై మరింతగా దృష్టి పెట్టనున్నట్లు వివరించింది. బెంగళూరులో ఏఐ ఇన్నోవేషన్ ల్యాబ్ ఏర్పాటు చేయడం, కృత్రిమ మేథపై భారత ప్రభుత్వంతో కలిసి పని చేయడం, దాదాపు 2,00,000 మంది పౌరులకు డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ కల్పించడంలాంటి అంశాలపై ఫోకస్ చేయనున్నట్లు కింద్రిల్ తెలిపింది. అలాగే, భారత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రా లక్ష్యాలకు, దీర్ఘకాలికంగా దేశ ఆర్థిక పరిస్థితులకు సహాయకరంగా ఉండే ఏఐ, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాల్లో తోడ్పాటు అందించనున్నట్లు వివరించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
భారత్ - బ్రిటన్ మధ్య స్నేహ వారధి .. పాల్
భారత్‌లో ఓపెన్‌ఏఐ కార్యాలయం

మహిళా ఇన్వెస్టర్లపై సెబీ స్పెషల్ ఫోకస్


ఫస్ట్‌టైమ్ ఫండ్ పెట్టుబడులకు ప్రోత్సాహకాలు



ముంబై: మ్యూచువల్ ఫండ్స్‌లో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచడంపై సెబీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మొదటిసారి పెట్టుబడులు పెట్టే మహిళలకు ప్రోత్సాహకాలు అందించే ప్రణాళికతో ఉన్నట్టు సెబీ చీఫ్ తుహిన్ కాంత పాండే ప్రకటించారు. మహిళల సమాన ప్రాతినిధ్యం లేకుండా ఆర్థిక సమ్మిళితత్వం అసంపూర్ణంగా ఉండిపోతుందన్నారు. అందుకని వారికి పంపిణీ పరమైన ప్రోత్సాహకాలు ఇచ్చే ఆలోచనతో ఉన్నట్టు చెప్పారు. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పాండే మాట్లాడారు. టాప్ 30కి (బీ30) వెలుపలి పట్టణాల్లో పంపిణీదారులకు రాయితీలు కల్పించాలన్న ఇటీవలి ప్రతిపాదనను ప్రస్తావించారు. ఈ చర్యలతో కొత్త పెట్టుబడిదారులను భాగస్వాములను చేయొచ్చని, మరింత మందికి మ్యూచువల్ ఫండ్స్ సేవలను చేరువ చేయొచ్చని అభిప్రాయపడ్డారు.

లాభాల స్వీకరణ

- ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ఆరు రోజుల లాభాలకు వారాంతాన బ్రేక్ పడింది. జాక్సన్ హోల్ సదస్సులో యూఎస్ ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగానికి ముందు అప్రమత్తత చోటు చేసుకుంది. ఇటీవల వరుస ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు కీలక రంగాల షేర్లలో లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ఫలితంగా సెన్సెక్స్ 694 పాయింట్లు నష్టపోయి 81,307 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 214 పాయింట్లు పతనమై 24,870 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 709 పాయింట్లు కోల్పోయి 81,292 వద్ద, నిఫ్టీ 225 పాయింట్లు పతనమై 24,859 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. డాలర్ మారకంలో రూపాయి 27 పైసలు బలహీనపడి 87.52 వద్ద స్థిరపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- ఫార్మా, టెలికం, వినిమయ షేర్లు మినహా అన్ని రంగాల్లో అమ్మకాలు వెల్లువెత్తాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 0.35%, 0.23 శాతం పడిపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(–1.28%), రిలయన్స్ (–1%), ఐటీసీ (–2%) ఐసీఐసీఐ (–1%) నష్టపోయి సూచీల పతనానికి కారణమయ్యాయి.

బంగారం విలువపై 90 శాతం రుణం



న్యూఢిల్లీ: ప్రైవేటు రంగంలోని సౌత్ ఇండియన్ బ్యాంక్ 'ఎస్ఐబీ గోల్డ్ ఎక్స్‌ప్రెస్' పేరుతో కొత్త బంగారం రుణ పథకాన్ని ప్రారంభించింది. బంగారం విలువపై 90% వరకు రుణాన్ని ఈ పథకం కింద పొందొచ్చు. రూ.25,000 నుంచి రూ.25 లక్షల వరకు రుణం, గరిష్టంగా మూడేళ్ల కాలానికి తీసుకోవచ్చు. ఎంఎస్‌ఎంఈలు, నాన్ ఎంఎస్‌ఎంఈలు, చిన్న సంస్థలు తమ వ్యాపార విస్తరణ, మూలధన అవసరాల కోసం రుణాలు తీసుకోవచ్చని సౌత్ ఇండియన్ బ్యాంక్ ప్రకటించింది. ఎలాంటి రహస్య చార్జీల్లేకుండా, పారదర్శకంగా ఈ రుణ పథకం ఉంటుందని తెలిపింది. మొత్తం ప్రక్రియ డిజిటల్‌గా పూర్తవుతుందని, మొదటిసారి రుణం తీసుకునే వారు కూడా అర్హులేనని పేర్కొంది.

సాక్షి స్పోర్ట్స్



ప్రజ్ఞానంద హ్యాట్రిక్ 'డ్రా'

సింక్‌ఫీల్డ్ కప్ గ్రాండ్ చెస్ టూర్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద ఖాతాలో వరుసగా మూడో 'డ్రా' చేరింది. అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో నాలుగో రౌండ్‌లో భారత గ్రాండ్ మాస్టర్లు ప్రజ్ఞానంద, దొమ్మరాజు గుకేశ్ తమ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. సామ్ సెవియాన్ (అమెరికా)తో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద 28 ఎత్తుల్లో... మాక్సిమి లాగ్రెవ్ (ఫ్రాన్స్)తో జరిగిన గేమ్‌ను క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ గుకేశ్ 56 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించారు. ఇతర గేముల్లో ఫాబియానో కరువానా (అమెరికా) 30 ఎత్తుల్లో నొదిర్బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్తాన్)పై విజయం సాధించగా... అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)-వెస్లీ సో (అమెరికా) గేమ్ 35 ఎత్తుల్లో... అరోనియన్ (అమెరికా)-జాన్ క్రిస్టాఫ్ డూడా (పోలాండ్) గేమ్ 39 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. నాలుగో రౌండ్ తర్వాత కరువానా 3 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... 2.5 పాయింట్లతో ప్రజ్ఞానంద, అరోనియన్ సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు.

చిన్నస్వామిలో క్రికెట్ బంద్!

మహిళల వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌లకు దక్కని అనుమతి • నవీ ముంబైకి మ్యాచ్‌ల తరలింపు


చిన్నస్వామి స్టేడియం (ఫైల్)

న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరిగే మహిళల వన్డే వరల్డ్ కప్ వేదికల జాబితా నుంచి బెంగళూరును తొలగించారు. ఇక్కడ జరగాల్సిన మ్యాచ్‌లను నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియానికి తరలించారు. టోర్నీకి సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న భారత్, శ్రీలంక మధ్య చిన్నస్వామి స్టేడియంలో సెప్టెంబర్ 30న తొలి మ్యాచ్‌తో పాటు మరో నాలుగు మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. అయితే ఇక్కడ మ్యాచ్‌ల నిర్వహణకు బెంగళూరు పోలీసుల నుంచి అనుమతి పొందడంలో కర్నాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) విఫలమైంది. ఐపీఎల్–2025లో విజేతగా నిలిచిన అనంతరం జూన్ 4న ఇక్కడ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) నిర్వహించిన సంబరాల్లో ప్రమాదవశాత్తూ 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. అనంతరం జరిగిన దర్యాప్తులో ఆర్‌సీబీ యాజమాన్యాన్ని, కేఎస్‌సీఏను తప్పు పట్టిన కమిటీ... చిన్నస్వామి స్టేడియం మ్యాచ్‌లు నిర్వహించేదుకు సురక్షితం కాదని తేల్చింది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించలేదని అధికారులు ఈ స్టేడియానికి విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేశారు. ఇలాంటి స్థితిలో వరల్డ్ కప్ కోసం అనుమతి సాధించడం అసాధ్యంగా మారింది. తగిన జాగ్రత్తలు తీసుకుంటామని కేఎస్‌సీఏ హామీ ఇచ్చినా పోలీసులు స్పందించలేదు. ఇదే కారణంతో ఇంతకు ముందే అసోసియేషన్ తమ ప్రాంచైజీ టోర్నీ మహారాజా ట్రోఫీని బెంగళూరు నుంచి మైసూరుకు తరలించింది. తాజా పరిణామాలన్నీ ఐసీసీ మ్యాచ్‌ల నిర్వహణా నిబంధనలకు ప్రతికూలంగా ఉండటంతో బెంగళూరు నుంచి మ్యాచ్‌లు తరలించాల్సి వచ్చింది. బెంగళూరులో సాధ్యం కాకపోతే తాము తిరువనంతపురంలో మ్యాచ్‌లు నిర్వహిస్తామని కేరళ సంఘం ముందుకు వచ్చినా... అక్కడి నుంచి ప్రధాన నగరాలకు తగినన్ని ఫ్లయిట్‌లు అందుబాటులో లేకపోవడంతో ఆ ఆలోచనను పక్కన పెట్టారు. డీవై పాటిల్ స్టేడియంలో సెమీఫైనల్‌తో పాటు పాక్ అర్హత సాధించకపోతే ఫైనల్‌ను కూడా నిర్వహిస్తారు. ఎనిమిది జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీకి నవీ ముంబైతో పాటు విశాఖపట్నం, గువహటి, ఇండోర్, కొలంబో ఆతిథ్యం ఇస్తాయి.

రెజ్లర్ కాజల్‌కు పసిడి పతకం



సమోకోవ్ (బల్గేరియా): ప్రపంచ అండర్–20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. మహిళల 72 కేజీల విభాగంలో భారత రెజ్లర్ కాజల్ పసిడి పతకం సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన ఫైనల్లో కాజల్ 8–6తో లియు యుకి (చైనా)పై విజయం సాధించింది. భారత్‌కే చెందిన సారిక (53 కేజీలు), శ్రుతి (50 కేజీలు) కాంస్య పతకాలు గెలిచారు. కాంస్య పతక బౌట్‌లలో సారిక 11–0తో ఇలోనా వాల్‌చుక్ (పోలాండ్)పై, శ్రుతి 6–0తో జోసిఫిన్ వ్రెంచ్ (జర్మనీ)పై నెగ్గారు. పురుషుల గ్రీకో రోమన్ స్టయిల్‌లో భారత రెజ్లర్ సూరజ్ కాంస్యం దక్కించుకున్నాడు. కాంస్య పతక పోరులో సూరజ్ ఫ్రాన్స్ రెజ్లర్ లుకాస్ లాగ్రాసోపై గెలుపొందాడు.



భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (ఫైల్)

'డ్రీమ్' బంధం ముగిసినట్లే!

- భారత జట్టు స్పాన్సర్‌షిప్ రద్దు చేసే అవకాశం
- ప్రభుత్వ నిబంధనలు పాటిస్తామన్న బీసీసీఐ

న్యూఢిల్లీ: 'సెబీ' నిబంధనలు ఉల్లంఘించిన సహారా గ్రూప్, కాంపిటీషన్ కమిషన్ విచారణను ఎదుర్కొన్న స్టార్ ఇండియా, ఆర్థిక సమస్యలతో ఒప్పో, చెల్లింపులు చేయలేక బాకీపడ్డ బైజూస్... భారత క్రికెట్ జట్టు గత నాలుగు ప్రధాన స్పాన్సర్లు ఏదో ఒక వివాదం లేదా సమస్యతో సహవాసం చేయడం బీసీసీఐకి ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఇప్పుడు ఈ జాబితాలో 'డ్రీమ్ 11' కూడా చేరింది. ఇందులో నేరుగా కంపెనీ పాత్ర లేకపోయినా... ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టంతో పరిస్థితి మారిపోయింది. ఇకపై 'డ్రీమ్ 11' భారత టీమ్ స్పాన్సర్‌గా కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు. ఆన్‌లైన్ ఫాంటసీ స్పోర్ట్స్, గ్యాంబ్లింగ్ వేదికలపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఇదే కేటగిరీలో వచ్చే 'డ్రీమ్ 11'కు దీని కారణంగా ఆర్థిక పరంగా గట్టి దెబ్బ తగలనుంది. 2023లో రూ. 358 కోట్లతో మూడేళ్ల కాలానికి బీసీసీఐతో 'డ్రీమ్ 11' ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కాంట్రాక్ట్ 2026 మార్చి వరకు ఉంది. అయితే ఆసియా కప్‌కు ముందే స్పాన్సర్‌షిప్ ఒప్పందం రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా చేసిన వ్యాఖ్యలు దీనికి బలం చేకూరుస్తున్నాయి. 'ఫలానా సంస్థతో ఒప్పందానికి అనుమతి లేదంటే మేం ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకు వెళ్లం. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రతీ పాలసీ, నిబంధనలను బీసీసీఐ పాటిస్తుంది' అని ఆయన చెప్పారు. ఈ స్పాన్సర్‌షిప్‌కు సంబంధించి త్వరలోనే మరింత స్పష్టత రావచ్చు. తక్కువ సమయంలో బోర్డు మళ్లీ కొత్త స్పాన్సర్‌తో ఒప్పందం కుదుర్చుకుంటుందా అనేది ఆసక్తికరం. మరోవైపు డ్రీమ్ 11 శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది. 'డబ్బులు చెల్లించి ఆడే పోటీలన్నింటినీ మేం నిలిపివేశాం. ఉచితంగా ఆడుకునే ఆన్‌లైన్ సోషల్ గేమ్‌లుగా వాటిని మార్చేశాం. ఇన్నేళ్లు మేం నిబంధనల ప్రకారమే పని చేశాం. భారత ప్రభుత్వ చట్టాలను మేం గౌరవిస్తే. ఇకపై మా ఇతర సంస్థలు ఫ్యాన్ కోడ్, డ్రీమ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ద్వారా క్రీడలతో అనుబంధాన్ని కొనసాగిస్తాం' అని పేర్కొంది.

ఇలవేనిల్‌కు స్వర్ణ పతకం



షిమ్‌కెంట్ (కజకిస్తాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ సీనియర్ విభాగంలో శుక్రవారం భారత్‌కు ఒక స్వర్ణం, రెండు కాంస్యాలు లభించాయి. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో తమిళనాడుకు చెందిన ఇలవేనిల్ వలారివన్ భారత్‌కు పసిడి పతకాన్ని... ఇలవేనిల్, మెహులీ ఘోష్, అనన్య నాయుడులతో కూడిన బృందం కాంస్య పతకాన్ని అందించింది. స్కీట్ మిక్స్‌డ్ విభాగంలో గనీమత్ సెఖోన్–అభయ్ సింగ్ సెఖోన్ జోడీ భారత్ ఖాతాలో కాంస్య పతకాన్ని జమ చేసింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఫైనల్లో 26 ఏళ్ల ఇలవేనిల్ 253.6 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో ఇలవేనిల్ కొత్త ఆసియా రికార్డును నెలకొల్పింది. 2019 నుంచి అపూర్వీ చండేలా (భారత్; 252.9 పాయింట్లు) పేరిట ఉన్న ఆసియా రికార్డును ఇలవేనిల్ సవరించింది. భారత్‌కే చెందిన మెహులీ ఘోష్ 208.9 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. టీమ్ విభాగంలో ఇలవేనిల్ (630.7 పాయింట్లు), మెహులీ (630.3 పాయింట్లు), అనన్య (630 పాయింట్లు) మొత్తం 1891 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. స్కీట్ మిక్స్‌డ్ కాంస్య పతక మ్యాచ్‌లో గనీమత్–అభయ్ ద్వయం 39–37తో అబ్దుల్లా అల్‌రషీది–అఫ్రా (కువైట్) జంటపై నెగ్గింది.

మరోవైపు మహిళల జూనియర్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో శాంభవి, హృదయశ్రీ, ఇషాలతో కూడిన భారత జట్టు 1896.2 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. జూనియర్ స్కీట్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో హర్‌మెహర్ సింగ్–యశస్వి రాథోడ్ జోడీ కాంస్య పతకాన్ని సాధించింది.

భారత్ 'ఎ' 299 ఆలౌట్

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టుతో జరుగుతున్న ఏకైక అనధికారిక టెస్టులో భారత 'ఎ' జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 89.1 ఓవర్లలో 299 పరుగులకు ఆలౌటైంది. రాఘ్వీ బిస్ట్ (93; 16 ఫోర్లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా... జోషిత (51; 7 ఫోర్లు) కీలక అర్ధశతకంతో మెరిసింది. కెప్టెన్ రాధా యాదవ్ (69 బంతుల్లో 33; 5 ఫోర్లు), మిన్ను మణి (89 బంతుల్లో 28; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా 'ఎ' జట్టు బౌలర్లలో మైట్లాన్ బ్రౌన్, జార్జియా చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా ఆట ముగిసే సమయానికి 43 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. కెప్టెన్ తహిలా విల్సన్ (80 బంతుల్లో 49; 7 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

గౌహర్ సుల్తానా రిటైర్మెంట్

ఆటకు వీడ్కోలు పలికిన స్పిన్నర్ • ఐదు ప్రపంచకప్‌లలో భారత్‌కు ప్రాతినిధ్యం



హైదరాబాద్: సీనియర్ లెఫ్టార్మ్ స్పిన్నర్, హైదరాబాదీ గౌహర్ సుల్తానా క్రికెట్‌కు గుడ్‌బై చెప్పింది. అన్ని ఫార్మాట్‌లు, స్థాయిలలో ఆట నుంచి తప్పుకుంటున్నట్లు 37 ఏళ్ల గౌహర్ ప్రకటించింది. 'భారత క్రికెట్‌కు అత్యుత్తమ స్థాయిలో, వరల్డ్ కప్‌లలో ఆడే అవకాశం రావడం నా జీవితంలో దక్కిన గొప్ప గౌరవం. నేను తీసిన ప్రతీ వికెట్, మైదానంలో ఫీల్డింగ్, ఇతర క్రికెటర్ల సాహచర్యం నన్ను క్రికెటర్‌గా, వ్యక్తిగా కూడా ఎంతో తీర్చిదిద్దాయి' అని తన రిటైర్మెంట్ ప్రకటనలో ఆమె పేర్కొంది. 2008లో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగు పెట్టిన గౌహర్ చివరిసారిగా 2014లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ఆరేళ్ల కెరీర్‌లో 50 వన్డేలలో 19.39 సగటుతో ఆమె 66 వికెట్లు పడగొట్టింది. 37 టి20 మ్యాచ్‌లలో 5.73 ఎకానమీతో 29 వికెట్లు తీసింది. భారత్ తరఫున ఆడిన రెండు వన్డే వరల్డ్ కప్ (2009, 2013)లలో 12 వికెట్లు తీసిన ఆమె... మూడు టి20 వరల్డ్ కప్ (2009, 2019, 2014)లలో 7 వికెట్లు పడగొట్టింది.

క్లుప్తంగా...

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటాకు 13,682 మంది వెబ్ ఆప్షన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎంబీబీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా ప్రవేశాలకు శుక్రవారం నాటికి 14,413 మందికి గాను 13,682 మంది వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నట్టు ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. మేనేజ్‌మెంట్ కోటాలో 4,946 మంది అర్హత సాధించారని పేర్కొంది. ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ డెంటల్, బీఎస్సీ నర్సింగ్ వంటి కోర్సుల కౌన్సెలింగ్ అంతర్జాల సేవలు సాంకేతిక కారణాలతో 24వ తేదీ వరకు పని చేయవని, 25 నుంచి అందుబాటులోకి వస్తాయని వివరించింది.

పాఠశాలల్లో సుగర్ బోర్డులు

సాక్షి, అమరావతి: అధిక చక్కెర వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన పెంచడానికి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో సుగర్ బోర్డులు ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచనల మేరకు సుగర్ బోర్డులను తరగతి గదులు, పాఠశాల ప్రాంగణాల్లో ప్రదర్శించాలని పేర్కొంది. చిన్నారుల్లో పెరుగుతున్న మధుమేహాన్ని నివారించడానికి చక్కెర వినియోగంలో పరిమితులు, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవడం ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. విద్యార్థుల్లో ఆరోగ్య క్రమణ శిక్షణ పెంపొందించాలనే ఆలోచనతో సుగర్ బోర్డులు ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్టు ఏపీటీఎఫ్ అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో ఒకరోజు సుగర్ లెస్ ఆహారాన్ని అందించాలని, విద్యార్థులకు పాఠశాలల్లో చక్కెర పరీక్షలు నిర్వహించాలని కోరారు.

ముగిసిన హ్యాకథాన్ బూట్‌క్యాంప్


నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన అఖిల భారత స్థాయి అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ 2025 బూట్‌క్యాంప్ శుక్రవారం ముగిసింది. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ, ఐబీఎం, టీసీఎస్ వంటి సంస్థలు మద్దతు అందించాయి. వీరి భాగస్వామ్యం ద్వారా క్వాంటమ్ కంప్యూటింగ్‌లోని పరిజ్ఞానం, సమస్యల పరిష్కార పద్ధతులు, సృజనాత్మకతకు సంబంధించిన వ్యూహాలను విద్యార్థులు తెలుసుకునే అవకాశం కలిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీకి చెందిన సి.చంద్రమౌళి, బిట్స్ పిలానీ కేకే బిర్లా గోవా క్యాంపస్‌కు చెందిన ఆచార్య ఇంద్రాక్షి రాయ్ చౌదరి, సుజయ్ చక్రవర్తి, రుషికేశ్ ఉబాలే ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంటల్ టెస్టు ఫలితాలు విడుదల

సాక్షి, అమరావతి: ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల డిపార్ట్‌మెంటల్ పరీక్ష ఫలితాలను ఏపీపీఎస్సీ శుక్రవారం విడుదల చేసింది. ఫలితాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు కార్యదర్శి పి.రాజాబాబు తెలిపారు.

డిగ్రీ ఆప్షన్లలో గందరగోళం

ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాలపై సందేహాలెన్నో..



సాక్షి, అమరావతి: డిగ్రీ ప్రవేశాల్లో విద్యార్థులు వెబ్ ఆప్షన్ల నమోదులో టీడీపీ కూటమి ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తోంది. ఓఏఎండీసీ పోర్టల్‌లో సొంతంగా ఆప్షన్లు ఎంపిక చేసుకోవడంతోపాటుగా కళాశాలలకు నేరుగా వెళ్లి దరఖాస్తు ఇవ్వడం ద్వారా విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని ప్రకటించడం సీట్ల భర్తీపై తీవ్ర ప్రభావాన్ని చూపనుంది. ఈ మేరకు శుక్రవారం ఉన్నత విద్యా మండలి విడుదల చేసిన మార్గదర్శకాలు విద్యార్థుల భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వాస్తవానికి ఆన్‌లైన్‌లో సులభంగా ఆప్షన్లు ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉన్నప్పుడు కళాశాలలకు వెళ్లాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది. ఒక విద్యార్థి ఆన్‌లైన్‌లో తనకు నచ్చిన కళాశాల కోర్సును ఎంపిక చేసుకోవచ్చు. ఇలా ఎన్ని కళాశాలల్లో ఎన్ని కోర్సులకైనా ఆప్షన్లు పెట్టుకోవచ్చు. కానీ, ఉన్నత విద్యా మండలి మాత్రం వెబ్ ఆప్షన్లకు రెండు మార్గాలుగా అవకాశం కల్పిస్తోంది. ఇక్కడ విద్యార్థి సొంతంగా ఆన్‌లైన్‌లో కాకుండా నేరుగా కళాశాలకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే.. ఆ కళాశాలలో సీటు రాకపోతే సదరు విద్యార్థి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకం. పోనీ, ఒక కళాశాలకు వెళ్లి అక్కడి కోర్సుల్లో ఆప్షన్లతోపాటు వేరే కళాశాలలోని కోర్సుల ఆప్షన్లను ఎంపిక చేసుకోవడం కుదరదు. మళ్లీ ఇక్కడ విద్యార్థి ఆన్‌లైన్‌లో ఆప్షన్ పెట్టుకోవాలి/మరో కళాశాలలకు వెళ్లి విడిగా దరఖాస్తు చేసుకోవాలి. విచిత్రం ఏమిటంటే.. ఆప్షన్ల మార్పు సమయంలో ఆన్‌లైన్‌లో పెట్టిన ఆప్షన్లు ఎన్నైనా మార్చుకోవచ్చు. కానీ, కళాశాలకు వెళ్లి నమోదు చేసుకున్న ఆప్షన్‌ను మార్చడానికి వీలుపడదు. ఇది విద్యార్థి ప్రాథమిక హక్కును హరించడమే. మరోవైపు.. ఒక విద్యార్థి ఆన్‌లైన్‌లో పెట్టిన ఆప్షన్ కంటే కళాశాలలో దరఖాస్తు ద్వారా పెట్టుకున్న ఆప్షన్‌నే తొలి ప్రాధాన్యంగా పరిగణిస్తుండటం గమనార్హం.

ఇకపై ఏటా డీఎస్సీ

విద్యాశాఖ సమీక్షలో మంత్రి లోకేశ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏటా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్టు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. శుక్రవారం విద్యాశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. అనవసరమైన శిక్షణా కార్యక్రమాలతో ఉపాధ్యాయుల సమయాన్ని వృథా చేయవద్దని అధికారులకు సూచించారు. అసర్ నివేదిక ప్రకారం ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్ అమలులో రాష్ట్రం 14వ స్థానంలో ఉందని, ఈ పరిస్థితిలో మార్పు తేవాలని సూచించారు. విజయవంతమైన విధానాలను అధ్యయనం చేసి, ఉత్తమమైన ప్రీస్కూల్ పాలసీని సిద్ధం చేయాలన్నారు. అమరావతిలో సెంట్రల్ లైబ్రరీని 2లక్షల చదరపు అడుగుల్లో చేపడుతున్నట్టు చెప్పారు. విశాఖపట్నం జగదాంబ సెంట్రల్‌లో రీజినల్ లైబ్రరీని 50వేల అడుగుల్లో నిర్మించాలన్నారు. కొత్త జిల్లాల్లోనూ గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక సంస్థల నుంచి సుమారు రూ.213 కోట్ల సెస్ బకాయిలను రాబట్టి లైబ్రరీలను అభివృద్ధి చేపట్టాలన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం యువత, పరిశ్రమలను అనుసంధానించేలా నైపుణ్యం పోర్టల్‌ను దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.

మారీటైం ఎడ్యుకేషన్‌కు రాజధానిగా విశాఖ నిలవాలి

- విశాఖ పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అంగముత్తు
- విశాఖ వేదికగా స్కిల్ సెయిల్–2025



సదస్సును ప్రారంభిస్తున్న పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అంగముత్తు

ఏయూ క్యాంపస్ : సముద్రరంగం అపార అవకాశాలను కల్పిస్తుందని విశాఖ పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. బీచ్‌రోడ్డులోని నొవాటెల్‌లో శుక్రవారం నిర్వహించిన వైజాగ్ స్కిల్ సెయిల్–2025, స్కిల్ డెవలప్‌మెంట్ కాన్‌క్లేవ్ విత్ గ్రీన్ పోర్ట్ స్టార్టప్‌ను ఆయన ప్రారంభించారు. డాక్టర్ అంగముత్తు మాట్లాడుతూ మారీటైం ఎడ్యుకేషన్‌కు రాజధానిగా విశాఖ నిలవాలని ఆకాంక్షించారు. విశాఖ పోర్ట్‌ను గ్రీన్ పోర్టుగా నిలపడం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. నీతి ఆయోగ్ విశాఖలో కీలక వృద్ధి కేంద్రంగా పోర్ట్‌ను గుర్తించిందని, పోర్టు ఏటా సుమారు 5 వేల మందికి శిక్షణ ఇస్తోందని, అందిస్తోందని, 2030 నాటికి 50 వేల మందికి, 2047 నాటికి 5 లక్షల మందికి శిక్షణ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. వర్చువల్ విధానంలో కేంద్ర పోర్టు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి సముద్రరంగ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేందిర ప్రసాద్, కేంద్ర నౌకాయాన శాఖ కార్యదర్శి టి.కె.రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీల ప్రత్యేక ఆన్‌లైన్ ప్రోగ్రాం



సాక్షి, అమరావతి : అంతర్ జిల్లా బదిలీల్లో ఉపాధ్యాయుల సౌకర్యార్థం ఏపీటీఎఫ్ అమరావతి ప్రత్యేక ఆన్‌లైన్ ప్రోగ్రాం తయారు చేసినట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ తెలిపారు. దీని ద్వారా వివిధ జిల్లాలకు బదిలీ కోరుకుంటున్న 500 మంది జాబితా అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు. అంతర్ జిల్లా బదిలీలు కోరుకునేవారు https://www.vidyakranthi.in/?m=1 వెబ్‌సైట్ నుంచి పొందొచ్చని, ఇదే వెబ్‌సైట్ నుంచి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశ్వవిద్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. తేనెటీగల పెంపకం, జీవన ఎరువులు, పట్టుపురుగులు పెంపకం వంటి కోర్సులు సెప్టెంబర్ నుంచి ప్రారంభమవుతాయంది. ఆసక్తిగల అభ్యర్థులు రూ.1500 ఫీజు చెల్లించి సెప్టెంబర్ 10లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలంది.

‘భారత్-యూకే ఎఫ్‌టీఏతో సుంకాలు తగ్గుతాయి’

బీచ్‌రోడ్డు (విశాఖపట్నం) : భారత్-యూకే మధ్య జరిగిన ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ (ఎఫ్‌టీఏ) సుంకాలను తగ్గించడమే కాక బ్యూరోక్రాటిక్ ప్రక్రియలను సులభతరం చేస్తుందని, తద్వారా వాణిజ్యాన్ని వేగవంతం చేస్తూ పారదర్శకతను పెంచుతుందని హైదరాబాద్‌లోని ఏపీ–తెలంగాణ బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో శుక్రవారం సీఐఐ, డీజీఎఫ్‌టీ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్) సంయుక్తంగా నిర్వహించిన ఎగుమతి పోటీతత్వం సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ ఒప్పందం స్వల్పకాలిక వ్యాపార చలనశీలతను సులభతరం చేస్తుందని, యూకేలోని భారతీయ కార్మికులకు సామాజిక భద్రతా చెల్లింపు సంక్లిష్టతలను పరిష్కరిస్తుందని, జాయింట్ వెంచర్లు, పెట్టుబడులను ప్రోత్సహిస్తుందన్నారు. తద్వారా ఉద్యోగాలను సృష్టించి, సమ్మిళిత వృద్ధిని పెంపొందిస్తుందని భావిస్తున్నట్లు గారెత్ విన్ ఓవెన్ తెలిపారు. వృద్ధి కోసం గుర్తించిన కీలక రంగాల్లో క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ విభాగాలు ఉన్నాయన్నారు.

భారత్ వృద్ధికి డీజీసీఐ కట్టుబడి ఉంది..

డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్–స్టాటిస్టిక్స్ (డీజీసీఐ) డైరెక్టర్ జనరల్ బందన్‌సేన్ మాట్లాడుతూ.. ఖచ్చితమైన విశ్వసనీయమైన ఎగుమతి–దిగుమతి డేటాను నిర్వహించడంలో ఉన్న సవాళ్లను వివరించారు. వివిధ వనరుల ద్వారా డేటా ఉచితంగా అందుబాటులో ఉన్నప్పటికీ, ఎగుమతిదారులతో సహకారం చాలా అవసరమన్నారు. వాణిజ్య డేటాలో స్వాభావిక అస్థిరత ఉన్నప్పటికీ.. ఆర్థిక కేంద్రంగా భారతదేశ వృద్ధికి మద్దతిచ్చేందుకు డీజీసీఐ కట్టుబడి ఉందన్నారు. సమావేశంలో సీఐఐ విశాఖపట్నం చైర్మన్ డీవీఎస్ నారాయణరాజు, ఏపీ మాజీ చైర్మన్ జి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

Published and printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లు

హుబ్లీ: జిల్లాలో కురిసిన కుండపోత వర్షాలకు గత 24 గంటల్లో జిల్లాలోని వివిధ తాలూకాల్లో 34 ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇందులో హుబ్లీ 10, కుందగోల 2, హుబ్లీ నగరం 9, కలఘటిగి 7, నవలగుంద తాలూకాలో 6 ఇళ్లు ఉన్నాయి. మానవులు, జంతువులకు ఎటువంటి హాని జరగలేదని సంబంధిత అధికారులు నిర్వహించిన సంయుక్త సర్వే ప్రగతి పథంలో ఉందని జిల్లా విపత్తు నిర్వహణ ప్రాధికార శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

గణపతి ఉత్సవాల్లో డీజేలపై నిషేధం


కాలనీలో పర్యటిస్తున్న నగర సభ అధ్యక్షురాలు నరసమ్మ

రాయచూరు రూరల్: గణేశుడి ఉత్సవాల్లో డీజేలపై నిషేధం విధించినట్లు నగర సభ అధ్యక్షురాలు నరసమ్మ స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె నగరంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. నగరంలో ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని తెలిపారు. 27న వినాయకులను ప్రతిష్ఠించి, 31న నిమజ్జనం చేయాలని సూచించారు. రాత్రి 10 గంటల తరువాత డీజేలను వినియోగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బైక్ చోదకుడి మృతి

హుబ్లీ: బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో చోదకుడు ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటన హుబ్లీ తాలూకా కుసుగల్లు గ్రామంలో చోటు చేసుకుంది. ఆ గ్రామ నివాసి పవన్ ఏనగి (20) మృతుడు. పని ముగించుకుని హుబ్లీ నుంచి కుసుగల్లు గ్రామానికి బైకులో వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో పవన్ ఏనగికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు హుబ్లీ గ్రామీణ పోలీసులు తెలిపారు.

పల్లకీలో ఊరేగిన శ్రీకృష్ణుడు


శ్రీకృష్ణుడిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

రాయచూరు రూరల్: నగరంలో శుక్రవారం మహిళా సమాజ్ భక్తులు శ్రీకృష్ణుడికి పల్లకీ సేవ నిర్వహించారు. తొలుత కృష్ణుడి చిత్రపటాన్ని సుందరంగా అలంకరించిన పల్లకీలో కొలువుదీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. హిందూ ధర్మ రక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కోరారు. ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయుర్వేద పతంజలి సంచాలకులు సురేష్ పాల్గొన్నారు.

హంపీ వీధుల్లో పోలీసుల కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

హొసపేటె: గణేష్, మిలాద్–ఉన్–నబీ పండుగల నేపథ్యంలో శుక్రవారం హంపీ, కమలాపుర్ పోలీసులు గురువారం వీధుల్లో కవాతు నిర్వహించారు. హంపీ, కద్దిరాంపుర, కమలాపురం, హోసమలపన గుడి, గాలేమ్మన గుడితో పాటు తదితర గ్రామాల్లో కవాతు కొనసాగింది. పండుగల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

కన్నడ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలి


స్వామిజీని సన్మానిస్తున్న సాహితీ వేత్తలు

రాయచూరురూరల్: గడినాడు ప్రాంతాల్లో కన్నడ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రాలయం రాఘవేంద్ర స్వాముల మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ పాదంగళ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మంత్రాలయం రాఘవేంద్ర స్వాముల మఠంలో ప్రథమ కన్నడ అంతరాష్ట్రీయ కన్నడ సాహిత్య సమేళనం ప్రారంభించారు. స్వామీజీ మాట్లాడుతూ.. భాషలో నేటికి తెలుగు, మరాఠీ, కన్నడ కలిపి వాఖ్యానించడం, మాట్లడటం జరుగుతోందన్నారు. భవిష్యత్తులో కన్నడ భాషకు అధిక ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. అన్య భాషలను గౌరవిస్తూ కన్నడకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువకులు కన్నడ భాషను ఇనుమడింప చేసేందుకు చేసిన పోరాటాలను గుర్తించాలన్నారు. 1980లో కన్నడ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆందోళన చేసిన విషయాన్ని ప్రస్తావించారు.

తగ్గని వరద ప్రవాహం

- వాగులు, వంతెనలపై ప్రవహిస్తున్న నీరు
- నారాయణ పుర డ్యాం నుంచి 2.65 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

రాయచూరు రూరల్: కర్ణాటక ఎగువ భాగంలో నదీ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. ఉత్తర, కళ్యాణ కర్ణాటకలో బెళగావి, విజయపుర, బాగల్ కోట, కలబుర్గి, యాదగిరి, రాయచూరు జిల్లాల్లో వరద ప్రవహిస్తోంది. శనివారం నారాయణ పుర డ్యాం నుంచి 2.65 లక్షల క్యూసెక్కుల నీటిని వదలారు. దేవదుర్గ తాలూకా కోప్పర రహదారి పూర్తిగా కొట్టుకుని పోయింది. దేవదుర్గ తాలుకా హువిన హడగలి, శహపూర తాలుకా కోళూరు వంతెనపై వరద నీరు ప్రవహించడంతో కలబుర్గికి రాకపోకలు స్తంభింపజేశారు. ప్రవాహ పరిస్థితిపై జిల్లాధికారి నీతిష్ అధికారులతో చర్చించారు. యాదగిరి జిల్లా సురుపురలో జిల్లాధికారి హరీష బోయర్, ఎస్పీ పృథ్వీ శంకర్ పరిశీలించారు. హువిన హడగలి వద్ద బసవేశ్వర దేవాలయం నీటి మునిగింది. తుంగభద్ర, కృష్ణా నది తీర ప్రాంతాల్లోకి నీటి ప్రవాహం రావడంతో ప్రజలను అప్రమత్తం చేసేందుకు అధికారులు సహకరించాలని జిల్లాధికారి నీతిష్ సూచించారు. శుక్రవారం కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు ఇచ్చారు. తుంగభద్ర తీరంలో మాన్వి, రాయచూరు, గిల్లేసూగురు, కృష్ణా నది తీరంలో దేవసూరు, దోంగ రాంపూర్, అత్కూర్, బూడిద పాడు, నారద గడ్డ దత్తాత్రేయ దేవాలయం ప్రాంతాల ప్రజల రక్షణకు ముందుండాలని సూచించారు.


నారాయణ పుర డ్యాం గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న నీరు


నీట మునిగిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం


ప్రజలకు సూచనలిస్తున్న జిల్లాధికారి హరీష్ బోయర్


హువిన హడగలి వంతెనపై పారుతున్న నీరు

‘ధర్మస్థల’పై దుష్ప్రచారం తగదు


ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి తదితరులు

సాక్షి, బళ్లారి: మంజునాథ స్వామి వెలసిన ధర్మస్థలపై దుష్ప్రచారం చేయడం తగదు. అందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా బీజేపీ శాఖ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నగరంలోని రాయల్ సర్కిల్ నుంచి జిల్లాధికారి కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. జిల్లాధికారి కార్యాలయం ముందు ధర్నా చేపట్టిన అనంతరం మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర రెడ్డి మాట్లాడారు. పవిత్ర పుణ్యభూమి, ధర్మస్థలపై కొందరు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతిసేందుకు చేస్తున్న కుట్రలను ఖండించాలన్నారు. ధర్మం కోసం చేస్తున్న ధర్మయుద్ధానికి అందరి సహకారం అవసరం ఉందన్నారు. ధర్మస్థల మంజునాథ స్వామికి కర్ణాటకలోనే కాకుండా దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో భక్తులు ఉన్నారని తెలిపారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ధర్మస్థలపై చేస్తున్న కుట్రలతో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువులకు ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న ఈ పుణ్యక్షేత్రంపై దురుద్దేశంతో చేస్తున్న అప్రచారాన్ని యావత్ భక్తులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరో అపరిచితుడు ఎలాంటి ఆధారాలు లేకుండా చెబితే దానిపై విచారణ చేయాలన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతిసేందుకు నిరంతరం ఎక్కడో ఒక చోట ఇలాంటి సంఘటనలు జరుగుతుండటం విచారకమన్నారు. అనంతరం జిల్లాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ప్రముఖులు ఐనాథ రెడ్డి, డాక్టర్ కామినేని అరుణ, కార్పొరేటర్లు మోత్కూరు శ్రీనివాస రెడ్డి, హనుమంతు, మాజీ మేయర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దురుద్దేశంతోనే ధర్మస్థలపై ఆరోపణలు

హుబ్లీ: ‘హిందూ ధర్మం, విశ్వాసాలను సర్వనాశనం చేయాలన్న దురుద్దేశంతో ధర్మస్థలపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. దీని వెనుక పెద్ద కుతంత్రం ఉంది. ధర్మస్థలపై చేస్తున్న దుష్ప్రచారం బాధ కలిగించింది’ అని ధర్మస్థల ధర్మాధికారి డాక్టర వీరేంద్ర హెగ్డే తెలిపారు. శుక్రవారం హుబ్లీలో ధర్మస్థల ధర్మాధికారి డాక్టర వీరేంద్ర హెగ్డేను బీజేపీ యువనేత వెంకటేష్ కాట్వే కలిసి, సిద్ధారూడల విగ్రహం, జాతీయ పతాక ఫ్రేమ్, మొక్క అందజేశారు. కారణాలు లేకుండా నిందలు వేయడం తగదన్నారు. ధర్మస్థలలో ఎటువంటి అన్యాయాలు, ద్రోహాలు, వంచనలు జరగలేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ 17 స్థలాల్లో తవ్వకాలు చేపట్టినా.. ఎటువంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. ధర్మస్థలానికి కళంకాన్ని ఆపాదించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ కుట్రలు ఇలాగే కొనసాగితే మరో పుణ్యక్షేత్రంపై కూడా అసత్య ప్రచారం చేస్తారన్నారు. మన ధర్మాన్ని మనమే కాపాడుకోవాలన్నారు. ఎట్టకేలకు హిందూ సమాజం పోరాటానికి రంగంలోకి దిగినట్లు పేర్కొన్నారు. మొదటే పోరాటం ప్రారంభించి ఉంటే ఇంత స్థాయిలో ఈ కుతంత్రాలు జరిగేవి కావని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖులు విఠలదవ, నాగేష్ కలబుర్గి, ప్రకాష్, బసవరాజ, తదితరులు పాల్గొన్నారు.

‘ధర్మస్థలలో కుట్ర జరుగుతోంది’

హుబ్లీ: ధర్మస్థల పుణ్య సన్నిధిలో భారీ కుట్ర జరుగుతోందని అఖిల కర్ణాటక జనజాగృతి వేదిక మాజీ తాజా అధ్యక్షుడు, పాలికె స్థాయి సమతి అధ్యక్షుడు రాజన్న కొరవే ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక సత్తూరులో ధర్మస్థల పుణ్యసన్నిధి ధర్మాధికారి డాక్టర్ వీరేంద్రహెగ్డే అతిథి గృహంలో కలసి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మస్థల మంజునాథ స్వామి, డాక్టర్ వీరేంద్రహెగ్డేపై యూట్యూబ్, సోషల్ మీడియా ద్వారా అసత్య వార్తలు వ్యాపింపచేస్తున్నారన్నారు. అసత్య ప్రచారం చేస్తున్న వారిని ప్రభుత్వం తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. వీరికి మద్దతు ఇస్తున్న వారు, నిధులు ఎక్కడ నుంచి వస్తున్నాయి? అసలు వారి ఉద్దేశం ఏమిటనే విషయాలపై విచారించి చట్ట ప్రకారం శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సదరు వేదిక అధ్యక్షుడు వసంత ఆర్యాచారి, సవత అమరశెట్టి, ద్యామన్న హుండేద తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, పోలీస్ అధికారులు

చెళ్లకెర రూరల్: మధ్య కర్ణాటక ఆరాధ్య దేవత గౌరసముద్ర మారెమ్మ దేవి జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి. భక్తులు ఇబ్బందులు పడకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని గ్రామ పంచాయతీ అధ్యక్షుడు ఓబన్న తెలిపారు. శుక్రవారం జాతర జరిగే తుమ్మల ప్రదేశాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. ప్రతి సంవత్సరం భక్తుల సంఖ్య పెరగడం వల్ల పార్కింగ్ వ్యవస్థ కోసం పోలీసుల సహకారం అవసరమన్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర జరిగే తుమ్మల వద్ద అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రేహన్ పాషా, డీవైఎస్పీ టీటీ రాజన్న, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హనుమంతప్ప, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేయాలని 25న ధర్నా


మాట్లాడుతున్న రైతు సంఘం పదాధికారులు

కోలారు: జిల్లాలో అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న కోలారు– శ్రీనివాసపురం రహదారిలో వీరాపుర గేట్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ తెలిపారు. శుక్రవారం నగరంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రహదారులు అధ్వాన స్థితిలో ఉండడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతుండటంతో యువకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అమాయకుల ప్రాణాలు బలైపోతున్నాయన్నారు. కాంట్రాక్టర్లు రహదారులను నాణ్యత లేకుండా నిర్మిస్తుండటం వల్ల నిర్మించిన కొద్ది రోజులకే అవి గుంతలు పడుతున్నాయన్నారు. ఎంతో మంది యువకులు ప్రాణాలు కోల్పోగా మరెంతో మంది కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్నారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల బాధ్యతారాహిత్యం వల్లే ఇదంతా జరుగుతోందన్నారు. వర్షం వస్తే గుంతల్లో నీరు నిలిచి మరింత ప్రమాదకరంగా మారుతోందన్నారు. అధికారుల కళ్లు తెరిపించడం కోసం ధర్నా చేస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, రాష్ట్ర సంచాలకుడు బంగవాది నాగరాజు, తేర్నహళ్లి అంజినప్ప పాల్గొన్నారు.

‘రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు’


రక్తదాన ప్రమాణ పత్రం అందజేస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కన్వీనర్ నిర్మల, తదితరులు

రాయచూరురూరల్: సమాజంలో ఆపద, అత్యవసర సమయంలో రక్తదానం చేయడానికి యువకులు ముందుకు రావాలని ప్రజాపిత బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సంచాలకురాలు స్మిత పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ఎల్‌వీడి కళాశాల మైదానంలో ప్రజాపిత బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం, జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, రోటరీ క్లబ్, రిమ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంచాలకురాలు స్మిత మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల కొత్త రక్తం ఉత్పత్తి అయ్యేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇది స్ఫూర్తిదాయకం కావాలన్నారు. కార్యక్రమంలో డా.శ్యామణ, వెంకటేష్ నాయక్, లక్ష్మీకాంత రెడ్డి, గిరీష్, రవి, సుఖాణి, రాజేంద్ర, త్రివిక్రం జోషి, నీలోఫర్, శ్రీశైల అమరఖేడ, కేశవ రెడ్డి, రాజణ్ణ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల పాటు రక్తదాన శిబిరాలు

బళ్లారిటౌన్: స్థానిక పార్వతీ నగర్‌లో ఉన్న శివధ్యాన మందిరంలో శుక్రవారం నుంచి నాలుగు రోజుల పాటు మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కన్వీనర్ బీకే నిర్మల తెలిపారు. శుక్రవారం విశ్వవిద్యాలయ ఆవరణలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 25న రాజయోగిని దాది ప్రకాష్ మణిజి జ్ఞాపకంగా భారత రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విశ్వబంధుత్వం దినోత్సవాన్ని జరుపుకున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా లక్ష మంది నుంచి రక్తాన్ని సేకరించేందుకు లక్ష్యం పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 65 ఏళ్లలోపు వారు రక్తదానం చేయవచ్చన్నారు. బళ్లారిలో 250 మంది నుంచి సేకరించిన రక్తాన్ని స్థానిక బిమ్స్ రక్త బంధనానికి సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో విశ్వవిద్యాలయం నేతలు మంజుళ, రాజేశ్వరి, రష్మి తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న జిల్లాధికారి ఎంఎస్ దివాకర్

హొసపేటె: గౌరీ గణేష్, మిలాద్–ఉన్–నబీ పండుగలు ఒకే సమయంలో వచ్చాయి. పండుగలను సామరస్యంతో జరుపుకోవాలని జిల్లా మేజిస్ట్రేట్ ఎంఎస్ దివాకర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో గౌరీ, ఈద్ మిలాద్ ఉత్సవాల సందర్భంగా శాంతి సమావేశం నిర్వహించారు. జిల్లా మేజిస్ట్రేట్ ఎంఎస్ దివాకర్ మాట్లాడుతూ.. శాంతి, సామరస్యానికి ప్రసిద్ధి చెందిన విజయనగరం జిల్లాకు చెడ్డపేరు తీసుకుని రాకుండా.. అన్ని మతాల ప్రజలు కలిసి పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. పండుగ సందర్భంగా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. ఆస్పత్రులు పాఠశాలలు సహా బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని తెలిపారు. సింగిల్ విండో వ్యవస్థ కింద గణేష్ ప్రతిష్ఠకు అవసరమైన స్థలం, పెండల్, విద్యుత్ కనెక్షన్ కోసం సంబంధిత స్థానిక అధికారుల అనుమతి పొందాలని పేర్కొన్నారు. గణేష్ విగ్రహాల ఊరేగింపు సమయంలో శాంతిభద్రతలను కాపాడేందుకు మద్యం అమ్మకాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. శాంతిభద్రతల ఉల్లంఘన జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మంజునాథ్, డీవైఎస్పీలు టి.మంజునాథ్, వెంకటప్ప నాయక్, అన్ని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు వివిధ తాలుకాలకు చెందిన గణేష్ ప్రతిష్ఠాపన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గంగోత్రిని స్మారకంగా తీర్చిదిద్దుతాం

హుబ్లీ: విదూసీమణి గంగూబాయి హాణగల్లు జన్మస్థలమైన ధార్వాడాలోని హొసయల్లాపుర గంగోత్రిని శుక్రవారం జిల్లాధికారి దివ్యప్రభు సందర్శించారు. గంగూబాయి జన్మించిన ఇంటి అభివృద్ధిపై స్థానికులతో చర్చించారు. గంగోత్రిని స్మారకంగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధించి బ్లూప్రింట్, అంచనా వ్యయం నివేదికను సమర్పించాలని కన్నడ సంస్కృతి శాఖా అధికారికి సూచించారు. జిల్లా కీర్తి పతాకాన్ని జాతీయ స్థాయిలో చాటి చెప్పిన గంగూబాయి హాణగల్లును చిరస్మరణీయంగా స్మరించుకోవడానికి జిల్లా యంత్రాంగం అవసరమైన చర్యలు చేపడుతుందని హామీ ఇచ్చారు. సంగీతం, సాహిత్యం, కళలు, అలాగే నాటక రంగంలో ధార్వాడా కళాకారులు సత్తా చాటుకున్నారన్నారు. గంగోత్రి స్థలం చిన్నదిగా ఉండటంతో చుట్టుపక్కల ఖాళీ స్థలం తీసుకునే విషయంపై సదరు యజమానిని సంప్రదిస్తామన్నారు. సదరు యజమాని అంగీకరిస్తే ఆ స్థలంలో సాంస్కృతిక భవన నిర్మాణం, సంగీత పాఠశాలను నిర్వహిస్తామన్నారు. స్థానిక కళాకారులు, సంగీత విద్వాంసుల సహకారంతో నిరంతరం సంగీత కార్యక్రమాలు జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శంకర్ సేలకే, న్యాయవాధి అరుణ, ప్రసన్నగుడి, రాఘవేంద్రగుడి, అన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత నగరసభ స్థలం స్వాధీనం


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కోలారు: నగరంలోని ఖాద్రిపుర సమీపంలోని 6.1 ఎకరాల నగరసభ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసి నగరసభ అధికారులు శుక్రవారం స్థలానికి వెళ్లి ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. నగరసభ స్థలానికి అధికారులు రెండు నెలల క్రితం కంచె వేసి భద్రపరిచారు. అయితే ఈ మధ్య కొంతమంది కోర్టుకు వెళ్లామని ఆ స్థలంలో నామఫలకం వేశారు. నగరసభ అమర్చిన బోర్డును తొలగించి బెంగళూరు కోర్టులో దావా ఉందని తెలిపి మరో నామఫలకాన్ని ఉంచారు. దీనిని కొందరు నగరసభ దృష్టికి తేవడంతో కమిషనర్ నవీన్‌చంద్ర, అధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ సిబ్బందితో స్థలానికి వెళ్లారు. ఆక్రమణలను, ఆక్రమణదారులు వేసిన నామఫలకాలను తొలగించారు. ఆ సమయంలో అక్కడికి చేరిన కొంతమంది ఈ స్థలం తమదని గొడవ చేశారు. మొదలు రికార్డులు తీసుకు రమ్మని, తరువాత పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. స్థలం వద్ద ట్రెంచ్ నిర్మించడానికి తెచ్చిన జేసీబీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరసభకు చెందిన ఈ స్థలంలో వసతి రహితులకు ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

‘పంచ గ్యారెంటీలు’ ప్రచారం చేయాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చెన్న బసవ

రాయచూరురూరల్: గ్రామాల్లో సర్కార్ అమలు చేసిన పంచ గ్యారెంటీలను ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేయాలని రాయచూరు వాల్మీకి మహర్షి విశ్వ విద్యాలయం సేనేట్ సభ్యుడు చెన్న బసవ తెలిపారు. శుక్రవారం తాలుకాలోని మన్సలాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేసిన గ్యారెంటీల ద్వారా మహిళలు, విద్యార్థులు, యువకులు లబ్ధి పొందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచ గ్యారెంటీల అధ్యక్షుడు పవన్ పాటిల్, మౌనేష్ నాయక్, వెంకటేష్ నాయక్, మంజునాథ్, ఈరమ్మ, దేవమ్మ, చెన్నమ్మ, శారద, మహేష్ గౌడ, లక్ష్మి, శరణే గౌడ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు అందజేత


బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేస్తున్న డీవైఎస్పీ మల్లేష్, దొడ్డమణి సీఐ దురుగప్ప

హొసపేటె: సీఐఈఆర్ పోర్టల్ ద్వారా విజయనగర జిల్లా కొట్టూరు పోలీసులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను కనుక్కునేందుకు ఆపరేషన్ చేపట్టారు. కొట్టూరు పోలీస్ స్టేషన్‌లో సీఐఈఆర్ పోర్టల్ ద్వారా నమోదైన కేసుల్లో దాదాపు రూ.4,25,000 విలువైన మొత్తం 25 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కూడ్లిగి డీవైఎస్పీ మల్లేష్, దొడ్డమణి సీఐ దురుగప్ప ఆధ్వర్యంలో పోగొట్టుకున్న మొబైల్స్‌ను ఫిర్యాదుదారులకు అందజేశారు. మొబైల్స్ కనుక్కునేందుకు పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌ను విజయనగరం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అరుణంగ్శుగిరి ప్రశంసించారు.

ఖాస్ బావిలో శుభ్రత పనులు


జేసీబీతో పనులు చేయిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: నగరంలో పవిత్ర క్షేత్రమైన ఖాస్ బావి శుభ్రతకు అధికారులు శ్రీకారం చుట్టారు. శుక్రవారం సాయంత్రం నగర సభ కమిషనర్ జుబీన్ మోహ పాత్రో ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని విగ్రహాల నిమజ్జనం, భద్రత ఏర్పాట్లు చేపట్టారు. ఖాస్ బావి వద్ద పరిశుభ్రత పనులు చేయించారు. జేసీబీతో బావిలో పూడిక తీయించారు. అలాగే రహదారిపై పడిన గుంతల్లో మట్టి వేయించి చదును చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

అప్పు చెల్లించనందుకు ఉపాధ్యాయుడిపై దాడి

రాయచూరురూరల్: తీసుకున్న అప్పును సకాలంలో చెల్లించక పోవడంతో ఓ ఉపాధ్యాయుడిపై గ్రామ పంచాయతీ సభ్యుడు దాడి చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. లింగసూగురు తాలుకా ముదుగల్‌లో ప్రభుత్వ పాఠశాలలో హనుమంతు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. అవసరం కోసం గ్రామ పంచాయతీ సభ్యుడు వీరణ్ణ వద్ద బంగారు అభరణాలు తాకట్టు పెట్టి అప్పు తీసుకున్నారు. తీసుకున్న అప్పు చెల్లించాలని వీరణ్ణ పలుమార్లు ఉపాధ్యాయుడు హనుమంతును కోరారు. అయినా అప్పు చెల్లించకపోవడంతో దాడి చేశాడు. గాయపడిన ఉపాధ్యాయుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ రోటవేటర్‌కు చిక్కి కొండచిలువ మృతి

కోలారు: ట్రాక్టర్‌తో దున్నుతుండగా రోటవేటర్‌కు చిక్కి కొండచిలువ మరణించిన ఘటన తాలూకాలోని హెచ్.మల్లండహళ్లిలో జరిగింది. దేవరాజ్ అనే రైతు పొలంలో కొత్తిమీర సాగుకు రోటవేటర్‌తో భూమిని దున్నుతుండగా దానికి చిక్కి కొండచిలువ తీవ్రంగా గాయపడింది. వెంటనే గ్రామస్తులు స్నేక్ ఆనంద్‌కు సమాచారం ఇచ్చారు. అయితే తీవ్రంగా గాయపడిన కొండచిలువ అంతలోనే మరణించింది. విషయం తెలిసి అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. 4 ఏళ్ల వయస్సు, 10 అడుగుల పొడవు కలిగిన కొండచిలువను అటవీ సిబ్బంది, గ్రామస్తులు పూడ్చిపెట్టారు.

కేంద్ర గ్రంథాలయం తనిఖీ

కోలారు: నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లాధికారి డాక్టర్ ఎంఆర్ రవి సందర్శించారు. గ్రంథాలయంలోని రీడింగ్ రూం, పుస్తకాల గదులను పరిశీలించారు. గ్రంథాలయంలో లభిస్తున్న సౌకర్యాల గురించి పాఠకులను ఆరా తీశారు. పోటీ పరీక్షలను రాసే విద్యార్థులు గ్రంథాలయంలో లభించే పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలో అంబేడ్కర్ కేంద్రాన్ని ప్రారంభించడానికి స్థలం గుర్తించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్తులో పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి అవసరమైన మరిన్ని పుస్తకాలను తెప్పిస్తామన్నారు. గ్రంథాలయానికి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ అధికారి ఎన్.గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.